
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు
బుధవారం 9 ఆగస్టు 2017 | 20 | ★★★★★★★



మరో కలికితురాయి..

7



- రేపు దొండపాడు సమీపంలో పునాది కార్యక్రమం
- సీఎం హాజరు కానుండటంతో భారీ భద్రత ఏర్పాట్లు
- రాజధానిలో మొదటి అంతర్జాతీయ వైద్య సంస్థగా 'బీఆర్ షెట్టి హెల్త్‌కేర్'



కోర్టు ద్వారానే న్యాయ పోరాటం

- హైకోర్టుపై నమ్మకం పెరిగింది..
- అయేషా తల్లి సంషాద్ బేగం

8

నేటి నుంచి రాష్ట్రస్థాయి బాలల నాటిక పోటీలు

20

నేడు భూగర్భ జల డీడీ కార్యాలయం ప్రారంభం

- హాజరు కానున్న మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

పదేళ్లకు..

- పూర్తి కావచ్చిన సాగర్ కాల్వల పనులు
- రూ.1045.67 కోట్లు విలువైన పనులు పూర్తి
- మరో నెల రోజుల్లో నూరు శాతం
- సాగర్ ఆధునికీకరణ ప్రాజెక్టు ముగిసినట్లే

ఎట్టకేలకు పదేళ్లకు నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో చేపట్టిన కాలువల ఆధునికీకరణ పనులు పూర్తి కావచ్చాయి. మూడేళ్లుగా సాగర్ కాలువలకు నీరు విడుదల కాకపోవటం పనులు పూర్తికి కలసి వచ్చింది. ఇప్పటి వరకు 94.41 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన సుమారు ఐదు శాతం పనులు కూడా ఈ నెలాఖరుకు పూర్తవుతాయని అధికారులు చెప్తున్నారు. రూ.1045.67 కోట్ల విలువైన పనులను నీటి పారుదల శాఖ పూర్తి చేసింది.



- గోవిందాపురం కాలువ పై నిర్మిస్తున్న బ్రిడ్జి

19



- సీజ్ చేసిన రేషన్ బియ్యం

ఆగని.. అక్రమాలు

మన ఇసుక యాప్.. ఎప్పటికో?

- వారం అవుతున్నా గూగుల్ ప్లేస్టోర్‌లో కనిపించని అప్లికేషన్

10,11

- ఈ-పోస్ వచ్చినా మారని వైనం
- అందినకాడికి దోచుకోవడమే లక్ష్యం
- ప్రజాపంపిణీ విధానం పారదర్శకత ఎప్పటికో..?
- పౌర సరఫరాలపై నేడు జేసి కృతిక శుక్ల సమీక్ష

6

ఈ-పోస్‌తో డీలర్ల అక్రమాలకు చెక్ పడుతుంది. కార్డుదారులకు లబ్ధి దారులు చేకూరుతుంది.. అని ప్రభుత్వం ఆర్భాటంగా చేసిన ప్రకటనలు గాలి బుడగలేనని డీలర్లు తేల్చారు. యథావిధిగానే రేషన్ పంపిణీలో అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. చౌక బియ్యాన్ని కొంతమంది అధికారులు, రేషన్ డీలర్లు కలిసి బొక్కేస్తోన్నారు. రేషన్‌షాపులకు బియ్యం తరలించే ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నుంచే అక్రమాలకు నాంది పలుకుతున్నాయి. జీపీఎస్ పరికరం అమర్చిన వాహనం ద్వారా బియ్యం తరలించాల్సి ఉండగా అది కూడా అమలు జరగడం లేదు.




కరువుపై.. కమిటీ

- పరిస్థితుల అంచనాకు కేంద్రం ఆదేశాలు
- జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ
- 10న జరిగే రాష్ట్ర కమిటీలో సమీక్ష
- 17 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు

20 లో..

గంటల్లో పరిహారం





- చంద్రన్న బీమా చెల్లింపులు వేగవంతం
- సెర్ప్‌కు బాధ్యతలు ఇచ్చిన ప్రభుత్వం
- ఒక్క రూపాయి ప్రీమియం అక్కర్లేదు
- పెద్ద కర్మకు రెండు రోజులు ముందుగానే పరిహారం

ఆంధ్రజ్యోతి, అమరావతి : కార్మికులకు చంద్రన్న బీమా పరిహారం చెల్లింపులను ప్రభుత్వం మరింత సరళం చేసింది. ప్రస్తుతం బాధితులకు ఇన్సూరెన్స్ సంస్థలే చెల్లింపులు చేస్తున్నాయి. దీనివల్ల బాధితులకు సకాలంలో చెల్లింపులు అందటం లేదన్న విమర్శలు వస్తుండటంతో ప్రభుత్వం చంద్రన్న బీమాలో కొన్ని మార్పులు చేసింది. తాజా విధానం ప్రకారం లబ్ధిదారులకు నేరుగా ఇక సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(సెర్ప్) పరిహారం చెల్లిస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాజాగా సెర్ప్ కార్యక్రమాలపై జరిపిన సమీక్షలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని సెర్ప్ అధికారులు తెలిపారు. ఇక మీదట బాధితులకు సంబంధించిన డాక్యుమెంట్లు సరిగ్గా ఉంటే ఇన్సూరెన్స్ కంపెనీల ప్రమేయం లేకుండా సెర్ప్ చెల్లింపులు జరుపుతుంది. దీనికోసం ప్రభుత్వం సెర్ప్‌కు కొంత నిధిని కూడా ఇవ్వనున్నట్లు తెలిసింది. చంద్రన్న బీమాలో రిజిస్టరయిన వ్యక్తి మరణించిన తరువాత అతనికి సంబంధించిన రికార్డులన్నీ సక్రమంగా ఉన్నట్లయితే సెర్ప్ నేరుగా ఆ కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించనున్నది. ఇందుకు సంబంధించిన కసరత్తు సెర్ప్‌లో ప్రస్తుతం జరుగుతున్నది... చంద్రన్న బీమాలో అసంఘటిత కార్మికులను రిజిస్టర్ చేయడం కూడా చాలా సులభం. నేరుగా ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేయించుకోవచ్చు. ఎవరికైనా ఆన్‌లైన్‌పై అవగాహన లేక పోతే పంచాయతీ కార్యదర్శి, గ్రామ సమాఖ్య సభ్యుల వద్ద రిజిస్టర్ చేయించుకోవచ్చు...

ఒక్కరూపాయి ప్రీమియం కట్టక్కర్లేదు....

చంద్రన్న బీమాలో లబ్ధి పొందడానికి అసంఘటిత కార్మికులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించనక్కర్లేదు. గ్రామ సమాఖ్య సభ్యులకు ఖర్చులకు కేవలం రూ. 15 చెల్లిస్తే చాలు, వారే దానికి సం బంధించిన వ్యవహారాలు చూస్తారు. మనిషి సహజమరణం చెందిన, ప్రమాదవశాత్తు ప్రాణం కోల్పోయినా వాటికి సంబంధించిన వివరాలను కూడా గ్రామ సమాఖ్యలే సేకరించి, క్లెయిమ్‌కోసం సెర్ప్‌కు పంపిస్తారు.

ఆలస్యం నివారణకే...

చంద్రన్నబీమాలో లబ్ధి పొందేందుకు మరణించిన వారి వివరాలను పంపించడంలో ఇక ఏమాత్రం ఆలస్యం జరగడానికి వీల్లేదు. ఖచ్చితంగా నిర్ధారిత సమయంలో వివరాలు పంపించాలని సీఎం ఆదేశించినట్లు తెలిసిందే, ఈమేరకు సెర్ప్ అధికారులు కూడాసంబంధిత విభాగాలకు ఉత్తర్వులు జారీ చేశారు. జూన్, జూలై నెలలకు సంబంధించి జరిగిన బీమా చెల్లింపులపై సమీక్ష జరిగినప్పుడు ఆయా విభాగాల నుంచి అందాల్సిన వివరాలు సకాలంలో రావడంలేదని తేలింది. గ్రామ పంచాయతీల నుంచి ఆన్‌లైన్‌లో వివరాలు కేవలం రెండు రోజులలోనే రావాల్సి ఉండగా మూడున్నర రోజులు పడుతున్నట్లు వెల్లడైంది. అలాగే పట్టణ మునిసిపల్ ప్రాంతాల నుంచి రెండు రోజులలోనే వివరాలు పంపించాల్సి ఉండగా నాలుగున్నర రోజులు పడుతున్నట్లు తేలింది. వైద్య ఆరోగ్య శాఖ నుంచి అంటే ప్రభుత్వ ఆస్పత్రులలో మరణించిన వ్యక్తుల వివరాలు ఆరున్నర రోజులకు గాని రావడం లేదు. మెడికో లీగల్ కేసులు, ప్రమాదాలలో మరణిస్తే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఒకటిన్నర రోజు తీసుకుంటున్నారు. మరణించిన వ్యక్తికి సంబంధించి ఇంక్వెస్ట్ రిపోర్ట్ రెండున్నర రోజులు, పోస్టుమార్టమ్ రిపోర్ట్‌ను ఏడు రోజులకు పంపిస్తున్నట్లుగా వెల్లడయింది. ఇంత జాప్యం అనేది ఉండకూడదని ప్రభుత్వం సంకల్పించింది. ఏ విభాగం నుంచైనా సరే 48 గంటలలోపే వివరాలు వచ్చేలా సెర్ప్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఎందుకంత తొందర...

అసంఘటిత కార్మికుల కుటుంబాలు పేదరికంలో మగ్గుతుంటాయి. వారికి చంద్రన్న బీమా ద్వారా వచ్చే లబ్ధి మొత్తాన్ని త్వరగా ఇవ్వాలి. నిబంధనల మేరకు ఇవ్వాల్సిన మొత్తాన్ని మృతుడి పెద్దకర్మకు రెండు రోజుల ముందే చెల్లించాలన్నది తాజా నిర్ణయం. డాక్యుమెంట్లు క్లియర్‌గా ఉంటే ఇక ఎవరి ప్రమేయం లేకుండానే సెర్ప్ డబ్బు మొత్తాన్ని అందచేస్తుంది. నేరుగా లబ్ధిదారుని బ్యాంక్ అకౌంట్‌లో డబ్బు పడిపోతుంది.

బీమాలో ప్రభుత్వ వాటానే ఎక్కువ

చంద్రన్నబీమా సొమ్ములో ప్రభుత్వవాటానే అత్యధికం. అసంఘటిత కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆమ్ ఆద్మీ బీమా యోజనను అమలు చేస్తున్నది. ఇందులో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి బీమా వర్తిస్తుంది. చంద్రన్నబీమాలో 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు వరకు బీమా వర్తిస్తుంది. చంద్రన్నబీమాలో ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తికి ఎల్ఐసీ రూ 75,000 ఇస్తుంది. ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఇతోధికంగా ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీతో భాగస్వామ్యం కలిసి మిగతా రూ 4.25లక్షలు కూడా చేర్చి మొత్తంగా ఐదులక్షల రూపాయలను చెల్లిస్తున్నారు. ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీకి ప్రభుత్వం డబ్బు చెల్లిస్తుంది.

బీమా మొత్తం చెల్లింపులో నాలుగో స్థానంలో కృష్ణా జిల్లా...

గత ఏడాది అక్టోబర్ నుంచి అసంఘటిత రంగ కార్మికులకు చంద్రన్నబీమా అమలవుతున్నది. అప్పటి నుంచి ఈ నెల నాలుగో తేదీ వరకు ఆయా జిల్లాల్లో జరిగిన క్లెయిముల పరిష్కారం పరిశీలిస్తే కృష్ణా జిల్లా నాలుగో స్థానంలో ఉంది. అక్టోబరు నుంచి ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 59,252 సాధారణ క్లెయిములు, 7677 ప్రమాదానికి సంబంధించిన క్లెయిములు వచ్చాయి. వీటిలో ఎల్ఐసీ ద్వారా సాధారణ కేసులలో 53,775, ప్రమాదానికి సంబంధించిన కేసులలో క్లెయిములు 3771 పరిష్కారమయ్యాయి. ఓరియంటల్ ఇన్సూరెన్స్ ద్వారా ప్రమాదానికి సంబంధించిన క్లెయిములు 4529 పరిష్కారమయ్యాయి. టోటల్‌గా రూ 382.85 కోట్లమేరకు చెల్లింపులు జరిగాయి. చెల్లింపులలో రాష్ట్ర సగటు 67.04 శాతంగా ఉంది.

క్లెయిముల పరిష్కారంలో విజయనగరం, అనంతపురం, చిత్తూరు, కృష్ణాజిల్లాలు 85 శాతానికిపైగా చెల్లింపులు చేసి నాలుగో స్థానంలో నిలిచాయి. కడప, శ్రీకాకుళం 86 శాతానికిపైగా క్లెయిములు పరిష్కరించి మూడో స్థానంలో ఉండగా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, కర్నూలు జిల్లాలు 87 శాతం మేరకు క్లెయిములు పరిష్కరించి రెండో స్థానంలో నిలిచాయి. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు అన్ని జిల్లాలకంటే ఎక్కువగా 88 శాతం మేరకు క్లెయిములు పరిష్కరించి మొదటి స్థానంలో నిలిచాయి.

జిల్లా సమాఖ్య కాల్ సెంటర్‌ను వినియోగించు కోవడంలోనూ నాలుగో స్థానమే...

గ్రామాలలో లబ్ధిదారులకు సహాయపడేందుకు బీమా మిత్రులు ప్రతి మండలానికి ఇద్దరు ఉన్నారు...సెర్ప్ కాల్ సెంటర్ 155214కు లబ్ధిదారులు ఫోన్ చేసి చెబితే బీమా మిత్రులు స్పందిస్తారు. అక్టోబర్ నుంచి ఈ నెల నాలుగో తేదీ వరకు కాల్‌సెంటర్ సేవలను వినియోగించుకుని 68,558 మంది తమ క్లెయిములను నమోదు చేసుకున్నారు. వీటిలో 1580 క్లెయిములు తిరస్కరణకు గురయ్యాయి. వీటిలో డిజేబులిటీ క్లెయిములు 252 ఉన్నాయి. కాల్‌సెంటర్‌కు కాల్ వచ్చిన రోజునే 46,667 రిజిస్టర్ అయ్యాయి. అంత్యక్రియలకు అప్పటికప్పుడే రూ. 5000 చొప్పున 38,760 క్లెయిములకు చెల్లించారు. ఏడు రోజులలో క్లెయిములను అప్‌లోడ్ చేయడంలో కృష్ణా జిల్లా నాలుగో స్థానంలో ఉంది. ఈ జిల్లాలో కేవలం 59.2 మేరకే అప్‌లోడు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా మాత్రం 83.68 శాతం మేరకు అప్‌లోడు చేసి టాప్‌లో నిలిచింది. అన్ని జిల్లాలకంటే తక్కువగా కర్నూలు జిల్లాలో కేవలం 42.44 శాతమే అప్‌లోడు అయ్యాయి. అప్‌లోడు చేయడంలో రాష్ట్ర సగటు 61.92 శాతంగా ఉంది.

శ్రీవారి సమాచారం



తిరుమల తిరుపతి శ్రీవారి ఆర్జిత సేవలు వివరాలు టీటీడీ కళ్యాణ మండపంలోని ఈ దర్శనం కౌంటర్‌లో...

ప్రత్యేక దర్శనం : ఆగస్టు 21 నుంచి నుంచి సెప్టెంబర్ 30 వరకు అందుబాటులో ఉన్నాయి.


కాటేజీలు : సెప్టెంబర్ 13 నుంచి 20 వరకు అక్టోబర్ 3 నుంచి డిసెంబర్ 5 వరకు ఖాళీలు ఉన్నాయి.

ఆర్జితం : అక్టోబర్ 5వ తేదీకి కల్యాణోత్సవం, దీపాలంకరణ, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్‌సేవ విశేష పూజా టిక్కెట్లను ఆదివారం జారీ చేస్తారు.

గమనిక : ఇప్పటి వరకు 60 రోజులు ముందుగా జారీ చేస్తున్న నిజపాదం, సుప్రభాతం, అష్టాదళ పాదపద్మారాధన సేవలు ఈ కౌంటర్‌లలో జారీ చేయటం నిలిపివేశారు.

● రూ.300 టికెట్లు ఒక్కరు ఎంత మందికైనా పొంద వచ్చు. సేవా టికెట్లు ఇద్దరికే జారీ చేస్తారు. టికెట్ల కోసం వెళ్ళే భక్తులు తమ గుర్తింపు కార్డును, టికెట్లు ఎవరికి తీసుకుంటున్నారో వారి గుర్తింపు కార్డులు కూడా తీసుకువెళ్ళాలి. సేవా టికెట్లు 60 రోజులు ముందుగా, ప్రత్యేక దర్శనం టికెట్లు, కాటేజీలు 120 రోజులు ముందు ఖాళీగా ఉన్న ప్రకారం జారీ చేస్తారు.

దుర్గగుడిలో ఆర్జిత సేవలు



- తెల్లవారు జాము 3.00గంటలకు కవాట ఉద్ఘాటన. అనంతరం సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగనివేదన, హారతి
- ఉదయం 6-7, 10.45-11.45, 4.45 నుంచి 5.45 గంటల వరకు త్రికాలార్చన
- 4 గంటలకు సర్వదర్శనం, 5 గంటల వరకు ఖడ్గమాల పూజ
- 6.30గం. అమ్మవారికి నివేదన
- ఉదయం 7 నుంచి తొమ్మిది గంటల మధ్య రుద్రహోమం
- ఉదయం 9 - 12.00 మధ్య లక్ష కుంకుమార్చన, శ్రీచక్రార్చన, చండీహోమం, శాంతి కల్యాణం
- 11 - 12 మధ్య సౌభాగ్య ప్రదాయనీ పూజ
- మధ్యాహ్నం 12 గంటలకు మహానివేదన
- సాయంత్రం 3.30 - 4.30 గంటల మధ్య స్వర్ణపుష్పార్చన
- సాయంత్రం 6- 6.30 పంచహారతులు
- రాత్రి 10 గంటలకు ఆలయం మూసివేత

బైక్ ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన కృష్ణ

ఫిరంగిపురం : ముందు వెళ్తున్న బైక్‌ను వెనుకగా వస్తున్న బైక్ ఢీకొనగా వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వేములూరిపాడు గ్రామానికి చెందిన వీరయ్య, ఇర్ల కృష్ణ(54)లు బైక్‌పై ఫిరంగిపురం వస్తున్నారు. ఆ సమయంలో హౌస్‌గణేష్‌కు చెందిన కొమ్మనబోయిన వెంకట సురేష్ గుంటూరులో పూలు అమ్ముకొని బైక్‌పై వస్తూ ముందు వెళ్తున్న బైక్‌ను గుంటూరు-కర్నూలు రహదారిపై ఫిరంగిపురం సమీపంలోని అనాథ ఆశ్రమం వద్ద ఢీకొట్టాడు. దీంతో ముందు బైక్‌పై వెనుక కూర్చున్న ఇర్ల కృష్ణ రోడ్డుపై పడగా తలకు తీవ్ర గాయాలై రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడు కృష్ణ బంధువులు వందలాదిగా తరలి వచ్చి కృష్ణ మృత దేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. స్థానిక పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. ఏఎస్ఐ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురు అరెస్టు

పొన్నూరు: పట్టణంలోని తెలగపాలెంకు చెందిన తాపీ మేస్త్రి బత్తిన మణికంఠపై హత్యాయత్నం కేసులో ముగ్గురిని స్థానిక ఆలూరు రైల్వే గేట్ వద్ద మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. మణికంఠపై హత్యాయత్నం చేయగా చికిత్స పొందుతున్న విషయం పాఠకులకు విదితమే. అర్బన్ పోలీస్ స్టేషన్ హెచ్‌సీ బొర్రా చంద్రశేఖర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇరువర్గాలమధ్య చెలరేగిన చిన్న తగాదా చిలికి చిలికి గాలివానగా మారి హత్యాయత్నం చేసే స్థాయికి వెళ్ళిందన్నారు. కొండముదికి చెందిన కోండ్రు ఏసుబాబు, 16 వార్డు తుంగభద్ర కట్టపై ఉంటున్న జవ్వాది దోతి సుధాకర్‌బాబు, మద్దెల కిరణ్ అలియాస్ బాషా అనే ముగ్గురు కలిసి ఈ నెల 6వ తేదీన మణికంఠను హతమార్చాలని నిర్ణయించుకున్నారు. స్థానిక ఎస్‌వీపీ రోడ్డులోని ఓ వైన్ షాపులో మద్యం తాగారు. అనంతరం తెలగపాలెంలోని మణికంట ఇంటికి వెళ్ళి నిద్రపోతున్న అతనిని బయటకు రమ్మని పిలిచారు. కోండ్రు ఏసుబాబు బైక్‌పై ఉండగా మద్దెల కిరణ్ అలియాస్ బాషా మణికంఠ చేతులు పట్టుకోగా సుధాకర్‌బాబు మినీకట్టర్‌తో గొంతు, పొట్ట, చేతిపై పొడిచాడు. దీంతో తీవ్రంగా రక్తస్రావం కావటంతో మణికంఠ అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. మనికంఠ చనిపోయాడనుకుని వారు బైక్‌పై పరారయ్యారు. ముద్దాయిలను అరెస్టుచేసి స్థానిక కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారని స్థానిక హెచ్‌సీ బొర్రా చంద్రశేఖరరావు తెలిపారు.

స్పిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు గజ్వెల్లి స్పిన్నింగ్ మిల్లులో మంగళవారం విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో సుమారు 200 బోరాలు దగ్ధం కావటంతో రూ. 4 లక్షల మేర ఆస్థి నష్టం సంభవించింది. మిల్లు యాజమాన్యం పెనుప్రమాదం సంభవించకుండా అప్రమత్తమై మంటలను అదుపు చేసే చర్యలు చేపట్టారు. ప్రమాదంపై స్పిన్నింగ్ మిల్ యాజమాన్యం చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శేకూరులో యువకుడి ఆత్మహత్య

చేబ్రోలు: కుటుంబ కలహాల నేపథ్యంలో మండలంలోని శేకూరు గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం శేకూరు గ్రామానికి చెందిన యడ్ల ప్రసాద్ (38) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంతకాలంగా కుటుంబంలో నెలకొన్న కలహాల వల్ల ఉరివేసుకున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాబూరావు పేర్కొన్నారు.

గూడ్సు రైళ్ల కింద పడి ఇద్దరి మృతి

దుగ్గిరాల: చెన్నై-విజయవాడ మార్గంలో దుగ్గిరాల రైల్వేస్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు వేర్వేరు గూడ్సు రైళ్ల కిందపడి మృతి చెందారు. తెనాలి రైల్వే ఎస్ఐ కె. వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం .. స్థానిక రైల్వే స్టేషన్‌లోని లూప్‌లైన్‌లో గూడ్సు రైలుకింద పడి స్థానిక దళితవాడకు చెందిన మంచికలపూడి చిన్నబ్బాయి(45) మృతిచెందాడు. మంగళవారం తెల్లవారుజామున రైలుపట్టాలు దాటబోతూ మృతిచెంది ఉండవచ్చునని భావిస్తున్నట్లు తెలిపారు. తలవెనుకభాగం పూర్తిగా ఛిద్రమైంది. స్థానిక సొసైటీలో కూలీగా పనిచేసే చిన్నబ్బాయికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. మరో ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. తల వెనుకభాగం పూర్తిగా ఛిద్రమైంది. ప్రత్యక్షసాక్షులెవరూ లేకపోవడంతో బలవన్మరణమా, ప్రమాద వశాత్తు జరిగిందా .. అనే వివరాలు పోస్టుమార్టం అనంతరం చెప్పగలమని ఎస్ఐ తెలిపారు. నలుపురంగుపై వంగ పువ్వురంగు అడ్డచారల టీ షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి, మాసిన గడ్డం కలిగిన వ్యక్తికి వయసు 50 సంవత్సరాలు ఉండవచ్చని భావిస్తున్నారు. పంచనామా అనంతరం హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలో ఉంచినట్లు ఎస్ఐ వెంకటయ్య తెలిపారు.

'భూంఫట్'పై.. కదిలిక

- అధికారుల జాయింట్ ఆపరేషన్
- అక్రమార్కులపై కేసుల నమోదుకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మాచర్ల: విజయపురిసౌత్‌లో ఆక్రమణకు గురైన భూములపై ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో 'భూంఫట్' పేరిట ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రెవెన్యూ, ఎన్ఎస్పీ, పర్యాటక శాఖాధికారులు మంగళవారం ఆక్రమిత భూములను పరిశీలించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 15 ఎకరాలు, అటవీశాఖకు సంబంధించి 15 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు, ఎన్ఎస్పీకి సంబంధించిన 10 ఎకరాల్లో చెట్లను నరికి కాల్చివేసినట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా తహసీల్దారు వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ 1995లో ఎన్ఎస్పీ అధికారులు 1720 ఎకరాల భూమిని రెవెన్యూశాఖకు అప్పగించినట్లు తెలిపారు. దీనిలో 500 ఎకరాలు మెగా టూరిజం ప్రాజెక్టుకు కేటాయించగా మరో 200 ఎకరాల భూమిని గత ప్రభుత్వాల హయాంలో లబ్దిదారులకు పట్టాలిచ్చినట్లు తెలిపారు. మిగిలిన 1020 ఎకరాల్లో ఏడు ఎకరాలు భూ ఆక్రమణకు గురైనట్లు చెప్పారు. భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఓ వ్యక్తి ఐదెకరాల భూమిని సాగు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఫారెస్ట్ రేంజర్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ గతంలో రెండు పర్యాయాలు భూ ఆక్రమణదారులపై జరిమానా విధించినట్లు తెలిపారు. అటవీశాఖాధికారుల పరిధిలోని భూములను ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ డీఈ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్ఎస్పీ పరిధిలోని సుమారు 10 ఎకరాల భూముల్లో చెట్లు నరికి కాల్చి వేసినట్లు గుర్తించామన్నారు. భూముల పరిశీలనలో పర్యాటక శాఖ ఈడీ మల్లికార్జునరావు, ఎన్ఎస్పీ జేఈలు సత్యనారాయణ, కేశవరావు, సుబ్బయ్య, అటవీశాఖ స్పెషలాఫీసర్ వెంకటేశ్వర్లు, రూరల్ ఆర్ఐ ఏసీహెచ్ వెంకటేశ్వర్లు, సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న అధికారులు

మద్యం తాగి స్కూల్ బస్సు నడిపిన డ్రైవర్ అరెస్టు

నెల రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా


డ్రైవర్‌ను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరెడ్డి

బాపట్ల టౌన్/గుంటూరు : మద్యం మత్తులో ప్రైవేటు పాఠశాల బస్సు నడుపుతున్న డ్రైవర్‌ను పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నరాల శెట్టివారిపాలెంకు చెందిన సురేంద్రనాథ్ అనే వ్యక్తి పట్టణంలోని విద్యా సంస్థ స్కూల్ బస్సు డ్రైవర్‌గా కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం సూర్యలంక రోడ్డులోని విద్యార్థులను స్కూల్‌కు తీసుకెళ్లేందుకు వెళుతున్న సమయంలో దారిలో ఓ మద్యం షాపులో మద్యం తాగాడు. ఈ దృశ్యాన్ని ఓ వ్యక్తి రూరల్ ఎస్పీకి వాట్సాప్ ద్వారా పంపాడు. వెంటనే రూరల్ ఎస్పీ అప్పలనాయుడు స్పందించి బాపట్ల పోలీసులను అప్రమత్తం చేశారు. బాపట్ల ఇన్‌చార్జ్ డీఎస్పీ సుధాకర్, బాపట్ల ఎస్ఐ శ్రీనివాసరెడ్డిలు స్పందించి డ్రైవర్‌ను అదుపులోనికి తీసుకున్నారు. డ్రైవర్‌ను బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరిశీలించగా 206 శాతం మద్యం తాగినట్లు నిర్ధారణ అయ్యిందని తెలిపారు. డ్రైవర్ సురేంద్రనాథ్‌పై కేసు నమోదు చేసి బాపట్ల కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రవి సురేంద్రనాథ్‌కు నెల రోజులు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానాగా విధించారు. ఆ మొత్తం చెల్లించకుంటే మరో నెల రోజులు జైలు శిక్ష అనుభవించాలంటూ తీర్పునిచ్చారు. డ్రైవర్ సురేంద్రనాథ్‌ను పోలీసులు జైలుకు తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉదయాన్నే వైన్ షాప్ తెరిచి మద్యం విక్రయించిన దుకాణంపై చర్యలు తీసుకోవాలని రూరల్ ఎస్పీ అప్పలనాయుడు కలెక్టర్‌కు లేఖ రాశారు.

జరిమానా వసూళ్లలో చేతి వాటం

- నకిలీ రశీదులతో ఖజానాకే కన్నం
- ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుళ్ళ సస్పెన్షన్

గుంటూరు : నిబంధనలు అతిక్రమించిన వాహన చోదకుల నుంచి అనధికారికంగా సాగించే వసూళ్లకోసం నకిలీ రశీదులతో ఖజానాకే కన్నం వేసిన ఇద్దరు ఖాకీలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ అవకతవకలు అర్బన్ ఎస్పీ దృష్టికి వచ్చాయి. దీంతో మంగళవారం ఈస్ట్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ పీవీఎస్ సాయిబాబా (హెచ్‌సీ 2839), కానిస్టేబుల్ జి.అనీల్‌కుమార్ (పీసీ 83) లను సస్పెండ్ చేస్తూ అర్బన్ ఎస్పీ విజయరావు ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారం పోలీసుశాఖలో కలకలం రేపింది. నిబంధనలు అతిక్రమంచే వాహన చోదకుల నుంచి జరిమానా వసూలు చేసేందుకు పోలీసుశాఖ ప్రత్యేకంగా ఆయా స్టేషన్లకు రసీదు పుస్తకాలను అందజేస్తుంది. ఒరిజినల్ రసీదు కింద కార్బన్ ద్వారా మరో డూప్లికేట్ రసీదు ఉంటుంది. పుస్తకం పూర్తయిన తరువాత మొత్తం ఎంతనేది లెక్కించి పుస్తకాన్ని, మొత్తం నగదును పోలీసు కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. అయితే ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిమానా పుస్తకంలోని డూప్లికేట్ రసీదు స్థానంలో మూడు నకిలీ రసీదులు ఉంచి ప్రభుత్వ ఖజానాకు నష్ట కలుగచేశారని అజ్ఞాత వ్యక్తులు అర్బన్ ఎస్పీకి సమాచారం అందించారు. దీంతో ఆయన ఆయా రసీదులపై విచారణ జరిపించి మోసం చేసినట్లు గుర్తించారు. బాధ్యులిద్దరినీ సస్పెండ్ చేశారు. కాగా ఇదే తరహాలో ఇంకేమైనా అవకతవకలు, మోసాలు జరిగాయా.. అనే కోణంలోనూ అధికారులు విచారణ చేస్తున్నారు.

మెగ్నీషియం సల్ఫేట్ వాడాలి: ఏవో నరసింహారావు

రెంటచింతల: పత్తిలో ఎరుపు రంగు నివారణకు మెగ్నీషియం సల్ఫేట్‌ను లీటర్ నీటికి 10 గ్రాములు, బోరాన్ 250 గ్రాములు యూరియా ద్రావణంతో కలిపి మొక్క బాగా తడిసే వరకు పిచికారి చేయాలని ఏవో పోట్ల నరసింహారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో అదనులో మంచి వర్షాలు పడ్డాయన్నారు. జూన్, జూలైలో సగటు కన్నా ఎక్కువ వర్షపాతం నమోదైందన్నారు. ఆగస్టులో సాధారణ వర్షపాతం 10 సెం.మీకాగా ఇప్పటికే 50 శాతం దాటిందని వివరించారు.

జెట్టిపాలెంలోని మోడల్ స్కూల్



మోడల్ స్కూల్లో వసతుల లేమి

క్రీడా ప్రాంగణం కరువు ● తీవ్ర నీటి ఎద్దడి

(రెంటచింతల)

మండల పరిధి జెట్టిపాలెం గ్రామంలోని మోడల్ స్కూల్‌కు వసతుల కల్పన పూర్తిస్థాయిలో జరగలేదు. సుమారు 4.5 ఎకరాల్లో 2012లో రూ. 3.2 కోట్లతో భవనాలను నిర్మించగా, 2013 జూన్ నుంచి తరగతులను ప్రారంభించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో వేలకు వేలు చెల్లించలేని నిరుపేదలు మోడల్ స్కూల్లో ఉచితంగా సుమారు 360 మంది ఇంగ్లీషు విద్యను అభ్యసిస్తున్నారు. 6 నుంచి 12 తరగతుల వరకు చెబుతున్నారు. అయినా,నేటికి ప్రహరీ ఏర్పాటు చేయకపోవడంతో పాఠశాల పరిసరాల్లో పశువులు సంచరిస్తున్నాయి. సరైన ఆట స్థలం లేదు. రాళ్లతో నిండిపోయి ఆటలకు ఏ మాత్రం యోగ్యంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడున్న ఏకైక బోర్ వట్టి పోవడంతో తాగునీటికి కటకట ఏర్పడింది. ప్రతిరోజు మంచినీటి క్యాన్లను కొనుగోలు చేసి విద్యార్థులకు తాగునీటిని అందచేస్తున్నారు. పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో అగ్రశేణిగా ఉంటున్నప్పటికీ సౌకర్యాల కల్పనలో అధికారులు చొరవ చూపడం లేదు.

పెరిగిన పత్తి సాగు విస్తీర్ణం



సాగవుతున్న పత్తి పైరు

రెంటచింతల: మండల గ్రామాల్లో గతంలో కంటే ఈ ఖరీఫ్‌లో పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. కిందటేడాది పత్తికి గిట్టుబాటు ధర రావడంతో పాటు దిగుబడి కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో వచ్చింది. దాంతో రైతులు ఈసారి పత్తి సాగుపై దృష్టి పెట్టారు. కొన్ని గ్రామాల్లో మాగాణి భూముల్లో కూడా పత్తినే సాగు చేయడం గమనార్హం. కిందటేడాది కాలువలకు నీరు రాకపోవడంతో చాలా మంది రైతులు నిరాశ చెందారు. ఇప్పుడు కూడా అటువంటి పరిస్థితి తలెత్తుతుందనే అనుమానంతో చాలా మంది వరి సాగును పక్కనపెట్టారు. నిరుడు మిర్చిని సాగు చేసిన రైతులంతా భారీగా నష్టపోయారు. ఆ నష్టాల నుంచి గట్టెక్కడానికి పత్తిసాగే శరణ్యంగా భావించారు. కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలు పత్తిపైరుకు బాగా మేలు చేస్తున్నాయి. 2016-17 ఖరీఫ్ సీజన్‌లో 4914 హెక్టార్లలో పత్తి సాగు చేయగా, 2017-18 సంవత్సరానికి 5500 హెక్టార్ల దాకా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

పంచాయతీ రోడ్లకు రూ.19 కోట్లు

ప్రతిపాదనలు ఆమోదించిన మంత్రి లోకేష్



మంత్రి లోకేష్‌తో రాయపాటి రంగబాబు

మాచర్ల: గ్రామ పంచాయతీ రహదారుల నిర్మాణానికి రూ. 19 కోట్లతో ప్రతిపాదనలను గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌బాబు ఆమోదించారు. మాచర్ల నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న నరసరావుపేట ఎంపీ రాయపాటి సాంబశివరావు తనయుడు రంగబాబు ఈ ప్రతిపాదనలను మంగళవారం మంత్రి లోకేష్‌ను కలిసి అందించారు. గిరిజన గ్రామాలను, తండాలను అనుసంధానం చేసే రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఈ సందర్భంగా లోకేష్ స్పష్టం చేసినట్లు రంగబాబు తెలిపారు. మాచర్ల పరిధిలో ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద రక్షిత మంచి నీటి పథకాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారని అన్నారు. నిధులు త్వరితగతిన మంజూరు చేసేందుకు చొరవ తీసుకోవాలని లోకేష్‌ను కోరినట్లు రంగబాబు వెల్లడించారు.

10న మెగా వైద్యశిబిరం

దుర్గి: తేరాల గ్రామంలో ఈ నెల 10వ తేదీన ఎన్టీఆర్ వైద్య సేవ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంపు కోఆర్డినేటర్ మల్లికార్జునరెడ్డి, ఆరోగ్య మిత్ర చలపతి తెలిపారు. గుంటూరులోని పీపుల్స్ ట్రామా హాస్పిటల్, శ్రీరామచంద్ర పిల్లలు, దంత వైద్యశాల వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. హాజరయ్యేవారు తెల్లరేషన్‌కార్డుతో వైద్యపరీక్షలకు హాజరుకావాలని కోరారు. దుర్గి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

అక్షర ఫౌండేషన్ బియ్యం వితరణ

గురజాల: పట్టణానికి చెందిన కత్తి దానం 13వ వర్ధంతి సందర్భంగా మంగళవారం అతని కుటుంబసభ్యులు మండలంలోని గంగవరం గ్రామంలో గల అక్షర ఫౌండేషన్‌కు క్వింటా బియ్యాన్ని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కత్తి చలమరాజు, గాంధీ, కాశిబాబు తదితరులు పాల్గొన్నారు.



దాతల సహకారంతో ఆలయాభివృద్ధి

చెన్నకేశవస్వామి ట్రస్ట్ బోర్డు చైర్మన్ యలమంద

మాచర్ల రూరల్: దాతల సహకారంతో ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు లక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ సూరె యలమంద తెలిపారు. ఆలయంలోని కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కండె భాస్కరరావు, పుష్పావతి దంపతులు కల్యాణ మండపానికి 15 ఫ్యాన్లు అందించారన్నారు. తొండపు మల్లికార్జునరావు, శ్రీనివాసరావు మరో 18 ఫ్యాన్లు అందించినట్లు చెప్పారు. తన సొంత ఖర్చుతో 20 ట్యూబులైట్లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. శీతిరాజు వెంకటరమణ, అతని కుటుంబసభ్యులు, మిత్రుల సహకారంతో వాహనాల పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఈవో కృష్ణంరాజు, గోనుగుంట్ల రామ్మూర్తి, వెంకటేశ్వరరెడ్డి, చలమాచలం సీతారామచార్యులు, భరద్వాజ్‌చార్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యలమంద

రహదారులు ఇంత అధ్వానంగా ఉన్నాయెందుకు?

డీఎల్‌పీవో కృష్ణమోహన్ ఆగ్రహం

రెంటచింతల: ఇదేనా గ్రామీణ పారిశుధ్యం.. అంతర్గత రహదారులు ఇంత అధ్వానంగా ఉన్నాయెందుకు? అంటూ నరసరావుపేట డీఎల్‌పీవో కే కృష్ణమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామాన్ని ఆయన సందర్శించారు. పైప్‌లైన్లు పగిలిపోయాయని, బోర్‌కు మరమ్మతులు చేయడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. గ్రామ సచివాలయం ముళ్లకంపతో నిండిపోవడాన్ని ఆక్షేపించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఇటీవల బాధ్యతలు తీసుకున్నట్టు సమాధానం ఇచ్చారు. సర్పంచ్ పెద వెంకటేశ్వరరెడ్డికి ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో కృష్ణమోహన్ మాట్లాడుతూ రెండు వేలలోపు జనాభా వున్న గ్రామాల్లో 10శాతం కంట్రిబ్యూషన్ చెల్లిస్తే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా 90 శాతం నిధులు తెచ్చుకోవచ్చన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్షాలు విస్తృతంగా కురుస్తున్నందున పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈయన వెంట ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జాన్‌పీరా, టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, గొట్టం పేర్రెడ్డి, లింగారెడ్డి తదితరులున్నారు.



మిట్టగుడిపాడులోని రహదారిని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కృష్ణమోహన్

పైర్లకు జీవం పోసిన
చిరుజల్లులు

దుర్గి: మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు పడుతున్నాయి. ఇప్పటి వరకు సరైన వర్షం లేక పైర్లు బెట్టకొస్తున్న తరుణంలో కురుస్తున్న వర్షం జీవం పోసింది. కంది, పత్తి, మిర్చి, అపరాల పంటలకు ఈ వర్షాలు మేలు చేస్తాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గికి చేరిన
రామదండు

దుర్గి: వరుణుని కటాక్షం కోసం తలపెట్టిన రామదండు యాత్ర మంగళవారం రాత్రి దుర్గికి చేరింది. కోలగుట్ల గ్రామస్థులు శ్రీరాముడి చిత్రపటంతో రామదండుగా బయలుదేరి దుర్గికి శ్రీరాముని పీఠాన్ని చేర్చారు. దుర్గి ప్రజలు మేళతాళాలతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. అనంతరం పీఠాన్ని గ్రామంలో వైభవంగా ఊరేగించారు. బుధవారం సాయంత్రం ఈ పీఠాన్ని ఓబులేశునిపల్లెకు చేర్చనున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీనివాసుని కల్యాణం

రెంటచింతల: కలియుగ దైవం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి మాణ్యంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు పూరిమెట్ల శేషభట్టాచార్యులు నేతృత్వంలో 15 మంది అర్చకస్వాములు స్వామి కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన మారేపల్లి శ్రీమన్నారాయణాచార్యులు ప్రధాన రుత్వికుడిగా వ్యవహరించారు. వేకువజాము నుంచే సుప్రభాత సేవ, విశ్వక్సేన ఆరాధన, అభిషేకాలు, సుదర్శన హోమం, శాంతి కల్యాణం చేశారు. సన్నెగండ్ల గోపాలాచార్యులు వ్యాఖ్యాతగా వ్యవహరించి భక్తులను రంజింప చేశారు. పలువురు దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమిటీ సభ్యులు గం డికోట విజయకుమార్‌శర్మ, నారాయణం విజయకుమార్, సాగి మురళి, జిగురు ప్రసాద్, శంకర్, మారుతి శర్మ, అనిల్ శర్మ తదితరులను సత్కరించారు.


మాంగళ్యాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చక స్వాములు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

మాచర్ల — కూరగాయల ధరలు (రూ.) 1 కిలో

టమోటా:రూ.60, పచ్చిమిర్చి: రూ.35, బెండ:రూ.15, దొండ:రూ.15, బంగాళదుంప: రూ.20, దోస:రూ.15, వంకాయలు: రూ.20, బీర:రూ.20, క్యారెట్:రూ.50, బీట్‌రూట్:రూ.40, ఉల్లిగడ్డలు:రూ.30 కీర: రూ.40, కాకర:రూ.40, క్యాబేజి రూ20, మునక్కాయ(1):రూ.4, సొరకాయ:రూ.10.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవికాదు) సమస్యలు ఉన్నాయా? ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం : ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య
ఫోన్ నెంబర్ : 08642 224949

ఎమ్మార్ వ్యాక్సిన్‌తో వ్యాధులు దూరం:డాక్టర్ సతీష్


కస్తూర్బాలో ఎమ్మార్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రెంటచింతల: రూబెల్లా తట్టు రాకుండా ఉండడానికి వేస్తున్న ఎమ్మార్ వ్యాక్సిన్‌తో చిన్నారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పీహెచ్‌సీ డాక్టర్ సతీష్ తెలిపారు. మంగళవారం మండలంలోని పాలువాయి, పశర్లపాడు, మిట్టగుడిపాడు తదితర గ్రామాల్లోని పాఠశాలల 702 బాల బాలికలకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. ఇప్పటి వరకు 8169 మందికి వ్యాక్సిన్ వేసినట్లు పేర్కొన్నారు. మరో 8 వేల మందికి వ్యాక్సిన్ వేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కందిమళ్ల నాగరాజు, మాధవి, శివమ్మ, విజయమ్మ, నాగమణి, కస్తూర్బా ప్రిన్సిపాల్ అవ్వారి అంజలి సుధ, సుజాత, వంశి, శాంతకుమారి,మణి, ఆశా, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ బోర్డులో
పేర్లు మార్పు

మాచర్ల రూరల్: మున్సిపల్ బోర్డులోని పాలకుల పేర్లను ఎట్టకేలకు అధికారులు మార్చారు. ఆంధ్రజ్యోతి మాచర్ల జోన్‌లో సోమవారం ప్రచురితమైన 'తప్పుల తడకగా మున్సిపల్ బోర్డు' కథనానికి స్పందించారు. మంగళవారం గతంలో ఉన్న పేర్లను తొలగించి ప్రస్తుతం పాలకుల పేర్లు, వారి హోదాలను తెలుపుతూ రాశారు.



శిథిల భవనాలు కూల్చివేత


శిథిల గృహాన్ని కూల్చివేయిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావు

మాచర్ల రూరల్: పట్టణంలోని శిథిల భవనాల కూల్చివేతకు పురపాలక సంఘ అధికారులు శ్రీకారం చుట్టారు. టౌన్ ప్లానింగ్ అధికారి కే నాగేశ్వరరావు పర్యవేక్షణలో కాలం తీరిన గృహాలను కూల్చివేయిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 30 శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించామన్నారు. ఇప్పటికే గృహ యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. యజమానులు స్పందిచకపోతే మున్సిపల్ సిబ్బంది కూల్చివేస్తారని తెలిపారు.

10న విద్యా సంస్థల బంద్
గోడప్రతుల విడుదల

మాచర్లటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న విద్యా సంస్థ బంద్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ కమిటి నేతలు తెలిపారు. పట్టణంలో మంగళవారం బంద్‌కు సంబంధించిన గోడప్రతులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భగవాన్‌దాసు, రాజేష్, రామారావు, తిరుపతయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి పోస్టుమాస్టర్‌గా
సాంబశివరావు

రెంటచింతల: సబ్ పోస్టాఫీసు ఇన్‌చార్జి పోస్టుమాస్టర్‌గా ఆర్‌జె సాంబశివరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పెదకూరపాడు నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి దాకా ఇక్కడ పనిచేసిన లక్ష్మి 3 నెలలు పాటు సెలవుపై వెళ్లారు. సాంబశివరావుకు గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉంది.

నెలాఖరుకు మరుగుదొడ్ల లక్ష్యాలను చేరుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శశిధర్

మాచర్ల: ఈ నెలాఖరు నాటికి మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ కోన శశిధర్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబానికి మరుగుదొడ్డి మంజూరు చేసి పనులు ప్రారంభించాలన్నారు. ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించి మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఎన్టీఆర్ భరోసా కింద మంజూరైన గృహాల వివరాలను గ్రామసభలు నిర్వహించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ గృహాలను గుర్తించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్ విజయ్, ఈవోపీఆర్డీ గంగామోహన్, హౌసింగ్ డీఈ రవి, ఏఈ రామకృష్ణ, ఏపీవో రేఖాజ్యోతి, టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఆఫీసర్స్ వాయిస్

బకాయిలు త్వరితగతిన చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్ గిరికుమార్



మాచర్ల రూరల్: పురప్రజలు బకాయిలను త్వరితగతిన చెల్లించాలి. ఇంటి, నీటి పన్ను బకాయిలను మీసేవాలో గానీ, పురపాలక సంఘ కార్యాలయంలో గానీ చెల్లించవచ్చు. ప్రతి ఆదివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో హ్యాపీ సండే నిర్వహిస్తున్నాం. దుకాణాదారులు, గృహస్తులు చెత్తాచెదారాన్ని రోడ్ల వెంట పడవేయకుండా డస్ట్‌బిన్‌లలో వేయాలి.

రైతులు, కార్మికుల సంక్షేమానికే వైద్య శిబిరాలు

మిర్చియార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు



వైద్య శిబిరంలో పాల్గొన్న మన్నవ సుబ్బారావు

ఆంధ్రజ్యోతి, గుంటూరు: రైతుల, కార్మికుల సంక్షేమానికే ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు మిర్చియార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం యార్డులోని ఎన్జీ రంగా సమావేశ మందిరంలో ఎండోలైఫ్ హాస్పిటల్, కొనాక్ డయోగ్నిస్టిక్స్ వారితో కలిసి డాక్టర్ కొంగర శ్రీకాంత్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్మికులకు, రైతులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈసందర్భంగా మన్నవ మాట్లాడుతూ యార్డుకు వచ్చే రైతులు, కార్మికులు, సిబ్బంది ఆరోగ్యపరిస్థితిని తెలుకోవడానికే వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇవి వారికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చాలామందికి షుగర్ వ్యాధి ఉందనే విషయం తెలియదని అలాంటి వారికి ఈ వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా యార్డు ఆవరణలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల సంస్థ డైరెక్టర్ వట్టికూటి హర్షవర్ధన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ లాల్‌వజీర్, సీఈవో చలపతి, పొదూరి రమేష్‌బాబు, యార్డు కార్యదర్శి ఎం. దివాకర్, యార్డు డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌కు తీహార్ జైలే శరణ్యం

- ఆయన బయట ఉంటే సమాజానికి, అడవుల్లో ఉంటే జంతువులకు ప్రమాదం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు, శనక్కాయల అరుణ

గుంటూరు (సంగడిగుంట): వైసీపీ అధినేత బయట ఉంటే సమాజానికి, అడవుల్లో ఉంటే జంతువులకు ప్రమాదమని, ఆయనను తీహార్ జైలులో ఉంచటం ద్వారానే అన్ని వర్గాలకు రక్షణ కలుగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ జగన్‌లో అణువణువునా క్రూరత్వం నిండి ఉందని, దానిని ముందుగా గుర్తించింది అతని తండ్రి రాజశేఖరరెడ్డేనన్నారు. హైదరాబాద్‌లో జగన్ ఉంటే తన పదవికే ఎసరు వస్తుందని బెంగుళూరులో రాజశేఖరరెడ్డి ఉంచారన్నారు. ఈ విషయాన్ని రాజశేఖరరెడ్డే స్వయంగా తన సన్నిహితుల వద్ద చెప్పి ఆవేదన చెందారన్నారు. పదో తరగతి పాస్ కాలేక జగన్ క్వశ్చన్ పేపర్‌ను దొంగతనం చేసి పరీక్ష రాసి పాసయ్యాడన్నారు. అమెరికాకు పంపిస్తే మూడు రోజుల్లో వెనక్కి తిరిగి వచ్చాడన్నారు. ఉపాధ్యాయుల పైనే దౌర్జన్యం చేసిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. జగన్ జీవితం మొత్తం నేరస్తులతో ముడిపడిఉందని, అదే కోవలో ముఖ్యమంత్రి చంద్రబాబుని నడిరోడ్డు మీద కాల్చి చంపాలని అన్నాడన్నారు. జగన్ లాంటి వాడు రాజకీయాలకే మచ్చగా మారినట్లు విమర్శించారు. 2001లో పరిటాల రవిపై సూట్‌కేస్ బాంబుతో హత్యాయత్నం చేసిన ఘటనలో జగన్ హస్తం ఉందన్నారు. 2016 జూన్ 3న ముఖ్యమంత్రిని చీపుర్లతో కొట్టమని వ్యాఖ్యానించాడన్నారు. ఇవన్నీ అతని మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఇటువంటి ప్రతిపక్ష నేతకు రాజకీయాల్లో స్థానం లేదని, నంద్యాల ఓటర్లు తమ ఓటుతో ఆ దిశగా తీర్పును ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రోజా వ్యాఖ్యలు సిగ్గుచేటు : అరుణ

అసభ్యకరమైన దుస్తులతో పనికిమాలిన చిత్రాల్లో నటించిన రోజా మంత్రి అఖిలప్రియ పంజాబీ డ్రెస్‌లపై వ్యాఖ్యానించడం సిగ్గు చేటని మాజీ మంత్రి శనక్కాయల అరుణ ధ్వజమెత్తారు. కామెడీ షోల పేరుతో ఆమె ప్రవర్తనను చూసి మహిళా లోకం సిగ్గుపడుతుందన్నారు. నేటి యువతకు పంజాబీ డ్రెస్ ఎంతో అనుకూలమెందన్నారు. మద్యం తాగిన మత్తులో ప్రెస్ మీట్లు పెట్టే రోజా ఇకపై నోరు అదుపులో పెట్టుకోపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. తండ్రి చనిపోయిన మరుసటి రోజే అసెంబ్లీకి వచ్చిందంటూ మంత్రి అఖిల ప్రియపై రోజా వ్యాఖ్యానించడం అర్థంలేని వ్యాఖ్య అన్నారు. తండ్రి చనిపోతే శవ దహనానికంటే ముందే ఎమ్మెల్యేల సంతకాల పనిలో ఉన్న జగన్ పార్టీలో ఉండి రోజా ఈ వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి మానుకొండ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోజా అతి పెద్ద ఊసరవెల్లి - మురళి

గుంటూరు : రాష్ట్రంలోనే అతి పెద్ద ఊసరవెల్లి రోజా అని టీడీపీ జిల్లా కార్యదర్శి వీరవల్లి మురళి ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజా ఒక మహిళనని, ప్రజా ప్రతినిధిననే విషయాన్ని మరిచి సీఎం స్థాయి వ్యక్తులపై నోటికి వచ్చినట్లు దుర్భాషలాడుతూ సినిమాల్లో లాగే రాజకీయాల్లోనూ ప్రచారం పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. తొలుత టీడీపీలోకి అడుగు పెట్టటంతోనే పార్టీ ఓటమి పాలైందన్నారు. కాంగ్రెస్‌లోకి వెళ్లగా ఏకంగా సీఎం వైఎస్ మృతి చెందారన్నారు. వైసీపీలోకి అడుగు పెడితే జగన్ జైలుకు వెళ్లారన్నారు. ఈ విధంగా రోజాది అతి పెద్ద ఐరన్ లెగ్ అని ప్రజలంతా భావిస్తున్నారన్నారు. నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చివరకు నంద్యాలలో ఏ విధంగా మహిళలు తరిమికొట్టారో రాష్ట్రంలోని అన్ని చోట్ల ఆమెకు అదే పరిస్థితి పునరావృతం అవుతుందని హెచ్చరించారు.

ఆగని అక్రమాలు

- ఈ-పోస్ వచ్చినా మారని వైనం
- అందినకాడికి దోచుకోవడమే లక్ష్యం
- ప్రజాపంపిణీ విధానంలో పారదర్శకత ఎప్పటికో..?

ఆంధ్రజ్యోతి, గుంటూరు: ఈ-పోస్ విధానం వచ్చింది. ఇకపై ఎలాంటి అక్రమాలు జరగవన్న ప్రభుత్వ ప్రకటనలు గాలి మీద బుడగల్లా మారాయి. ఎక్కడికక్కడ విరుగుడు కనుక్కొని ఎప్పటిలానే చౌక బియ్యాన్ని కొంతమంది అధికారులు, రేషన్ డీలర్లు కలిసి బొక్కేస్తోన్నారు. లారీలకు లారీల బియ్యాన్ని జిల్లా సరిహద్దులు దాటిస్తోన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్‌షాపు వరకు ఎక్కడ రిజిష్టర్లు తనిఖీ చేసినా బియ్యం గోల్‌మాల్. ఇంత జరుగుతోన్న అడ్డుకట్ట వేయలేకపోతోన్న టెక్నాలజీ. ఇదీ స్థూలంగా జిల్లాలో ప్రజా పంపిణీ విధానం. జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కృతిక శుక్ల బుధవారం పౌరసరఫరాలపై సమగ్ర సమీక్ష నిర్వహించబోతోన్నారు. ఈ సమావేశంతోనైనా మార్పు రావాలని వినియోగదారుల సంఘాలు కోరుతోన్నాయి.

జిల్లాలో 2,730కి పైగా ఉన్న రేషన్ షాపుల ద్వారా ప్రతీ నెలా 14 లక్షల పేద కుటుంబాలకు చౌక బియ్యం సరఫరా జరగాల్సి ఉంది. ప్రతీ నెలా 90 శాతం పైగా పంపిణీ జరుగుతోన్నట్లు ఈ-పోస్‌లో గణాంకాలు కనిపిస్తోన్నా క్షేత్రస్థాయిలో జరుగుతోన్న తంతు వేరే విధంగా ఉంది. రేషన్‌షాపులకు బియ్యం తరలించే ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నుంచే అక్రమాలకు నాంది పలుకుతోన్నాయి. ఒక బస్తాలో 50 కేజీలు నిక్కచ్చిగా బియ్యం, 600 గ్రాముల గోనెసంచి తూకం కలిపి మొత్తం బరువు 50 కేజీల 600 గ్రాములుండాలి. రేషన్‌డీలర్ సంబంధిత ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లి దగ్గరుండి కాటా వేయించుకొని బియ్యం బస్తాలు తీసుకెళ్లాలి. అయితే ఈ విధానం అమలు జరగడం లేదు. ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద తూకం వేయకుండానే బియ్యం బస్తాలను రేషన్‌షాపులకు పంపిస్తోన్నారు. జీపీఎస్ పరికరం అమర్చిన వాహనం ద్వారా బియ్యం తరలించాల్సి ఉండగా అది కూడా అమలు జరగడం లేదు.

రేషన్ డీలర్లు, ఎంఎల్ఎస్ పాయింట్ల డిప్యూటీ తహసీల్దార్లు కుమ్మక్కు అయి బియ్యాన్ని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు తరలిస్తోన్నారు. ఇటీవల ఏఎస్‌వో విలియమ్స్ ఆధ్వర్యంలో గుంటూరు, మాచవరం ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేయగా స్టాకులో భారీగా వ్యత్యాసం కనిపించింది. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలకు సిఫార్సు చేయగా ప్రస్తుతం ప్రాసెస్‌లో ఉన్నది. మరోవైపు రేషన్ డీలర్లు ఎలాంటి భయం కూడా లేకుండా ప్రతీ నెలా మిగిలిపోయిన బియ్యాన్ని నల్లబజారులో అమ్ముకోవం ప్రారంభించారు. బ్రాడీపేట, వెంకటరమణ కాలనీలో అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 50 క్వింటాళ్లకు పైగా స్టాకు వ్యత్యాసం కనిపించడం సాదాసీదాగా తీసుకోవాల్సిన విషయం కాదు.

డీలర్ల వద్ద అక్రమాలు ఇలా...

రేషన్ డీలర్ల వద్దకు బియ్యం కోసం వెళితే వారి నుంచి వచ్చే ప్రశ్న ఒక్కటే బియ్యం కావాలా, కేజీకి రూ.8 నగదు కావాలా? గట్టిగా బియ్యం అడిగిన వారికి మాత్రమే ఇస్తోన్నారు. మిగతా వాళ్లకి నగదు ఇచ్చి పంపి ఆ బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌లో కేజీ రూ.10 నుంచి 12కు విక్రయిస్తోన్నారు. బియ్యం అవసరం లేని లబ్ధిదారులను గుర్తుపెట్టుకొని ప్రతీ నెలా టంఛన్‌గా వారి ఇళ్లకే ఈ-పోస్ యంత్రం తీసుకెళ్లి వేలిముద్ర వేయించి బియ్యాన్ని డీలర్ అమ్ముకొంటున్నాడు. దీని వలన ఏ నెల చూసినా 90 శాతం పైగా లబ్ధిదారులు బియ్యం తీసుకెళ్లినట్లుగా సీఎం డ్యాష్‌బోర్డులో కనిపిస్తోన్నది. ఇలా సేకరించిన బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు ఎక్కడికక్కడ దళారులు ఉన్నారు. కేజీకి రూ. 10 ఇచ్చి కొనుగోలు చేసి వాటిని హోటళ్లకు సరఫరా చేస్తోన్నారు. పునుగులు, దోశలకు పీడీఎస్ బియ్యాన్ని వినియోగిస్తోన్నారన్నది బహిరంగ రహస్యమే. మరోవైపు నగరంలో ఒక బియ్యం మాఫియా ఉన్నది. వాళ్లు రేషన్ డీలర్లు, దళారుల వద్ద బియ్యాన్ని కొనుగోలు చేసి నేరుగా గోదావరి జి ల్లాలకు తరలించి మళ్లీ రీసైక్లింగ్ చేస్తోన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు జరు గుతోన్న పాఠశాలల్లో వంట చేసే ఏజెన్సీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ బియ్యం నిల్వల్లో వ్యత్యాసం ఉంటోంది. ఇక్కడ కూడా బియ్యాన్ని మిగుల్చుకొని విక్రయిస్తున్నారు.

కిరోసిన్ పంపిణీలోనూ అక్రమాలే. రేషన్ డీలర్ ఈ-పోస్ యంత్రంపై కిరోసిన్‌కు కూడా స్లిప్పు తీస్తాడు. అయితే వంటగ్యాస్ కనెక్షన్లు ఎక్కువ మందికి ఉండటం కారణంగా చాలామంది కిరోసిన్ తీసుకోవడం లేదు. దీంతో ఆ స్లిప్పుని కిరోసిన్ హాకర్‌కు ఇచ్చి డీలర్లు కొంత కమీషన్ అందుకొంటోన్నారు. బహిరంగ మార్కెట్‌లో లీటర్ కిరోసిన్ రూ. 40కి పైనే ఉన్నది. ప్రభుత్వం సబ్సిడీపై రూ. 19కే ఇస్తోండటంతో హాకర్లు, డీలర్లు పండిపోతోన్నారు. ఇటీవలే జిల్లా వ్యాప్తంగా 48 శాతం కార్డులకు కిరోసిన్ కోటాని ప్రభు త్వం తగ్గించింది. దీంతో ఈ-పోస్‌లో కిరోసిన్ యాక్టివేషన్ అయిన ఉన్న కార్డుదారులకు కూ డా డీలర్లు మీకు కిరోసిన్ కోటా లేదని చెబు తూ పంపించేసి ఆ స్లిప్పులను హాకర్లకు ఇచ్చి లీటర్‌కు రూ.10 చొప్పున కమీషన్ పొందుతోన్నారు. ఇలా అక్రమాలు కొనసాగుతోన్న నేపథ్యంలో జేసీ కృతిక శుక్ల బుధవారం ఉదయం కలెక్టరేట్‌లో డీటీలు, ఏఎస్‌వోలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంపై అంతా ఉత్కంఠగా ఎదురు చూస్తోన్నారు.

జిల్లాలో 4.30 లక్షల మందికి ఎంఆర్ టీకాలు

- 40 శాతం పూర్తయిన లక్ష్యం
- కొనసాగుతున్న ప్రక్రియ



గుంటూరులోని పాఠశాలలో విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు (మెడికల్): జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో విద్యార్థులకు తట్టు, రుబెల్లా వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన ఎంఆర్ వ్యాక్సినేషన్ (మీజిల్స్-రుబెల్లా టీకా) కార్యక్రమం కొనసాగుతోంది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఎంఆర్ టీకాల కార్యక్రమం జిల్లాలో ప్రారంభించిన సంగతి తెలిసిందే. సోమవారం నాటికి జిల్లా కేంద్రానికి అందిన సమాచారం ప్రకారం 4 లక్షల 30 వేల మంది విద్యార్థులకు మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ నిర్వహించారు. ఇది జిల్లాకు నిర్ధేశించిన లక్ష్యంతో పోలిస్తే సుమారు 40 శాతం. జిల్లాలో 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు వయస్సు గల 10.40 లక్షల మంది బాల బాలికలకు ఎంఆర్ వ్యాక్సిన్ ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. 'జిల్లాలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం సజావుగా సాగుతోందని, జిల్లాకు ప్రభుత్వం నిర్ధేశించిన వ్యాక్సినేషన్ లక్ష్యాలను సాధిస్తామని' జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం సుహాసిని తెలిపారు.

జిల్లా కేంద్రంలో...

మరో పక్క జిల్లా కేంద్రం గుంటూరులో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం కొనసాగుతోంది. వైద్య ఆరోగ్య శాఖతో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో పలు పాఠశాలల్లో టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య శాఖకు చెందిన మహిళా ఆరోగ్య కార్యకర్తలు చిన్నారులకు వ్యాక్సినేషన్ నిర్వహించారు. పలు కార్పొరేట్ పాఠశాలల్లో యాజమాన్యాలు పిల్లలకు ఎంఆర్ టీకా ఇచ్చే ముందు వారి తల్లిదండ్రుల నుంచి వ్యాక్సినేషన్‌కు తమకు అభ్యంతరం లేదని చెబుతూ రాతపూర్వకంగా నో అబ్జెక్షన్ పత్రాలు తీసుకుంటున్నాయి. మంగళవారం గుంటూరులో జరిగిన ఎంఆర్ టీకా అమలు కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ గూడూరు చంద్రశేఖర్, జోనల్ చైర్మన్ శ్యామ్‌సుందర్‌రావు, అధ్యక్షులు రమణి శ్రీనివాసరావు, భాష్యం స్కూల్ ఇన్‌చార్జ్ తలశిల శివ తదితరులు పాల్గొన్నారు.

● డీ నోటిఫై.. ట్రబుల్స్

● అటవీ భూముల డీనోటిఫై చేయటంలో కేంద్రం తాత్సారం
● 5116 హెక్టార్ల డీ నోటిఫైకి ప్రతిపాదనలు
● వన, జల సంరక్షణ చర్యలకు ప్రతిబంధకం
● నగరం వనం ఏర్పాటులో అంతులేని తాత్సారం



వనంపై.. మౌనం!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అటవీ భూముల డీ నోటిఫికేషన్ విషయంలో కేంద్రం నుంచి అంతులేని జాప్యం జరుగుతోంది. డీ నోటిఫికేషన్ జాబితాలో ఉన్న అటవీ భూములపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవటంతో వాటిలో ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. రాజధాని ప్రాంత అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అటవీ భూములను ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. ఇందుకనుగుణంగా అప్పటి కలెక్టర్లకు అటవీ భూములను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది. రాజధాని ప్రాంతంలోని కృష్ణాజిల్లాలో 30 వేల అటవీ భూములను గుర్తించటం జరిగింది. రాజధాని ప్రాంత అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని డీ నోటిఫికేషన్ చేస్తున్న నేపథ్యంలో, వీటి వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలను ఆ తర్వాత సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకు రావటం జరిగింది. సీఆర్‌డీఏ చేతికి వెళ్లాక రాజధాని ప్రాంతం పరిధిలో కృష్ణాజిల్లాలో ఉన్న 5116 హెక్టార్ల అటవీ భూములను అవసర ప్రాతిపదికన గుర్తించటం జరిగింది. వీటికి సంబంధించి డీ నోటిఫై చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి పంపించటం జరిగింది. ఈ భూమలకు డీ నోటిఫై చేస్తే ప్రతిగా వేరే ప్రాంతాలలో అడవుల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రభుత్వం తెలిపింది. కేంద్రానికి దీనికి సంబంధించిన ప్రతిపాదనలు వెళ్లిన తర్వాత అనేక కొర్రీలు వేయటం జరిగింది. జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) విధానంలో ఫొటోలు తీసి పంపించాలని కూడా కేంద్రం కోరింది. జీఐఎస్ విధానంలో కూడా మ్యాపింగ్ చేసి కేంద్రానికి పంపించటం జరిగింది. ఇది జరిగి దాదాపు ఆర్థ సంవత్సర కాలం పైగానే గడుస్తోంది. ఇప్పటివరకు కేంద్రం నుంచి ఎలాంటి సమాచారం లేదు. ఇటీవలి కాలంలో అటవీ విస్తీర్ణం చాలా తక్కువగా ఉందన్న వాదనలను కేంద్రం వినిపిస్తోంది. వాస్తవానికి అటవీ విస్తీర్ణం తక్కువగానే ఉంది. అయినప్పటికీ ప్రత్యామ్నాయంగా అడవుల పెంపకానికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతోంది. దాదాపుగా ఏడాదిన్నరకాలంగా అటవీ భూముల డీ నోటిఫైపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోవటం లేదు. అటవీశాఖ అభివృద్ధి కార్యక్రమాలను కూడా చేయలేకపోతోంది. ప్రతిపాదిత భూములలో వన పెంపకం చేపట్టలేకపోతోంది. దీంతో పాటు నీటి సంరక్షణ చర్యలను కూడా చేపట్టలేకపోతోంది. నీటి సంరక్షణ చర్యల కింద చెక్ డ్యామ్‌లను నిర్మించటం.. నీటిని నిల్వ చేయటం వంటి చర్యలు చేపడతారు. డీ నోటిఫై ప్రతిపాదిత భూములలో ఉండగా.. వీటిని ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది.

నగర వనం.. తాత్సారం

రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో నగర వనాలు రూపుదిద్దుకున్నా.. కృష్ణాజిల్లాలో ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు లేవు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో నగరవనాలను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని తీసుకు వచ్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్రం ఆర్థిక మద్దతు ఇస్తుంది. కృష్ణాజిల్లాలో విజయవాడ శివారును ఉన్న కొత్తూరు తాడేపల్లిని నగర వనంగా అభివృద్ధి చేయాలని అటవీ శాఖ నిర్ణయించింది. రూ.2 కోట్ల వ్యయంతో వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటపరికరాలు వంటివి ఏర్పాటు చేసి ఓ పిక్నిక్ స్పాట్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అయితే ఆ తర్వాత అప్పటి కలెక్టర్ బాబు దీనిని అద్వితీయంగా అభివృద్ధి చేస్తామంటూ ఈ ప్రాజెక్టును తన అధీనంలోకి తీసుకున్నారు. భారీ డిజైన్లు చేయించారు. ముందు రూ.8 కోట్లతో అభివృద్ధి చేయిస్తామన్నారు. ఆ తర్వాత రూ.20 కోట్లకు దీని వ్యయం పెంచారు. డిజైన్లు తప్పితే ఆచరణలో ఒక్క పని కూడా పూర్తి కాలేదు. దీంతో కృష్ణా జిల్లా నగర వనం విషయంలో వెనుకపడాల్సి వచ్చింది. ప్రస్తుత కలెక్టర్ లక్ష్మీకాంతం దీనిపై జోక్యం చేసుకోకుండా.. అటవీశాఖాధికారులనే అభివృద్ధి చేయాల్సిందిగా సూచించటం జరిగింది. దీంతో అటవీ శాఖ అధికారులు తక్షణం రంగంలోకి దిగారు. వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటపరికరాలు, ఫెన్సింగ్ వంటి ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నారు.

జాతీయ స్థాయిలో ఏఎన్‌యూకి 25వ ర్యాంకు

● విద్యార్థి అభివృద్ధి విభాగంలో 7..



ఏఎన్‌యూ: విద్య, విషయక, పరిశోధన, మౌలిక వసతుల విషయంలో రాజధాని వర్సిటీగా కీర్తిగడించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి మరొకసారి జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు లభించినట్లు వైస్‌చాన్సలర్ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్, రెక్టార్ ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు, రిజిస్ట్రార్ ఆచార్య కె.జాన్‌పాల్‌లు తెలిపారు. 2017 సంవత్సరానికి దేశంలోని వర్సిటీలకు అవుట్‌లుక్ డ్రస్టియూనివర్సిటీ సర్వే ర్యాంకులను ప్రకటించింది. దేశంలో ఉన్న విశ్వవిద్యాలయాలను సర్వే చేసి, 30 వర్సిటీలను అత్యున్నత వర్సిటీలుగా ప్రకటించింది. జాతీయ స్థాయిలో ఏఎన్‌యూకి 25వ ర్యాంకు, విద్యార్థి అభివృద్ధి విభాగంలో 7వ ర్యాంకు లభించింది. సర్వే ప్రముఖంగా విశ్వ విద్యాలయాల్లో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థి సంక్షేమం, ఉద్యోగ మేళ తదితర ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని ర్యాంకులు ప్రకటించారు. అత్యున్నత యూనివర్సిటీల జాబితాలో ఏఎన్‌యూకి చోటు దక్కడంపై వర్సిటీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

మరో కలికితురాయి..

● రూ.4,640 కోట్లు- 8 వేల ఉద్యోగాలు.. ● విద్య, వైద్యరంగాల్లో ఉన్నత లక్ష్యాలతో బీఆర్ షెట్టి మెడిసిటీ
● పిచ్చుకలపాలెం- దొండపాడు మధ్య రేపు శంకుస్థాపన ● ముఖ్యమంత్రి చంద్రబాబుచే పునాది కార్యక్రమం
● ఏర్పాట్లు చేస్తున్న షెట్టి యాజమాన్యం, సీఆర్డీయే అధికారులు

ఆంధ్రజ్యోతి, అమరావతి/తుళ్లూరు: రాజధానికి మరో కలికితురాయిగా నిలవనున్న బీఆర్ షెట్టి మెడిసిటీ హెల్త్‌కేర్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు గురువారం ఉదయం అమరావతిలోని పిచ్చుకలపాలెం- దొండపాడుల మధ్య శంకుస్థాపన జరగనుంది. ఈ 2 గ్రామాలకు చేరువలో రాష్ట్ర ప్రభుత్వం ఎకరం రూ.50 లక్షల ధరకు కేటాయించిన 100 ఎకరాల్లో ఏర్పాటవనున్న ఈ ప్రతిష్ఠాత్మక విద్య, వైద్యకేంద్ర నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టనున్నారు. గల్ఫ్‌లోని అబుదబి కేంద్రంగా కలిగిన ఈ సంస్థల అధినేత బి.ఆర్.షెట్టి సహా వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరవనున్న ఈ కార్యక్రమానికి ఆ సంస్థ యాజమాన్యంతోపాటు సీఆర్డీయే విస్తృత సన్నాహాలు చేస్తున్నాయి.

సుమారు రూ.4,640 కోట్ల అంచనా వ్యయంతో దశలవారీగా అభివృద్ధి పరచనున్న బీఆర్ షెట్టి మెడిసిటీ ఓ పక్క వైద్యవిద్యను అందజేస్తూనే మరొకపక్క వైద్య కళాశాలకు అనుబంధంగా ఏర్పాటు చేయబోయే అంతర్జాతీయస్థాయి ఆస్పత్రి ద్వారా రాజధాని వాసులతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వారికి అత్యధునాతన వైద్యాన్ని అందుబాటులోకి తేనుంది. పైగా.. వివిధ వ్యాధులకు సంబంధించి విస్తృత పరిశోధనలు జరపడం ద్వారా ఉత్తమస్థాయి పరిశోధనా కేంద్రంగా కూడా నిలవనుంది. కేవలం వైద్యవిద్యకే పరిమితం కాకుండా అనుబంధ విభాగాలపైనా దృష్టిని కేంద్రీకరించడం ద్వారా చక్కటి సమగ్ర వైద్య, విద్యాకేంద్రంగా రూపుదిద్దుకోనుంది. అనుబంధ ఆస్పత్రి, అవసరమైన ఇతర విభాగాలకు కావలసిన భవనాలను సాధ్యమైనంత త్వరగా (సుమారు రెండేళ్లలోపు) పూర్తి చేసి, 2019 విద్యా సంవత్సరం నుంచి వైద్యకళాశాలను ప్రారంభించేందుకు యాజమాన్యం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిసింది.

ఇందులో పనిచేసే ఉద్యోగుల సంఖ్య తొలి ఏళ్లల్లో వందల్లోనే ఉన్నా, క్రమంగా పెరుగుతూ దాదాపు 8,000కు చేరనుంది. ఆ సమయానికి ఈ సంస్థల్లో వైద్యవిద్యను, ఇతర అనుబంధ కోర్సులను అభ్యసించే వారి సంఖ్య కూడా వేలల్లోకి చేరి, దీనిని రాష్ట్రంలోని ప్రఖ్యాత సంస్థల్లో ఒకటిగా చేయనుంది. ఈమేరకు ఈ ఏడాది మొదట్లో ఈ సంస్థకు, సీఆర్డీయేకు మధ్య ఒప్పందం కుదిరింది. దీనిని తూచా తప్పకుండా పాటించేందుకు సీఆర్డీయే, రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో బీఆర్ షెట్టి యాజమాన్యం ఉద్యుక్తమవుతోంది.


ఫొటో ఎగ్జిబిషన్

నమూనాల ప్రదర్శన..

పిచ్చుకలపాలెం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు జరగనున్న శంకుస్థాపనోత్సవానికి రాజధాని, పరిసర ప్రాంతాల నుంచి సుమారు 5,000 మంది వరకూ హాజరు కావొచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలుగని రీతిలో బీఆర్ షెట్టి మేనేజ్‌మెంట్, సీఆర్డీయే చర్యలు తీసుకుంటున్నాయి. ఈ సందర్భంగా బహిరంగసభా ప్రాంగణం వద్ద సీఆర్డీయే అమరావతి నిర్మాణంలో ఇప్పటి వరకూ చోటు చేసుకున్న ప్రధాన ఘట్టాలకు సంబంధించిన ఛాయాచిత్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేస్తోంది. అంతే కాకుండా రాజధానిలో ప్రప్రథమంగా తరగతులు ప్రారంభించిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, అమరావతికి ముంపు బెడదను నివారించేందుకు తలపెట్టిన కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం, త్వరలో సింగపూర్ కన్సార్టియం పనులు మొదలుపెట్టబోతున్న రాజధాని స్టార్టప్ ఏరియాకు చెందిన 3డీ నమూనాలను కూడా ప్రదర్శించేందుకు సన్నాహాలు జరుపుతోంది.

ఏర్పాట్ల పరిశీలన.

శంకుస్థాపన ఏర్పాట్లను అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. సీఎం చంద్రబాబు రోడ్డు మార్గాన కార్యక్రమం జరిగే ప్రదేశానికి చేరుకుంటారని అధికార వర్గాలు ప్రకటించాయి. అందుకు తగ్గట్టుగా పోలీసులు బందోబస్తుపై దృష్టిపెట్టారు. విద్యార్థులు, రైతులు కలిపి 5 వేలమంది కార్యక్రమానికి హాజరవుతారని అంచనా వేసి అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో వాటర్‌ప్రూఫ్ టెంట్లు వేయిస్తున్నారు. మంగళవారం రూరల్ ఎస్పీ అప్పలనాయుడు శంకుస్థాపన ప్రదేశాన్ని పరిశీలించారు. జడ్పీటీసీ బెజవాడ నరేంద్రబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఆర్డీయే కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ సహా పలువురు ఉన్నతాధికారులు మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు.


వర్షం పడుతుండగా టెంట్‌లో ఉండి పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు





మహామండపం ఎదురుగా వంటశాలకు ఏర్పాటు చేస్తున్న ప్రదేశం

ప్రక్షాళన!

- ఈశాన్యంలో మంట పెట్టొద్దు..
- భక్తుల దర్శనం టికెట్ రూ.200కు తగ్గించాల్సిందే
- భక్తులకు సౌకర్యాల పెంపుపై దృష్టి
- నేడు దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు సమావేశం
- 17 అంశాలపై జరగనున్న చర్చ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

దుర్గామల్లేశ్వర దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఆలయ పాలనపై దృష్టిపెట్టారు. దుబారా తగ్గించాలని నిర్ణయించుకున్నారు. గతంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు చేసిన తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఒక వేళ దేవస్థానంలో భోజనం చేయాలంటే సామాన్య భక్తులవలె తాము కూడా క్యూలో వెళ్లి అందరి సరసన భోజనానికి కూర్చుని ఆర్శంగా నిలవాలని యోచిస్తున్నారు. దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు బాధ్యతలు స్వీకరించాక మొదటి అధికారిక సమావేశం బుధవారం జరగనుంది. ఈ సమావేశంలో ముఖ్యఅంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు సమా చారం. ఆలయట్రస్ట్ బోర్డు సభ్యులకు ఇప్పటికే దేవస్థానం అధికారులు సమా వేశంలో చర్చించనున్న 17 అంశాలతో అజెండాను పంపించారు. వీటిపై చర్చించే అవకాశం ఉంది.

● ఇటీవల దేవస్థానం భక్తులకు వడ్డించే భోజనంలో సాంబారు ఎత్తివేసి రసం పెట్టడం వల్ల భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే భక్తులకు వడ్డించే భోజనంలో అదనంగా ఇంకొక కూరను వడ్డించాలని కూడా అనుకుని ప్రయోగం చేసి వ్యయం ఎక్కువవుతుందని ఆ ప్రయత్నాన్ని విరమి ంచారు. దేవస్థాన అన్నదాన కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే రూ.42 కోట్ల మూలనిధి ఉండడంతో పాటు అన్న ప్రసాద వితరణకు చాలామంది దాతలు విరాళాలు ఇస్తున్న దృష్ట్యా ఉన్నంతలో కనీసం ఒక కూర, చెట్నీ, పప్పు, సాంబారు, మజ్జిగతో భోజనం పెట్టాల ని సూచిస్తున్నారు. దీనిపై సాధ్యా సాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

● అమ్మవారి ఆలయం విశిష్టత ప్రపంచవ్యాప్తంగా కూడా తెలిసిందే. అయితే ఇతర కొన్ని ఆలయాలకు సంబంధించి పోస్టల్ స్టాంపులను విడుదల చేశారు. అదే తరహాలో దుర్గమ్మకు కూడా పోస్టల్ స్టాంపును విడుదల చేయించేందుకు ప్రయత్నాలు చేయాలని అధికారులు ప్రతిపాదించారు.

● దసరా ఉత్సవాలకు సంబంధించి ఇంజనీరింగ్ విభాగం రూపొందించిన వ్యయం అంచనాలు, కాలెండర్లు, ఫోటోల ముద్రణ, ఫెస్టివల్ విభాగంలో స్టేషనరీ కొనుగోలు ఇతరత్రా కొన్ని అంశాలను అజండాలో ప్రస్తావించినట్లుగా తెలుస్తోంది. అజండాలో లేని అంశాలను టేబుల్ ఐటమ్ గా ప్రస్తావనకు తీసుకువచ్చే అవకాశం ఉన్నట్లుగా సమాచారం.



● అమ్మవారి ప్రత్యేక దర్శనానికి ప్రస్తుతం రూ.300 రుసుం తీసుకుంటున్నారు. ఇంత రుసుం పెట్టి సామాన్య, మధ్యతరగతి భక్తులు ప్రత్యేక దర్శనానికి వెళ్లే అవకాశం ఉండదు. కుటుంబ సభ్యులు అందరు కలిసి దర్శనానికి వెళితే భారీగా వ్యయమయ్యే అవకాశం ఉన్నందున రుసుంను తగ్గించాలని ట్రస్ట్‌బోర్డు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది, బుధవారం నాటి ట్రస్ట్‌బోర్డు సమావేశంలో టికెట్‌ను రూ. 200 చేయాలని తీర్మానం చేయాలని అనుకున్నట్లు సమాచారం.

● వన్‌టౌన్ పాడివీధిలో దేవస్థానానికి చెందిన సి.వి.రెడ్డి చారిటీస్ స్థలంలో భక్తులు వేచి ఉండేందుకు షెడ్లను నిర్మించారు. ఈ షెడ్ల వల్ల ఉపయోగం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కోట్లాది విలువ చేసే స్థలంలో కేవలం షెడ్లను నిర్మించడం వల్ల దేవస్థానం పరువు పోతుందన్న అభిప్రాయంగా ఉంది. ఇక్కడ కనీసం ఐదు అంతస్థుల భవనాన్ని నిర్మించి భక్తులకు సౌకర్యం కల్పించవచ్చునని చెబుతున్నారు. దీనిపై కూడా ట్రస్ట్‌బోర్డు చర్చించినట్లుగా తెలుస్తోంది.



సివి రెడ్డి చారిటీస్ స్థలంలో షెడ్లు

ఈశాన్యంలో పోటు...

అమ్మవారి ప్రసాదాలను తయారు చేసేందుకు దేవస్థానం అధికారులు మహామండపం వద్ద ఈశాన్య మూలలో పోటు (వంటశాల)ను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయమై బోర్డు సభ్యులు దేవస్థానం జ్యోతిష్యుడిని సంప్రదించగా ఈశాన్యంలో మంటపెడితే నష్టం జరుగుతుందని వాస్తు చెబుతుంది కదా? అని జ్యోతిష్యుడిని ప్రశ్నించినట్లుగా తెలిసింది. ఈశాన్యాన పోటును నిర్మించాలని చెప్పలేదని, తాను సలహా ఇవ్వలేదని, గుడిలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో కూడా తనను సంప్రదించకుండానే చర్యలు తీసుకున్నారని ఆయన సమాధానమిచ్చినట్లు సమాచారం. ఈశాన్యంలో తాను వంటశాలను ఏర్పాటు చేయాలని సూచించలేదని రాసి ఇవ్వాలని కూడా జ్యోతిష్యుడిని కోరినట్లు సమాచారం. ఇటీవల దేవస్థానానికి జ్యోతిష్య సలహాదారుని నియమించారు, ఆయనకు నెలకు రూ.45 వేలు వేతనాన్ని దేవస్థానం చెల్లిస్తోంది. ప్రత్యేకంగా గది, సిబ్బంది, కారు వంటి సౌకర్యాలు కూడా కల్పించారు. దుర్గగుడిలో వేద పండితులు, సీనియర్ అర్చకులు చాలామందికి శాస్త్ర జ్ఞానం తెలిసి ఉంటుంది. ఆలయానికి స్తపతి కూడా ఉంటారు. వారి నుంచి సలహాలు తీసుకునే బదులు భారీ వేతనం ఇచ్చి జ్యోతిష్యుని నిమమించుకోవడం అవసరమా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కోర్టు ద్వారానే న్యాయ పోరాటం

- హైకోర్టుపై నమ్మకం పెరిగింది..
- అయేషా తల్లి సంషాద్ బేగం

తెనాలి : విజయవాడలో హత్యకు గురైన అయేషామీరా కేసు దర్యాప్తును సీబీఐ చేపట్టినా, సిట్ జరిపినా, మరే సంస్థ చేసినా హైకోర్టుకు లోబడే జరగాలని అయేషా తల్లి సంషాద్ బేగం అభిప్రాయం వ్యక్తం చేశారు. అప్పుడే తమకు న్యాయం జరుగుతుందన్నారు. హైకోర్టులో తాము వేసిన రిట్‌పై మంగళవారం విచారణకు హాజరై రాత్రి తెనాలి చేరుకున్న ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. సిట్ బృందంలో ఎవరుంటారనే పేర్లు జీవోలో చూపకపోవటంపై న్యాయవాది అభ్యంతరం తెలిపారని తెలిపారు. ప్రభుత్వం తరపు న్యాయవాది దీనికోసం మూడువారాలు గడువు కోరినా సమయం ఇవ్వకుండా రెండో రోజునే(గురువారం) ఆ వివరాలు కోర్టుకు సమర్పించాలని ఆదేశించటం చూస్తే, తమకు హైకోర్టుపై చాలా నమ్మకం కలిగిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కూడా తమకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తోందని, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారికూడా సిట్‌లో విజయవాడ కమిషనర్ గౌతమ్‌సవాంగ్‌ను తప్పించాలని కోరడంపై కృతజతలు తెలిపారు. తాముకూడా విజయవాడ సీపీని దర్యాప్తు బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతున్నామన్నారు. దర్యాప్తు చేపట్టే విషయంలో తాముకూడా న్యాయ సలహాలు కోరామన్నారు. ప్రభుత్వం మా విన్నపాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. తమ అభ్యర్థనకు విరుద్ధంగా స్థానికులకు ప్రాధాన్యం ఇస్తే కోర్టు ద్వారానే న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

ఏఎన్‌యూలో ఫిల్మ్ అండ్ టీవీ ఇనిస్టిట్యూట్ తరగతులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఫిల్మ్ అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్ తరగతులు జరుగుతాయని వీసీ ఆచార్య రాజేంద్రప్రసాద్ తెలిపారు. అమరావతిలో ఫిల్మ్ అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే జీవో నెంబర్ 84ను విడుదల చేసిందన్నారు. వర్సిటీ ప్రాంగణంలో ఈ సంస్థకు సంబంధించిన తరగతులు, కోర్సులు ప్రారంభమైతే, విద్యార్థులకు ఎంతో ప్రయోజన కరంగా ఉంటుందని తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఏర్పాటు తదితర అంశాలపై క్షుణంగా పరిశీలించేందుకు ప్రభుత్వం కమిటీని నియమించిందని తెలిపారు.

విదేశీ వైద్య బృందం పర్యటన



వైద్యాధికారులతో విదేశీ వైద్య బృందం

పెదనందిపాడు: పెదనందిపాడు, నాగులపాడు గ్రామాల్లో మంగళవారం ఆస్ట్రేలియా జార్జ్, లండన్ ఆక్స్‌ఫర్డ్ ఇన్‌స్టిట్యూట్ వైద్యబృందం పర్యటించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రోగులకు అందిస్తున్న వివరాలను వైద్యాధికారిని, వసతుల గురించి ఎంపీపీ ముద్దన నగరాజకుమారిని అడిగి తెలుసుకున్నారు. నాగులపాడులోని సబ్‌సెంటర్‌ను పరిశీలించి ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు ఎలా సేవలు అందిస్తున్నారు, గర్భిణులకు షుగర్, బీపీ లాంటివి ఉన్నాయేమోనని ఆరా తీశారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాబిన్, జైన్, షోబినాగార్జున్, వైద్యాధికారులు ప్రవీణ్, కిషోర్, ప్రాజెక్ట్ మేనేజర్ అమర్, సూపర్‌వైజర్ గంగరాజు బాలరాజు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ముద్దన రాఘవయ్య, సీహెచ్‌వో రమణానంద, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వ్యవస్థలపై సమాలోచన

- నిర్మాణం కానున్న అసెంబ్లీ, హైకోర్టుల్లో సురక్షిత అగ్నిమాపక వ్యవస్థ
- భద్రతా ఏర్పాట్లు, నిర్మాణ మెలకువలపై నిపుణులతో సంప్రదింపులు

ఆంధ్రజ్యోతి, అమరావతి : రాజధానిలోని పరిపాలన, న్యాయనగరాల్లో భాగంగా నిర్మించనున్న అసెంబ్లీ, హైకోర్టుల్లో ఏర్పాటు చేయాల్సిన అత్యాధునిక అగ్నిమాపక వ్యవస్థలపై సీఆర్డీయే ఉన్నతాధికారులు నిపుణులతో సంప్రదింపులు జరిపారు. విజయవాడలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఈ సమావేశం జరిపింది. అమరావతికే వన్నె తెచ్చే విధంగా ఐకానిక్ బిల్డింగులుగా అసెంబ్లీ, హైకోర్టు భవనాలు రూపుదిద్దుకోవాలన్న సీఎం చంద్రబాబునాయుడి ఆకాంక్షల మేరకు, సుదీర్ఘ కసరత్తు అనంతరం కొద్ది వారాల క్రితమే వాటి డిజైన్లు సిద్ధమైన విషయం తెలిసిందే. కృష్ణాతీరంలో లభించిన ప్రపంచ ప్రసిద్ధ కోహినూర్ వజ్రాకృతిలో అసెంబ్లీ, ఈ ప్రాంతంలో పరిఢవిల్లిన బౌద్ధమతాన్ని స్ఫురింపజేసేలా బౌద్ధ స్థూపాకారంలో హైకోర్టులను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతీ విదితమే. కొన్ని నెలలపాటు సాగిన డిజైన్ల ఖరారు ప్రక్రియ ఎట్టకేలకు ఒక కొలిక్కి రావడంతో ఈ 2 ప్రతిష్టాత్మక నిర్మాణాలకు సంబంధించిన తదనంతర చర్యల్లో భాగంగా సీఆర్డీయే వాటిల్లో భద్రతాపరమైన వ్యవస్థలను నెలకొల్పడంపై దృష్టి సారించింది. ఈ భవనాల్లో అత్యుత్తమమైన, అత్యంత సురక్షితమైన, ప్రపంచస్థాయి అగ్నినిరోధక వ్యవస్థలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో ఆ రంగంలో పేరొందిన నిపుణులతో సవివరంగా చర్చించింది. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఈ భవంతుల్లో అగ్నిప్రమాదాలు జరగరాదన్న అభిప్రాయంతో ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యధునాతన అగ్నిమాపక వ్యవస్థల గురించి ఈ సమావేశంలో నిపుణులు సీఆర్డీయేకు వివరించినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ రంగంపై విస్తృత అధ్యయనం జరిపిన సీఆర్డీయే ఉన్నతాధికారులతో వారు జరిపిన సంప్రదింపులు ఫలవంతంగా జరిగాయని సమాచారం. ఇటువంటి మరిన్ని సమావేశాలను భవిష్యత్తులో నిర్వహించడం ద్వారా ప్రమా దాలకు ఏమాత్రం ఆస్కారమివ్వని ఫైర్‌ఫైటింగ్ వ్యవస్థలను అసెంబ్లీ, హైకోర్టుల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. రాజధానిలో ప్రధానంగా తొట్టతొలుత నిర్మాణం జరుపుకోనున్న పరిపాలన, న్యాయనగరాలు ఇతరాలకు సంబంధించిన భద్రతా వ్యవస్థలు ఏవిధంగా ఉండాలన్న దానిపై కూడా సీఆర్డీయే అధికారులు సంబంధిత నిపుణులతో మరో సమావేశంలో విపులంగా చర్చించినట్లు సమాచారం. వచ్చే నెలాఖరు నుంచి ప్రారంభం కానున్న అడ్మినిస్ట్రేటివ్, జస్టిస్ సిటీలతోపాటు ఇతర నిర్మాణాలు ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమా ణాలతో, నిర్దేశించిన కాలవ్యవధిలోగా పూర్తవ్వాలంటే అవలంబి ంచదగిన నిర్మాణ రీతులపై కూడా సీఆర్డీయే ఇంకొక సమావేశాన్ని నిర్వహించింది. దేశంలోని పేరొందిన నిర్మాణ సంస్థల ప్రతినిధులు, సీఆర్డీయేలోని సంబంధిత అధికారులు పాల్గొన్న ఈ భేటీలో అత్యధునాతన నిర్మాణ విధానాల గురించి చర్చించారు.

ఫెయిల్ అయిన సి90, సి 96 పాలిటెక్నిక్ విద్యార్థులకు పరీక్షలు

గుంటూరు (విద్య): రాష్ట్రసాంకేతిక విద్య, శిక్షణా మండలి (ఎస్‌బీటీఈటీ) ఆదేశాల ప్రకారం సి 90, సి 96లో ఫెయిల్ అయిన పాలిటెక్నిక్ విద్యార్థులకు తిరిగి పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నల్లపాడులోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివరామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సి 90,సి 96 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. సెప్టెంబరు 4 నుంచి నల్లపాడులోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్ష టైమ్‌టేబుల్ ఇతర వివరాల కోసం వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలు నిర్వహించడానికి కళాశాలలో తగు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు అవార్డులు


- అపుస్మా జిల్లా కన్వీనర్ తులసి విష్ణుప్రసాద్
- 18లోగా జిల్లా కమిటీకి వివరాలు పంపాలి

గుంటూరు (విద్య): జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో దీర్ఘకాలం పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించే ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయిలో అవార్డులు ఇవ్వనున్నట్లు ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజమెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా కన్వీనర్ తులసి విష్ణుప్రసాద్ వెల్లడించారు. స్థానిక సంగడిగుంటలోని కొండవీడు పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 5న కర్నూలులో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలల్లో కనీసం 9 సంవత్సరాలు పనిచేసి ఉండాలని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు, ఒక ఉపాధ్యాయురాలిని ఎంపిక చేసి ఈనెల 18లోగా జిల్లా కమిటీకి పంపాలని ఆయన సూచించారు.

దరఖాస్తులు, ఇతర వివరాల కోసం సెల్ నం: 98491 25146, 94901 14496లలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజమెంట్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పీజేఎన్ ధన్, కార్యదర్శి ఎన్.చక్రనాగ్‌నాయుడు, గౌరవాధ్యక్షుడు పోతిరెడ్డి, కోశాధికారి మస్తాన్‌రావు, కాటూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాఘవయ్య, గుంటూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ మున్ను, సాంబిరెడ్డి, సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు నాగిరెడ్డి, కార్యదర్శి భాస్కరరావు పాల్గొన్నారు.



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న అపుస్మా జిల్లా కన్వీనర్ తులసి విష్ణుప్రసాద్



ఉద్యోగావకాశాలు

➾ **RK పచ్చళ్ళు నందు** తయారుచేయుటకు మరియు మార్కెటింగ్ చేయుటకు, అనుభవం కలిగిన యువతీ/యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ఫోన్ : 9440271577
AJG-387984

➾ **ప్రముఖ కంపెనిలో** పనిచేయుటకు మార్కెటింగ్ Executives కావలెను అర్హత : 2సం॥అనుభవం : జీతం 10,000-15,000 వయస్సు: 20సం॥-30సం॥ 9948499966
RK-944

➾ **స్పాట్ జాయినింగ్** వెల్‌నెస్ సొల్యూషన్స్ సంస్థ నందు B.Tech, M.B.A, డిగ్రీ వాళ్ళకి మీ అర్హతకి తగిన విధంగా P/T, F/Tఅవకాశాలు సెల్ : 9652246265.
MA-1119

➾ **స్పాట్ జాయినింగ్!** క్రొత్తగా స్థాపించిన మా సంస్థ నందు A.S, సూపర్ వైజర్స్, A.Mగా B.Tech, M.B.A, డిగ్రీ వాళ్ళకి అవకాశాలు కలవు. 9550208490 9885806800.
MA-1121

➾ **Wanted Customer** support executives Qualitication : Degree with computer knowledge (youngers preferred) contanct : kireeti soft Technologies L.td. Guntur. cell : 9177649375, 0863-2210778, 2237799 Walk-in interiew between 10am to 5 pm along with original certificetes.
KC-879

➾ **Wanted .net** programmers: Tech skills : VB.net, SQL.server, Qual: Degree with computer knowledge. Between 11 am to 3 pm along with original certificates at kireeti soft Technologies Ltd,. Deluxe complex, 1st Floor, Arundelpet 13th line, Guntur-522002, ph: 0863-2210778, 2237799, cell:9177649375.
KC-880

➾ **రేపల్లె & చీరాలలోని** ప్రముఖ సినిమా థియేటర్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, House Keeper(s), Operator(s), Box Office నందు చేయుటకు అనుభవం ఉన్న స్త్రీ, పురుషులు కావలెను. ఆసక్తి గలవారు సం్రప॥ 9966124545
AJG-387962

➾ **ఫోటోషాప్ డిజైనర్లు** (M/F), ఫ్రంట్ ఆఫీస్ మేనేజరు (F), ఫ్లెక్స్ మెషీన్ ఆపరేటర్లు (M) కావలెను. సం్రప॥ ఆంధ్ర డిజిటల్స్ 17/2, అరండల్‌పేట, గుంటూరు. ఫోన్ : 7032226666, 7032228888
AJG-387972

➾ **రాజధాని బిజినెస్** ఇన్‌ఫర్‌మేషన్ నందు 10th, Inter, Degree, PG and B.Tech అర్హత కలవారికి Jobs చూపించబడును. RBI మాసపత్రికకు కమీషన్ బేసిస్ మీద field Staff కావలెను. అర్హత : 10th and above. సం్రప॥ 8885150999, 8639753929
AJG-400305

➾ **గృహిణులకు, రిటైర్డ్** ఉద్యోగులకు, గుంటూరులోని ప్రముఖ కంపెనీలో ఉద్యోగావకాశాలు. అ: ఇంటర్ ఆపైన, వ: 25 నుండి 65సం॥, పాన్ కార్డు తప్పనిసరి. ఫోన్ : 9594100003
AJG-400457

➾ **గుంటూరులోని** నిరుద్యోగులకు, ఉద్యోగులకు మా Wellness Solutions నందు 42 మందికి P/T, F/T అవకాశాలు. సం్రప॥ 9705258014, 8143888150
AJG-387955

➾ **Wanted Experienced** Mother Teachers for Classes Nur to II & Science, Computer teachers for Classes 3rd to 7th. Sumedha High School, NGGO's Colony, Guntur. Cell : 8885594154
SSDAM-109

➾ **వెల్‌నెస్ సంస్థ** నందు ఒకే సం॥లో సెటిల్ అయ్యేఛాన్స్ ! బి.టెక్, డిగ్రీ, పి.జి., నర్సింగ్ మొ॥ వారికి P/T, F/T అవకాశాలు. సం్రప॥ 9542050601, 9299556740
MA-1117

➾ **Required** Marketing executives for Startup software Company - వెబ్‌సైట్‌డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్, Cont : Sriranga Sarada Sadom Apartments, 2/3 Brodipet, Guntur. Ph : 7989565851, 0863-2232277. www.appgeek.in, అతి త్వరలో మీ ముందుకు "www.xploor.in" (ఫ్రీ బిజినెస్ లిస్టింగ్)
AJG-387797

➾ **గుంటూరు అరండల్‌పేట** 13/2లో నూతనంగా ప్రారంభించిన మా వెల్‌నెస్ సొల్యూషన్స్ నందు P/T, F/T కలవు. కొత్తవారికి ప్రాధాన్యత. Q: ఏదైనా డిగ్రీ, ఫోన్ : 9618681833, 9492939816
MA-1114

WANTED

➾ **అన్నపూర్ణ మ్యారేజెస్** గుంటూరు హెడ్ ఆఫీస్ నందు టీమ్ లీడర్‌గా మరియు PRO గా వర్క్ చేయుటకు స్త్రీ అభ్యర్థులు కావలెను. Q: డిగ్రీ/B.Tech/PG. సం్రప॥ 9640633359
RK-930

అమ్మకము

➾ **ఓంకార్ ఆటో ఫైనాన్స్,** ఆటోనగర్, కలేబాయ్ హోటల్ ప్రక్కన 2వ క్రాస్ మంగళగిరి, గుంటూరు. అప్పి పాసింజర్ ఆటోలు 2010, 2011, 2012, 2013, 2014, 2015, 2016 మోడల్స్ గల ఆటోలు అమ్మకం. 99495 58181, 93999 65213
AJB-392231

PLOT FOR SALE

➾ **గుంటూరు పొన్నూరు** రోడ్, పాత గుంటూరు, బుడంపాడు బైపాస్ పెట్రోలు బంకు దగ్గరలో గాని ప్లాట్లు, పొలాలు తక్కువ ధరలో అమ్మదలిస్తే సం.ప్ర॥ 9866962215.
AJB-387985

➾ **డ్యూప్లెక్స్ విల్లాస్** & ఓపెన్ ప్లాట్స్ CRDA గేటెడ్ కమ్యూనిటీలో, SRM, VIT యూనివర్సిటీలకు అతి చేరువలో, సీడ్ ఏక్సెస్ రోడ్‌ని అనుకొని, 70% బ్యాంక్ లోన్ సౌకర్యం. సం్రప : 77949 91455
AJB-1713

ఓంకారేశ్వర్ హౌసింగ్

➾ **ఓంకారేశ్వర్ హౌసింగ్** రాజధాని అమరావతి గుంటూరు సమీపంలో గృహ నిర్మాణానికి అనువుగా అందరికి అందుబాటు ధరల్లో ఫ్లాట్లు అమ్మకానికి కలవు. సం్రప॥ 8367033399
RK-929

అద్దెకు

➾ **అయ్యప్ప కన్సల్టెన్సీ** : గుంటూరులో ఇళ్ళు, షాపులు, ఆఫీసులు, బ్యాచిలర్ రూమ్స్, హాస్టల్స్, అపార్ట్‌మెంట్స్ అద్దెకు ఇవ్వాలన్నా, కావాలన్నా & అమ్మాలన్నా, కొనాలన్నా, All jobs సర్వీస్‌లు మొ॥ 98, ఎటువంటి సర్వీసులకైనా సం్రప॥ 8885777631, 8885777634
AJG-387982

➾ **నవభారత్ నగర్** 1/2లైను నరసింహా ఎన్‌క్లేవ్ B-1 ఫ్లాట్ గ్రౌండ్ ఫ్లోర్ 2BHK కార్ పార్కింగ్‌తో అద్దెకు గలదు. నెం॥ 9848478154
AJG-400313

➾ **A.T. అగ్రహారం** 7వ లైను చివర నూతనంగా నిర్మించబడిన 3 అంతస్థుల భవనంలో 1వ మరియు 2వ ఫ్లోర్‌లో (2BHK) నార్త్ ఫేసింగ్ అద్దెకు కలదు. ఫోన్ : 9866260557
AJG-387935

రియల్ ఎస్టేట్

➾ **CRDA పరిధిలో** గుంటూరు జిల్లాలో సీడ్ క్యాపిటల్‌కు అతి చేరువలో L.P.No తో మీ పెట్టుబడి త్వరగా రెట్టింపు అయ్యే ఇళ్ళ స్థలాలు కొరకు సం్రప॥ 9848110359, 9160604648
AJG-400460

స్థలం కావలెను

➾ **అమరావతి రాజధానికి** దగ్గరలో 40 అడుగుల రోడ్డు మార్గం కలిగిన 1 ఎకరం నుండి 20 ఎకరాల పొలములు అమ్మదలచిన. డైరెక్ట్ పార్టీ మరియు మీడియేటర్లు. సం్రప॥ 8367244499
RK-931

బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్

➾ **ఇల్లు, గోడౌన్స్,** ప్రహరిగోడలు, ఐరన్ షెడ్స్ మెటీరియల్ (లేదా) వర్కర్సు కాంట్రాక్ట్ పద్ధతిలో కట్టించబడును. మాకినేని ప్రాజెక్ట్, సెల్ : 9963335577
RK-936

లోన్స్

➾ **DHILLON HERE PURCHASE** PVT. LTD. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (R.O.C. & RBI అప్రూవ్డ్) ద్వారా అన్ని రకముల లోన్స్ తక్కువ వడ్డీతో పొందగలరు.బ్యాంక్ రిజక్ట్ చేసిన / సివిల్ ప్రాబ్లమ్స్ వారికి కూడా లోన్స్ ఇవ్వబడును. Ph: 8054189600
AJH-278

గోల్డ్ ఫైనాన్స్

➾ **బంగారం బ్యాంకులలో,** ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. సెల్ : 81421 30517
AJB-385938

➾ **బంగారం బ్యాంకులలో** ఏ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి, మా డబ్బుతో విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. ఫోన్ : 7093920022
AJG-387959

వధువు కావలెను

➾ **వైశ్యాస్, 51 సం॥,** బిజినెస్, పిల్లలు లేరు. వైశ్యాస్‌లకు ప్రాధాన్యత, మధ్యవర్తులతో సంబంధము లేకుండా అర్జంటుగా సంప్రదించగలరు. సం్రప॥ 8309382789
AJG-380872

మ్యారేజ్ సర్వీసెస్

➾ **రాధాకృష్ణ మ్యారేజ్ లైన్స్,** 23 సం॥ అనుభవం వున్న సంస్థ కమ్మవారికి మాత్రమే. రిజిస్ట్రేషన్ ఫీజు లేదు. తెనాలి. నాగళ్ళ రాధాకృష్ణ చౌదరి, సెల్ :9347635086. nagallarkm@gmail.com
AJG-400408

సర్వీసెస్

కృష్ణ ఫర్నిచర్స్

➾ **డబల్ కాట్స్,** దివాన్ కాట్స్, డైనింగ్ టేబుల్స్, డ్రెస్సింగ్ టేబుల్స్, సోఫాసెట్స్ మరియు అన్ని రకాల ఆఫీస్ ఫర్నిచర్స్ మా వద్ద హోల్‌సెల్ రేట్లకే లభించును, బజాజ్ ఫెనాన్స్ సౌకర్యం కలదు. ఆదివారం కూడా తెరిచి ఉంచబడును మీకు నచ్చిన మోడల్స్ చేయబడును అరండల్ పేట, 8/1 సెల్॥ 8885353000.
AJG-387983

ఎడ్యుకేషన్

➾ **ఆగస్టు 20కే/ Octకి** ఒకే సం॥/ 2 1/2 సం॥రాల ఆంధ్ర/నాన్ ఆంధ్ర పాస్ గ్యారంటీతో All Govt. Job పొందగల B.Sc, B.Com, BA, B.Tech, MBA అన్ని PG లు డిప్లొమోలు D.Ed (16-18) 1సం॥లో ఇంటర్, X లకై 17-8-2017లోగా సం్రప॥ 9346446079
AJG-400311

➾ **Inter / Degree** One Sitting, Direct 10th., B.E., B.Tech., MCA., M.B.A., B.Ed., M.Ed B.A.,Bcom., Diplom&P.G. Cont: 8184804474, 9573886603
AJN-75

సెల్‌ఫోన్ శిక్షణ

➾ **సొంతంగా షాపు పెట్టుకునే విధంగా** సెల్‌ఫోన్ రిపేరు 2, 3 నెలల్లో తెలుగులో నేర్పబడును. సచిన్ సెల్ టెక్నాలజీ, 3/1, బ్రాడీపేట, గుంటూరు. 9849807659.
AJG-400409

జ్యోతిష్యం

➾ **మీ జాతకంలో దోషం ఉన్నదా?** మీరు ఏ పని చేసినా కలిసి రావడం లేదా? ఎటువంటి మొండి సమస్యలకైనా శ్రీ దుర్గాదేవి పూజ, హోమం ద్వారా శాశ్వత పరిష్కారం చూపబడును. సం్రప॥ పండిట్ S.V. శంకరరావు శాస్త్రి, అమరావతి రోడ్, పాత SBI బ్యాంక్ ఎదురు వీధి (సుందరయ్య బిల్డింగ్) P.S. నగర్, ఒకటవ లైన్, గుంటూరు, సెల్: 9866282252
AJO-395264

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.

బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు.

పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- మేనేజర్

పదాలు కనుక్కోండి

S	U	N	F	Z	H	P	A	S
V	A	C	A	T	I	O	N	W
S	W	O	M	F	H	O	T	I
U	T	F	I	A	Q	L	L	M
M	J	U	L	J	U	N	E	M
M	U	N	Y	A	R	H	S	I
E	L	A	U	G	U	S	T	N
R	Y	M	B	E	A	C	H	G

family
summer
vacation

sun
hot
fun

beac
pool
swim

June
July
August

నవ్వుల్ నవ్వుల్

టింకు : అరేయ్ బిట్టూ! మా టామీ మీ ఇంటి కన్నా ఎక్కువ ఎత్తు ఎగరగలదు తెలుసా?

బిట్టు : అంత సీను లేదు రా! నేను నమ్మను.

టింకు : చూడు మా టామీ ఎగిరింది. మరి మీ ఇల్లు ఎగురుతుందా?

బిట్టు : !!!!!!!!!!!!







బుల్‌ఫైట్ తెలుసు. స్ట్రీట్ ఫైట్ తెలుసు. కానీ ఫుడ్‌ఫైట్ గురించి తెలుసా! వేల మంది ఒకచోట గుమికూడి రోడ్లపై టన్నుల కొద్దీ టొమాటోలు కుమ్మరించి వాటితో కొట్టుకోవడమే ఫుడ్‌ఫైట్. స్పెయిన్ దేశంలోని బ్యునెల్‌లో ఈ ఫుడ్‌ఫైట్ జరుగుతుంది. ప్రతి ఏడాది ఆగస్టు నెల చివరి బుధవారంలో జరిగే ఈ ఫుడ్‌ఫైట్‌ను చూడటానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వెళుతుంటారు.

అతి పెద్ద టొమాటో ఫైట్

బ్యునెల్....

స్పెయిన్‌లో చిన్న ఊరు. అక్కడి జనాభా తొమ్మిది వేలే. కానీ, ఆగస్టు నెల చివరి బుధవారం వచ్చిందంటే చాలు రోడ్లన్నీ జనమయం అవుతాయి. ఎక్కడ చూసినా టొమాటోలే కనిపిస్తాయి. 'వరల్డ్ బిగ్గెస్ట్ ఫుడ్‌ఫైట్‌'గా పిలిచే ఈ వేడుకను తిలకించడానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. 2013లో సుమారు 50 వేల మంది ఈ ఫైట్‌లో పాల్గొనడానికి వచ్చారట. అంత మంది పాల్గొనడం కష్టమని భావించిన నిర్వాహకులు లాటరీ సిస్టమ్‌ను పెట్టి 20 వేల మందిని ఎంపిక చేశారు. ఈ ఫుడ్‌ఫైట్‌కు ఉన్న క్రేజ్ అది.

ఎలా మొదలయింది?

ఈ టొమాటో ఫుడ్‌ఫైట్ సంప్రదాయంగా వస్తోంది. అయితే ఇది ఎలా మొదలయిందీ అనే విషయం కచ్చితంగా తెలియదు. రకరకాల కథనాలు చెబుతుంటారు. 1944-45లో మొదటి సారి ఫుడ్‌ఫైట్ జరిగింది. స్నేహితుల మధ్య ఆహారం కోసం జరిగిన పోరు అని చెబుతుంటారు. ప్రమాదవశాత్తు ఒక లారీ బోల్తా పడటం వల్ల మొదలయిందని అంటుంటారు. అన్నింటికన్నా ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్న కథనం ఏమిటంటే ఒక రోజు టౌన్‌లో ఉత్సవాలు జరుగుతున్న సమయంలో సిటీ కౌన్సిల్‌మెన్ పాలనపై అసంతృప్తితో ఉన్న ప్రజలు టొమాటోలతో దాడి చేశారట. ఫుడ్‌ఫైట్ ఎలా మొదలయినా దాన్ని బాగా ఎంజాయ్ చేయడంతో మరుసటి సంవత్సరం కూడా నిర్వహించారు. అలా అది ప్రతి ఏడాది జరుగుతూ వచ్చింది. అయితే ఫ్రాన్సిస్కో ఫ్రాంకో పాలన సమయంలో ఫుడ్‌ఫైట్‌కు ఎలాంటి సంప్రదాయ ప్రాముఖ్యత లేకపోవడంతో ఆ రోజు సెలవును రద్దు చేశారు. అయితే 1970లో ఆయన తరువాత మళ్లీ సెలవును పునరుద్ధరించారు. పట్టణాన్ని రక్షించే దేవతలైన ల్యూయిస్ బెర్ట్రాన్, మారె ది డ్యూ డేల్స్ గౌరవార్థం ఈ పండుగను నిర్వహిస్తున్నారు.




సందడే సందడి

ఉదయం 11 గంటలకు టౌన్ సెంటర్‌లోకి టొమాటోలతో ట్రక్కులన్నీ చేరుకుంటాయి. తరువాత రెండు అంతస్తుల పొడవున్న ఒక పొడవాటి కర్రకు గ్రీజును పూసి సెంటర్లో పాతుతారు. దాన్ని పైకి ఎక్కిన తరువాతే ఫుడ్‌ఫైట్ మొదలవుతుంది. ఫుడ్‌ఫైట్ ప్రారంభానికి సంకేతంగా నీటి ఫిరంగులను ప్రయోగిస్తారు. దాంతో పండుగ మొదలవుతుంది. వేల మంది టొమాటోలతో కొట్టుకోవడం మొదలుపెడతారు. సరిగ్గా ఒక గంట తరువాత ఫైట్ ముగుస్తుంది. అప్పుడు ఎవ్వరూ కూడా టొమాటోలు విసరడం చేయరు. వెంటనే టౌన్‌లోని వీధులన్నీ శుభ్రం చేసే కార్యక్రమం మొదలవుతుంది. పర్యాటకులు దగ్గరలో ఉన్న బ్యునెల్ నదిలో స్నానం చేస్తారు. మొత్తంగా ఫుడ్‌ఫైట్ మరచిపోలేని మధురానుభూతిని అందిస్తుంది.

ఈ ఫుడ్‌ఫైట్‌లో పాల్గొనే వారు కొన్ని రూల్స్ పాటించాలి. అవి...

- పదునైన వస్తువులు, బాటిల్స్ తీసుకెళ్లకూడదు.
- ఇతరుల టీషర్టులు చింపకూడదు.
- టొమాటోలు విసిరే ముందు తప్పకుండా చిదమాలి.
- టొమాటోలను తీసుకొచ్చిన లారీలకు దూరంగా ఉండాలి.

దారి కనుక్కోండి



ఇది నిజం !

థాయ్‌లాండ్‌లో షాపింగ్ చేసినపుడు, బిల్లింగ్ కౌంటర్‌లో మిమ్మల్ని చూసి షాప్ యజమాని 'హహహ' అంటే.. అపార్థం చేసుకోవద్దు. ఎందుకంటే థాయ్‌లో 'హ' అంటే ఐదు అని అర్థం. హహహ అంటే 555.



రంగులు వేయండి



టంగ్‌ట్విస్టర్స్

1. I feel a feel a funny feel a funny feel feel I,If I feel a funny feel a funny feel feel I.
2. If a fella met a fella in a field of fitchesCan a fella tell a fella where a fella itches?
3. It's a nice night for a white rice fight.



సూక్తి

ఓడిపోతామనే భయంతో ప్రయత్నించకుండా ఉండటం కంటే ప్రయత్నించి ఓడిపోవడం మేలు.


మీకు తెలుసా?

- పాలను తోడుబెట్టి పెరుగు తయారు చేయడం, వెన్న సేకరించడం వంటి ప్రక్రియలు క్రీస్తు పూర్వం 5000 సంవత్సరాల నాటికే మానవులకు తెలుసు.
- ప్రాచీన కాలంలోనే భారతీయులు పాలతో రకరకాల వంటకాలను తయారు చేసేవారు.

భారతదేశ మొట్టమొదటి గవర్నర్ జనరల్?

భారత రాజ్యాంగం- చట్టాలు

1. ఈస్టిండియా కంపెనీ స్థాపన?
1) 1600 డిసెంబరు 28 2) 1600 డిసెంబరు 29 3) 1600 డిసెంబరు 30 4) 1600 డిసెంబరు 31
2. కలెక్టర్ పదవిని ఎప్పుడు సృష్టించారు?
1) 1770 2) 1771 3) 1772 4) 1773
3. మొట్టమొదటి గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్?
1) వారన్ హేస్టింగ్స్ 2) రాబర్ట్ క్లైవ్ 3) మన్రో 4) ఎవరూ కాదు
4. బెంగాల్ గవర్నర్ పదవిని బెంగాల్ గవర్నర్ జనరల్‌గా మార్చిన చట్టం?
1) మొదటి చార్టర్ చట్టం - 1793
2) రెండో చార్టర్ చట్టం - 1813
3) మూడో చార్టర్ చట్టం - 1883
4) రెగ్యులేటింగ్ చట్టం - 1773
5. భారతదేశంలో మొట్టమొదటి మున్సిపల్ కార్పొరేషన్ 1687లో ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) మద్రాసు 2) కలకత్తా 3) బొంబాయి 4) ఏదీకాదు
6. భారతదేశ మొట్టమొదటి గవర్నర్ జనరల్?
1) వారన్ హేస్టింగ్స్ 2) రాబర్ట్ క్లైవ్ 3) విలియం బెంటింక్ 4) లార్డ్ మెకాలే
7. భారతదేశంలో ఆధునిక సివిల్ సర్వీస్ పితామహుడు?
1) నెహ్రూ
2) సర్దార్ వల్లభాయ్ పటేల్
3) సుభాష్ చంద్రబోస్
4) ఎవరూకాదు



8. ఇండియన్ పీనల్ కోడ్‌ను ఎప్పుడు చట్టం చేశారు?
1) 1858 2) 1859 3) 1860 4) 1861
9. ప్రస్తుత(21వ) లా కమిషన్ ఛైర్మన్?
1) ఎం.సి.సెతల్వాడ్ 2) ఎ.పి.షా 3) బల్బీర్‌సింగ్ చౌహాన్ 4) ఎవరూ కాదు
10. 'సతి'ని ఎప్పుడు రద్దు చేశారు?
1) 1853 2) 1828 3) 1829 4) 1830
11. ప్రపంచంలో తొలిసారిగా పోటీ పరీక్షలు నిర్వహించిన దేశం?
1) రష్యా 2) చైనా 3) భారత్ 4) బ్రిటన్
12. భారతదేశంలో సివిల్ సర్వీస్ పితామహుడు?
1) విలియం బెంటింగ్ 2) లార్డ్ మెకాలే 3) కారన్ వాలిస్ 4) లార్డ్ రిప్పన్
13. కలకత్తా, బొంబాయి, మద్రాసు విశ్వవిద్యాలయాలను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1856 2) 1857 3) 1859 4) 1860
14. భారతదేశంలో న్యాయ వ్యవస్థ పితామహుడు?
1) లార్డ్ మెకాలే 2) కారన్ వాలిస్ 3) విలియం బెంటింగ్ 4) లార్డ్ రిప్పన్
15. మొట్టమొదటి ఇండియన్ సివిల్ సర్వీస్ అధికారి?
1) రవీంద్రనాథ్ ఠాగూర్
2) సత్యేంద్రనాథ్ ఠాగూర్
3) సుభాష్ చంద్రబోస్
4) సురేంద్రనాథ్ బెనర్జీ
16. భారతదేశ మొట్టమొదటి వైస్రాయి?
1) లార్డ్ కానింగ్ 2) లార్డ్ మేయో 3) లార్డ్ రిప్పన్ 4) ఎవరూ కాదు
17. భారతదేశ మొట్టమొదటి రాజ్య కార్యదర్శి?
1) హంటర్ 2) చార్లెస్ ఉడ్స్ 3) లార్డ్ మెకాలే 4) ఎవరూ కాదు



తాళ్లపెల్లి సదయ్య
రామప్ప అకాడమీ
హన్మకొండ

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

18. 1833లో లా కమిషన్ ఛైర్మన్?
1) లార్డ్ మేయో 2) లార్డ్ మెకాలే 3) లార్డ్ విలియం బెంటింక్ 4) ఏదీకాదు
19. 1857 సిపాయిల తిరుగుబాటుకు ఆద్యుడు?
1) మంగళ్‌పాండే 2) తాంతియా తోపే 3) నానా సాహెబ్ 4) కున్వర్‌సింగ్
20. సిపాయిల తిరుగుబాటును జాతీయ తిరుగుబాటుగా అభివర్ణించింది?
1) సయ్యద్ అహ్మద్‌ఖాన్ 2) వి.డి.సావర్కర్ 3) నెహ్రూ 4) ఎవరు కాదు
21. పోర్ట్‌పోలియో విధానాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1857 2) 1858 3) 1859 4) 1862
22. కలకత్తా, బొంబాయి, మద్రాసు హైకోర్టులను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1859 2) 1860 3) 1861 4) 1862
23. ప్రస్తుతం భారతదేశంలో హైకోర్టుల సంఖ్య?
1) 21 2) 22 3) 23 4) 24
24. రౌలత్ చట్టాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1909 2) 1917 3) 1918 4) 1919
25. బ్రిటిష్ పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి భారతీయుడు?
1) దాదాబాయి నౌరోజీ
2) సత్యేంద్ర ప్రసాద్ సిన్హా
3) సత్యేంద్రనాథ్ ఠాగూర్ 4) ఎవరూ కాదు
26. భారతదేశంలో 'విభజించు - పాలించు' అనే విధానానికి బీజం వేసిన చట్టం?
1) 1909 చట్టం 2) 1813 చట్టం 3) 1853 చట్టం 4) 1833 చట్టం
27. మత నియోజకవర్గాల పితామహుడు?
1) లార్డ్ మెకాలే 2) మార్లే 3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
28. ముస్లింలీగ్ స్థాపన?
1) 1905 2) 1906 3) 1907 4) 1908
29. సూరత్‌లో కాంగ్రెస్ చీలిక?
1) 1906 2) 1907 3) 1908 4) 1909
30. మాంటెంగ్ ప్రకటన ఎప్పుడు వెలువడింది?
1) 1917 ఆగస్టు 20 2) 1917 ఆగస్టు 21 3) 1917 ఆగస్టు 23 4) 1917 ఆగస్టు 25
31. ద్వంద్వ పాలన పితామహుడు ఎవరు?
1) కారన్ వాలిస్ 2) విలియం డ్యూక్ 3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
32. అలహాబాద్ హైకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?



1) 1861 2) 1863 3) 1855 4) 1866
33. జలియన్‌వాలాబాగ్ దుర్ఘటన ఎప్పుడు జరిగింది?
1) 1919 ఏప్రిల్ 13 2) 1919 ఏప్రిల్ 14 3) 1919 ఏప్రిల్ 15 4) 1919 ఏప్రిల్ 16
34. ప్రభుత్వ ఖాతాల సంఘాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1919 2) 1920 3) 1921 4) 1922
35. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటును సూచించిన కమిటీ?
1) లీ కమిటీ 2) హాలీ కమిటీ 3) మాడ్డిమాన్ కమిటీ 4) ఏదీకాదు
36. నెహ్రూ నివేదికను ఎప్పుడు ప్రకటించారు?
1) 1927 2) 1928 3) 1929 4) 1930
37. జిన్నా నివేదికను ఎప్పుడు ప్రకటించారు?
1) 1927 2) 1928 3) 1929 4) 1930
38. కమ్యూనల్ అవార్డును ఎప్పుడు ప్రకటించారు?
1) 1930 2) 1931 3) 1932 4) 1933
39. గాంధీ - అంబేద్కర్‌ల మధ్య పూనా ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
1) 1930 2) 1931 3) 1932 4) 1933
40. భారత్ నుంచి బర్మాను ఎప్పుడు వేరు చేశారు?
1) 1935 2) 1936 3) 1937 4) 1938
41. మౌంట్ బాటన్ ప్రణాళిక ఎప్పుడు వెలువడింది?
1) 1947 జూన్ 3 2) 1947 జూన్ 4 3) 1947 జూన్ 5 4) 1947 జూన్ 6
42. ఆర్‌బిఐని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1934 2) 1935 3) 1936 4) 1937
43. ఆర్‌బిఐకి తొలి భారతీయ గవర్నర్?
1) ఎం.సి.సెతల్వాడ్ 2) సత్యేంద్రనాథ్ ఠాగూర్ 3) చింతామణి ద్వారాకానాథ్ దేశ్‌ముఖ్ 4) ఎవరూ కాదు
44. ప్రస్తుత(24వ) ఆర్‌బిఐ గవర్నర్ ఎవరు?
1) ఉర్జిత్ పటేల్ 2) రంగరాజన్ 3) వై.వి.రెడ్డి 4) ఎవరూ కాదు
45. ఫెడరల్ కోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1935 2) 1936 3) 1937 4) 1938
46. భారతదేశంలో సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1950 జనవరి 26 2) 1950 జనవరి 27 3) 1950 జనవరి 28 4) 1950 జనవరి 29
47. స్థానిక సంస్థల పితామహుడు ఎవరు?
1) లార్డ్ మెకాలే 2) లార్డ్ రిప్పన్ 3) లార్డ్ మేయో 4) ఎవరూ కాదు
48. సాధారణ బడ్జెట్ నుంచి రైల్వే బడ్జెట్‌ను ఎప్పుడు వేరు చేశారు?
1) 1920 2) 1921 3) 1922 4) 1923
49. కేంద్రంలో ద్విసభా విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
1) 1919 2) 1909 3) 1935 4) 1947
50. రాష్ట్రాల్లో ద్విసభ విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
1) 1909 2) 1919 3) 1935 4) 1947

సమాధానాలు

1) 4	9) 3	17) 2	25) 1	34) 3	43) 3
2) 3	10) 3	18) 2	26) 1	35) 1	44) 1
3) 1	11) 2	19) 1	27) 3	36) 2	45) 3
4) 4	12) 3	20) 3	28) 2	37) 3	46) 3
5) 1	13) 2	21) 3	29) 2	38) 3	47) 2
6) 3	14) 2	22) 4	30) 1	39) 3	48) 2
7) 2	15) 2	23) 4	31) 2	40) 3	49) 1
8) 3	16) 1	24) 4	32) 4	41) 1	50) 3
			33) 1	42) 2	

JOBS ఉద్యోగాలు

కెన్ ఫిన్ హోమ్స్

కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలోని కెన్ ఫిన్ హోమ్స్ లి. - క్లరికల్ కేడర్‌లో **ప్రొబేషనరీ అసిస్టెంట్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 30
బ్రాంచ్ వారీ ఖాళీలు: బెంగళూరు 8, చెన్నై 4, హైదరాబాద్ 5, ముంబై 4, జైపూర్ 2, భోపాల్ 1, ఇండోర్ 1, ఢిల్లీ/ నొయిడా/ గ్రేటర్ నొయిడా 5
అర్హత: మే 1 నాటికి డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డేటా ఎంట్రీలో ప్రావీణ్యం + కంప్యూటర్ అప్లికేషన్స్ పరిజ్ఞానం + ప్రాంతీయ భాషల్లో నైపుణ్యం ఉండాలి.
వయసు: 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
ప్రొబేషన్: ఏడాది
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.100
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 14
వెబ్‌సైట్: www.canfinhomes.com/jobapplication.php, www.canfinhomes.com

ఇస్రో

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)- కింది పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 128
పోస్టులు - ఖాళీలు: లైట్ వెహికిల్ డ్రైవర్ ఎ 50, హెవీ వెహికిల్ డ్రైవర్ ఎ 76, స్టాఫ్ కార్ డ్రైవర్ 2
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 28
వెబ్‌సైట్: www.isro.gov.in

ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ

ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ - అప్రెంటిస్‌ల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 24
డిగ్రీ అప్రెంటిస్‌లు: మెకానికల్ 3, మెటలర్జికల్ 2, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్ 2
డిప్లొమా అప్రెంటిస్‌లు: మెకానికల్ 3, మెటలర్జికల్ 3, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్ 2
టెక్నికల్ ఒకేషనల్ అప్రెంటిస్‌లు: మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ 3, ఆఫీస్ సెక్రటరీ/ స్టెనోగ్రఫీ 3, పర్చేజింగ్ & స్టోర్ కీపింగ్ 3
అర్హత: అభ్యర్థులు సంబంధిత విభాగంలో డిగ్రీ / డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్: ఏడాది
స్టయిపెండ్: గ్రాడ్యుయేట్స్‌కు రూ.4984, డిప్లొమా అభ్యర్థులకు రూ.3542, టెక్నీషియన్స్‌కు రూ.2758 చెల్లిస్తారు.
ఎంపిక: అకడమిక్ మెరిట్, వైవా, మెడికల్ టెస్ట్
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 14
చిరునామా: General Manager/Grey Iron Foundry, Jabalpur - 482009

జెఎన్‌టిబిజిఆర్‌ఐ

జవహర్‌లాల్ నెహ్రూ బొటానికల్ గార్డెన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (జెఎన్‌టిబిజిఆర్‌ఐ)- తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 46
పోస్టులు - ఖాళీలు: జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో(బోటనీ 21, బయోటెక్నాలజీ/ బయో ఇన్ఫర్మాటిక్స్ 2, కెమిస్ట్రీ/ బయో కెమిస్ట్రీ/ అనలిటికల్ కెమిస్ట్రీ 4, మైక్రో బయాలజీ/ ఇంటిగ్రేటెడ్ బయాలజీ 2, జువాలజీ/ వైల్డ్ లైఫ్ బయాలజీ 1), ప్రాజెక్ట్ అసిస్టెంట్(బోటనీ/ అగ్రికల్చర్/ హార్టికల్చర్ 13), కంప్యూటర్ అసిస్టెంట్ (బోటనీ) 2, సిస్టం అడ్మినిస్ట్రేటర్ 1
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఫస్ట్‌క్లాస్ మార్కులతో ఎమ్మెస్సీ/ బీఎస్సీ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ అర్హత పొందినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
స్టయిపెండ్: విభాగాన్ని అనుసరించి రూ.19000 నుంచి రూ.25000 వరకు ఇస్తారు.
వయసు: ఈ ఏడాది జనవరి 1 నాటికి 36 ఏళ్లు ఉండాలి.
ఇంటర్వ్యూ: ఆగస్టు 22, 23, 24న
వేదిక: JNTBGRI, Karmiancode, PO, Pacha Palode, Thiruvanthapuram 695562
వెబ్‌సైట్: www.jntbgri.res.in

వర్ణమాల అక్షరాల దిశలు తెలిస్తే జవాబు సులువే..!

అనాలజీ (పోలిక పరీక్ష)

మోడల్ - 1

1. **ఖురాన్: మహ్మదీయులు:: జెండ్ అవస్థా: -----**
ఎ) జొరాస్ట్రియన్ బి) షింటో సి) అజీవక డి) పారశీక
సమాధానం: **ఎ**
వివరణ: మహ్మదీయుల పవిత్ర గ్రంథం ఖురాన్. అలాగే జొరాష్ట్రియన్ల పవిత్ర గ్రంథం జెండ్ అవస్థా

2. **నవంబరు 14 : బాలల దినోత్సవం :: జూన్ 5 : -------**
ఎ) యువజన దినోత్సవం
బి) పర్యావరణ దినోత్సవం
సి) ఆహార దినోత్సవం డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: నవంబరు 14 బాలల దినోత్సవం. అలాగే జూన్ 5 పర్యావరణ దినోత్సవం

3. **శాకాహారి: ఆవు :: మాంసాహారి: ----------**
ఎ) జింక బి) మేక సి) గొర్రె డి) సింహం
సమాధానం: **డి**
వివరణ: ఆవు శాకాహారి. అలాగే ఇచ్చిన ఐచ్ఛికాల్లో సింహం మాంసాహారి

4. **రక్తం: ఎరుపు :: బొగ్గు : ------------**
ఎ) పసుపు బి) ఆకుపచ్చ సి) నలుపు డి) గులాబి
సమాధానం: **సి**
వివరణ: రక్తం ఎరుపు రంగులో ఉంటుంది. బొగ్గు నలుపు రంగులో ఉంటుంది

5. **ఉదయం: సాయంత్రం :: రాత్రి : -----**
ఎ) పగలు బి) సాయంత్రం
సి) మధ్యాహ్నం డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: ఉదయానికి వ్యతిరేకం సాయంత్రం, అలాగే రాత్రికి వ్యతిరేకం పగలు

6. **గడియారం: సమయం :: థర్మామీటర్ : -------**
ఎ) ఉష్ణం బి) ఉష్ణోగ్రత సి) శక్తి డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: సమయాన్ని తెలిపేది గడియారం, ఉష్ణోగ్రతను తెలిపేది థర్మామీటర్

7. **సిక్కిం: గాంగ్‌టక్ :: మణిపూర్ : ------**
ఎ) డిస్పూర్ బి) షిల్లాంగ్ సి) ఇంఫాల్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: సిక్కిం రాష్ట్ర రాజధాని గాంగ్‌టక్. అలాగే మణిపూర్ రాజధాని ఇంఫాల్

8. **క్యాలెండర్ : తేదీలు :: నిఘంటువులు : ------**
ఎ) భాష బి) వాక్యాలు సి) పదాలు డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: క్యాలెండర్‌లో తేదీలు ఉంటాయి. అలాగే నిఘంటువులో పదాలు ఉంటాయి

9. **కిలోగ్రాం : క్వింటాల్ :: పైసా : ------**
ఎ) రూపాయి బి) నాణెం సి) సంపద డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: వంద కిలోగ్రామ్‌లు ఒక క్వింటాల్. అలాగే వంద పైసలు అంటే ఒక రూపాయి.

10. **సముద్రగుప్తుడు: ఇండియన్ నెపోలియన్ :: కాళిదాసు : ------**
ఎ) ఇండియన్ ఐన్‌స్టీన్
బి) ఇండియన్ మాఖియ వెల్లి
సి) ఇండియన్ షేక్‌స్పియర్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: సముద్ర గుప్తుని బిరుదు ఇండియన్ నెపోలియన్ అలాగే కాళిదాసు బిరుదు ఇండియన్ షేక్‌స్పియర్

11. **నిరక్షరాస్యత : విద్య :: వరద : -------**
ఎ) వంతెన బి) సముద్రం సి) ఆనకట్ట డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: నిరక్షరాస్యత తొలగాలంటే విద్యావంతులు కావాలి. అదేవిధంగా వరదల నుంచి రక్షణకై ఆనకట్టలు నిర్మించాలి.

12. **ప్రోటీన్స్: పెరుగుదల:: కార్బోహైడ్రేట్స్: ------**
ఎ) శక్తి బి) బలం సి) వ్యాధి డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: పెరుగుదలకు ప్రోటీన్స్, తక్షణ శక్తికి కార్బోహైడ్రేట్స్ ఉపయోగపడతాయి.



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 2

వర్ణమాల అక్షరాలతో పోలిక పరీక్ష

- ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇచ్చి దానిని ఒక క్రమ పద్ధతిలో కొత్త అక్షరాలుగా మారుస్తారు. అంతేకాక మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇస్తారు. అభ్యర్థి మొదటి వర్ణమాల అక్షరాల సమూహం ఏ పద్ధతిలో మార్చారో పరిశీలించి ఇచ్చిన మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని అదే పద్ధతిలో మార్చి రాయాలి.
- ఈ మోడల్‌కు సంబంధించిన ప్రశ్నలకు త్వరగా సమాధానం గుర్తించాలంటే వర్ణమాల అక్షరాల సవ్యదిశ, అపసవ్యవదిశ సంఖ్యలు తెలిసి ఉండటం చాలా అవసరం.

సవ్యదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
A	B	C	D	E	F	G	H	I	J	K	L	M	N
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
O	P	Q	R	S	T	U	V	W	X	Y	Z		

అపసవ్యవదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
Z	Y	X	W	V	U	T	S	R	Q	P	O	N	M
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
L	K	J	I	H	G	F	E	D	C	B	A		

1. **ADG: CFI :: MPS: ----------**
ఎ) PRU బి) OSU సి) ORU డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: ఈ ప్రశ్నలో అక్షరాలు +2 సిద్ధాంతాన్ని అనుసరించినవి. ADG ని CFI గా రాశారు.
అంటే A మొదటి అక్షరం C(A + 2 = C) మూడో అక్షరం
D నాలుగో అక్షరం, F ఆరో అక్షరం (D + 2 = F)
G ఏడో అక్షరం, I తొమ్మిదో అక్షరం (G + 2 = I)
అలాగే
M పదమూడో అక్షరం, O పదిహేనో అక్షరం (M + 2 = O)
P పదహారో అక్షరం, R పద్దెనిమిదో అక్షరం (P + 2 = R)
S పందొమ్మిదో అక్షరం, U ఇరవై ఒకటో అక్షరం(S + 2 = U)
కాబట్టి సమాధానం ORU అవుతుంది

2. **FDB: HFD :: NLJ : ------------**
ఎ) KLN బి) PNL సి) QNK డి) ఏదీకాదు
సమాధానం: **బి**

6	4	2		4	12	10
F	D	B		N	L	J
+2	+2	+2	అలాగే	+2	+2	+2
H	F	D		P	N	L
8	6	4		16	14	12

3. **FAME: JEQI :: LOVE: -------**
ఎ) PSZI బి) PRYK సి) PSXJ డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

6	1	13	5	12	15	22	5
F	A	M	E	L	O	V	E
+4	+4	+4	+4	+4	+4	+4	+4
J	E	Q	I	P	S	Z	I
10	5	17	9	16	19	26	9

4. **JOY: MQZ :: KNR : -----------**
ఎ) MMR బి)NPS సి) LMS డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ:

10	15	25	11	14	18
J	O	Y	K	N	R
+3	+2	+1	+3	+2	+1
M	Q	Z	N	P	S
13	17	26	14	16	19

5. **KIG : MMM :: MLK : ----------**
ఎ) QRP బి) PQR సి) OPQ డి) ఏదీకాదు
సమాధానం: **సి**

11	9	7	13	12	11
K	I	G	M	L	K
+2	+4	+6	+2	+4	+6
M	M	M	O	P	Q
13	13	13	15	16	17

6. **HEN : FCL :: IHG: ----------**
ఎ) GFE బి) EFG సి) FGE డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

8	5	14	9	8	7
H	E	N	I	H	G
-2	-2	-2	-2	-2	-2
F	C	L	G	F	E
6	3	12	7	6	5

7. **FENR: DILV :: SALT : ------------**
ఎ)PEJY బి) QFJY సి) QEJY డి) QEJX
సమాధానం: **డి**

6	5	14	18	19	1	12	20
-2	+4	-2	+4	-2	+4	-2	+4
D	I	L	V	Q	E	J	X
4	9	12	22	17	5	10	24

8. **TRK: QPJ :: NKF : ---------**
ఎ) KIE బి) KJF సి) JJE డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

20	18	11	14	11	6
T	R	K	N	K	F
-3	-2	-1	-3	-2	-1
Q	P	J	K	I	E
17	16	10	11	9	5

9. **BOLD: CQOH :: KITE : ----------**
ఎ) LWKJ బి) LKWI సి)KLXJ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ:

2	15	12	4	11	9	20	5
B	O	L	D	K	I	T	E
+1	+2	+3	+4	+1	+2	+3	+4
C	Q	O	H	L	K	W	I
3	17	15	8	12	11	23	9

10. **MNR: GJP :: KPT : ---------**
ఎ) ELR బి) EJP సి) DJP డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

13	14	18	11	16	20
M	N	R	K	P	T
-6	-4	-2	-6	-4	-2
G	J	P	E	L	R
7	10	16	5	12	18

11. **NF: SK :: GJ : ----------**
ఎ) NP బి) PQ సి) LO డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: N పధ్నాలుగో అక్షరం, S పందొమ్మిదో అక్షరం (N + 5 = S)
F ఆరో అక్షరం, K పదకొండో అక్షరం (F + 5 = K)
G ఏడో అక్షరం, L పన్నెండో అక్షరం (G + 5 = L)
J పదో అక్షరం, O పదిహేనో అక్షరం (J + 5 = O)
కాబట్టి LO సమాధానం అవుతుంది

12. **RKNI : NHLH :: KIND : ---------**
ఎ) GFED బి) GFLC సి) JFEC డి) ఏదీకాదు
సమాధానం: **బి**

18	11	14	9	11	9	14	4
R	K	N	I	K	I	N	D
-4	-3	-2	-1	-4	-3	-2	-1
N	H	L	H	G	F	L	C
14	8	12	8	7	6	12	3

13. **NRKI : JUIJ :: TFNK : ---------**
ఎ) IUJJ బి) LIPL సి) PILL డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ:

14	18	11	9	20	6	14	11
N	R	K	I	T	F	N	K
-4	+3	-2	+1	-4	+3	-2	+1
J	U	I	J	P	I	L	L
10	21	9	10	16	9	12	12

JOBS ఉద్యోగాలు

యుఐఐసిఎల్

యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యుఐఐసిఎల్)- **అసిస్టెంట్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: **696**
అర్హత: జూన్ 30 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రాంతీయ భాషల్లో ప్రావీణ్యం ఉండాలి.
వయసు: 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి
వేతనం: నెలకు రూ.23,000
ఎంపిక: ప్రిలిమ్స్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్ ద్వారా
ప్రిలిమ్స్ టెస్ట్: సెప్టెంబరు 22న
మెయిన్ ఎగ్జామ్: అక్టోబరు 23న
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 14 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 28
వెబ్‌సైట్: www.uiic.co.in

ఓఐసిఎల్

ఓరియంటల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఓఐసిఎల్)- **అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు:** **300**
పోస్టులు - ఖాళీలు: అకౌంటెంట్స్ 20, యాక్చసరీస్ 2, జనరలిస్ట్స్ 223, లీగల్ 30, ఆటోమొబైల్ ఇంజనీర్స్ 15, మెడికల్ ఆఫీసర్స్ 10.
వయసు: 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
రాత పరీక్ష: అక్టోబరు 22న
దరఖాస్తు ఫీజు: రూ.600
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 18 నుంచి
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.orientalinsurance.org.in/Career.jsp

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర - సెక్యూరిటీ ఆఫీసర్ (మేనేజర్) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది
ఖాళీలు: **13**
అర్హత: డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఆర్మీ/ నేవీ/ ఎయిర్‌ఫోర్స్/ పారా మిలిటరీ/ పోలీస్ విభాగాల్లో కనీసం అయిదేళ్ల అనుభవం + కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. **వయసు:** 25 - 40 ఏళ్ల మధ్య
వేతనం: రూ.31,705 నుంచి రూ.45,950 వరకు
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ప్రొబెషన్: రెండేళ్లు **దరఖాస్తు ఫీజు:** రూ.600
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 12 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 2
దరఖాస్తు హార్డుకాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 12
వెబ్‌సైట్: www.bankofmaharashtra.in

ఎలుకల విధ్వంసం రూ.500 కోట్ల పైమాటే!

జిల్లాలో ప్రతియేటా సుమారు రూ.500 కోట్ల నుంచి రూ.700కోట్ల వరకు వివిధ రకాల వ్యవసాయ పంటలను ఎలుకలు ధ్వంసం చేస్తున్నాయి. రైతన్నలు ఆరుగాలం పండించిన పంటలు ఎలుకల పాలుకాకుండా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. వరి పంటలో దీని ప్రభావం ఎక్కువగా ఉంది. వరి, పసుపు, పత్తి, కూరగాయలు, అపరాలు, ఇతర పంటల్లో ఎలుకల బెడద వల్ల రైతులు నష్టపోతున్నారు.



ఎలుకల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- కృష్ణా పశ్చిమ డెల్టాలో బెడద
- నేడు పంచాయతీ కార్యాలయాల్లో ఎలుకల నివారణ మందు పంపిణీ



ఆంధ్రజ్యోతి, గుంటూరు

కృష్ణా పశ్చిమ డెల్టాలోని వరి మాగాణి భూముల్లో ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. వ్యవసాయశాఖ కృష్ణాపశ్చిమ డెల్టాలో ఎలుకల నివారణపై రైతులకు ఈ నెల 9 బుధవారం ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. సామూహికంగా అన్ని ప్రాంతాల్లో ఒకే రోజు ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిపుణులు సూచించారు. తెనాలి, పొన్నూరు, బాపట్ల, రేపల్లె వ్యవసాయ సబ్ డివిజన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఎలుకల నివాణ మందును పంచాయతీ కార్యాలయాల్లో పంపిణీచేస్తున్నారు. ఎలుకలు ప్రధానంగా రాత్రి పూట వ్యవసాయ పంటలను ధ్వంసం చేస్తుంటాయి. సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు ఎలుకలు సంచరిస్తుంటాయి. వరి పైరు వేసిన నెలరోజుల తరువాత పిలకలను కొరికి ధ్వంసం చేస్తాయి. పంట చేలో రంధ్రాలు వేసి గూడు (బొరియ)ను ఏర్పాటు చేస్తుంది. వరి ఇతర పంటలను తిని ఆహారాన్ని దానిలో భద్రపరుస్తుంది. ఏటా జిల్లాలో వివిధరకాల పంటలను ఇవి దెబ్బతీస్తున్నాయి. మినుము, పెసర, కందిలో ఎక్కువగా ఉంది. కొబ్బరి చెట్లకు పైనే గూళ్ళు ఏర్పాటు చేసి అక్కడే నివాసం ఉంటాయి.

నివారణకు ఉచితంగా మందుల పంపిణీ

వ్యవసాయశాఖ ఎలుకల నివారణకు ఉచితంగా మందులను పంపిణీచేస్తోంది. ఈనెల 9న తెనాలి ప్రాంతంలోని 18 మండలాల్లో మందుల పంపిణీకి ఏర్పా ట్లు చేశారు. బ్రోమోడయోలిన్ అనే పౌడరును నువ్వుల నూనె, వేరుశనగ నూనెలో కలిపి వరి నూకలను జతచేసి మిశ్రమరూపంలో తయారుచేయాలి. ఎనిమిది గ్రాముల బ్రోమోడయోలిన్, 8 గ్రాముల నూనె, 384 గ్రాముల వరినూకలను కలిపి, 400 గ్రాముల ఈ మిశ్రమాన్ని, పది గ్రాముల వంతున 40 ప్యాకెట్లను తయారుచేస్తారు. బ్రోమోడయోలిన్ విషపదార్థం.. దీనిలో వరినూకలు, నూనె కలపడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులకు బ్లౌజులు ధరించి వీటిని కలపాలి. ఈనెల 9న తొలిదశలో వరి పండే ప్రాంతంలో సామూహికంగా ఎలుకల నివారణకు ప్రభుత్వం, వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. పంచాయతీ కార్యాలయాల వద్ద వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వంఉచితంగా 8 గ్రాముల బ్రోమోడయోలిన్ తెల్ల పౌడరును ఉచితంగా ఇస్తారు. రైతులు 8 గ్రాముల నువ్వులు, వేరుశనగ నూనె, వరి నూకలను తీసుకెళ్ళాలి. ఒక ఎకరానికి 40 ప్యాకెట్లు, 400 గ్రాముల ఈ మిశ్రమం సరిపోతుంది. పంట పొలాల్లోని ఎలుకల బోదెల వద్ద ఈ ప్యాకెట్లను వేయాలి. ఈ మందు వేసిన 2-3 రోజులకు ఎలుకలు చనిపోతాయి.

గ్రామాల్లో కూడా నివారణ...

తెనాలి ప్రాంతంలోని 18 మండలాల్లో పంటపొలాలతో పాటు గ్రామాల్లో కూడా ఎలుకల నివారణకు అన్ని చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వరిలో నెలరోజుల తరువాత, పత్తిలో 45 -60 రోజుల్లో ఎలుకలు వచ్చే అవకాశం ఉంది. మినుము, పెసర, కంది పూతదశలో ఎలుకలు వస్తాయని అధికారులు చెప్పారు. ప్రతియేటా జిల్లాలో రూ.500 నుంచి రూ.700 కోట్ల వరకు వ్యవసాయ ఉత్పత్తులకు ఎలుకలు హానీ కలిగిస్తున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ కృపాదాస్ తెలిపారు. ఎలుకల నివారణపై రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే సెల్ నం: 88866 14109కు ఫోన్ చేసి తెలుసుకోవాలని ఆయన సూచించారు.

ఈవీఎంలను పరిశీలించిన ఆర్డీవో



ఈవీఎంలను పరిశీలిస్తున్న ఆర్డీవో బండ్ల శ్రీనివాసరావు

ఫిరంగిపురం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను గుంటూరు ఆర్డీవో బండ్ల శ్రీనివాసరావు పరిశీలించారు. మంగళవారం మండలంలోని రేపూడి మార్కెట్ యార్డు గోడౌన్లలోని ఈవీఎంలను అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలసి పరిశీలించారు. 2006 ముందు వున్న (ఎన్-1) బ్యాలెట్ యూనిట్లు 24, కంట్రోల్ యూనిట్లు 756లను తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఈవీఎంలను పరిశీలిస్తున్నామని ఆర్డీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి, తహసీల్దార్ జె. పార్థసారథి, డీటీ కేఎస్ చక్రవర్తి, ఆర్ఐ హనుమంతరావు, సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్లు, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ దుర్ఘటనపై మేజిస్టీరియల్ విచారణ నేడు

ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని కార్మెల్ కొండ క్వారీలో రెండు నెలల క్రితం క్వారీ దుర్ఘటనలో ఆరుగురు కార్మికులు మృతి చెందిన సంఘటనపై మేజిస్టీరియల్ విచారణ జరగనున్నదని తహసీల్దార్ జె.పార్థసారథి మంగళవారం తెలిపారు. తెనాలి ఆర్డీవో ఆర్.నరసింహులు విచారణ నిమిత్తం బుధవారం ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తారు. మృతుల రక్త సంబంధీకులు, క్వారీ యజమానులు, ఈ ఘటనపై ఇంకా సమాచారం ఇచ్చేవారితో చర్చిస్తారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరుగుతుందని పార్థసారథి తెలిపారు. ఎవరైనా ఈ విచారణలో పాల్గొని దుర్ఘటన పూర్వాపరాలను తెలియజేయవచ్చన్నారు.

సిద్ధమవుతున్న బాస్కెట్‌బాల్ కోర్టు

- మునిసిపల్ బాలికోన్నత పాఠశాలకు అదనపు ఆకర్షణ
- హెచ్‌ఎం, పీఈటీ అభ్యర్థనలతో చైర్మన్ నిధుల మంజూరు

నరసరావుపేట టౌన్: మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మాణం చివరిదశకు చేరుకుంది. పాఠశాల విద్యార్థినుల్లో అనేకమంది జాతీయ స్థాయిలో ప్రతిభను చాటారు. ఇప్పటికీ సాధనచేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల పీఈటీ భాగ్యలక్ష్మి, హెచ్‌ఎం ఎం. సులేఖ అభ్యర్థనకు మేరకు మునిసిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా కోర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. సుమారు రూ. 15 లక్షలతో నిర్మాణం పూర్తి కావచ్చింది. ఈ కోర్టు మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలకు అదనపు ఆకర్షణ కానుంది.

బాస్కెట్ బాల్‌లో జాతీయస్థాయి ప్రతిభ

మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు. క్రీడాకారిణులు సాధన చేసేందుకు స్కూల్‌లో బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మాణానికి మునిసిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా చొరవ తీసుకొని నిధులు మంజూరు చేశారు. బాస్కెట్‌బాల్ కోర్టు జాతీయస్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంటోంది. బోర్డు, నెట్ బిగిస్తే నిర్మాణం పూర్తవుతుంది. ఆ తరువాత మునిసిపల్ చైర్మన్ సహకారంతో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించటానికి కృషి చేస్తాం.

-హెచ్‌ఎం సులేఖ, పీఈటీ భాగ్యలక్ష్మి





నిర్మాణం చివరి దశకు చేరుకున్న బాస్కెట్ బాల్ కోర్టు, అంతరచిత్రంలో హెచ్‌ఎం సులేఖ, పీఈటీ భాగ్యలక్ష్మి

టీడీపీ నాయకులకు ఓటమి భయం

వైసీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జంగా



వినుకొండ: తెలుగుదేశం పార్టీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని వైసీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. నంద్యాల ప్రచారానికి వెళ్తూ స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నంద్యాల సభలో వైఎస్ జగన్ వ్యాఖ్యలను పదేపదే ప్రస్తావిస్తూ టీడీపీ నాయకులు పబ్బం గడుపుకుంటున్నారని, ఇదే నాయకులు పలుమార్లు జగన్‌నుద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలు గుర్తులేవా అంటూ ప్రశ్నించారు. నంద్యాలలో వైసీపీ గెలుపు ఖాయమని గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎలాగైనా ఆ సీటును చేజిక్కించుకోవాలనే తలంపుతో అనేక కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ దొంగఓట్లను సైతం చేర్పిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లా బ్రహ్మనాయుడు, నాయకులు చీరపురెడ్డి కోటిరెడ్డి, చుండూరి వెంకటేశ్వర్లు, చిన్నబ్బాయి, నరాలశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గణితం గుర్తులపై విద్యార్థులకు అవగాహన

పిడుగురాళ్లరూరల్: పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయురాలు వెళాంగిణి జ్యోతి, అధ్యాపక బృందం ఆధ్వర్యంలో గణితంలోని గుర్తులపై విద్యార్థినీ విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం విద్యార్థులకు గణితంలోని గుర్తులను చూపిస్తూ వాటిని ఎందుకు, ఎలా ఉపయోగిస్తారో వివరించారు. గణితంపై జ్ఞానం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం రాఖీ పౌర్ణమి సందర్భంగా బాలికలు బాలురకు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

గురజాల నియోజకవర్గంలో రూ.10కోట్లతో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం

పిడుగురాళ్లటౌన్: నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మంగళవారం పంచాయతీ రాజ్‌శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైనింగ్ శాఖ నుంచి రూ.7కోట్లతో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని, ఎస్సీ, ఎస్టీ కాలనీలకు ప్రాధాన్యం ఇచ్చి, అంచనాలు తయారుచేయాలని ఆదేశించారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కోటి రూపాయలతో సీసీ రోడ్లు, మరో కోటి రూపాయలతో అవసరమైన ప్రాంతాల్లో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు, గ్యాప్ ఫిల్లింగ్ ఫండ్ (మధ్యలో నిలిచిన నిర్మాణ పనులకు) మరో కోటి రూపాయలతో మధ్యలో నిలిచిపోయిన పనులను పూర్తిచేసేందుకు అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. మొత్తం రూ.10కోట్లతో గురజాల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో 50 కి.మీ.పైగా సిమెంట్ రోడ్లు వేయనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు, ఉపాధిహామీ పథకం ద్వారా శ్మశానాల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో గురజాల డివిజన్ పంచాయతీరాజ్ శాఖ డీఈ మాలకొండయ్య, ఏఈలు వీరాస్వామి, నాగేశ్వరరావు, విభూషణ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటు అర్జీలను పరిష్కరించండి

● తహసీల్దారు ఫణీంద్రబాబు

మాచవరం: ఇటీవల ఓటు నమోదు కోసం పెట్టుకున్న అర్జీలను వెంటనే పరిష్కరించాలంటూ తహసీల్దారు ఫణీంద్రబాబు ఆయా గ్రామాల బీఎల్వోలను ఆదేశించారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సుమారు 800 వరకు అర్జీలు వచ్చాయని, గ్రామాల వారీగా బీఎల్వోలు వారి వారి అర్జీలను తీసుకొని, విచారణ చేసి, పరిష్కరించాలన్నారు. ఓటు అర్జీలను నిస్పక్షపాతంగా విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల బీఎల్వోలు, ఆర్ఐలు రమేష్, మహాలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిపో మేనేజర్‌గా అబ్దుల్ సలాం



పిడుగురాళ్ల టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌గా షేక్ అబ్దుల్ సలాం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన గుంటూరు, విజయవాడల్లో పనిచేశారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న సలాం పదోన్నతిపై పిడుగురాళ్ల డిపో మేనేజర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా అవగాహన కల్పిస్తానని అన్నారు.

అభివృద్ధికి అందరం కృషి చేయాలి : ఎంపీపీ

రాజుపాలెం: రాజకీయాలు, వర్గాలను వీడి, మండలాభివృద్ధికి అందరం కలసి కృషి చేయాల్సిన అవసరం ఉందని మండల పరిషత్ అధ్యక్షురాలు నర్రా సంధ్యారాణి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన సంధ్యారాణి మాట్లాడుతూ, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు కలసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత మండల శాఖాధికారులు వారి వారి శాఖల పరిధిలో జరిగిన కార్యక్రమాలను వివరించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ, అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డు నిర్మాణానికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అవగాహనకు వచ్చి ప్రభుత్వ స్థలం లేకపోతే రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ గుత్తా సత్యనారాయణ మాట్లాడుతూ, పారిశుధ్య పనుల తాలూకు ఎంబుక్ సిద్ధం చేయడంలో, నగదు ఇవ్వడంలో అధికారులు ఆలస్యం వహిస్తున్నారని అన్నారు. ఎంపీడీవో రాజేష్ మాట్లాడుతూ, ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ దృష్టికి తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. మా గ్రామంలో సబ్‌స్టేషన్‌కి స్థలం చూపిస్తామని, వెంటనే నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ బాలాజీనాయక్‌ను సత్యనారాయణ కోరారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు కూడా తమను ఆహ్వానించకపోవడంపై జడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి అసహనం వ్యక్తంచేశారు. గణపవరం, బీరవల్లిపాయ గ్రామాల్లోని పేదలకు అటవీశాఖ భూములు ఇస్తామని చెప్పి దళారులు సొమ్ము వసూలు చేశారని సభాముఖంగా తెలపగా, ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం అందజేస్తామని అటవీశాఖాధికారి తెలిపారు. స్మార్ట్ పల్స్ సర్వేలో 35,030 మందికి గ్యాస్ లేదని గుర్తించామని, వారిలో 993 మందిని అర్హులుగా గుర్తించి గ్యాస్ కనెక్షన్ అందజేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా, మండల పరిషత్ హాలులో మూడు నెలల క్రితం మరమ్మతులకు గురైన ఫ్యాన్లను పట్టించుకోరా అంటూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశంలో జడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, తహసీల్దారు నగేష్, ఎంపీడీవో రాజేష్, నెమలిపురి సర్పంచ్ సత్యనారాయణ, మండల శాఖాధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మండల పరిషత్ అధ్యక్షురాలు నర్రా సంధ్యారాణి

రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి జరగలేదో చూపించాలి

● టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎస్‌కె మస్తాన్ షరీఫ్

బెల్లంకొండ: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని వైసీపీ నాయకులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎస్‌కె మస్తాన్ షరీఫ్ తీవ్రంగా విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన మూడేళ్ల కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని, పింఛన్ల పంపిణీ, రుణమాఫీ ఇచ్చిన హామీల్లో భాగం కాదా అని ఆయన ప్రశ్నించారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు, శ్మశానవాటికల నిర్మాణం వంటి కార్యక్రమాలు ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు అక్కల వెంకట్రామిరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, మండల తెలుగుయువత అధ్యక్షుడు సయ్యద్‌జబ్బార్, బెల్లంకొండ వైస్ సర్పంచ్ సయ్యద్‌జాని, మైనార్టీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్‌హసాన్, డాక్టర్ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై ఫిర్యాదు

పిడుగురాళ్లరూరల్: స్థానిక పిల్లుట్ల రోడ్డులోని ఎస్సీ హాస్టల్‌లో అవుట్‌సోర్సింగ్ విధానంలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న వరలక్ష్మి హాస్టల్ వార్డెన్‌పై మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరలక్ష్మి అనే తెలుగు ఉపాధ్యాయురాలిని అదే హాస్టల్‌లో పనిచేసే వార్డెన్, వంటమనిషి కలిసి బెదిరిస్తున్నారు. విద్యార్థులతో మరుగుదొడ్లు శుభ్రం చేయించవద్దని చెప్పినందుకు తనపై కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. బయటి వ్యక్తులకు హాస్టల్‌లోని గదులివ్వడంతో వారు అక్కడే భోజనం, స్నానం చేస్తున్నారని, లుంగీలు కట్టుకొని స్కూల్ టైంలో తిరుగున్నారని, అలా వద్దని చెప్పినందుకు బెదిరింపులకు పాల్పడుతున్నారని వరలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేటి కార్యక్రమాలు

● ప్రభుత్వం పేదల తీర్థయాత్ర కోసం ఏర్పాటు చేసిన 4 బస్సులను ఉదయం కారంపూడిలోని వీర్ల దేవాలయం వద్ద నుంచి బయలుదేరతాయని చెన్నకేశవ దేవస్థాన కార్యనిర్వహణాధికారి సీహెచ్ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

● ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై కారంపూడి పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ జరుగుతుందని హౌసింగ్ ఏఈ జె కోటయ్య తెలిపారు.

పిడుగురాళ్ల కూరగాయల ధరలు (రూ.) 1 కిలో

టమోటా: 40, వంగ: 35, బెండ: 30, దొండ: 20, క్యారెట్: 60, క్యాబేజి: 20, దోస: 20, పచ్చిమిర్చి: 60, బంగాళదుంప: 20, చిక్కుళ్లు: 60, గోరుచిక్కుళ్లు: 30, బీట్‌రూట్: 40, బీర: 25, మునగ (1): 6, ఆకు కూర కట్ట: 5.

సినిమా గైడ్

అశ్వని డీలక్స్	: ఫిదా
జయలక్ష్మీ	: నక్షత్రం
గంగామహల్	: గౌతమ్‌నందా

గృహ నిర్మాణాలకు గ్రామసభలు

ఆఫీసర్స్ వాయిస్



జె.కోటయ్య, హౌసింగ్ ఏఈ

ప్రభుత్వం పేదల అభ్యున్నతికి ఎన్టీఆర్ గృహాలను మంజూరు చేసింది. ఆ గృహాలు నిర్మించుకోవడంలో లబ్ధిదారులు అవలంబిచాల్సిన పద్ధతులను గ్రామసభల ద్వారా తెలియజేస్తున్నాం. ప్రతి గ్రామంలో గృహ నిర్మాణ కార్యక్రమ సభలు ఏర్పాటుచేశాం. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ జాబ్‌కార్డు తీసుకోవాలి. దాని వలన ఉపాధిహామీ పథకం ద్వారా అదనంగా నిధులు లబ్ధిదారులకు చేకూరుతాయి. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి.
(కారంపూడి)

ముగిసిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

పిడుగురాళ్లరూరల్, మాచవరం: పిడుగురాళ్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 14రోజులుగా, మాచవరం తహసీల్దారు కార్యాలయం వద్ద 12 రోజులుగా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకుల రిలే దీక్షలు మంగళవారంతో ముగిశాయి. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయాలకు ర్యాలీగా వెళ్లి ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి హామీ ఇచ్చిన టీడీపీ, బీజేపీ పార్టీలు మాట నెరవేర్చుకోవాలని కోరుతూ తహసీల్దారు ఫణీంద్రబాబుకు, డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు డేగల అబ్రహాం, ఉపాధ్యక్షులు మీసాలబాబు, పట్టణాధ్యక్షులు కుక్కమూడి జార్జ్, ప్రధాన కార్యదర్శి రామాఇజ్రాయల్, టి. హనుమయ్య, టి. మాణిక్యరావు, బి. ఆనందరావు, ఎం, ఇజ్రాయల్, ఎస్‌నాగేశ్వరరావు, కె. యేసుదానం, బి. సుందరావు, డి. వెంకయ్య, బాబి, అంకారావు, కె.పుల్లారావు, వేండూరి సాంబయ్య, పోదూరి జగన్, లాజర్ తదితరులున్నారు.

నేడు ఎమ్మెల్యే శ్రీధర్ రాక

బెల్లంకొండ: పెదకూరపాడు ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివారెడ్డి బెల్లంకొండ మండలంలోని చండ్రాజుపాలెం గ్రామానికి బుధవారం ఉదయం గం.11లకు రానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు.

నాగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో వైద్యశిబిరం

మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు బెల్లంకొండ ఆయుర్వేద వైద్యుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. వానాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తుగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవికాదు) సమస్యలు ఉన్నాయా? ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం : ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య
ఫోన్ నెంబర్ : 9908622915



కారంపూడిలోని గిరిజన తండా సమీప పత్తిచేలో కలుపు తీస్తున్న కూలీలు, దాచేపల్లిలో పచ్చగా కళకళలాడుతున్న పత్తి చేను

వర్షంతో ఊరట

- మెట్ట పంటలకు జీవం ● వ్యవసాయ పనుల్లో రైతులు
- కారంపూడి మండలంలో మూడు రోజుల్లో 16మి.మీ వర్షపాతం నమోదు


(కారంపూడి, దాచేపల్లి)

మూడు రోజులుగా పడుతున్న వానతో రైతులకు ఊరట లభించింది. మెట్టపంటలన్నీ ఊపిరి పోసుకున్నాయి. కారంపూడి మండలంలోని 15 పంచాయితీల పరిధిలో సుమారు 10వేల హెక్టార్లలో పత్తి, వెయ్యి హెక్టార్లలో కంది, మరో 1200ల హెక్టార్లలో జూట్, వెయ్యి ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. తొలకరి వర్షాలు సకాలంలో కురిసిన అనంతరం కొంత వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఆందోళనకు గురైన రైతులకు ప్రస్తుతం కురిసిన వాన ఊరటనిచ్చింది. ఆదివారం 5మి.మీ., సోమవారం 5.2మి.మీ., మంగళవారం 6.2మి.మీ.ల వర్షపాతం నమోదైంది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పేటసన్నెగండ్ల, చింతపల్లి గ్రామాల పరిధిలో జూట్ ఎక్కువగా సాగుచేస్తున్నారు. కంది, మినుము, మొక్కజొన్న, తదితర పంటల సాగుపై ఈ ఏడాది రైతులు దృష్టి సారించారు. సాగునీటి చెరువులకింద గత ఏడాది 25వేల ఎకరాల్లో పంటలువేయగా, ఈ ఏడాదీ అదే స్థాయిలో సాగుచేస్తున్నారు.

దాచేపల్లిలో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా పడుతున్న వాన రైతులకు ఊరటనిచ్చింది. ఎద్దుల వాగులోకి నీరు చేరింది. రెండేళ్లుగా సాగర్ జలాలు రాకపోవడంతో పల్నాడులోని రైతులు వరి సాగుకు విరామం ప్రకటించారు. వాననే నమ్ముకొని వాణిజ్య పంటలు సాగుచేశారు. ప్రకృతి కరుణిస్తే ఈ ఏడాదన్నా సాగుచేసుకుంటామని, తిండికి గింజలన్నా ఉంటాయని రైతులు అంటున్నారు.

పంటలకు జీవం



మూడు రోజులుగా పడుతున్న వాన పత్తి, కంది, మిర్చి తదితర వాణిజ్య పంటలకు జీవం పోసింది. దీంతో పంటలపై ఆశ చిగురించింది.

- అంజయ్య, రైతు

సకాలంలో పడింది



ఇటీవల వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రస్తుతం వాన సకాలంలో పడడంతో ఊరటకలిగింది. వరి సాగుకు భూములు పదునులోకి వచ్చాయి.

- బొమ్మిన శేషగిరి, రైతు

ఎస్సీ కార్పొరేషన్ భూముల పరిశీలన

రామాపురం (దాచేపల్లి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూముల పంపిణీ చేసేందుకు గురజాల ఆర్డీవో మురళి మంగళవారం పంటపొలాలను పరిశీలించారు. మండలంలోని రామాపురం రైతులతో మాట్లాడారు. రామాపురంలో 50 ఎకరాల భూమి పంపిణీకి అధికారులు భూములను పరిశీలిస్తున్నారు. ఆర్డీవోతోపాటు తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, యార్డు మాజీ చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి, పి.చిట్టి, ఎంపీటీసీ పాపమ్మ, యాకోబు, ఊట్ల వెంకటేశ్వర్లు, బి.రామిరెడ్డి, ఎ.సైదారెడ్డి, పరిమి సైదులు, నేలపాటి నాగేశ్వరరావు, ఆర్‌ఐ అక్కమ్మరావు, రెవెన్యూ కార్యదర్శి రామకృష్ణ తదితరులున్నారు.


రామాపురంలో పంట పొలాలను పరిశీలిస్తున్న గురజాల ఆర్డీవో మురళి, తదితరులు

ఆన్‌లైన్ సర్వేలోకి సిమెంట్ ఫ్యాక్టరీలు

తంగెడ (దాచేపల్లి) : ఆన్‌లైన్ సర్వేలోకి ఇళ్లతోపాటు సిమెంట్ ఫ్యాక్టరీలూ చేరుతున్నాయి. మంగళవారం మండలంలోని తంగెడలోని భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలోని కాలనీలు, ఇతర రేకుల గదులు, ఫ్యాక్టరీ యూనిట్ నివాస ప్రాంతాలను అధికారులు డిజిటలైజేషన్‌లో నమోదు చేశారు. నడికూడిలోని ముగ్గు, రైస్ మిల్లులు, చిన్న చిన్న వ్యాపార సముదాయలను నమోదు చేశారు. ప్రతి వ్యక్తి ఆస్తుల వివరాలు ఆధార్ నెంబర్‌కు జతపరచడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం నుంచి తమకు వస్తున్న పథకాలు, సబ్సిడీలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌కు గండిపడుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ సతీష్, జిల్లా మాస్టర్ ట్రైనర్ సురేష్, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర రత్నం, ముక్కంటి హాజరయ్యారు.

15కల్లా మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి : ఎంపీడీవో

మాచవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 15వ తేదీకల్లా మరుగుదొడ్డి నిర్మాణాలు పూర్తిచేసేలా ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాంబాబు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మరుగుదొడ్డి నిర్మాణాలు, ఉపాధిహామీపై సమీక్షా సమావేశం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సుమారు 2500 మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తికావచ్చాయన్నారు. అంతేకాకుండా, ఉపాధిహామీ పనులు కావాల్సినవారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పని కల్పించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఎస్‌వీఆర్ శేషగిరిరావు, ఏఈలు సురేష్, రాము, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవో నాగశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం : తహసీల్దార్

దాచేపల్లి: అర్హత కలిగినవారు రేషన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు మంగళవారం తెలిపారు. మండలంలో ఉన్న పెదగార్లపాడులోని 30 నెంబర్ రేషన్ షాపునకు బీసీలు, 31వ నెంబర్ షాపునకు ఎస్సీలు, పొందుగుల గ్రామ శివారు శ్రీనివాసపురంలో నూతనంగా ఏర్పాటుచేసిన రేషన్ దుకాణానికి ఓసీల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆగస్టు 2017లోపు దరఖాస్తుదారులకు 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయసు ఉండాలని తెలిపారు. దరఖాస్తులకు చివరి గడువు తేదీ ఈ నెల 19గా ప్రకటించారు.

విద్యుత్ మోటార్ అందజేత

దాచేపల్లి: శివాలయానికి వస్తున్న భక్తులకు నీటి వసతి కల్పించాలన్న ఉద్దేశంతో మంచినీటి బోరుకు విద్యుత్ మోటార్‌ను మంగళవారం అందజేశారు. నడికూడి గ్రామ పంచాయతీ పరిధిలోని మన్సూర్‌షాపేట భవానీశంకర్ ఆలయానికి నారాయణపురంలోని నోబుల్ కాలేజీ ఏవో పయ్యావుల శ్రీనివాసరావు, పుష్ప దంపతులు మోటార్ అందజేశారు. పదహారు వేల రూపాయలు విలువ కల్గిన మోటార్‌తోపాటుగా, ఇతర సామగ్రిని ఇచ్చినట్లు తెలిపారు. ఏళ్లతరబడి ఉన్న భక్తుల ఇబ్బంది తొలగడంతో శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

చిన్నారులకు మీజిల్స్-రూబెల్లా నివారణ టీకా వేయించాలి

పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష

మాచవరం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాను సారం మాచవరం మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల విద్యార్థులకు మీజిల్స్-రూబెల్లా నివారణ టీకాలు వేయనున్నట్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి అనూష తెలిపారు. మంగళవారం పిన్నెల్లి ప్రాథమిక పాఠశాలలో టీకాల కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులందరికీ ఈ టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 8వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆమె వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కారంపూడి: మండలంలోని చింతపల్లి, చినకొదమగుండ్ల, పెద కొదమగుండ్ల గ్రామాల్లో 620 మంది విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. గాదెవారిపల్లె పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ప్రియాంక, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చింతపల్లిలోని కాకతీయ ప్రైవేటు పాఠశాలల్లో, మండల పరిషత్ పాఠశాలలో, అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో ఈ వ్యాక్సిన్ వేశారు.


మాచవరం మండలం పిన్నెల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

పూర్తికాలపు వైద్యులు, ఉద్యోగులను నియమించండి

డీఎంహెచ్‌వోని కోరిన టీడీపీ నేతలు


డీఎంహెచ్‌వో రెడ్డి శ్యామలకు వినతిపత్రం అందజేస్తున్న పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ లింగయ్య, ఎంపీపీ నాగుల్‌నాయక్ తదితరులు

కారంపూడి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తికాలపు వైద్యులు లేక ఇన్‌చార్జీల పాలనలోనే కొనసాగుతోందని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ముక్కపాటి లింగయ్య, ఎంపీపీ రామావత్ నాగుల్‌నాయక్, గుంటూరు డీఎంహెచ్‌వో రెడ్డి శ్యామలను మంగళవారం కలసి వివరించారు. ప్రస్తుతం వైద్యాధికారి ముటుకూరు నుంచి, మహిళా వైద్యురాలు గాదెవారిపల్లి నుంచి రావాల్సి వస్తున్నదని తెలిపారు. ఇటీవల బదిలీల్లో ఫార్మాసిస్టు వెళ్లిపోవడంతో మెడికల్ స్టోర్ ఇన్‌చార్జి బాధ్యతలను ఏఎన్‌ఎంలే చూడాల్సి వస్తున్నదన్నారు. అదనంగా మరో స్టాఫ్‌నర్సు కావాలన్నారు. వైద్యశాలను పది పడకలకు పెంచాలని కోరారు. ఆ మేరకు ఆమెకు వినతిపత్రం అందజేసినట్లు టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఎంపీ రాయపాటి సాంబ శివరావు నిధులతో వైద్యశాల ఆవరణలో బోరు వేయిస్తామని చైర్మన్ లింగయ్య తెలిపారు. డీఎంహెచ్‌వోని కలిసిన వారిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ గంగారావు, ఒప్పిచర్ల టీడీపీ నేత సత్యనారాయణ, తదితరులున్నారు.

పత్తిలో తెగుళ్ల నివారణకు చర్యలు

- వ్యవసాయ అధికారుల సూచన

మాచవరం, కారంపూడి: పత్తిపంటలో పిండినల్లి, తామర, గులాబిరంగు పురుగు ఆశించాయని, నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి కృష్ణయ్య, విస్తరణాధికారి షేక్ ఆరిఫ్ అన్నారు. వారు మంగళవారం మాచవరం మండలంలోని వేమవరం, వెల్లంపల్లి, కారంపూడి మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించి, రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. పిండినల్లి నివారణకు క్యూరాక్రాన్ మందు ఎకరానికి 400ల మిల్లీలీటర్లు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. తామరపురుగు నివారణకు పిప్రోనిల్ రెండు మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. నేలలో నిల్వఉన్న భాస్వరాన్ని కరిగించుకోవడానికి ఎకరానికి పీఎస్‌బి అరలీటరు మందును భూమిపై చల్లాలన్నారు. జూట్‌పంట సాగుపై రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

కార్యక్రమాల్లో ఉప ఎంపీపీ చావా వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ వల్లెపు ఏడుకొండలు, మరో విస్తరణాధికారి షేక్ సైదా, సర్పంచులు షేక్ మాబూసుభాని, కె. నాగరాజు, సామ్రాజ్యం, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఆనందరావు, ఏఈవో మణికంఠ, ఎంపీఈవో కృష్ణవేణి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సినీ, రాజకీయ, న్యాయ, ఉన్నత విద్యా రంగాల వారికి ఆర్థికంగా అనుకూలిస్తుంది. ప్రియతములకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ప్రయాణాలు, చర్చలు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బంధు, మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ప్రదర్శనలు, సభలకు అనుకూలం. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి గురించి ఆలోచిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

మిథునరాశి:(మే21-జూన్21): పెద్దలతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. మ్యూచ్యువల్ ఫండ్స్, బ్యాంకు లావాదేవీలు లాభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలపై స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. ఆత్మావలోకనం చేసుకునేందుకు తగిన సమయం.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సమావేశాలు, బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులతో అనుబంధం ఏర్పడుతుంది.భాగస్వామి గురించి ఆలోచిస్తారు. కొత్త పరిచయాలు లక్ష్య సాధనకు తోడ్పడతాయి.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆస్పత్రులు సందర్శిస్తారు. వైద్యం, హోటల్, రిటైల్ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఆహార నియమాలు పాటిస్తారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ప్రముఖులతో వేడుకల్లో పాల్గొంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక విషయాల్లో సంకల్పం నెరవేరుతుంది. చిట్‌ఫండ్‌లు, డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బంధుమిత్రుల కలయికతో ఇంట్లో సందడిగా ఉంటుంది. ఇంటికి అవసరమైన వస్తువుల రవాణాకు అనుకూలం. బదిలీల విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యం సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిరకాల మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సన్నిహితుల స్టేషనరీ, రవాణా, బోధన, ఏజెన్సీ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామ్యాలు లాభిస్తాయి. స్నేహ పరిచయాల ఆధారంగా ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల కోసం విలువైన వస్తువుల కొనుగోలు చేస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): విందు, వినోదాలతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ సంస్థలు, పరిశ్రమలు, వైద్య రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొత్త ప్రాజెక్టులు ప్రారంభానికి అనుకూల సమయం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

గన్నవరం విమాన సమాచారం

ఎయిర్ పోర్టు ఫోన్ నెంబర్ : 0866- 2846729

- **హైదరాబాద్** : ఉదయం 9:35, సాయంత్రం 5:20, 5:35, రాత్రి 9:55 (ప్రతి రోజు), మధ్యాహ్నం 1:20 (బుధవారం మినహా)
- **విశాఖపట్నం** : ఉదయం 10:55 (బుధవారం మినహా), మధ్యాహ్నం 3:35 (బుధవారం మాత్రమే)
- **బెంగళూరు** : ఉదయం 7:45, రాత్రి 8:00 (ప్రతిరోజు), మధ్యాహ్నం 2:00 (మంగళవారం మినహా)
- **ఢిల్లీ** : ఉదయం 9:05, సాయంత్రం 5:20 (హైదరాబాద్ మీదుగా), రాత్రి 8:40 (ప్రతిరోజు)
- **చెన్నై** : ఉదయం 7:55, సాయంత్రం 5:20 (ప్రతిరోజు)
- **తిరుపతి** : ఉదయం 7:55 (బుధవారం మినహా)

● వర్సిటీ సమాచారం

సమ్మిళిత అభివృద్ధి సాధనే ఆర్‌బీఐ లక్ష్యం

ఏఎన్‌యూ: దేశంలో సమ్మిళిత అభివృద్ధి సాధించడమే రిజర్వు బ్యాంకు లక్ష్యమని రిజర్వుబ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.బాలసుబ్రహ్మణ్యన్ అన్నారు. మంగళవారం వాణిజ్య భవన్‌లో జరిగిన ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలో అట్టడుగు ప్రజానీకానికి కూడా బ్యాంకు రుణాలు, పథకాలు అందినప్పుడే నిజమైన దేశాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. ఈ దిశలో రిజర్వు బ్యాంకు నేతృత్వంలో ఎన్నో సంస్కరణలు చేపట్టాయని, వాటిని చిన్న పరిశ్రమలు, చిన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నూర్‌బాషా అబ్దుల్ ప్రసంగిస్తూ బ్యాంకుల రుణాలు ధనిక, పారిశ్రామిక వర్గానికి దక్కినంతగా, అణగారిన వర్గాలకు చేరువ కాలేదన్నారు. కార్యక్రమంలో రిజర్వు బ్యాంక్ అధికార్లు వి.రమణమూర్తి, పి.సావిత్రి, ఆంధ్రాబ్యాంక్ లీడ్ మేనేజర్ సుదర్శనరావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వర్సిటీ బంద్‌కు విద్యార్థి సంఘాల పిలుపు

ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిరక్షణ కోసం విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ పిలుపు మేరకు ఈనెల 10న వర్సిటీ బంద్‌ను పాటిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌వో, పీడీఎస్‌యూ ఏఎన్‌యూ కమిటీల నాయకులు తెలిపారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను మంగళవారం ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ బంద్‌ను విజయవంతం చేయాలని వారు కోరారు. అనంతరం బంద్ నోటీస్‌ను వైస్‌చాన్సలర్ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్‌కు అందజేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కేవీ రమణ, ఎం.కిరణ్, కె.సురేఖ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మరిన్ని సదుపాయాలు

విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు మరిన్ని సదుపాయాలను ప్రభుత్వ సహకారంతో కల్పిస్తున్నట్లు వైసచాన్సలర్ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఏపీ బీసీ ఫెడరేషన్ ఎండీ నాగభూషణ్‌తో చర్చించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు వర్సిటీలో లేని సదుపాయాలు వాషింగ్, హెయిర్ కటింగ్ సెలూన్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. తద్వారా సకల సదుపాయాలు విద్యార్థులు వర్సిటీ ప్రాంగణాన్ని వినియోగించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

ఆంధ్రజ్యోతి, గుంటూరు: సెలవుల రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు రైల్వే సీనియర్ డీసీఎం కె.ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబర్ 07452 కాచీగూడ - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 10, 12, 14 తేదీల్లో సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 12.45 గంటలకు గుంటూరు వచ్చి మరుసటి రోజు వేకువజామున 5.40కి కాకినాడ టౌన్ చేరుకొంటుంది. నెంబర్ 07453 కాకినాడ టౌన్ - కాచీగూడ ప్రత్యేక రైలు ఈ నెల 11, 13 తేదీల్లో సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరి గుంటూరుకు రాత్రి 11గంటలకు వచ్చి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, మల్కాజ్‌గిరి మీదుగా మరుసటి రోజు వేకువజామున 5 గంటలకు కాచిగూడ చేరుకొంటుంది. నెంబర్ 07457 కాకినాడ టౌన్ - కాచిగూడ ప్రత్యేక రైలు ఈ నెల 15వ తేదీన సాయంత్రం 6 గంటలకు బయలుదేరి గుంటూరుకు అర్ధరాత్రి 12.35కు వచ్చి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు కాచిగూడ చేరుకొంటుంది. నెంబర్ 07075 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5.55 గంటలకు బయలుదేరి గుంటూరుకు రాత్రి 11.20 గంటలకు వచ్చి మరుసటి రోజు వేకువజామున 5.50 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నెంబర్ 07076 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 12వ తేదీ రాత్రి 7.40 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.05 గంటలకు గుంటూరు వచ్చి మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు సికింద్రాబాద్ చేరుకొంటుంది. ఈ రైళ్లలో ఏసీ టూ టైర్, రెండు త్రీ టైర్, తొమ్మిది స్లీపర్ క్లాస్ కోచ్‌లు, ఐదు జనరల్ భోగీలు ఉంటాయని సీనియర్ డీసీఎం ఉమామహేశ్వరరావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి

బ్రాయిలర్ బర్డ్	83.00,90.00,100.00
చికెన్ విత్ స్కిన్	160.00
చికెన్ స్కిన్‌లెస్	170.00

బ్రాయిలర్ ధరలు

వెన్‌కాబ్

రైతు ధర	80.00
రిటైల్ లైవ్	94.00
విత్‌స్కిన్	132.00
స్కిన్‌లెస్	155.00

జిల్లాలో నేటి వాతావరణం

గుంటూరు : జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు ఈ విధంగా ఉండవచ్చు. గుంటూరులో పగలు అత్యధికంగా 34 డిగ్రీల సెల్సియస్, రాత్రి అత్యల్పంగా 27 డిగ్రీల సెల్సియస్. జిల్లాలో కొన్ని ముఖ్య ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు. జంగమహేశ్వరపురం 35-27, తెనాలి 34-27, మాచర్ల 35-27, బాపట్ల 34-27, నరసరావుపేట 34-27 డిగ్రీల సెల్సియస్ ఉండవచ్చు.

ఆర్టీసీ సమాచారం

గుంటూరు : ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి బుధవారం రాత్రి బయలుదేరే దూరప్రాంత సర్వీసుల్లో సీట్ల ఖాళీల వివరాలను ఆర్ఎం శ్రీహరి తెలిపారు. రిజర్వేషన్ కోసం 99590 61597లో సంప్రదించాలని కోరారు. రాత్రి 11.00- గుంటూరు - కేపీహెచ్‌బీ- గరుడ(ఏసీ) 42, 10.50- గుంటూరు - కేపీహెచ్‌బీ-అమరావతి (ఏసీ)- 34, 10.15- గుంటూరు- కేపీహెచ్‌బీ- ఇంద్ర (ఏసీ)- 34, 9.45- గుంటూరు- కేపీహెచ్‌బీ - ఇంద్ర(ఏసీ)- 34, 8.30 - గుంటూరు -చెన్నై - సూపర్ లగ్జరీ - 31 ఖాళీలు ఉన్నాయి.

సాగర్‌లో 500.40 అడుగుల నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటి మట్టం మంగళవారం నాటికి 500.40 అడుగులు ఉంది. ఇది 115.94 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 327 క్యూసెక్కులు, మొత్తం ఔట్ ఫ్లో వాటర్‌గా 621 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నీటి మట్టం 778.10 అడుగులు ఉంది. ఇది 19.65 టీఎంసీలకు సమానం.

సత్రశాల టెయిల్ పాండ్ సమాచారం

రెంటచింతల: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో 4.76 టీఎంసీల నీరు నిల్వ వున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ శేషారెడ్డి తెలిపారు. దిగువకు నీటి విడుదలను నిలిపివేశామన్నారు.

పులిచింతలలో 2.11 టీఎంసీలు..

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 2.11 టిఎంసీల నీటినిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు డీఈఈ రఘునాథ్ తెలిపారు. స్లూయిజ్‌ల ద్వారా 1083 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నారు.

పశ్చిమ డెల్టాకు 3622 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల: కృష్ణాపశ్చిమ డెల్టాకు విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి 3622 క్యూసెక్కులనీరు మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద ప్రస్తుతం 10.3అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 120 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 454 క్యూసెక్కుల నీరు, పశ్చిమ కాల్వకు 273 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నం కాల్వకు 382 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 848 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 1020 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

పసుపు విక్రయాలు నిల్

దుగ్గిరాల: స్థానిక పసుపు మార్కెట్ యార్డుకు రైతులెవ్వరూ రాకపోవడంతో మంగళవారం ఈ-నామ్ ద్వారా పసుపు విక్రయాలు జరుగలేదు.

57,367 టిక్కీల విక్రయం

ఆంధ్రజ్యోతి, గుంటూరు: గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి మంగళవారం 55,687 మిర్చి టిక్కీలను రైతులు విక్రయానికి తీసుకొచ్చినట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎం.దివాకర్ తెలిపారు. యార్డులో నిల్వవున్న వాటితో కలుపుకొని 57,367 టిక్కీలు విక్రయం జరగగా, ఇంకా 25,799 టిక్కీలు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. యార్డులో మంగళవారం నాన్ ఏసీ కామన్ వెరైటీ రకం క్వింటాల్ ధర కనిష్టంగా రూ. 1,300, గరిష్టంగా రూ. 7,800, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ రకం రూ. 2,000, రూ. 10,800, తెల్లకాయలు రూ. 800, రూ. 4,900, ఏసీ కామన్ వెరైటీ రూ. 2,500, రూ. 8,200, ఏసీ స్పెషల్ వెరైటీ రూ. 3,000, రూ. 11,500, ఏసీ తెల్లకాయలు రూ. 1,800, రూ. 4,500 ధర లభించినట్లు తెలిపారు.

రాయపూడి మార్కెట్‌లో నిమ్మ ధరలు

తుళ్ళూరు: రాయపూడి నిమ్మకాయల మార్కెట్‌లో మంగళవారం జరిగిన లావాదేవీలు ఈ విధంగా ఉన్నాయి. పచ్చికాయ లావు రకం టిక్కీ రూ. 500 నుంచి రూ.550, పండు కాయ, సన్న రకం రూ. 300 నుంచి రూ. 400 ధరలు పలికాయి.

పదేళ్లకు..



పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌లో ఆధునికీకరణ పనులు

- పూర్తి కావచ్చిన సాగర్ కాల్వల పనులు
- రూ.1045.67 కోట్లు విలువైన పనులు పూర్తి
- మరో నెల రోజుల్లో నూరు శాతం పనులు
- సాగర్ ఆధునికీకరణ ప్రాజెక్టు ముగిసినట్లే

నరసరావుపేట: సాగర్ కుడి కాలువ పరిధిలో ప్రధాన, బ్రాంచ్ కెనాల్స్, మేజర్లు, మైనర్లు అధ్వానస్థితిలో ఉన్న నేపథ్యంలో 2007లో ప్రపంచ బ్యాంక్ నిధులతో ఆధునికీకరణ ప్రాజెక్టును ప్రతిష్మాత్మకంగా ప్రారంభించారు. ఏడేళ్ళ పాటు పనులు పూర్తి చేయటంలో తీవ్ర జాప్యం జరిగింది. మూడేళ్లుగా సాగర్ కాలువలకు నీరు విడుదల కాకపోవటం పనులు పూర్తికి కలసి వచ్చింది. ఎట్టకేలకు ఆధునికీకరణ ప్రాజెక్టు పూర్తి కావస్తుండటంతో అధ్వానంగా ఉన్న కాలువలు అభివృద్ధి చెందాయి. ప్రధాన కాలువల్లో లైనింగ్ పనులు పూర్తి చేశారు. డ్రాపులు, నీటి విడుదల కట్టడాలు, బ్రిడ్జిలు, షట్టర్ల ఏర్పాటు, కాలువల్లో పూడిక తీత, కట్టలను పటిష్ట పరచటం వంటి పనులను ఆధునికీకరణలో నిర్వహించారు. ప్రధాన కాలువ పరిధిలో పనులను ఎనిమిది ప్యాకేజీలలో నిర్మించారు. ఏడు ప్యాకేజీలలో నూరు శాతం పూర్తయ్యాయి. చేజర్ల ప్రాంతంలో ప్రధాన కాలువపై 11వ నెంబర్ ప్యాకేజీలో జరుగుతున్న పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. ఈ నెలాఖరుకు ఈ పనులు పూర్తవుతాయని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్రాంచ్ కెనాల్స్‌ను మూడు ప్యాకేజీలుగా విభజించి పనులు నిర్వహించారు. వీటిలో రెండు ప్యాకేజీలలో నూరు శాతం పనులు పూర్తయ్యాయి. పెదనందిపాడు, అద్దంకి బ్రాంచ్ కెనాల్స్ పరిధిలో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 91 శాతం పనులు పూర్తయ్యాయి. మేజర్ కాలువల పై డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో ప్యాకేజీలుగా రూపొందించి 29 డీసీలలో రూ.284.66 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. 93.20 శాతం పనులు పూర్తయ్యాయి. నాలుగు డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో మాత్రమే పనులు జరుగుతున్నాయి. మిగిలిన డీసీల పరిధిలో పనులు పూర్తయ్యాయి. సత్తెనపల్లి, లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో ఈ పనులు పూర్తి కావాల్సి వుంది. నీటి వినియోగ దారుల సంఘాల పరిధిలో మైనర్ కాలువలను ఆధునీకరించారు. 73 ప్యాకేజీలలో ఈ కాలువల పై పనులు చేపట్టారు. రూ.330.44 కోట్ల వ్యయంతో మైనర్ కాలువలపై పనులు చేపట్టగా 94.51 శాతం పనులు పూర్తయ్యాయి. 65 ప్యాకేజీలలో పనులు పూర్తి కాగా ఎనిమిది ప్యాకేజీలలో పనులు చివరి దశకు చేరుకున్నాయి. కాలువలకు ఇప్పట్లో నీరు విడుదలయ్యే పరిస్థితులు లేక పోవటంతో మిగిలిన పది శాతం పనులు పూర్తి చేసేందుకు అనుకూల వాతావరణం నెలకుంది. ఆధునికీకరణ ప్రాజెక్టులో భాగంగా కార్యాలయాలు, అతిథి గృహాల నిర్మాణాలు కూడా రూ.24.88 కోట్ల వ్యయంతో చేపట్టారు. 16 పనులు చేపట్టగా 15 పూర్తయ్యాయని నీటి పారుదల శాఖ అధికారులు వివరించారు.

ఆధునికీకరణకు జీఎస్టీ ఎఫెక్ట్

ఆధునికీకరణ పనుల బిల్లుల చెల్లింపులపై జీఎస్టీ ప్రభావం నెలకుంది. దీంతో రెండు నెలలుగా కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు నిలిచి పోయింది. జీఎస్టీ అమల్లోకి రాక ముందు పూర్తి చేసిన బిల్లులకు మాత్రమే పాత విధానం అమలు చేయాలని ప్రభుత్వం సూచిస్తున్నది. దీని ప్రకారం అయితే ఆధునికీకరణ నిధులు జీఎస్టీకి కొంతఎక్కువగా చెల్లించాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. జీఎస్టీపై కూడా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు నీటి పారుదల శాఖకు అందలేదు. ఇది తేలే వరకు ఆధునికీకరణ బిల్లులు చెల్లించే పరిస్థితులు లేవని అధికారులు తెలిపారు.

ఇంకా నిధులు విడుదలయ్యే అవకాశం

ఆధునికీకరణ ప్రాజెక్టును ప్రపంచ బ్యాంక్ 2007లో మంజూరు చేసింది. అప్పుడే పనులకు సంబంధించిన అంచనాలను రూపొందించారు. ఆ సమయంలో డాలర్ రేటు సుమారు రూ.45 ఉంది. ఆ మేరకు ఆధునికీకరణ ప్రాజెక్టుకు నిధులను రుణంగా అందించింది. ప్రస్తుతం డాలర్ రేటు రూ.66కు పెరిగింది. డాలర్ రేటు పెరుగుదలకు అనుగుణంగా ప్రపంచ బ్యాంక్ నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఈ అంశాన్ని ప్రభుత్వం బ్యాంక్ ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్ళింది. ఈ నేపథ్యంలో కాలువల అభివృద్ధికి ఇంకా నిధులు విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.



చార్ట్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ, డీఈవో రఘుకుమార్

ఒత్తిడిలేని విద్యతో

విద్యార్థి వికాసం

● ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ

చిలకలూరిపేట : ఒత్తిడి లేని విద్య విద్యార్థి వికాసానికి దోహదపడుతుందని గుంటూరు, కృష్ణా జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ అన్నారు. చిలకలూరిపేట మండలంలోని గోవిందపురం ప్రాథమిక పాఠశాల(ఎల్‌ఈ)లో మంగళవారం ఆనందలహరి నూతన విద్యావిధానాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనిలో భాగంగానే పట్టణాల్లో అంగన్‌వాడీ స్కూళ్లను ప్రీస్కూళ్లుగా మార్చుచేశాన్నారు. ఇక గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా ఈ ఏడాది నుంచి ఆనందలహరి విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బడికి రానంటూ మారంచేసే చిన్నారులను బడివైపు ఆకర్షితులయ్యేలా చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. బొమ్మలు, చిత్రాలు, పరికరాలు, వస్తువులు తదితర వాటితో ఆడుతూ పాడుతూ చదువుకునేందుకు ఈ విధానం దోహదపడుతుందన్నారు. ఈ విధానం విజయవంతమైతే త్వరలోనే అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు. డీఈవో రఘుకుమార్ మాట్లాడుతూ ఆనందలహరి ద్వారా పిల్లలు సులభంగా, ఆనందంగా చదువు నేర్చుకోవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. చిత్తూరు జిల్లా రిషివ్యాలీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రూపొందించిన బోధనాపద్ధతిని ఈ పాఠశాలల్లో అమలు చేస్తామన్నారు.

ఎంఈవో కె.లక్ష్మి మాట్లాడుతూ విద్యకే పరిమితం కాకుండా విద్యార్థుల ఆసక్తినిబట్టి నైపుణ్యాన్ని పెంపొందించేలా ప్రభుత్వం నూతన విద్యాబోధన విధానాలను ప్రవేశపెడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఏఎంవో ప్రభాకర్, ఎస్ఎస్‌టీవో సత్యవాణి, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, మంగాబాయి, ఎంపీటీసీ సభ్యుడు గుత్తా వెంకటేశ్వర్లు, సర్పంచి కాశిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించేవరకు సెలవుల్లేవ్

● జిల్లా కలెక్టర్ శశిధర్ ● మరుగుదొడ్ల నిర్మాణాలపై వీడియోకాన్ఫరెన్స్

గుంటూరు (శ్యామలానగర్): జిల్లాలో చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తక్షణమే పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ కోన శశిధర్ మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లాలోని మండలాల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపడుతున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై కలెక్టర్ సమీక్షించారు. ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ అప్‌లోడ్ చేయాలన్నారు. గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు పనులు చేపడుతున్నట్లుగా కన్ఫర్మేషన్ లేఖలు ఇచ్చారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్ల నిర్మాణాల విషయంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించేవరకు ఎలాంటి సెలవులు మంజూరు చేయబోమని స్పష్టంచేశారు. ఇసుక, మెటీరియల్ నిర్ణీత సమయానికి అందుతున్నాయా లేదా తెలుసుకుని, సమస్యవుంటే జిల్లా అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. కొన్ని మండలాలు లక్ష్యసాధనలో వెనుకబడి ఉండటంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. జిల్లావ్యాప్తంగా నిర్మించిన మరుగుదొడ్లకు జియోటాగింగ్ చేయాలన్నారు. ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకతతో, జవాబు దారీతనంతో పనులు జరగాలన్నారు. కాన్ఫరెన్స్‌లో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ భానుప్రసాద్, డ్వామా పీడీ పులి శ్రీనివాసులు, జడ్పీ సీఈవో ఎస్.వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.



మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ కోన శశిధర్

అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు వర్షం అడ్డంకి

● ఒక వికెట్ నష్టానికి 64 పరుగులు చేసిన కడప

నరసరావుపేట టౌన్ : స్థానిక ఆంధ్రా పబ్లిక్ స్కూల్ ఆవరణ లోని ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రెండోరోజు ఆట ప్రారంభమైంది. అండర్- 16 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో భాగంగా కర్నూలు, కడప జట్ల మధ్య మ్యాచ్ వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైంది. ఓవర్‌నైట్ స్కోరు నాలుగు పరుగులతో ప్రారంభించి టీ విరామ సమయానికి ఒక వికెట్ నష్టానికి కడప జట్టు 64 పరుగులు చేసింది. మరోసారి వర్షం రావటంతో మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. అంపైర్లు మ్యాచ్‌ని ఆపివేశారు. మూడో రోజు ఆట కొనసాగుతుందని చెప్పారు. కడప జట్టులోని కాన్‌లోడి 20 పరుగులు చేయగా వాసుదేవరాజు 14, హరిప్రసాదు 18 పరుగులతో అజేయంగా క్రీజ్‌లో వున్నారు. కర్నూలు జట్టులోని సునీల్‌శంకర్ ఒక వికెట్ సాధించారు. ఏసీఏ కోచ్ వి.కృష్ణారావు అండర్- 16 రాష్ట్ర సెలెక్టర్ కృష్ణమోహన్, జిల్లా సెలెక్టర్ టి.అమరనాథ్, కో-ఆర్డినేటర్ కేవీ పురుషోత్తమరావు మ్యాచ్‌ని పర్యవేక్షించారు.



తలపడుతున్న కర్నూలు, కడప జట్లు

నేటి నుంచి రాష్ట్రస్థాయి బాలల నాటిక పోటీలు

తెనాలి కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, సూపర్‌స్టార్ కృష్ణ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాలల నాటికల పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్థానిక టీబీ రోడ్డులోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్, ఎన్టీఆర్ కళావేదికను ప్రదర్శనలకు సిద్ధంచేశారు. ప్రాంగణంలో స్వాగత ద్వారాలను ఏర్పాటుచేశారు. తొలిరోజు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఆదిత్య కళాపరిషత్, ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్ వారు వేల్పుల నాగేశ్వరరావు రచించిన ఆదిత్య కృష్ణంరాజు దర్శకత్వం వహించిన 'మొక్క' నాటికను ప్రదర్శిస్తారు. ప్రారంభోత్సవ సభలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డి.విజయభాస్కర్, ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ, డీఈవోలు ఎస్.రఘుకుమార్, బి.విజయభాస్కర్, సినీనిర్మాతలు శాఖమూరి మల్లికార్జునరావు, గుమ్మడి రవీంద్ర తదితరులు పాల్గొంటారు. కళాకారులు గోపరాజు రమణ, రావినూతల శ్రీరామమూర్తిలకు సూపర్‌స్టార్ కృష్ణ విశిష్ట వ్యక్తి పురస్కారాలను ప్రదానం చేస్తారు. పి.ప్రకాష్, అక్కల శ్రీరామ్, చెరుకుమల్లి సింగరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, బి.రవి, గౌరీ శంకర్, షేక్ జానీబాషా, కరిముల్లా మాలిక్, తేజస్వీ ప్రఖ్య, టీనా చౌదరిలను సత్కరిస్తారు. ప్రత్యేకంగా బాలల్లో కళాతృష్ణను పెంపొందించేందుకు, సృజనాత్మకతను వెలికితీసేందుకు, రంగస్థల కళలను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఆరాధ్యుల కన్న, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి చెప్పారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.



సిద్ధమైన తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం

భూగర్భ జల డీడీ కార్యాలయం నేడు ప్రారంభం

ఆంధ్రజ్యోతి - గుంటూరు: గుంటూరులోని జలవనరుల శాఖ ప్రాంగణంలో భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యలయ ప్రారంభోత్సవానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హాజరు కానున్నారు. ఇప్పటివరకు రామన్నపేటలోని అద్దె భవనంలో కొనసాగుతున్న భూగర్భ జల శాఖ కార్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఇరిగేషన్ ఆఫీసు ప్రాంగణంలో నూతన భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణం పూర్తి కావడంతో మంత్రి ప్రారంభింప చేయాలని అధికారులు నిర్ణయించారు. మంత్రి ఉమామహేశ్వరరావుతో పాటు జిల్లా మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద్‌బాబు, పశ్చిమ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, ఇతర అధికారులు ఈ కార్యక్రమానికి హాజరౌతారని అధికారులు తెలిపారు. భూగర్భ జల శాఖ కూడా తరలి రానుండటంతో జిల్లాలోని నీటి పారుదల రంగానికి చెందిన అన్ని కార్యాలయాలు ఒక గొడుగు కిందకు రానున్నాయి.

ఖాళీలు భర్తీ చేయరూ...

జలవనరుల శాఖ గుంటూరు సర్కిల్ కార్యాలయం ఖాళీలతో బోసిబోతున్నది. కాలువలకు సాగునీరు విడుదల జరిగిన ప్రస్తుత తరుణంలో అధికారుల పర్యవేక్షణ కీలకం కాగా డజన్‌కు పైగా ఖాళీగా ఉన్న పోస్టులతో ఆ శాఖ సతమతమౌతున్నది. ఉన్న అధికారులకు అదనపు బాధ్యతలు కేటాయించి నెట్టుకొస్తున్నది. రిటైర్‌మెంట్ అయిన అధికారుల స్థానాలను భర్తీ చేయకుండా మిన్నకుండిపోతున్నది. అదేమంటే పదోన్నతుల వివాదం తమ శాఖలో ఉందని, అది పరిష్కారమయ్యేంత వరకు ఈ పరిస్థితి తప్పదంటున్నారు. ఇరిగేషన్ గుంటూరు సర్కిల్ కార్యాలయం పరిధిలో కృష్ణా పశ్చిమ డెల్టా, గుంటూరు ఛానల్, మైనర్ ఇరిగేషన్ ఉన్నాయి. ఒక్క డెల్టాలోనే ఐదు లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. జూన్ 28నే కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో సాగునీరు సక్రమంగా చివరి భూములకు చేరుతుందా, లేదా అన్న పర్యవేక్షణ ఉండాలి. అలానే షట్టర్లు, స్లూయిజ్‌లు, బండ్‌ల రిపేర్లు ఉంటే వాటిని సత్వరం చేపట్టాలి. రైతుల మధ్య వివాదం తలెత్తకుండా నీటి విడుదలలో తగిన చర్యలు తీసుకోవాలి. అయితే ఖాళీగా ఉన్న ఇంజనీర్ల పోస్టులు ఆ శాఖని వెక్కిరిస్తున్నాయి. గుంటూరు సర్కిల్ ఆఫీసులో పరిపాలన వ్యవహారాలు పర్యవేక్షించే డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ పోస్టు గత నెలలో ఖాళీ కాగా ఇప్పటివరకు మరొకరిని నియమించలేదు. సర్కిల్ ఆఫీసులో ఒక డీఈఈ(డిజైన్స్), మరో డీఈఈ(టెక్నికల్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గుంటూరు ఛానల్ డీఈఈ పండా సాంబశివరావు గత నెలలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. రేపల్లెలో నాలుగు జేఈఈ, దుగ్గిరాలలో ఒక డీఈఈ, తెనాలిలో మూడు ఏఈఈ, చీరాల డివిజన్‌లో ఒక డీఈఈ, మూడు జేఈఈ పోస్టులు గత కొన్ని నెలల నుంచి ఖాళీగా ఉంటోన్నాయి. కీలకమైన ఇంజనీరింగ్ పోస్టులు ఖాళీగా ఉండటం ఆ శాఖ పనితీరుపై ప్రభావం చూపుతున్నది. అదనపు బాధ్యతలు సక్రమంగా నిర్వహించలేక ఉన్న అధికారులు సతమతమౌతున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసే విషయమై జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. మంత్రి దేవినేనితో ఈ పోస్టుల ఖాళీలపై దృష్టి సారించాలని అధికారులు ఆశిస్తున్నారు.

కరువుపై.. కమిటీ

- పరిస్థితుల అంచనాకు కేంద్రం ఆదేశాలు
- జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ
- ఈ నెల 10న జరిగే రాష్ట్రకమిటీలో సమీక్ష
- 17 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు

(ఆంధ్రజ్యోతి - గుంటూరు)

రాష్టంలో వర్షాభావం మూలంగా నెలకొన్న కరువు పరిస్థితులను అంచనా వేసేందుకు రాష్ట్ర స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చింది. ఈ ఏడాది ఇప్పటివరకు రైతులకు అవస రం మేరకు వర్షాలు కుదరకపోవటంతో జిల్లాలో పూర్తి స్థాయిలో రైతులు పంటలు సాగు చేయలేకపోయారు. నాగార్జున సాగర్ కుడికాలవ పరిధిలో ఆయకట్టు భూములకు నీరందక బీళ్లుగా మారాయి. దీంతో పల్నాడు ప్రాంతంలో రైతులతో పాటు రైతు కూలీలు కూడా కరువు ప్రభావాన్ని చవి చూడాల్సి వచ్చింది. రాష్ట్రంలో ఖరీఫ్ కష్టాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పరిస్థితులను అంచనా వేసి ఆదుకునేందుకు సంకల్పించింది. రాష్ట్ర స్థాయి కమిటీతో పాటు జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే కమిటీ క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిశీలించి నివేదికలు రూపొందించాల్సి ఉంది. జిల్లాలో దుర్గి, వెల్దుర్తి, మాచవరం, కారంపూడి, నూజెండ్ల, పెదకూరపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట, యడ్లపాడు, ప్రత్తిపాడు, కాకుమాను, చేబ్రోలు, బాపట్ల, కొల్లూరు, భట్టిప్రోలు, గుంటూరు, తాడేపల్లి మండలాల్లో వర్షపాతం తక్కువగా నమోదైంది. రైతులను ఏ విధంగా ఆదుకోవాలి, రైతు కూలీలకు ఏ విధంగా ఉపాధి పనులు కల్పించాలి, తాగునీటి అవసరాలను ఏ విధంగా తీర్చాలి అనే అంశాల ప్రాతిపదికగా జిల్లా స్థాయి కమిటీలు రాష్ట్ర స్థాయి కమిటీకి నివేదికలు అందించనున్నాయి. వీటిని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి కరువు సంక్షోభ నివారణ చర్యలు చేపట్టనున్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడే జిల్లా స్థాయి కమిటీలో సభ్యులుగా జలవనరులశాఖ, ప్రణాళికా విభాగం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, ఉద్యానవన శాఖ, కార్మికశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ, పశు సంవర్ధకశాఖ, పౌరసరఫరాలు, ట్రాన్స్‌కో, రెవెన్యూశాఖల జిల్లా స్థాయి అధికారులు ఉంటారు.

జిల్లాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు: జిల్లాలో మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం నెలకొన్నది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వినియోగానికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి లేకపోవటంతో హఠాత్తుగా అధికారులు విద్యుత్ సరఫరాలో కోతలు విధించారు. అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు పవన విద్యుత్ ఉత్పత్తిలో భారీ వ్యత్యాసం నెలకొందని చెబుతున్నారు. అదే సమయంలో ధర్మల్ పవర్ స్టేషన్‌ల నుంచి కూడా విద్యుత్ ఉత్పత్తిలో వ్యత్యాసం నెలకొంది. దీంతో ఉన్నట్టుండి అనధికార కోతలు విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి తలెత్తినట్లు అధికారులు చెబుతున్నారు. గుంటూరులో పలు ప్రాంతాల్లో సాయంత్రం నుంచే అనధికారిక కోతలు విధించారు. మరో వైపు జిల్లాలోని తెనాలి డివిజన్, నరసరావుపేట డివిజన్‌లలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అనధికారిక కోతలు విధించారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

'క్విట్ ఇండియా' వజ్రోత్సవం

క్విట్ ఇండియా వజ్రోత్సవాన్ని పురస్కరించుకుని చిలకలూరి పేటలోని ఆర్వీఎస్‌సీవీఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దేశభక్తిని చాటారు. మంగళవారం పాఠశాలలో 75సంవత్సరాల క్విట్ ఇండియా అక్షరాల ఆకృతిలో విద్యార్థులు కూర్చొని కార్యక్రమానికే వన్నె తెచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపా ధ్యాయుడు మాట్లాడు తూ స్వాతంత్ర్యోద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం భారత జాతి ని ఏకతాటిపైకి తెచ్చిందన్నారు. ఈ ఉద్యమ స్ఫూర్తితో స్వాతంత్ర్య పోరాటం ఉధృతంగా సాగి తద్వారా బ్రిటిష్‌వారు దేశం విడిచి వెళ్లిపోయారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **- చిలకలూరిపేట**





కారుమబ్బులు కమ్మిన వేళ..

గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. గుంటూరు నగరంలో దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. ఆకాశమంతా కారుమబ్బులు కమ్ముకోవటంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. *- ఫొటో : వి.వి.ఆర్. ఉమామహేశ్వరరావు*

ఆంధ్రజ్యోతి

పోలీసు బడిబాట..!

● రాణాకో పాఠశాల దత్తత ● మౌలిక వసతుల కల్పన
● పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ ● రూరల్ జిల్లా ఎస్పీ సరికొత్త క్రతువు

పిడుగురాళ్ల/పిడుగురాళ్ల రూరల్: ఆలనాపాలన లేక అల్లాడిపోతున్న పాఠశాలకు మహర్దశ పడుతోంది. గుంటూరు రూరల్ జిల్లా కొత్త ఎస్పీ సీహెచ్ వెంకట అప్పలనాయుడు మాటతో జిల్లా పోలీసులు బడిబాట పడుతున్నారు. పోలీసుస్టేషన్‌కు ఒక పాఠశాల వంతున దత్తత తీసుకుంటున్నారు. అక్కడ విద్యార్థుల కోసం పోలీసుల తరపు నుంచి ప్రత్యేక ఏర్పాట్లుచేస్తున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను గుర్తిస్తున్నారు. ముఖ్యంగా మౌలిక వసతులపై శ్రద్ధచూపించి మురికికూపాలుగా ఉన్న బడులకు కొత్త హంగులు దిద్దే ఏర్పాట్లుచేస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో, ఆనందం నిండిన మనస్సుతో విద్యార్థులను ఉంచటమే ధ్యేయంగా ఈ కొత్త క్రతువుకు రూరల్ జిల్లా పోలీస్ బాస్ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా స్వచ్ఛభారత్ నిర్వహించటంతో పాటు, గోడలకు వేసే సున్నాలు గ్రా కూడా పోలీసు అధికారులు పర్యవేక్షిస్తారు. సమస్యలను గుర్తించి స్థానిక స్వపరిపాలన సంస్థల సహకారంతో వాటిని పరిష్కరించే ఏర్పాటు చేస్తారు. పోలీసు దృష్టి ఉండటం వల్ల పాఠశాలలకు (హాస్టల్ కూడా కావచ్చు) ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో మేలుజరుగుతుందనేది ఉన్నతాధికారుల భావన.



పిడుగురాళ్ల ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌వో హనుమంతురావు

150 మంది పిల్లలు... నాలుగే లైట్లు

రూరల్ జిల్లా ఎస్పీ అప్పలనాయుడు చేపట్టిన పోలీసుల బడిబాట ఉపయుక్తమైనదనటానికి ఈ ఉదంతం ఓ ఉదాహరణ. పిడుగురాళ్లలోని తహశీల్దారు కార్యాలయం వెనుక పక్క ఎస్సీ బాలికల వసతి గృహం ఉంది. అక్కడే ఎంఈవో, ఎంపీడీవో కార్యాలయాలు కూడా ఉన్నాయి. పక్కనే ఉన్న పాఠశాలలో 150 మంది విద్యార్థినులు కేవలం నాలుగు ట్యూబ్ లైట్లతో నానా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించలేకపోయారు. ఎస్పీ ఆదేశాలతో పిడుగురాళ్ల ఎస్‌హెచ్‌వో హనుమంతరావు సోమవారం రాత్రి హాస్టల్‌ను సందర్శించారు. 'మీ సమస్యేమిటి' అని విద్యార్థినులను అడిగినప్పుడు వాళ్లు కేవలం నాలుగు ట్యూబ్ లైట్లతో, చాలిచాలని వెలుతురుతో అల్లాడిపోతున్నామని ఆవేదన చెందారు. చదువుకోవటం కూడా చాలా ఇబ్బందిగా ఉందని చెప్పారు. అక్కడ మంచినీళ్లు కూడా అంత మంచివి కాదని బాధపడ్డారు. స్పందించిన హనుమంతరావు ఈ సమస్యలపై వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. బుధవారం నాటికి స్వ చ్ఛమైన మంచినీటిని విద్యార్థినులకు పంపిణీ చేయాలని సూచించారు. మరికొన్ని ట్యూ బ్ లైట్లు ఏర్పాటుచేయాలని అధికారులతో మాట్లాడా రు. పోలీసు అధికారి మాట్లాడటంతో మున్సిపాలిటీ యంత్రాంగంలో చెప్పుకోదగ్గ కదలిక వచ్చింది. లైట్లు, మంచినీరు సమస్య పరిష్కారానికి మార్గం సుగమమైంది. ఆదివారం హాస్టల్‌లో స్వచ్ఛభారత్ నిర్వహిస్తామని ఎస్‌హెచ్‌వో హనుమంతరావు తెలిపారు. విద్యార్థినులకు మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పారు. ఎస్సీ హాస్టల్‌ను పోలీసు స్టేషన్ దత్తత తీసుకుందని, వారి బాగోగులను దగ్గరుండి చూసుకుంటామని ఎస్ఐలు ఆవుల హరిబాబు, రఫీ, రవీంద్ర తెలిపారు.

మన ఇసుక యాప్.. ఎప్పటికో?

● వారం అవుతున్నా గూగుల్ ప్లేస్టోర్‌లో కనిపించని అప్లికేషన్
● బ్లూఫ్రాగ్ టెక్నాలజీస్ పరంగా జాప్యం అంటున్న అధికారవర్గాలు

ఆంధ్రజ్యోతి - గుంటూరు: ఇసుక విధానంలో అక్రమాలు తొలగించి ప్రభుత్వ లక్ష్యం ప్రకారం పారదర్శకంగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుంటూ ప్రకటించిన మన ఇసుక అండ్రాయిడ్ యాప్ రూపకల్పనలో జాప్యం చోటు చేసుకొన్నది. గత శనివారం సాయంత్రం లోపే యాప్ బ్లూఫ్రాగ్ టెక్నాలజీస్ నుంచి తయారౌతుందని అధికారులు ప్రకటించారు. అయితే మంగళవారం సాయంత్రానికి కూడా ఈ యాప్ వినియోగదారులకు అందుబాటులోకి రాలేదు. గూగుల్ ప్లేస్టోర్‌లో ఏ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందో అధికారులు స్పష్టంగా పేర్కొనలేకపోతున్నారు. దీనిపై గత వారంలో అధికార యంత్రాంగంలో కనిపించిన వేడి ప్రస్తుతం కనిపించకపోతుండటంతో ఇసుక ధర యధాతథంగానే కొనసాగుతున్నది. ఈ నెల 10న దొండపాడులో ముఖ్యమంత్రి పర్యటన ఉండటంతో యంత్రాంగం అంతా అక్కడ కేంద్రీకృతమై ఉన్నది. మరోవైపు రానున్న శనివారం నుంచి వరుసగా నాలుగు రోజులు సెలవు దినాలు కావడంతో మన ఇసుక యాప్ వచ్చే బుధవారం లోపు అమలులోకి రావడం సందేహంగా మారింది. వోలా, ఊబర్ క్యాబ్స్ తరహాలో ఇసుకని ఊబరై జేషన్ చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణ యం తీసుకున్నది. దీని వల్ల ఇసుక అవసరమైన ప్రజలు బ్రోకర్లను సంప్రదించా ల్సిన పని లేకుండా చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నది.



ఇసుక కావాల్సిన వారు స్మార్ట్‌ఫోన్ తెరిచి గూగుల్ ప్లేస్టోర్ నుంచి మన ఇసుక యాప్ డౌన్ లోడ్ చేసుకుని లాగిన్ అయితే చాలు. యాప్ ఓపెన్ కాగా నే జీపీఎస్ లోకేషన్ ఆధారంగా సమీపంలో ఇసుక లోడింగ్ అయిన వాహనం కనిపిస్తుంది. రెయిడ్ నొక్కగానే ఇసుక లారీ డ్రైవ ర్ వినియోగదారుడు కోరుకున్న ప్రదేశానికి వచ్చి ఇసుక అన్‌లోడింగ్ చేస్తారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం బోట్స్‌మెన్, ఓపెన్ ఎక్స్‌కవేషన్, పట్టాభూముల్లో మేటల తొలగింపు కేటిగిరీలకు నిర్ణయించిన ధరను వసూలు చేస్తారు. అలానే ఆ ఇసుక ఏ క్వారీ నుంచి తీసుకువచ్చారనేది జీపీఎస్ ద్వారా తెలిసిపోతుంది. ఈ నేపథ్యంలో ఆ రీచ్ నుంచి ఇసుక తీసుకువచ్చినందుకు ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీ చెల్లించి ఇసుకని పొందవచ్చు. ఈ విధానం వల్ల కొంతమేరకు ఏకఛత్రాదిపత్యం తగ్గుతుందని ప్రజలు భావిస్తున్నారు.

ఆండ్రాయిడ్ యాప్ తయారీ బాధ్యతలను జిల్లాలో రెండు ఇసుక రీచ్‌లను కేటాయించిన ఎన్‌జీవో అయిన బ్లూఫ్రాగ్ టెక్నాలజీస్‌కు అప్పగించారు. ఆదివారం లోపు యాప్ తయారు చేస్తే జిల్లాలో మంత్రుల ద్వారా దానిని ఓపెన్ చేయిద్దామని కలెక్టర్ స్పష్టం చేశారు. అయితే మన ఇసుక యాప్ ఇప్పటివరకు రూపుదిద్దుకోలేదు. మరోవైపు మున్నేరు నుంచి వరద రావ డంతో అచ్చంపేట, అమరావతి, తుళ్లూరు, తాడేపల్లి ఇసుక క్వారీల్లోకి నీరు వచ్చేసింది. దీంతో కట్టలు ఎక్కడికక్కడ తెగిపోవడంతో ఇసుక తవ్వకాలు నాలుగైదు రోజుల నుంచి నిలిచిపోయాయి. దీంతో ఇసుక ధర యథాతథంగా కొనసాగుతున్నది. లారీ ఇసుకు రూ.8 వేలకు పైగా చెల్లించాల్సి వస్తుందని జిల్లా కేంద్రంలోని ప్రజలు చెబుతున్నారు. మండల స్థాయిలో మైనింగ్ ఇన్‌స్పెక్టర్, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దార్‌తో కమిటీలు వేసి ఇసుకను ఎవరు కావాలంటే వారు తవ్వుకునే అవకాశం కల్పించాలన్న టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆదేశాలు అమలులోకి రావడం లేదు. నేటికీ కొంత మంది పెద్దల అనుచరులు, కుటుంబ సభ్యు ల అదుపు ఆజ్ఞల్లోనే ఇసుక క్వారీలున్నట్లు సమాచారం.

అక్షరాలంకరణ

● అంకెలు.. పదాలు... పద్యాలు.. ఏవైనా ఇంటి అలంకరణలో భాగమే
● ఇంటీరియర్ డెకరేషన్‌లో మారుతున్న పోకడలు ● చిన్నారుల కళ్లకు, మెదడుకు పనిచెప్పేలా డిజైన్లు



ఆంధ్రజ్యోతి, విజయవాడ ఫీచర్స్ : గోడల మీద చూడచక్కని ఫొటోలు, చిత్రలేఖనాలు, లేదంటే రకరకాల బొమ్మల్ని అలంకరించడం ద్వారా ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోవడం అందరికీ తెల్సిందే. అయితే ఎప్పుడూ ఒకేలా ఉంటే బోరే కదా. అందుకే ఇంట్లో ఓ గదినో, హాలునో అంకెలతో గానీ అక్షరాలతో గానీ అలంకరిస్తే వినూత్నంగా ఉంటుందంటున్నారు ఆధునిక డిజైనర్లు. కొత్తదనం కోసం మాత్రమే కాదు. అంకెలు, లెక్కల ప్రాశస్త్యాన్ని, అక్షరాలు వర్ణమాలలోని అనుపానుల్ని పదాల భావసౌందర్యాన్ని గుర్తు చేస్తూ మన ఆలోచనలకు, అభిరుచికి అద్దం పడుతుంటాయి. అంకెలు... అక్షరాలు.... పదాలు.... పద్యాలు.... సూక్తులు.... ఏవైనా ఎక్కడైనా అలంకారమే అంటున్నారు ఆధునిక గృహాలంకరణ నిపుణులు. కొందరు తమ ఇళ్ల ఇంటీరియర్ డెకరేషన్‌లో అక్షరాలకు పెద్దపీట వేస్తూ ఇంటి అందాన్ని ఇనుమడింప చేసుకుంటున్నారు.

ప్రభావితం చేసే సూక్తులు, వ్యాఖ్యానాలు

పదాలు, పదబంధాలు మన జీవితాన్ని ఎంతో ప్రభావితం చేస్తాయనడంలో సందేహం లేదు. అందులోనూ ప్రముఖులు చెప్పిన మంచి మాటలు, అద్భుతమైన వ్యాఖ్యానాలు,... హాల్, బెడ్‌రూమ్, డ్రాయింగ్‌రూమ్, రీడింగ్‌రూమ్ గోడల మీద అందంగా చెక్కినట్లుగా రాయడం వల్ల అవి కళ్లకి ప్రతిక్షణం కనిపిస్తూ మనల్ని ఉత్తేజితం చేస్తుంటాయి. ఇంటికి వచ్చిన వాళ్ల కళ్లకీ, మెదడుకీ కూడా పనిచెబుతాయి. పైగా ఇవన్నీ కూడా మనలోని సృజనాత్మకతను ప్రతిబింబిస్తుంటాయి.

వినూత్నంగా పిల్లల బెడ్‌రూమ్

పిల్లల బెడ్‌రూమ్‌లో అక్షరాలతో డెకరేషన్ ట్రెండ్ మొదలై చాలా కాలమైనా ఇటీవల ఎన్నో నూతన డిజైన్లు చొప్పించి ఆకర్షణీయంగా మలుస్తున్నారు. ప్రత్యేకంగా చెప్పేదేముంది. రంగురంగుల అక్షరాలతో అలంకరిస్తే వాళ్ల ఆనందానికి అంతే ఉండదు. మామూలుగా అక్షరాలనీ, అంకెలనీ, పుస్తకాల్లో చూపించో లేదా పలక మీద రాయమంటే ఓ పట్టాన మాట వినరు. అదే అక్షరాన్ని గోడల మీద అందంగా వర్ణరంజితంగా రాయడం వల్ల వాటిని ఏదో ఓ క్షణంలో చూస్తూ చదువుతారు. అంతేకాదు ఒకటికి పదిసార్లు అలా చూడటం వల్ల అవి ఆ చిన్న బుర్రల్లో పీఠమేసుకుని కూర్చుంటాయి. ఎప్పటికీ గుర్తుండిపోతాయి.


ఫర్నిచర్‌లోనూ అక్షరాల ఆకర్షణ

అక్షరాలు గోడల మీద రాతలకే పరిమితం కాలేదు. ఫర్నిచర్ రూపంలోనూ వస్తున్నాయి. ఎక్కువగా బుక్‌ర్యాక్‌లు, బల్లలు, కుర్చీలను ఈ అక్షర క్రమం వచ్చేలా రూపొందిస్తున్నారు. పిల్లల కోసం వచ్చే బంక్ బెడ్‌లను ఈ అక్షర మాల వచ్చేలా తయారు చేస్తున్నారు. అక్షరాలు, పదాలు, పదబంధాలు ఉన్న కుషన్ కవర్లతో సోఫాల్ని దివాన్‌లను అలంకరిస్తే మన ఫర్నిచరు ఇల్లు వినూత్నంగా కనిపిస్తాయి. బాల్కనీలు, వాకిట్లో అమర్చే కుండీలను సైతం అందంగా కుదురుకున్న అక్షరాలతో అమర్చుకోవచ్చు. బెడ్ ల్యాంప్‌లు, ఫ్లవర్‌వేజ్‌లు, గోడగడియారాలు.... ఇలా ఇంటిని అలంకరించే సమస్త వస్తువులను అంకెలతోనూ అక్షరాలతోనూ ఉన్న వాటిని ఎంపిక చేసుకుంటే ఇల్లు మరింత వినూత్నంగా కనిపిస్తుంది. సృజన ప్రియులయితే లేసులతోనూ దారాలతోనూ అల్లిన అక్షరమాలల్ని కూడా గోడలకు అలంకరించి తమ కళాపిపాస చాటుకోవచ్చు.

కావాల్సిందల్లా ఓపిక, సృజన

ఆంగ్ల అక్షరాలు, ఆంగ్ల పదాలే కాదు. మన తెలుగు వర్ణమాల సైతం ఇంటికి కొత్త అందాలు సంతరింపజేస్తుందనడంలో సందేహం లేదు. ఎంతైనా తల్లి భాష తరవాతే కదా ఏదైనా కావాల్సిందల్లా కాస్త ఓపిక. మరికాస్త సృజన. ఈ రెండూ ఉంటే మనదైన అభిరుచితో ఇంటిని అలంకరించుకోవచ్చు. ఇంటికి వచ్చిన అతిథుల్లోనూ కొత్త ఆలోచనలు రేకెత్తించేలా చేయవచ్చు. అన్నింటికీ మించి అక్షరాల అలంకరణ అనేది చిన్నా పెద్దా అందరినీ అలరిస్తుదనడంలో అతిశయోక్తి లేదు.
ఇ అంటే ఇల్లు... అ అంటే అక్షరం అనుకుంటూ మీ పొదరింటిని అక్షరాలు, అంకెలతో అలంకరించడం వెంటనే ప్రారంభించండి మరి!













వృద్ధులకు.. ఆసరా

పండు టాకులకు ప్రభుత్వం అండ

పలు పథకాలు అమలు.. రాయితీలు

అవగాహనలేమితో కోల్పోతున్న అవకాశం

వృద్ధాప్యం.. పలు రకాల సమస్యలతో సహవాసం. అనారోగ్యంతో సతమతం. ఖర్చులు పెరిగిపోతుంటాయి. ఆర్థిక సమస్యలు వెంటాడుతాయి. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. వృద్ధాప్యంలో అన్ని విధాలా అండగా నిలుస్తున్నాయి. అయితే ఆయా పథకాలపై సరైన అవగాహన లేకపోవడంతో పండుటాకులు వాటిని అందుకుని లబ్ధి పొందలేక పోతున్నారు.

పొన్నూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పండుటాకుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. వృద్ధాప్యంలో అన్నివిధాలా అండగా నిలుస్తున్నాయి. అయితే ఈ పథకాల గురించి సరైన అవగాహన లేకపోవటంతో వృద్ధులు వాటికి దూరంగా ఉండాల్సి వస్తోంది. ఈ పథకాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

వయోశ్రీ...

వయోశ్రీ పథకం ద్వారా వృద్ధులందరికీ చేతి కర్రల నుంచి అవసరమైన సహాయ జీవన పరికరాలను ఉచితంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని అర్హుల ఎంపికకు శిబిరాలు నిర్వహించనున్నారు.

ఆరోగ్య బీమా పథకాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అర్హులైన వృద్ధులకు అనేక పథకాలు వర్తించేలా ఆయా సంస్థల పాలసీలు ప్రవేశపెడుతున్నాయి. భా రతీయ జీవిత బీమా సంస్థ రక్షిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో 8 శాతం వంతున పదేళ్ళ వరకు పింఛన్ అందుతుంది. 3, 6, 12 నెలల కాల పరిమితిలో పింఛన్ తీసుకునే వీలుంది. వార్షిక మెడిక్లైమ్ ద్వారా 60 నుంచి 80 సంవత్సరాల వయస్సు వారికి రూ.లక్ష వరకు ఆసుపత్రి ఫీజు, ఆరోగ్య సమస్యల వర కు మెడికల్ సదుపాయాన్ని అందిస్తున్నారు.

● జైన్ ఆరోగ్య బీమా పాలసీల్లో వైద్య పరీక్షలు, చికిత్సల అనంతరం ఖర్చులు, అంబులెన్స్ ఖర్చులు చెల్లించేలా వరుసగా 18 నెలలు ప్రీమియం చెల్లించే పాలసీ అందుబాటులోకి తీసుకువచ్చారు.

● టెలిఫోన్ బిల్లులో వృద్ధులకు రాయితీ ఉంది. 60 సంవత్సరాలు పైబడి వృద్ధులకు ఫోన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రాధాన్యం ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఛార్జీల్లో రాయితీ ఇస్తారు. ల్యాండ్‌ఫోన్ కనెక్షన్ ఛార్జీల్లో 25 శాతం మినహాయింపు, నెలవారీ సర్వీస్ ఛార్జీల్లోను మినహాయింపు ఉంటుంది.

ప్రయాణంలో రాయితీలు

ప్రయాణం ఛార్జీల్లో రాష్ట్ర, రోడ్డు రవాణా సంస్థ వృద్ధులకు 20 శాతం రాయితీ అందిస్తుంది. ఏసీ బస్సులకు కూడా ఇది వర్తిస్తుంది. వయస్సు ధ్రువీకరణకు కేవలం ఆధార్‌కార్డు చూపిస్తే సరిపోతుంది. బస్సుల్లో వృద్ధులకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించారు. రైల్వేల్లో పురుషులకు 60, మహిళలకు 58 సంవత్సరాలు దాటితే ప్రయాణంలో రాయితీ కల్పిస్తున్నారు. 40 నుంచి 50 శాతం వరకు టిక్కెట్ ధరలో రాయితీ వస్తుంది. ఇది అన్ని తరగతుల వారికీ వర్తిస్తుంది. విమాన ప్రయాణానికి 60 ఏళ్ళు పైబడిన వృద్ధులకు ఎయిర్‌ఇండియా 50 శాతం రాయితీ కల్పిస్తుంది.

తక్కువ పన్నులు

60 సంవత్సరాలు వయస్సు పైబడినవారికి రూ.3 లక్షల వార్షిక ఆదాయంపై, 80 ఏళ్ళు పైబడినవారిని రూ.5 లక్షల వార్షిక ఆదాయంపై పన్ను మినహాయింపు ఉంటుంది. ఆరోగ్య బీమాల్లో సైతం రూ.30 వేలు ప్రీమియం వరకు పన్ను మినహాయింపు వస్తుంది. ఆదాయపు పన్ను చట్టం 1961 సెక్షన్ 80డీ ప్రకారం ప్రత్యేక మినహాయింపు లభిస్తుంది. పొదుపు ఖాతాలు, పథకాల్లో దాచిన డబ్బుపై 60 సంవత్సరాలు పైబడినవారికి 8.4 వడ్డీ లభిస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 6.5 శాతం అదనంగా వడ్డీ లభిస్తుంది.



చట్టపరమైన భరోసా

వృద్ధులకు చట్టపరమైన భరోసాను న్యాయస్థానాలు కల్పిస్తున్నాయి. ఇప్పటికే కేసులు, వాదనల పరిష్కారాల విషయంలో వృద్ధుల కేసులను త్వరితగతిన పూర్తి చేసేలా మార్పులు చేశారు. వృద్ధుల బాధ్యత వారి పిల్లలపై ఉంది. దీనిని అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు ఉంటాయి.



పునాదుల్లో వృక్షాలు పెరుగుతున్నాయ్

- బేస్‌మెంట్ వేశారు.. వదిలేశారు
- మధ్యలో నిర్మాణం ఆపేసిన వైనం
- రూ.లక్షల ప్రజాధనం వృధా
- ఇదీ రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్ బాగోతం



అసంపూర్తిగా వదిలేసిన కట్టడాల మధ్య పెరుగుతున్న రావి, వివిధ వృక్షాలు


తెనాలి రూరల్ : పట్టణంలోని 23 వార్డు చంద్ర బాబునాయుడు కాలనీలో పేదలకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో రాజీవ్ గృహకల్ప పేరుతో అపార్ట్ మెంట్ తరహా గృహాలు నిర్మించారు. మొత్తం 15 బ్లాక్‌ల్లో 480 కుటుంబాలకు ఇళ్లు ఇవ్వాలన్న ఆలోచ నతో పనులు ప్రారంభించారు. 15 బ్లాకులకు బేస్ మెంట్ వేశారు. 13 బ్లాక్‌లను పూర్తి చేశారు. మిగిలిన రెండు బ్లాక్‌లకు బేస్‌మెంట్ వేసి పిల్లర్లు లేపి వదిలి వేశారు. ఆ బేస్‌మెంట్‌లో రావి, నేరేడు వంటి మొక్కలు పెరిగి పిల్లర్ల మధ్యలో వృక్షాలుగా మారి పోతున్నాయి. దానికి తోడు బేస్‌మెంట్, పరిసర ప్రాం తాలలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో ఒక వైపు దోమలు బాధ, మరో వైపు పందులు సంచారంతో నానాఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతు న్నారు. మొత్తం 15 బ్లాక్‌లు నిర్మించేందుకు అప్పట్లో ఓ కాంట్రాక్టరు టెండర్లు దక్కించుకున్నారు. నిర్మాణ సమ యానికి ధరలు పెరిగిపోయాయని, కాంట్రాక్ట్ విలువ పెంచాలని, ప్రభుత్వాన్ని కోరినట్లు సమాచారం. ప్రభు త్వం ఈ విషయంపై సరైన స్పష్టత ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ 13 బ్లాక్‌ల వరకే పూర్తి చేసి అప్పగించి నట్లు చెబుతున్నారు. 13 బ్లాక్‌లకు గాను ఒక్కొక్క బ్లాక్‌లో 32 చొప్పున మొత్తం 416 కుటుంబాలు నివా సం ఉంటున్నాయి. నిర్మాణ సమయంలో ఉన్న బ్లాకు లకు కలిపి ఒకే సెప్టిక్ ట్యాంకు ఏర్పాటు చేశారు. అదీ బ్లాకులకూ దూరంగా ఉండటంతో డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. డ్రైనేజీ పైపు లైన్ పెద్దగా లోతు వేయకపోవడంతో ఎక్కడికక్కడ కుంగిపోయింది. ఎక్కడి వ్యర్థాలు అక్కడే ఆగిపోతున్నాయి. అపార్ట్ మెంట్‌లో ఉండే వారు మ్యాన్‌హోల్స్ నుంచి నేరుగా వ్యర్థాలను కాల్వలో బహిరంగంగానే కలిపేస్తున్నారు. అందువల్ల ఈ ప్రాంతం అంతా దుర్గంధం వెదజలు తోంది. బేస్‌మెంట్ ప్రాంతంలో ప్రజలు చెత్త వేయ డం, పందుల సంచారంతో దోమలు విపరీతంగా పెరిగి పోయి తీవ్రఇబ్బందులు పడుతున్నామని పరిసర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు బ్లాక్‌లను పూర్తి చేస్తే మరో 64 కుటుంబాలకు గృహాలు మంజూరు చేయవచ్చని అంటున్నారు. రావి, నేరేడు వంటి చెట్లు వృక్షాలుగా తయారై బేస్‌మెంట్ సైతం పగుళ్లు వచ్చే అవకాశం ఉందని, దానికి తోడు పిల్లర్లు, బేస్‌మెంట్‌కు వాడిన ఐరన్ తుప్పు పట్టి పోతుందని, భవిష్యత్‌లో పిల్లర్లపై భవనాలు నిర్మిస్తే ఎంతవరకు నిలబడతాయో చెప్పలేమని అంటున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనం మట్టిపాలు అయి పోతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం పలు విమర్శ లకు తావిస్తోంది. బేస్‌మెంట్ వేసిన ప్రాంతాన్ని వది లేసి కొత్త ప్రాంతంలో ఇళ్లు నిర్మించాలన్న అధికారుల ఆలోచనను పలువురు విమర్శిస్తున్నారు. ఉన్న దానిని పూర్తి చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని, ప్రజాధనం వృధా కాదని అంటున్నారు. 2009లో వేసిన పునాదులు అలా పడి ఉంటే అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కాని, నేటి ప్రభుత్వం కాని ఆ ప్రాంతంపై ఏళ్లు గడుస్తున్నా దృష్టి సారించకపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఇళ్ల మధ్య చెట్లు పెరిగిపోవడంతో ఇబ్బంది పడుతు న్నామని, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు బ్లాక్‌లు పూర్తి చేసే విషయంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

డ్రైనేజీ సమస్యతో అల్లాడుతున్నాం



రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో ఆనాడు వేసిన డ్రైనేజీ పైపు లైను పూర్తిగా బ్లాక్ అయిపోవడంతో ఎక్కడి వ్యర్థాలు అక్కడే ఆగిపోతున్నాయి. దానికి తోడు కొత్తగా వదిలేసిన బ్లాక్‌ల వద్ద పందుల సంచారం పెరిగిపోయింది. ఏళ్ల తరబడి నానా ఇబ్బందులు పడుతున్నాం. - **రమేష్, స్థానికుడు**

దోమలు బాగా పెరిగిపోయాయి



బేస్‌మెంట్‌పై పిచ్చిమొక్కలు, చెట్లు పెరిగిపోవడంతో దోమల ఉధృతి పెరిగి పోయింది. రాత్రివేళల్లో ఈ ప్రాంతంలో పాములు చేరతాయోమోనని భయపడు తున్నాం. మొక్కలను తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించాలి. - **ప్రేమావతి, స్థానికురాలు**

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

తెనాలి క్రైం : స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డు లోని లాడ్జిలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. మంగళవారం వన్ టౌన్ ఎస్ఐ కె.వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం చినరావూరు యానాదికాలనీకి చెందిన పొలిశెట్టి సుబ్బారావు(75) మృతుడిగా గుర్తించినట్లు చెప్పారు. ఇతడికి నా అనే వారె వరూ లేరని, అనారోగ్యంతో కొంతకాలంగా బాధప డుతున్నట్లు తెలిసిందన్నారు. సోమవారం లాడి లోకి వచ్చాడు. మంగళవారం లాడ్జి యజమాని పరిశీలనలో అతడు మృతి చెందాడని గమనిం చారు. లాడ్జి యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న భక్తులు

తెనాలి కల్చరల్ : స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీవారిని భక్తులు దర్శించుకున్నారు. దేవ స్థాన ప్రాంగణంలోని నాగేంద్రస్వామికి భక్తులు విశేష పూజలు చేశారు. చంద్రగ్రహణం వల్ల ఉదయం వరకు ఆలయం మూసిఉంచారు. దేవస్థానాన్ని శుద్ధి చేసి భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యేకపూజలను ప్రధాన అర్చకుడు రత్నాకరం సత్యనారాయణ గౌతమ, అర్చకులు అళహరి రవి, టీవీఆర్ ఆత్రేయ, దీవి శ్రీనివాసాచార్యులు, ఎస్.శ్రీనివాసరావు, టి.తీర్థానందం, కె.వెంకటరమణ జరిపారు. ఈవో శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



నాగేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

10 నుంచి బైబిల్ మిషన్ తైలాభిషేక మహోత్సవాలు



పోస్టర్ విడుదల చేస్తున్న రెవరెండ్ అబ్దుల్ రజాక్‌బాషా

తెనాలి క్రైం : బైబిల్ మిషన్ తైలాభిషేక మహోత్సవాలను జయప్రదం చేయాలని స్వస్థిశాల ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ అబ్దుల్ రజాక్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని హాఫ్‌పేట గ్రామ పరిధిలో బైబిల్ మిషన్ స్వస్థిశాల వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆగస్టు 10, 11, 12 తేదీ లలో హాఫ్‌పేట బైబిల్ మిషన్ స్వస్థిశాల ఎదుట ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే తైలాభిషేక మహోత్సవంలో పాల్గొని దేవుడి కృపకు పాత్రులు కావాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే ఆల పాటి రాజేంద్రప్రసాద్, నరసరావుపేట ఎంపీ రాయపాటి సాంబశివ రావు సభలకు రానున్నట్లు చెప్పారు. ప్రతి దినం జరిగే ఆశీర్వాద భోజనం సద్వినియోగం చేసుకోవాలని క్రీస్తు ఆరాధకులకు సూచిం చారు. పలువురు ప్రసంగీకులు వాక్యోపదేశం చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ వై.రవిచంద్రకుమార్, డి.సత్యబాబు, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ విద్యార్థుల ఆందోళన



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

తెనాలి క్రైం : మాతృభాషలో విద్యా బోధన జరగాలని, కార్పొరేట్ దోపిడీని అరికట్టాలని పలు డిమాండ్‌లతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన పాఠశాలల బంద్ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ నేతలు మంగళవారం పట్టణంలోని పలు పాఠశాలలకు వెళ్లి బంద్‌కు సహకరించాలని కోరారు. బుర్రిపాలెంరోడ్డులోని ఓ స్కూల్ వద్దకు వెళ్లి ప్రిన్సిపాల్‌ను బంద్‌కు సహకరించాలని కోరారు. ఆయన పరుష పదజాలంతో మాట్లాడి, తమపై దాడి చేశారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్ తెలిపారు. దీనిపై స్థానిక టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆ ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేశారు. స్కూల్ వద్ద రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. వన్ టౌన్ సీఐ బెల్లం శ్రీనివాసరావు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఆందోళనలో ఎస్ఎఫ్ఐ నేతలు పవన్‌కళ్యాణ్, కాళికృష్ణ, సురేష్, ఆలీ, రవి, నోవాహు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి రైతు బజారులో

కూరగాయల ధరలు 1 కిలో రూపాయల్లో

టమాటా-40, వంకాయ-26, బెండ-10, మిర్చి- 32 కాకర-12, బీర-12, క్యాబేజి- 20, క్యారెట్-54, దొండ-12, బంగాళదుంప-15, ఉల్లిపాయలు-32, గోరుచిక్కుడు-24, దోస-12, సొర-06, పొట్ల-5, అరటి(1)-5, చామ-24, పెద్దచిక్కుడు-30, ములక్కాయ-7, ఆకుకూర-కట్ట-3, బీట్ రూట్- 28, కీర-26, బీన్స్-54, క్యాప్సికం-52, నిమ్మకాయలు (డజను)-10



వైకుంఠపురంలో నేటి కార్యక్రమాలు

తెనాలి: వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం ఉదయం 5.30 గంటలకు స్వామి వారికి బిందె తీర్థం సమర్పించి 6 గంటలకు బాల భోగం, నివేదన చేస్తారు. ఉదయం 10 గంట లకు శాంతి కల్యాణం నిర్వహిస్తారు. 11.30 గంటలకు 50 మందికి అన్నదానం చేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మహా నివేదన అనంతరం ఒంటి గంటకు ద్వార బంధన చే స్తారు. తిరిగి 3.50 గంటలకు ఆలయం తలుపులు తెరిచి రాత్రి 7.30 గంటలకు బాల భోగం, 8 గంటలకు ద్వార బంధ నం నిర్వహిస్తారు.

తెనాలి సినిమా గైడ్

పెమ్మసాని- ఇదేం దెయ్యం , **స్వరాజ్-** నక్షత్రం , **వీనస్-** దువ్వాడ జగన్నాథం, **గెయిటీ -** బిజినెస్‌మెన్, **ప్రియ- ఫిదా, శ్రీప్రియ** - దువ్వాడ జగన్నాథం, **అలంకార్** - రాక్షసుడు, **లక్ష్మి-** దర్శకుడు, **శ్రీలక్ష్మి** - జబ్ హ్యారీమెట్ జజల్ **సంగమేశ్వర-** గౌతమ్ నంద, **మినీ సంగమేశ్వర-** అవంతిక

హలో... ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగత మైనవి కాదు) సమస్యలు ఉన్నాయా? అలా ఉన్న సమస్యల గురించి ఫోన్‌చేసి ఆంధ్రజ్యో తికి తెలపండి. ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం : ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య

ఫోన్ నెంబర్ : 08644-225900

డిస్ట్రిక్ చైర్మన్‌గా 'కాకరపర్తి'



తెనాలి రూరల్: లయన్స్ ఇంటర్నేషనల్ రిక్గ్నైజ్ డిస్ట్రిక్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన కాకరపర్తి సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఆయన గతంలో లయన్స్ క్లబ్‌లో పలు పదవులు నిర్వహించారు. ఈ నెల 13వ తేదీన ఒంగోలులో డిస్ట్రిక్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు.

నేడు ఎలుకల నివారణ మందు పంపిణీ

తెనాలి రూరల్: సామూహిక ఎలుకల నివారణలో భాగంగా నేడు అన్ని గ్రామాలలో ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద ఎలుకల నివారణ మందు పంపిణీ చేయనున్నట్లు మంగళవారం ఏవో వెంకటనరసయ్య తెలిపారు. ఎకరాకు అర కిలో నూకలు, 10 గ్రాముల చొప్పున వంట నూనె రైతులు తెచ్చుకోవాలని, అందులో బ్రోమా డైలిన్ మందు కలిపి ఇవ్వనున్నట్లు తెలిపారు. 9వ తేదీన అందరూ ఒకే రోజు మందును తమ పొలాల్లోని ఎలుక బొరియాల వద్ద వేస్తే పూర్తి స్థాయిలో ఎలుకలను నివారించవచ్చని అన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలకు అవగాహన



తెనాలి క్రైం : తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పీహెచ్‌సీ వైద్యురాలు రాధిక సూచించారు. మండలంలోని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడు రోజుల క్రితం ఇద్దరు మగ కవలలకు జన్మనిచ్చిన ఖాజీపేటకు చెందిన శివానీ అనే బాలింతకు తల్లిపాల అవశ్యకతపై డాక్టర్ రాధి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి అవగాహన కల్పించారు. ఆరు నెలల వరకు బిడ్డలకు తల్లిపాలు ఇవ్వాలని, ఆమె తీసుకోవాల్సిన పోషకాహారంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నర్సులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

1700 మంది బాలలకు ఎంఆర్ టీకాలు



తెనాలి అర్బన్ : నాజరుపేటలోని సెయింట్ జాన్స్ స్కూల్లో 1700 మంది విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ టీకాలు వేశారు. డాక్టర్ కె.ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ తట్టు, రుబెల్లా పిల్లలకు ఆశించకుండా ప్రభుత్వం టీకాను ప్రవేశపెట్టిందన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ సూరజ్ మోహన్, అనీ అరుణలత, ప్రసాద్, దిలీప్, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుంభవృష్టితో మెట్టకు మేలు



తూములూరులో జలమయమైన రోడ్డు



మున్నంగిలో నీటితో నిండిపోయిన సిమెంట్ రోడ్డు

కొల్లిపర : మండలంలో మంగళవారం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు కుంభవృష్టి కురిసింది. పలు చోట్ల రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో మురుగు కాల్వలు స్తంభించాయి. భారీ వర్షం కారణంగా వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, గుడిబండివారిపాలెం, తూములూరు, దావులూరు తదితర గ్రామాల్లో రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి. ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రం కొల్లిపరలో కురిసిన కుంభవృష్టి వర్షానికి జనజీవనం స్తంభించింది. మురుగు కాల్వలు నిండిపోయి రోడ్లపై ప్రవహించటంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. భారీ వర్షం పడటంతో మెట్ట భూముల్లో సాగు చేసిన అరటి, పసుపు, కంద పంటలలో నీరు చేరుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ వర్షం మెట్ట, మాగాణి భూములకు మేలు చేకూర్చినట్లు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్‌లో వీఎస్ఆర్ విద్యార్థినులు

తెనాలి కల్చరల్ : వెలగపూడి సచివాలయంలో శాసన సభ స్పీకర్ కోడెల శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన అమరావతి డిక్లరేషన్ ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ సదస్సులో స్థానిక వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. సోమవారం మహిళా సాధికారత అంశంపై విద్యార్థినులు జి.పూజిత, యామిని, సీహెచ్ హేమనాగమణి, కళాశాల తెలుగు శాఖాధిపతి కేవీ పద్మావతిలు తమ అభిప్రాయం వివరించారు. స్పీకర్‌తో పాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత, ఐఏఎస్ అధికారులతో చర్చించారు. మంగళవారం నిర్వహించిన అభినందన సభలో కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో నేషనల్ ఉమెన్స్ పార్లమెంట్‌లో విద్యార్థులను ఎంపిక చేశారని అందులో తమ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులను ఏవో సుగుణ, ప్రిన్సిపాల్ డీవీ సోమయ్యశాస్త్రి, అధ్యాపకులు అభినందించారు.



స్పీకర్ కోడెల శివప్రసాద్‌తో చర్చిస్తున్న విద్యార్థినులు

మున్సిపల్ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి

- చైర్మన్ పెండేల వెంకట్రావు



తెనాలి అర్బన్ : మున్సిపల్ పాఠశాలల విద్యాభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శ్రీవాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు బూట్లు, బెల్ట్‌లు, టై, సాక్సులు అందజేశారు. పట్టణంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. ఉపాధ్యాయుల హాజరు, పనితీరును సమీక్షిస్తామని, సమర్థంగా పని చేసి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. కమిషనర్ కె.శకుంతల, కౌన్సిలర్ పెండేల సుబ్బారావు, వరదా వెంకటశేషగిరిరావు, సుబ్బారావు, గ్రంధిసేతు మాధవరావు, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, గడవర్తి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మరింత రుచికరంగా వండాలని ఏజెన్సీ నిర్వాహకులకు చైర్మన్ పెండేల సూచించారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

తెనాలి టౌన్ : బులియన్ వ్యాపారులకు మంగళవారం గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ హాల్లో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. గాంధీచౌక్ కార్యాలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడారు. తయారు చేయించిన నగల మొత్తానికి ఒకే బిల్లు ఉంటే మూడు శాతం, విడివిడిగా బిల్లు చేస్తే మజూరికి ఐదు శాతం, బంగారానికి మూడు శాతం, వజ్రాలు పొదిగి ఉంటే 0.2 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాత బంగారానికి కూడా మజూరి నిమిత్తం చార్జ్ చేయాలని, వ్యాపారుల వద్ద కొంటే కొనుగోలుపై రివర్స్ చార్జి చెల్లించాలన్నారు. ఫైలింగ్ చేయని పక్షంలో అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. మారీసుపేట కార్యాలయ సహాయ కమిషనర్ మురళీకృష్ణ, అసోసియేషన్ అధ్యక్షుడు నేమిచంద్ గోవాని, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారుల గ్రామసభ



కొల్లిపర : నిరుపేదలు గృహనిర్మాణ పథకాన్ని సద్వినియోగించుకోవాలని సర్పంచ్ పొత్తూరు సుదర్శనకుమారి అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంపై అధికారులు గ్రామసభ నిర్వహించారు. సుదర్శనకుమారి మాట్లాడుతూ గృహనిర్మాణ దారులు అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. హౌసింగ్ డీఈ వై. భాస్కరరావు మాట్లాడుతూ పేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 2022 నాటికి నిరుపేదలందరూ పూర్తి స్థాయిలో గృహాలు నిర్మించుకునేలా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా గృహాన్ని నిర్మించుకుంటే రూ.2 లక్షలు, ఎన్టీఆర్ గృహ నిర్మాణం ద్వారా రూ 1.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటరమణమూర్తి, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ జగన్మోహన్‌రావు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ ఆరిమండ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌తో జ్ఞాపకశక్తి వృద్ధి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుధ

తెనాలి కల్చరల్ : అబాకస్ అభ్యసించడంతో జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుందని కొత్తపేటలోని సాయి అబాకస్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ వి.సుధ తెలిపారు. మంగళవారం అబాకస్‌లో రాష్ట్ర స్థాయిలో బహుమతులు పొందిన విద్యార్థులను ఆమె అభినందించారు. గుంటూరులో యుసిమాస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అబాకస్ పోటీల్లో తమ విద్యార్థులు రేణుక, కె.రక్షిత, తమోజ్ఞ, ధీరజ్, భావన ప్రకాష్, సాయినారాయణ, ఎస్‌కే అర్మాన్, కుశల్ మణిదీప్, సుభాని, యశ్వంత్, అక్షయ సౌమ్య, దీపికలు 8 విభాగాల్లో ప్రథమ బహుమతులు అందుకున్నారని వివరించారు. విద్యార్థులు సులువుగా అబాకస్‌ను అభ్యసించవచ్చని, గణితంలో అత్యధిక మార్కులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్ సోఫియా తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



నృత్య పోటీల్లో విద్యార్థిని

తెనాలి కల్చరల్ : చెన్నైలో ఆగస్టు 5, 6 తేదీల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య 24వ వార్షికోత్సవం లో భాగంగా తెలుగు వైభవంలో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థినులు బహుమతులు సాధించారు. స్వరలయ వేదిక లక్కరాజు సాయి ఆధ్వర్యంలో విద్యార్థులు నృత్య పోటీల్లో పాల్గొన్నారు. నిర్మలా రమేష్ శిష్య బృందం కళ్యాణి, కుసుమ, భారతి, సింధూర, పూజా బృంద నృత్యాల్లో ద్వితీయ, సీనియర్‌లో కళ్యాణి తృతీయ, జూనియర్ సోలో హసినీరెడ్డి ద్వితీయ బహుమతి అందుకుంది. వీరిని సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరాదత్, హిందీ అకాడమీ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఐఏఎస్ అధికారి కాకర్త ఉష అభినందించారు.

విద్య వ్యాపారం చేసేందుకు చట్టం

యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి



సదస్సులో ప్రసంగిస్తున్న బాబురెడ్డి

తెనాలి అర్బన్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టంతో విద్య వ్యాపారంగా మారిపోతుందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల నియంత్రణ చట్టం-2017 అనే అంశంపై మంగళవారం వైష్ణవి జూనియర్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. చట్టంపై ముసాయిదా బిల్లును ప్రవేశపెట్టి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. ఈ బిల్లు చట్టమైతే సామాన్యులకు విద్య అందుబాటులో లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కార్పొరేట్ శక్తులు కారణంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దిగజారిపోతుందని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలు ఫీజులు ఇష్టానుసారం పెంచుకునే హక్కులు కలుగుతాయన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ అంతా ఒకటి, రెండు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి పోవడంతో పాటు చిన్నాచితక ప్రైవేట్ పాఠశాలలు మూతబడతాయని తెలిపారు. ముసాయిదా బిల్లు చట్టంగా మారక ముందే అన్ని ప్రజా సంఘాలు వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. రాష్ట్ర సహ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఉదయభాస్కర్, మల్లేశ్వరరావు, కుర్రా శ్రీనివాసరావు, దౌలా, డేవిడ్‌రాజు, నాంచారయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలింతలు జాగ్రత్తలు పాటించాలి

కొల్లూరు : శిశువుల సంరక్షణలో బాలింతలు జాగ్రత్తలు పాటించాలని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎ.అనూరాధ సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో బాలింత దర్శనంలో భాగంగా బాలింతలను ఆమె సందర్శించారు. బాలింతలు ఆరోగ్య ఆహార విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. రెండేళ్ల పాటు పౌష్టిక విలువలు గల ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. బిడ్డలకు పాలు పట్టే విషయంలో శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు రవిబాబు, సూపర్‌వైజర్ దానమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, అపర్ణ, రమణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు

వేమూరు : జిల్లా గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన మిషన్ ఆధ్వర్యంలో ఉద్యోగం కల్పించేదుకు 10వ తరగతి పైన చదివిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని జేఆర్పీ అరుణ తెలిపారు. అసిస్టెంట్ సేల్స్‌మెన్ ఉద్యోగాలు 75 ఖాళీలు ఉన్నాయన్నారు. ఎంపికైన వారికి రూ.10,500 వేతనం లభిస్తుందని తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 10వ తేదీన జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె కోరారు.

విద్యార్థికి ప్రోత్సాహం



పెదపూడి(అమృతలూరు): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థికి దాత ప్రతిభా ప్రోత్సాహం అందించారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో కాకుమాను సుమశ్రీ 9.5 జీపీఏ సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థి ఉన్నత చదువుల నిమిత్తం తుమ్మల రామచంద్రరావు, నాగరత్నమ్మల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుడు దొడ్డపనేని సుధీర్ నగదు ప్రోత్సాహం అందజేశారు.

నేడు వైద్య శిబిరం

తెనాలి క్రైం : మండలంలోని బుర్రిపాలెం కళ్యాణ మండపంలో బుధవారం విజయవాడ ఆంధ్రా హాస్పటల్స్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. గ్రామస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యం

తెనాలి క్రైం : స్థానిక పాండురంగపేటకు చెందిన బట్టా సత్యనారాయణ(59) అనే వృద్ధుడు సుమారు 40 రోజుల నుంచి కనిపించడం లేదని ఆయన కుమారుడు మంగళవారం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.హజరత్తయ్య తెలిపారు.

లాభసాటి వ్యవసాయానికి పథకాలు

అమృతలూరు : వ్యవసాయ లాభసాటిగా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగంలో పలు పథకాలు ప్రవేశపెడుతున్నారని ఎంపీపీ బొంతా నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు రివాల్వింగ్ ఫండ్‌ను ఎంపీపీ నాగమల్లేశ్వరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. 80 గ్రూపులకు ఒక్కొక్క గ్రూపుకు 10 వేల రూపాయల చొప్పున అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర బడ్జెట్‌తో రైతు రుణ మాఫీ చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి

ఏవో ప్రేమ్‌సాగర్

కొల్లూరు : రైతులు సామూహికంగా ఎలుకలను నివారించుకోవాలని ఏవో జి.ప్రేమ్‌సాగర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రావికంపాడు, తాడిగిరిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో క్షేత్ర స్థాయిలో నారుమడులు, వరినాట్లు పరిశీలించారు. వరి పైరులో ఎలుకల బెడద వలన దిగుబడులపై ప్రభావం చూపుతోందన్నారు. ఎలుకల నివారణకు వ్యవసాయ శాఖ బుధవారం మందును ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామ పంచాయితీ కార్యాలయాల వద్ద ఎలుకల మందును వ్యవసాయ శాఖ సిబ్బంది పంపిణీ చేస్తారని, రైతులు, నూకలు, మంచి నూనెలను తీసుకు రావాలని సూచించారు. నూకలతో కలిపిన మందును పొలంలోని ఎలుక బొరియలలో వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో మోహన్, ఎంపీఈవోలు బిందు, భార్గవి, విజయ్, పవన్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న కొల్లూరు ఏవో ప్రేమ్‌సాగర్

భట్టిప్రోలు : వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏవో చుక్కా విజయరాజ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో ఉదయం 8 గంటల నుంచి ఎలుకల మందును పంపిణీ చేస్తారని రైతులు సద్వినియోగపరుచుకుని ఎలుకల నివారణ చేపట్టాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.

వైఎస్ విగ్రహం కనబడకుండా గోడ నిర్మాణం

వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త శివకుమార్



తెనాలి రూరల్ : రణరంగ చౌక్ పక్కన డాక్టర్ వైఎస్ విగ్రహం కనబడకుండా చేయాలని గోడ నిర్మిస్తున్నారని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ ఆరోపించారు. గోడ నిర్మాణ వివాదం మంగళవారం కొనసాగింది. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని వైఎస్ విగ్రహ దిమ్మ ఉన్న ఎత్తులో మాత్రమే గోడ నిర్మించాలని, అంతకు మించి ఎత్తు నిర్మిస్తే ఊరుకోబోమని నిరసన వ్యక్తం చేశారు. కమిషనర్ సమాధానానికి సంతృప్తి చెందకపోవడంతో చైర్మన్‌తో మాట్లాడతామని చెప్పి ఆమె వెళ్లిపోయారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, రమేష్, బి.శ్రీనివాసరావు, శానంపూడి రఘురామిరెడ్డి, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, సుద్దపల్లి నాగరాజు, నాగిరెడ్డి, దుబాయ్‌బాబు, తట్టుకూళ్ల అశోక్ యాదవ్, అక్కిదాసు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు ఆరిగ కోటిరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, కల్లం వీరారెడ్డి, ఆరిగ చంద్రశేఖర్‌రెడ్డి, కల్లం వీరారెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, అడపాల నాగేశ్వరరావు, బొమ్ము శ్రీనివాసరెడ్డి, అవుతు నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మినుము రైతులను ఆదుకోవాలి..



మున్నంగి (కొల్లిపర): రబీలో మినుము వేసి నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైనట్లు వైసీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మంగళవారం గ్రామంలో గడపగడపకు వైసీపీ నిర్వహించారు. శివకుమార్ మాట్లాడుతూ డెల్టాలో వేలాది ఎకరాల్లో మినుము దెబ్బతిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తోడేటి చంటి, జడ్పీటీసీ భట్టిప్రోలు వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు వేమూరి దీనమ్మ, కట్టా భారతి, మండల ఉపాధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పచ్చవ రమేష్, బొల్లిముంత పోతురాజు,

ఉపాధ్యాయులకు బదిలీ పత్రాలు

భట్టిప్రోలు : మండలంలో 41 మంది ఉపాధ్యాయులకు బదిలీ పత్రాలను అందించినట్లు ఎంఈవో బండారు నారాయణ మంగళవారం తెలిపారు. 30 పాఠశాలలకు చెందిన 41 మంది ఉపాధ్యాయులు స్థాన చలనం పొందగా 25 మంది వేర్వేరు మండలాలకు, 16 మంది స్థానిక మండలంలోనే బదిలీ అయ్యారని వివరించారు.

చేనేత నాయకుల హర్షం

భట్టిప్రోలు : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడ సభలో రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు పేద చేనేత కార్మికులకు ఇస్తున్న పెన్షన్లకు అదనంగా రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల ఫించన్లు మంజూరు చేస్తూ ప్రకటన చేయడంతో చేనేత నాయకులు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దీపాల శివప్రసాద్, ఐలవరం గ్రామ అధ్యక్షుడు మాచర్ల నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ గ్రామ కమిటీ సమావేశం

భట్టిప్రోలు : మండలంలోని ఐలవరంలో మంగళవారం టీడీపీ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షులు మాచర్ల నాగరాజు అధ్యక్షత వహించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు, గ్రామ అభివృద్ధిపై కార్యకర్తలతో సమీక్ష జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ చల్లపల్లి మాణిక్యం, ఉప సర్పంచ్ ఆకురాతి వెంకటరావు, నాయకులు దీపాల శివప్రసాద్, అనగాని ఏడుకొండలు, పడవల కామేశ్వరరావు, ఆకురాతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంజూరు పత్రాల పంపిణీ

భట్టిప్రోలు : గృహ నిర్మాణ శాఖ మంగళవారం మండలంలోని ఐలవరం, భట్టిప్రోలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో గుమ్మడి సాంబశివరావు గృహాలు మంజూరైన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు కంభం మరియమ్మ, చల్లపల్లి మాణిక్యం, హౌసింగ్ ఏఈ గాంధీ, ఆర్ఐ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కొల్లూరు : పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అశోక్‌కుమార్ మంగళవారం పేర్కొన్నారు. మండలంలోని దోనేపూడి సమీప వ్యవసాయ భూముల్లో పేకాడుతున్నట్లు సమాచారం అందింది. ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.12,500 స్వాధీనం చేసుకున్నారు. జూదరులను కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

11న గాయత్రీ మహాయజ్ఞం

దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజుకొండూరు శ్రీమహాకాళీ అమ్మవారి ఆలయ ఆవరణలో ఈనెల 11న శ్రీగాయత్రీ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు చిలువూరు రంగిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ రంగిశెట్టి రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. శ్రావణమాసం మూడో శుక్రవారం గత 45 ఏళ్లుగా అమ్మవారి పుట్టినరోజుగా జరుపుకుంటున్నారన్నారు. సామూహిక శ్రావణ లక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతంతోపాటు ఈవో సూర్యప్రకాశరావు, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్ సహకారంతో, ఈఏడాది గాయత్రీపరివార్ ఆధ్వర్యంలో గాయత్రీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నామని వివరించారు. 5వేల మందికి పసుపు, కుంకుమ గాజులు, సుమారు 15వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించనున్నామని తెలిపారు.

నేటి నుంచి ఎలుకల నివారణ మందు పంపిణీ

దుగ్గిరాల: మండలంలోని వివిధగ్రామాల్లోని రైతులకు పంటచేలలో ఎలుకల నివారణకు మందును ఉచితంగా అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి సయ్యద్ అక్బర్ హుస్సేన్ మంగళవారం తెలిపారు. ఎకరానికి పావుకిలో నూకలు కొద్దిగా నూనె వెంటతీసుకుని గ్రామపంచాయితీ కార్యాలయాల వద్దకు బుధవారం రావాలని రైతులను కోరారు. నూరుశాతం సబ్సిడీపై అందించే సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, రైతుమిత్రగ్రూపులసభ్యులు హాజరుకావాలని ఏఓ విజ్ఞప్తి చేశారు.

అర్హులకు పక్కా గృహాలు



మంజూరు పత్రాలు అందిస్తున్న అధికారులు

వేమూరు : అర్హులైన పేదలకు ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మిస్తుందని వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు తెలియజేశారు. మంగళవారం వేమూరు పంచాయతీ కార్యాలయం వద్ద గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. పల్స్ సర్వే ఆధారంగా ఇళ్లు లేని పేదలకు డబల్ బెడ్‌రూమ్ నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటుందని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎండీవో కె.నరసింహారావు, కార్యదర్శి బోసు, ఏఈ శ్రీనివాసరావు, జన్మభూమి కమిటీ సభ్యులు, పార్టీ నేతలు యన్నం నాగరాజు, సురేంద్ర, రవి, రాజేష్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాభివృద్ధి

చుండూరు : కొంతకాలంగా అంబేద్కర్‌నగర్‌లో ఇరువర్గాల మధ్య నెలకొన్న వివాదాల పరిష్కార దిశగా మండల అధికారులు మంగళవారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. రోడ్డును ఆక్రమించుకుని వేసిన గడ్డివాములు, పశు వ్యర్థాలను, మురుగు నిల్వలను వెంటనే తొలగించాలని తహసీల్దార్ ఎడ్వర్డ్ ఇరువర్గాలకు ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తప్పవని ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. త్వరలో అందనున్న పంచాయతీ నిధులతో రోడ్లు, మురుగు పారుదల చర్యలు తీసుకుంటామని, ఈఓపీఆర్డీ ప్రభాకర్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వివాదాలు లేకుండా ఉమ్మడిగా గ్రామాభివృద్ధికి పాటు పడాలని ఎస్ఐ విక్టర్ సూచించారు.

అసిస్టెంట్ సేల్స్‌మెన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొల్లూరు : అసిస్టెంట్ సేల్స్‌మెన్ పోస్టులకు నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు వెలుగు ఏపీఎం కృపాసాగర్ మంగళవారం తెలిపారు. డీఆర్డీఏ, ఉపాధి కల్పనా మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన అసిస్టెంట్ సేల్స్‌మెన్ పోస్టుకు గుంటూరు జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు విద్యార్హత పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

10న గృహనిర్మాణాల కాంక్రీటు పనులు ప్రారంభం

చిలకలూరిపేట టౌన్ : పీఎంఏవై ఎన్టీఆర్ నగర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా నిర్మించనున్న 4,512 ఇళ్లకు సంబంధించి ఈ నెల 10న కాంక్రీటు పనులు ప్రారంభిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ నామా కనకారావు మంగళవారం తెలిపారు. గృహాల కోసం డీడీలు చెల్లించిన లబ్ధిదారులు ఆ రోజు పనులను పరిశీలించవచ్చునని కోరారు. ఇంకా డీడీలు కట్టని వారు ఈ నెల 15లోపు చెల్లించాలన్నారు. పట్టణంలో తెల్ల రేషన్‌కార్డు ఉండి ఇల్లు లేని వారు దరఖాస్తు చేసుకుంటే ఇంటిని మంజూరు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు.

కలగా.. డంపింగ్ యార్డు...

ప్రతి గ్రామంలోనూ డంపింగ్‌యార్డు ఏర్పాటుచేయాలనే ప్రభుత్వ లక్ష్యం కలగానే మిగిలింది. ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేస్తాం.. తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి ఎరువు తయారీ యూనిట్లను ఏర్పాటు చేస్తాం.. తద్వారా ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం.. అని చెబుతున్న పాలకుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. నిధులు పుష్కలంగా ఉన్నా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయలనే చిత్తశుద్ధితో అధికారులు కృషి చేయకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం రోజురోజుకీ క్షీణిస్తోంది.

రహదారులే డంపింగ్‌యార్డులు
పంచాయతీల్లో క్షీణిస్తున్న పారిశుధ్యం
క్షేత్రస్థాయిలో నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
ప్రకటనలకే పరిమితమవుతున్న అధికారుల మాటలు

నాదెండ్ల : మండలంలో 15 పంచాయతీలు ఉండగా ప్రస్తుతం ఒక్క నాదెండ్లలో మాత్రమే డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసి తడి, పొడి వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఆ యార్డులో తడి చెత్త నుంచి వానపాముల ఎరువు తయారు చేస్తున్నారు. ప్రతి పంచాయతీకి డంపింగ్‌యార్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో నెరవేరకపోవడం ఇందుకు నిదర్శనంగా ఉంది. నిధులు మంజూరు చేసినా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేద్దామనే చిత్తశుద్ధి అధికారుల్లో కొరవడటంతో గ్రామాల్లో పారిశుధ్యం క్షీణిస్తోంది.

ఉపాధిహామీ నిధులు పుష్కలంగా..

ఉపాధిహామీ పథకం కింద డంపింగ్ యార్డు నిర్మాణాలకు నిధులు పుష్కలంగా ఉన్నాయి. వెయ్యిమంది జనాభాకు ఒక్కరు చొప్పున హరిత రాయబారులను చెత్త సేకరణకు నియమించుకునే అవకాశం ఉంది. వారికి సంబంధించి ఈ వేతనాలను కూడా పం చాయతీకి సంబంధం లేకుండా ఉపాధి హామీ పథకం కింద ఇచ్చే వెసులుబాటు ఉంది. ఇది పంచాయతీలకు ఆర్థికంగా మేలు చేకూరే అంశంగా చెప్పవచ్చు. అంతే కాకుండా కంపోస్టుగా మార్చిన వానపాముల ఎరువును కూడా అమ్ముకోవడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంది. అయితే ప్రజాప్రతినిధులు, అధికారు లు సరైన దృష్టి కేంద్రీకరించకపోవడంతో ఆయా పంచాయతీలలో డంపింగ్ యార్డుల ఏర్పాటు కోసం స్థలాల అన్వేషణలో విఫలమవుతున్నారు. దీని వల్ల గ్రామాల్లో పారిశుధ్యం మరింతగా క్షీణిస్తోంది. 25 వేల జనాభా నివశించే మేజరు పంచాయతీ గ్రామమైన గణపవరంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. జాతీయ రహదారి ప్రక్కన ఉన్న జడ్పీ స్థలాన్ని చెత్త డంపింగ్ చేసేందుకు వినియోగిస్తున్నారు. అక్కడే చెత్తను కాల్చి వేస్తుండటంతో ఈ రహదారిన రాకపోకలు సాగించే వారికి అసౌకర్యంగా ఉంటోంది. మరో మేజరు పంచాయతీ సాతులూరులో కూడా ఇదే పరిస్థితి ఉంది. అన్ని గ్రామాలకు వెళ్లే రహదారు ల పక్కన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉంటే గ్రామాల్లోని వ్యర్థాలను సక్రమంగా బయటకు తరలించడంలోనూ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుండటంతో చెత్త సమస్య అపరిష్కృతంగా ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యపై దృష్టిసారించి చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది.





పారిశుధ్యం మెరుగుదల



డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడం వల్ల గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడుతుంది. స్వచ్ఛభారత్ సాకారానికి డంపింగ్ యార్డులు కీలకం. సర్పంచులు, అధికారులు దృష్టిపెట్టి సమస్య పరిష్కరించాలి. గ్రామాల్లో వాటి కోసం ప్రభుత్వం స్థలాలను కేటాయించాలి.

- నిడమానూరి రామస్వామి, గణపవరం

నాలుగు గ్రామాల్లో ప్రతిపాదనలు



నాలుగు గ్రామాల్లో డంపింగ్‌యార్డుల నిర్మాణానికి అంచనాలు పూర్తిచేశాం. ఎండుగుంపాలెం, గణపవరం, చిరుమామిళ్ల, ఇర్ల పాడు గ్రామాల్లో డంపింగ్‌యార్డుల నిర్మాణం చేపట్టబోతున్నాం. సరిపడా స్థలాలు లేకపోవడం వల్ల పంచాయతీలలో డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేయలేకపోతున్నాం. వీలైనంత త్వరగా స్థలాలు సేకరించి అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు నెలకొల్పేందుకు కృషి చేస్తున్నాం.

- కాశియ్య, ఎంపీడీవో, నాదెండ్ల

గులాబిరంగు పురుగు నివారణకు చర్యలు : ఏవో శాంతి



యడ్లపాడు : మండలంలోని పలు గ్రామాల్లోని పత్తి క్షేత్రాల్లో గులాబిరంగు పురుగు ఉనికిని ఇటీవల గుర్తించాం. ప్రాథమిక దశలోనే గులాబిరంగు పురుగును రైతులు సమర్థ వంతంగా అరికట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముందుగా రైతులు పత్తి పంటలో గులాబి రంగు పురుగుల ఉనికిని గుర్తించేందుకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. ఎకరా పత్తి పొలంలో 4 నుంచి 8 బుట్టలను ఏర్పాటు చేసుకొని వరుసగా 3 రోజులపాటు బుట్టలను క్రమం తప్పకుండా పరిశీలించాలి. బుట్టలో రోజుకు 8 తల్లి రెక్కల పురుగులు ఉన్నట్లయితే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. లింగాకర్షక బుట్టలు కావలసిన వారు మండల వ్యవసాయశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలి.

104 సమాచారం

చంద్రన్న సంచార వైద్యబృందం బుధవారం ఉదయం గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని పసుమర్రు, మధ్యాహ్నం గుదేవారిపాలెంలో సేవలు అందిస్తుంది.

చిలకలూరి పేట కూరగాయల ధరలు 1 కిలో రూపాయల్లో

టమోటా - రూ.44, వంకాయ- రూ.40, బెండకాయలు- రూ.24, పచ్చిమిర్చి- రూ. 40, కాకరకాయలు - రూ.40, బీరకాయలు - రూ.18, దొండకాయలు - రూ.24, గోరుచిక్కుళ్లు -రూ.30, పెద్దచిక్కుళ్లు -రూ.40, దోసకాయలు -రూ.24, పొట్లకాయ- 1రూ. 10, సొరకాయ -1రూ. 10, మునగకాయ- 1రూ. 5, అరటి- 1రూ.8, బంగాళదుంప- రూ.18, క్యారెట్- రూ.60, క్యాబేజి- రూ.20, క్యాలీఫ్లవర్- రూ.32, బీట్‌రూట్- రూ.40, చేమదుంప -రూ.36, ఉల్లిపాయలు - రూ.28

అసిస్టెంట్ సేల్స్‌మెన్ ఉద్యోగాలకు దరఖాస్తులు

చిలకలూరిపేట టౌన్ : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా మిషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు కంపెనీలలో అసిస్టెంట్ సేల్స్‌మెన్ ఉద్యోగాలకు గ్రామీణ ప్రాంత నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జాబ్ రిసోర్స్ పర్సన్ జి.రాజు తెలిపారు. పదవతరగతి నుంచి డిగ్రీ పాస్/ఫెయిల్, 19-25 సంవత్సరాల వయసు ఉన్న వారు అర్హులన్నారు. నెలకు రూ.10,500 వేతనంతోపాటు టీఏ, డీఏ, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం ఉందన్నారు. ఆగస్టు 10న ఉదయం 10 గంటలకు గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్‌లో ఉన్న జిల్లా సమాఖ్య కార్యాలయంలో విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్సులు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 73306 98119 నంబరులో సంప్రదించాలన్నారు.

నియోజకవర్గానికి 2,200 ఎన్టీఆర్ గృహాలు మంజూరు

హౌసింగ్ డీఈ కోదండరామయ్య

గణపవరం(నాదెండ్ల) : చిలకలూరిపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని గ్రామాల్లో 2,200 ఎన్టీఆర్ గృహనిర్మాణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని హౌసింగ్ డీఈ బి.కోదండరామయ్య పేర్కొన్నారు. మండలంలోని గణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామసభలో 94 మంది లబ్ధిదారులకు గృహనిర్మాణ మంజూరు పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాదెండ్ల మండలానికి 720 గృహాలు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలను ప్రారంభించాలని కోరారు. లబ్ధిదారులు 2 నుంచి 5 యూనిట్లలోపు పరిమాణంలోనే ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. బేస్‌మెంట్ పూర్తయిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తే ఇంటి నిర్మా ణాన్ని జియో ట్యాగింగ్ చేస్తామన్నారు. బ్యాంకు ఖాతాలు, ఆధార్‌కార్డును వెంటనే అందజేయాలని సూచించారు. సమావేశంలో సర్పంచి జాన్‌బాబు, ఏఈ సీహెచ్‌బాబూరావు, సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎంపీటీసీలు అరుణకుమారి, గగారిన్, కాట్రు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమైన ఫోన్ నంబర్లు

నాదెండ్ల మండలం

తహసీల్దార్	9949096532
నాదెండ్ల ఎస్ఐ	9440900881
పోలీస్‌స్టేషన్	08647-274333
ఎంపీడీవో	7032983503
ఎంఈవో	9949510729
ఐసీడీఎస్ సీడీపీవో	9491051609
ఏఈ, విద్యుత్ శాఖ	9440812331
ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్	9100121478
వ్యవసాయాధికారి	8886614173
గణపవరం వైద్యాధికారి	9493808653

విద్యార్థులకు ఎన్‌ఆర్ఐ సాయం


విద్యార్థికి పుస్తకాలు పంపిణీ చేస్తున్న చిత్రం

చిలకలూరిపేట: మండలంలోని పసుమర్రు మండల పరిషత్ ప్రాథమిక (హెచ్‌ఈ) పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన గొట్టిపాటి అబ్బయ్య, సత్యవతి కుమారుడు ఎన్‌ఆర్ఐ విద్యాధర్, రజని దంపతులు నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. తాను చదువుకున్న ఈ పాఠశాల విద్యార్థులకు ఎలాంటి సాయం అయినా అందిస్తానని విద్యాధర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.పాపయ్య, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, అనిల్, ఎంపీపీ యలగాల సాంబయ్య, గొట్టిపాటి కోటేశ్వరరావు, జాలాది వెంకటేశ్వర్లు, జాలాది అరుణాచలం, గోవిందరావు, సాదినేని నరేంద్ర, రావుల హనుమంతరావు, దొప్పలపూడి అంకమ్మచౌదరి, గడిపూడి చినరామయ్య, జాలాది హర్షవర్థ, దాదాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కృష్ణమహల్	శమంతకమణి
విజయభాస్కర్	గౌతమ్‌నంద
కేఆర్ మినీ	నిన్నుకోరి
భాస్కర్	**జబ్ హరి మీట్ సీజల్**
మంగాడీలక్స్	వైరస్
శ్రీనివాసా	ఘాజీ
విజయలక్ష్మి	రెడ్‌లైట్
విశ్వనాథ్	ఇదేం దెయ్యం
రామకృష్ణ	దువ్వాడజగన్నాథం
కళామందిర్	నక్షత్రం
వెంకటేశ్వర	దండుపాళ్యం-2
సిటి సెంటర్‌స్క్రీన్-1	ఫిదా
సిటి సెంటర్‌స్క్రీన్-2	దర్శకుడు
యడ్లపాడులో..	
జయలక్ష్మి మూవీల్యాండ్	నక్షత్రం

బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతి ఇవ్వొద్దని వినతి

చిలకలూరిపేట టౌన్ : చిలకలూరిపేట మండలంలోని చినపసుమర్రు పరిధిలో మద్దుకూరి గార్డెన్స్ ప్రధానగేటు ప్రక్కన గోడౌన్‌లో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయాలని వ్యాపారులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అనుమతి ఇవ్వవద్దని పలువురు స్థానికులు తహసీల్దార్, ఎక్సైజ్ సీఐ, రూరల్ ఎస్‌లకు వినతిపత్రం అందించారు. మద్దుకూరి గార్డెన్స్‌లో 20 కుటుంబాల ప్రజలు నివశిస్తున్నారని బార్ అండ్ రెస్టారెంట్ నిర్మిస్తే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని వివరించారు.

తెరచుకున్న ఆలయాలు



చిలకలూరిపేట అర్బన్ : చంద్రగ్రహణం సందర్భంగా పట్టణంలో సోమవారం సాయంత్రం నుంచి మూతపడిన ఆలయాలు మంగళవారం మధ్యాహ్నా సమయం తర్వాత తెరచుకున్నాయి. ప్రధానంగా కళామందిర్ సెంటర్‌లోని శ్రీబాలత్రిపురసుందరి నాగేంద్రస్వామి ఆలయం, చౌత్రాసెంటర్‌లోని శ్రీగంగాపార్వతి సమేత ఉమామహేశ్వరస్వామి దేవాలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంతోపాటు పలు ప్రధాన ఆలయాలు గ్రహణం సందర్భంగా మూతపడ్డాయి. మంగళవారం వేదపండితులు ఆలయాల సంప్రోక్షణ నిర్వహించి, అనంతరం స్వామివార్లకు పూజలు నిర్వహించారు.

ముర్రుపాలతోనే పిల్లల ఆరోగ్యం : డాక్టర్ అరుణ



చిలకలూరిపేట : ముర్రుపాలు పట్టిస్తేనే పిల్లల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని డాక్టర్ లావు అరుణ పేర్కొన్నారు. కళామందిర్ సెంటర్‌లోని ఆస్పత్రిలో మంగళవారం ఇన్నర్‌వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ ముర్రుపాలతో పిల్లలలో రోగనిరోధకశక్తి పెంపొందుతుందన్నారు. క్లబ్ అధ్యక్షురాలు శోభారాణి మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడంలో ఉన్న అపోహలను మూఢనమ్మకాలను విడనాడాలన్నారు. పిల్లల ఎదుగుదల చిన్న వయసులోనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉష, సభ్యులు అనంతలక్ష్మి, దండా రమాదేవి, కె భారతి, సర్తాజ్, ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ పంపిణీ



చిలకలూరిపేట : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మూడో వార్డుకు చెందిన గ్రంథి పావనికి ఉపాధి కోసం మంగళవారం కుట్టుమిషన్‌ను అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బండారు జయకుమార్, డిస్ట్రిక్ చైర్మన్ పోలిశెట్టి వెంకటరామారావు, తోట చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలతో పేదలకు మేలు : చైర్‌పర్సన్

చిలకలూరిపేట : వైద్యశిబిరాల నిర్వహణతో పేదలకు మేలు చేకూరుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంజి చెంచుకుమారి అన్నారు. పండరీపురం రోటరీక్లబ్, విజయవాడ మ్యాక్సివిజన్ కంటి వైద్యశాలల ఆధ్వర్యంలో పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో మంగళవారం కంటి వైద్యశిబిరం జరిగింది. శిబిరాన్ని ప్రారంభించిన చైర్‌పర్సన్ మాట్లాడుతూ రోటరీక్లబ్ సభ్యులు నిత్యం ప్రజలతో మమేకమై వారికి అవసరమైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఆస్పత్రులలో చికిత్స చేయించుకోలేని వృద్ధులకు శిబిరం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని క్లబ్ సభ్యులను కోరారు. మ్యాక్సివిజన్ డాక్టర్ రామకృష్ణ పర్యవేక్షణలో సాంకేతిక నిపుణులు బీమా, ప్రసన్న, ధర్మతేజలు వృద్ధులు, కంటి సమస్యలు ఉన్నవారిని 160 మందిని పరీక్షించారు. అవసరమైనవారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పండరీపురం రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కరరెడ్డి, పేరిరెడ్డి, సభ్యులు దాసునాయన, చెంచుపున్నయ్య, సుబ్రమణ్యం, మస్తాన్‌రావు, సింగారావు, పొన్నూరు కోటయ్య, కొల్లా సుబ్బారావు, ఆదినారాయణరెడ్డి, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.



కంటి వైద్యపరీక్షలు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గంజి చెంచుకుమారి

క్రమశిక్షణ, అంకితభావంతోనే ఏ రంగంలోనైనా రాణింపు

పారిశ్రామికవేత్త, అనంతలక్ష్మి స్పిన్నింగ్‌మిల్లు ఎండీ సామినేని కోటేశ్వరరావు

ఉన్నవ (యడ్లపాడు) : క్రమశిక్షణ, అంకితభావంతోనే ఏ రంగంలోనైనా రాణింపు సాధ్యమవుతుందని పారిశ్రామికవేత్త, అనంతలక్ష్మి స్పిన్నింగ్‌మిల్లు ఎండీ సామినేని కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఉన్నవ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు చదివే 220మంది విద్యార్థులకు గుంటూరు డీఎస్ఆర్ మిత్రమండలి సహకారంతో త్రిభాషా (ఇంగ్లీషు, హిందీ, తెలుగు) నిఘంటువులను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సామినేని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, అంకితభావంతో విధ్యనభ్యసించి జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. జీవితంలో ఎంత ఎత్తు ఎదిగినా జన్మభూమిని, కన్నతల్లిదండ్రులను, చదువు నేర్పిన గురువులను మరువరాదన్నారు. అందరితో మర్యాదకలిగి ఉండడంతోపాటు జీవితంలో ఏదో ఒక లక్ష్యాన్ని చేరుకోవాలన్న తపన ప్రతి విద్యార్థిలో ఉండాలన్నారు. జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కుర్రా రత్తయ్య, డీఎస్ఆర్ మిత్రమండలి అధ్యక్షుడు దామచర్ల శ్రీనివాసరావులు మాట్లాడిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం హజరయ్య, డీఎస్ఆర్ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు మానుకొండ శ్రీనివాసరావు, పమిడి ఆంజేయులు, మురళి, ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సామినేని కోటేశ్వరరావు

చుక్కల భూములపై రైతులకు అవగాహన

చిరుమామిళ్ల(నాదెండ్ల) : చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి ఇదే మంచి తరుణమని తహసీల్దార్ మేడూరి శిరీష అన్నారు. మండలంలోని చిరుమామిళ్లలో మంగళవారం చుక్కల భూములపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చుక్కల భూమి సమస్య ఉన్న రైతులు సరైన ఆధారాలతో వాటిని క్రమబద్ధీకరించుకోవచ్చునన్నారు. రైతుల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో ఆమెతోపాటు వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై సర్వే

ఈపూరు : రోడ్డు ప్రమాదాల నివారణకు సర్వే చేపట్టినట్లు నరసరావుపేట ఆర్టీవో ఎ.కిరణ్‌ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్లను పరిశీలించి ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట అర్బన్ : పట్టణంలోని పోలిరెడ్డిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ వై ఏడుకొండలు తెలిపారు. పోలిరెడ్డిపాలెం, వైఎస్ఆర్ కాలనీ, పండరీపురం, బ్యాంకు కాలనీ, మదర్ధెరెస్సా కాలనీ, కోండ్రుపాడు ప్రాంతాలో ఈ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతిపక్షనేత పదవికి మచ్చ తెచ్చిన జగన్ : నెల్లూరి

చిలకలూరిపేట టౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్, ప్రభుత్వంపై మతిభ్రమించి విమర్శలు చేస్తున్న జగన్ ప్రతిపక్ష నాయకుడి పదవికే మచ్చ తెచ్చారని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు అన్నారు. మంగళవా రం స్థానిక టీడీపీ కార్యాలయంలో సదాశివరావు విలేకర్లతో మాట్లాడుతూ తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని లక్ష కోట్లు అక్రమంగా సంపాదించి 11 సీపీఐ కేసులలో తొలి ముద్దాయిగా ఉన్న జగన్ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేకపోతున్నారన్నారు. ఆ అక్కసుతోనే ముఖ్యమంత్రిపై దిగజారుడు వ్యాఖ్యలు చేస్తూ గౌరవం కోల్పోయాడన్నారు. పరిటాల రవీంద్ర వంటి టీడీపీ నాయకులను హత్యలు చేయించిన చరిత్ర జగన్‌ది అని అన్నారు. 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయంలో హత్యా రాజకీయాలను ప్రోత్సహించకుండా ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని జగన్ కాల్చమని చెప్పడం దారుణమన్నారు. పట్టిసీమతో కృష్ణాడెల్టా రైతులను, రాయలసీమకు 120 టిఎంసీల నీరు, రుణమాఫీ, ఐదురెట్లు పెంచిన ఫించన్లు, ఉద్యోగులకు 43శాతం ఫిట్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలను సక్రమంగా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రిని విమర్శిస్తున్న జగన్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. నంద్యాల ఉప ఎన్నికలలో టీడీపీ విజయమే వైసీపీ పతనానికి నాంది కానున్నదని అన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధికార ప్రతినిధి మురకొండ మల్లిబాబు ఉన్నారు.

తెగిన విద్యుత్ తీగ.. అధికారుల అప్రమత్తత





పాత టెలిగ్రాఫ్ ఆఫీస్ వద్ద తెగిన విద్యుత్ తీగ, మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చిలకలూరిపేట టౌన్ : పట్టణంలోని పాత టెలిగ్రాఫ్ ఆఫీస్ వద్ద మంగళవారం రాత్రి విద్యుత్ తీగ తెగిపడింది. వర్షం పడుతుండటంతో జనసంచారం లేదు. దీనితో ప్రమాదం తప్పింది. దీనితో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అప్రమత్తమై సరఫరా నిలిపివేశారు. ఆ తర్వాత మరమ్మతులు నిర్వహించి తీగను క్రమబద్ధీకరించి సరఫరాను పునరుద్ధరించారు.

వర్షంతో రహదారులు జలమయం



సుబ్బయ్యతోట దర్గా వీధిలో వర్షపునీరు

చిలకలూరిపేట టౌన్ : పట్టణంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీనితో పలు శివారు కాలనీలను వర్షపునీరు ముంచెత్తింది. ప్రధానంగా సుబ్బయ్యతోట, గాంధీపేట, సంజీవనగర్, శాంతినగర్, జాలయ్య కాలనీ, బోసు రోడ్డు తదితర ప్రాంతాల్లోని రహదారులన్నీ జలమయమయ్యాయి. వర్షపునీటితోపాటు కాల్వలలోని మురుగునీరు కూడా పొంగి పొర్లడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

నేడు అచ్చంపేటకి రానున్న ఎమ్మెల్యే కొమ్మాలపాటి

అచ్చంపేట : అచ్చంపేటలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొంటారని ఎంపీడీవో డీజీ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా జూనియర్ కళాశాలలో స్నేహహస్తాల ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటైన బెంచీల పంపిణీ, జిల్లా పరిషత్ హైస్కూల్లో గ్రౌండ్ అభివృద్ధికి, శ్మశానవాటికల ప్రహరీలకు, డంపింగ్‌యార్డులో 50 నాడెప్ కంపోస్టులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో దివ్యాంగులకు బస్‌పాస్ పంపిణీ చేస్తారు.

తల్లిపాల వారోత్సవాలపై అవగాహన



లింగంగుంట్లలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

పెదకూరపాడు : బిడ్డపుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించాలని 75 తాళ్ళూరు స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి జొన్నలగడ్డ శ్రీవల్లి మంగళవారం అన్నారు. పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్యకేంద్రం, నీలిమ నర్సింగ్ హోం, పాటిబండ్ల మిషనరీ ఆస్పత్రిలో బాలింతలతో ఆమె మాట్లాడుతూ ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలను తాగించాలని, ఆరునెలల తర్వాత తల్లిపాలతో పాటు పౌష్టికాహారాన్ని అందించవచ్చన్నారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులు తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిల్లలకు వ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు ఇంజక్షన్లు చేయించాలని ఆమె కోరారు. ఆమెతో పాటు సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ బీవీఎస్ఎల్ రోహిణి రత్నశ్రీ, సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ ఆషా, షేక్ గౌసియా, కుమారి ఉన్నారు.

తల్లిపాలు అమృతం

తల్లిపాలు పిల్లలకు అమృతంలాంటివని మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు వి.భవాని, కె.విజయలక్ష్మిలు అన్నారు. మండలంలోని లింగంగుంట్లలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సం దర్భంగా తల్లిపాల విశిష్టతను అంగన్‌వాడీ కార్యకర్తలు బోడపాటి నాగజ్యోతి, సారెకుక్క ఉమాదేవిలు వివరించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అచ్చంపేట మండలంలో..

అచ్చంపేట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోను, శ్రీశ్రీనివాస నర్సింహోంలోను తల్లిపాల ప్రాముఖ్యంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సింహాచలం తల్లులకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపా లు తాగించటం వల్ల బిడ్డకు ఎలాంటి జబ్బు లు ఆశించవని, తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని తెలియజేశారు. ఈ సందర్భంగా ఐసీ డీఎస్ సూపర్‌వైజర్ సింహాచలంతో పాటు పెదపాలెం సూపర్‌వైజర్ మేరీ మహిమార్థిని, హెల్త్ ఎడ్యుకేటర్ చంద్రశేఖర్, సీహెచ్ వో ప్రేమజ్యోతితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఉషారాణి, ఖాజాబి, అరుణ, రూతు, మహాలక్ష్మి, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యాన్ని వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సింహాచలం తదితరులు

ప్రతిష్టాత్మకంగా ఎంఆర్ వ్యాక్సిన్



చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేస్తున్న ఆరోగ్య కార్యకర్త వాణ

పెదకూరపాడు : రాష్ట్ర ప్రభుత్వం 9 నెలల చిన్నారుల మొదలుకొని 15 ఏళ్లలోపు చిన్నారులకు తట్టు, రూబెల్లా వ్యాక్సిన్‌ను వేస్తున్నారని పెదకూరపాడు ఎంపీటీసీ షేక్ ముంతాజ్ అన్నారు. పెదకూరపాడులో ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు వేస్తున్న ఎంఆర్ వ్యాక్సిన్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని 15 సంవత్సరాల లోపు చిన్నారులందరికి తప్పనిసరిగా వ్యాక్సిన్‌ను వేసే విధంగా ఆరోగ్య సిబ్బంది చర్యలు తీ సుకు ం న్నా ర ని అన్నారు. 75 తాళ్ళూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేడికొండ అంబేద్కర్ మాట్లాడుతూ మండలంలోని 75 తాళ్ళూరు, పాటిబండ్ల, పెదకూరపాడు, లగడపాడు, కన్నెగండ్ల తదితర గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం జరిగిందన్నారు. తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరించి టీకాను వేయించాలని కోరారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆరోగ్య పర్యవేక్షకులు సారెకుక్క విజయకుమార్, సయ్యద్ బేగం, బేబిలత, ఆరోగ్య కార్యకర్తలు కళ్యాణి, రమాదేవి, రాణి, సుజాత, శివపార్వతి, లూర్దురాణి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మొక్కలు మానవాళికి ప్రాణదాతలు



పెదకూరపాడులో మొక్కలు నాటుతున్న దృశ్యం

పెదకూరపాడు : మొక్కలే మానవాళికి ప్రాణదాతలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు అన్నారు. పెదకూరపాడులో మహాప్రస్థానం వద్ద జన చైతన్యసమితి ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితంలో వృక్షం ప్రధానమైనవని, మొక్కలను రక్షిస్తే ఆ మొక్కలను ఆక్సిజన్ నుంచి రక్షిస్తుందన్నారు. చైతన్యసమితి అధ్యక్షుడు గోగులపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ జీవకోటికి మొక్కలే ప్రాణాధారమని, కాలుష్యంలేని వాతావరణాన్ని అందించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. గ్రామ అధ్యక్షుడు వేమూరి వెంకటప్పయ్య మాట్లాడుతూ మానవులకు మొక్కలు ఆక్సిజన్ ఇవ్వటంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తుందని కలప పక్షులకు, జంతువులకు కూడా ఆయుష్షను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జనచైతన్యసమితి ప్రతినిధులు ఒంటిపులి అంకమ్మరావు, గుడిపూడి బ్రహ్మానాయుడు, సుందరరావు, ఫ్రాంచీస్ పాల్గొన్నారు.

బదిలీఅయిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



అచ్చంపేట : మండల కేంద్రమైన అచ్చం పేట పంచాయతీ పరిధిలోని చామర్రు గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బదిలీ అవుతున్న ఏ యోనోష్‌బాబు, ఏ రత్నకుమార్, మిట్టా శ్రావణిని ఎస్ఎంసీ చైర్మన్ వెంకటరమణతో పాటు పలువురు పెద్దలు ఘనంగా సన్మానించారు. పాఠశాలకు వీరు చేసిన అభివృద్ధిపై వివరించారు. ఈ సందర్భంగా వారిని ఘనం గా సత్కరించారు. సత్కరించిన వారిలో చిలుకా వెంకటరావు, నెల్లూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సీహెచ్ నరసింహారావు, ఏ శ్రీనివాసరావు, బి.శివప్రసాద్ పాల్గొన్నారు.

నేడు డిజిటల్ క్లాస్‌రూంలు ప్రారంభించనున్న ఎమ్మెల్యే

క్రోసూరు : మండలంలోని బయ్యావరం హైస్కూల్లో బుధవారం ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ డిజిటల్ క్లాస్ రూంలు ప్రారంభిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి సైదా తెలిపారు. ఉదయం 9 గంటల కు క్లాస్‌రూంలు ప్రారంభించటంతో పాటు అక్కడ జరిగే సమావేశంలో పాల్గొంటారన్నారు. గ్రామ సమస్యల గురించి విచారించనున్నట్లు చెప్పారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా పొన్నెకంటి



అచ్చంపేటలో ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన పొన్నెకంటి రామారావు, అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు

అచ్చంపేట : అచ్చంపేట మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీపీగా పొన్నెకంటి రామారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరావు, క్రోసూరు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నందిగం ఆశీర్వాదం, ఎంపీడీవో డీజీ నాయక్, తహసీల్దార్ ఏ శ్రీనివాసరావు, సందెపోగు శ్రీనివాసరావు, కొమ్మవరపు దిబ్బయ్య, సందెపోగు శ్యామ్యేల్, పంచాయతీరాజ్ ఏఈ రఘు, కొత్తపల్లి సర్పంచి మేకల శ్రీనివాసరావు పొన్నెకంటి రామారావుకు అభినందనలు తెలియజేశారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు.

ముఖ్యమైన ఫోన్ నంబర్లు

పెదకూరపాడు మండలం

తహసీల్దార్	: 9949098618
ఎస్ఐ	: 9440796269
ఎంపీడీవో	: 7032983509
ఎంఈవో	: 9110331798
వ్యవసాయాధికారి	: 8886614096
వైద్యాధికారి	: 8121943623

క్రోసూరు మండలం

ఎంపీడీవో	: 7032983498
ఎంఈవో	: 9502423782
ఎస్ఐ	: 9440796235
ఏడీఏ	: 8886614114
ఏఈ (ఎలక్ట్రికల్)	: 9440812336

అచ్చంపేట మండలం

తహసీల్దార్	: 9949098611
ఎస్ఐ	: 9440796234
ఎంపీడీవో	: 7032983482
ఎంఈవో	: 9949510703

చంద్రన్నబీమా పేదలకు భరోసా



గారపాడులో చంద్రన్నబీమాను పంపిణీ చేస్తున్న సర్పంచి మాధవరావు, బీమామిత్ర సుమలత

పెదకూరపాడు: పేద కుటుంబాలకు చంద్రన్నబీమా భరోసాగా ఉంటుందని సర్పంచి గణేష్ మాధవరావు అన్నారు. మండలంలోని గారపాడులో మంగళవారం మీసాల నాగేశ్వరరావు మృతి చెందటంతో ఆయన కుటుంబసభ్యులకు రూ.5 వేలు చంద్రన్నబీమాను అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ గోలి యలమందయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదవారి కన్నీటిని తుడిచేందుకు చంద్రన్నబీమాను ఏర్పాటు చేసిందన్నారు. బీమా మిత్ర వేమవరపు సుమలత మాట్లాడుతూ చంద్రన్నబీమా పథకంలో ఉన్నవారికి సాధారణంగా మృతిచెందితే 30 వేల రూపాయలు, ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.5 లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. మహాలక్ష్మీ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన ఎమ్మార్పీఎస్ నాయకులు


తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

అచ్చంపేట : ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ రిలే దీక్షలు చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సందెపోగు నాగేశ్వర రావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తానని మాట ఇచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఆ మాట తప్పిందని, ఎస్సీ వర్గీకరణ చేసేంతవరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని నాగేశ్వరరావు అన్నారు. కనీసం మాదిగల ఉనికిని చాటుకునేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా అరెస్టులు చేయించటం మానవహక్కులను కాలరాయటమేనని అన్నారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బందిని బయటకు పంపించి కార్యాలయాన్ని మూసి వేసి కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు తుడుం రమేష్, కొంపల్లి బాలస్వామి, చిలకా విజయ్, రేపూడి సాగర్, శిఖా విజయ్, కొమ్మవరపు విజయ్, యాంపొంగు రవి, కన్నెగంటి వెంకటేశ్వర్లు, సందెపోగు రోశయ్య, కొత్తపల్లి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సండ్రతండాలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ


చండ్రతండాలో పారిశుధ్య చర్యలను పర్యవేక్షిస్తున్న ఈఓపీఆర్‌డీ ప్రసాద్‌బాబు

అచ్చంపేట : మండలంలోని తాడువాయి పంచాయతీ పరిధిలో గల సండ్రతండాలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో మొదటివిడత పారిశుధ్య పనుల్లో భాగంగా ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌బాబు పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఎంతోకాలంగా పూడిక తీత పనులు లేకపోవటంతో సండ్రతండాలో ఎక్కడచూసినా మురుగుగుంతలే దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పారిశుధ్య పనులు చేపట్టడంతో మురుగు గుంతల్లో నీరు లేకుండా సైడుకాల్వల్లోకి నీరు రావటంతో రోడ్లపై నడిచేందుకు అవకాశం కలిగింది. ఈ పనులను గ్రామసర్పంచి అనుమోలు వెంకటేశ్వరరావు చేయిస్తున్నాయి. రెండు, మూడు రోజుల్లో మురుగుకాల్వల పూడికతీత పూర్తికానుంది.

రాష్ట్రం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి

ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్



పెదకూరపాడు : విభజన సమస్యలతో సతమతమవుతున్న రాష్ట్రం కోసం అహర్నిశలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ కృషి చేస్తున్నాడని పెదకూరపాడు శాసనసభ్యుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ అవినీతి, నేర చరిత్ర ఉన్న ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి - నక్కకి, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఆయన అన్నారు. 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడుగానీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడుగానీ ఎప్పుడు ఎవరిని వ్యక్తిగత విమర్శలు చేయలేదన్నారు. రాష్ట్రంఎంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకుంటూ రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక్కొక్క ఇటుక పేర్చుకుంటూ వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న అరాచక శక్తి జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఆయన అన్నారు.

నేడు క్రోసూరు మండల పరిషత్ సమావేశం

క్రోసూరు : క్రోసూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో అనురాధ తెలియజేశారు. మండలంలో అమలు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఉపాధి పథకం, పక్కా గృహాలు, మరుగుదొడ్ల నిర్మాణం గురించి సమావేశంలో చర్చించటం జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు సమావేశంలో పాల్గొనాలని ఆమె కోరారు.

అంగనవాడి కేంద్రాలకు వంట సామగ్రి

అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నఅమృత హస్తం కార్యక్రమం ద్వారా గ్రామాలలోని గర్భిణులు, బాలింతలకు అంగనవాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు ఆవసరమైన వంట సామగ్రిని సంబందిత పంచాయతీలు తమ స్వంత నిధులతో పంపిణీ చేస్తున్నాయి. మంగళవారం మండల పరిధిలోని మునగోడు గ్రామంలో రూ20 వేల తో అల్యూమినియం డేషాలు, మగ్గలు, గెంటలు, ప్లేట్లు, బకెట్లు కొనుగోలు చేసి గ్రామంలోని నాలుగు కేంద్రాలకు సర్పంచ్ షేక్ ఖాజీబి షరీఫ్ అందజేశారు.

ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల.. అధ్వానం


వర్షపునీటితో నిండిన పాఠశాల ఆవరణ

క్రోసూరు : మండల కేంద్రం క్రోసూరులోని ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల మురికికూపం గా ఉంది. చిన్నపాటి వర్షం కురిసిన పాఠశాల ఆవరణ మొత్తం నీటితోను, బురదతోను నిండిపోతోంది. పాఠశాల వెనక ఉన్న మురికిగుంటలలో ఎప్పుడు చూసినా మురుగు నీరు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఈ పాఠశాలలో సుమారు 50 నుంచి 100 మంది వరకు షెడ్యూల్ తెగలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. దొడ్లేరు రోడ్డుపక్కన చెంచుకాలనీలో సుమారు 15 సంవత్సరాల క్రితం ఈ పాఠశాల లు ప్రారంభించినప్పటికి అభివృద్ధి చేయటం మాత్రం మరిచారు. రోడ్డు మట్టానికి సుమారు 3 అడుగుల దిగువన పల్లపు ప్రాంతంలో పాఠశాల ఉండటంతో వర్షాలు కురిసినప్పుడల్లా పాఠశాల ఆవరణ మొత్తం జలమయమవుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు నీటిలో నుంచే పాఠశాలలోకి వెళ్ళవలసి వస్తుందని చెబుతున్నారు. పాఠశాల వెనుకభాగంలో ఉన్న గుంటలలో పేరుకుపోయిన మురుగుతో దోమలు స్వైరవిహారం చేస్తూ విద్యార్థులు అంటురోగాల బారిన పడుతున్నారు. పాఠశాల ఆవరణ మొత్తాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు చెబుతున్నారు. విద్యార్థులు ఆటలు ఆడుకోవాలన్నా, చదువుకోవాలన్నా మురికినీటిలోనే ఉండాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పాఠశాల ఆవరణ మొత్తం జలమయంగా మారి నడవటానికి కూడా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పాఠశాల ఆవరణను అభివృద్ధి చేయటమేకాక వెనుక వైపున ఉన్న మురుగును తొలగించి గుంటలను పూడ్చివేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మురుగునీటిమయంగా ఉన్న పాఠశాల వెనుకభాగం

నేడు క్రోసూరులో కార్మిక చట్టంపై అవగాహన సదస్సు

క్రోసూరు : మండల కేంద్రం క్రోసూరులోని శివాలయం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు కార్మిక చట్టం, కార్మిక సంక్షేమనిధి చట్టాలపై అవగాహన సదస్సు జరుగుతుందని క్యాప్ సంస్థ అధ్యక్షుడు నర్రా పిచ్చయ్యచౌదరి తెలియజేశారు. సమావేశానికి కార్మికశాఖ అధికారులు హాజరవుతారన్నారు. చట్టపరిధిలోకి వచ్చే కార్మికులు, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు, వారు గుర్తింపు పొందటానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చిస్తామన్నారు. కొత్తగా భవన నిర్మాణ కార్మికులుగా చేరాలనుకొనేవారు, ఉపాధిహామీ కూలీలు తగిన గుర్తింపు పత్రాలతో సమావేశానికి హాజరుకావాలని, సభ్యులుగా చేరాలని ఆయన కోరారు.

ఎస్సీ కాలనీలో వైద్యశిబిరం

బెల్లంకొండ : మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించినట్లు బెల్లంకొండ ఆయుర్వేద వైద్యుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. వానా కాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తుగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఆఫీసర్స్ వాయిస్

భద్రతా నియమాలు పాటించాలి

జి.నాగేశ్వరరావు, ఎస్ఐ



పెదకూరపాడు : రోడ్డుపై ప్రయాణించేటప్పుడు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి. వాహనాలకు సంబంధించి సంబంధిత పత్రాలను విధిగా ఉంచుకోవాలి. యువకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు. పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయి. పెద్ద శబ్ధం వస్తున్న హారన్ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతుందనే ఫిర్యాదులు ఉన్నాయి. స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా శిక్షణ పొందాలి.

పీఎంఏవై గృహాలకు నిధులు మంజూరు


సమావేశంలో మాట్లాడుతున్న గృహ నిర్మాణశాఖ ఏఈ ఓబులరెడ్డి

పెదకూరపాడు : ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా మంజూరైన గృహాలకు ప్రభుత్వం 2 లక్షల రూపాయలను ఇస్తుందని గృహ నిర్మాణశాఖ ఏఈ ఇందూరి ఓబులరెడ్డి అన్నారు. మండలంలోని గారపాడులో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసాధికార సర్వేలో గృహాలు లేనివారిని సర్వే ద్వారా గుర్తించటం జరిగిందన్నారు. గ్రామసర్పంచి గణేష్‌మాధవరావు మాట్లాడుతూ గృహాలు మంజూరైనవారు గృహ నిర్మాణపు పనులను ప్రారంభించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు మక్కెన సాగర్, మాజీ ఎంపీటీసీ గోలీ యలమందయ్య తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన తనిఖీ


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తింటున్న ఎంపీపీ వల్లాల సుభాషిణి

క్రోసూరు : మండల కేంద్రం క్రోసూరులోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో మంగళవారం మధ్యాహ్నం క్రోసూరు ఎంపీపీ వల్లాల సుభాషిణి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా, ఆహార పదార్థాలు తయారుచేస్తున్నారా, లేదా అనే విషయమై ఆరాతీశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వసతి గృహాన్ని ప్రారంభించాల్సి ఉందని, పాఠశాల వద్ద ఆర్టీసీ బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి ఎంపీపీ దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలలోని వసతి సౌకర్యాలను ఎంపీపీ పరిశీలించారు.






పంచాయతీరాజ్ అధికారులతో సమావేశమైన, గంటలమ్మ పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల పనులు ప్రారంభించాలి : ఎమ్మెల్సీ

బాపట్ల : మండలంలోని కొండుభొట్లపాలెం, మూలపాలెం, చెరువుజమ్ములపాలెం, మురుకొండపాడు గ్రామాల్లో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 3కోట్ల50లక్షలతో చేపట్టే పనులకు టెండర్లు పూర్తయ్యాయి కనుక పనులు ప్రారంభించి, రెండు నెలల్లో పూర్తిచేయాలని ఎమ్మెల్సీ సూచించారు. పంచాయతీరాజ్ అధికారులతో ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, శ్మశానవాటికల ప్రహరీ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం తగదన్నారు. సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఇంకా బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. సమావేశంలో పంచాయతీరాజ్ డీఈ రాఘవసూరి, ఏఈలు కృష్ణారావు, గోవర్ధన్, మోహనరావు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

కొలుపుల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ

పట్టణంలోని 33వ వార్డు బాలకృష్ణపురంలో జరుగుతున్న కొలుపుల్లో ఎమ్మెల్సీ సతీష్ పాల్గొన్నారు. మంగళవారం ఉదయం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయనను ఆలయ కమిటీవారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అక్కల నాగవరలక్ష్మీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నమూనాల పరిశీలన

పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో నిర్మించ తలపెట్టిన మరుగుదొడ్డి నమూనా నిర్మాణాలను ఎమ్మెల్సీ మంగళవారం పరిశీలించారు. మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్ద నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు. వాటికి కొన్ని మార్పులు, చేర్పులు చేశారు.

297 కిలోల బ్రోమోడయోలిన్ మందు పంపిణీ

ఆఫీసర్స్ వాయిస్

● ఏడీఏ ఎ.వి.ఎస్.శాస్త్రి



బాపట్ల : సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా బాపట్ల సబ్ డివిజన్‌లోని కర్లపాలెం, పిట్టలవానిపాలెం, కాకుమాను, బాపట్ల మండలాలలకు 297 కిలోల బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేసినట్లు ఏడీఏ ఎ.వి.ఎస్.శాస్త్రి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బాపట్ల మండలానికి 104 కిలోలు, కర్లపాలెంకు 59కిలోలు, పిట్టలవానిపాలెంకు 45కిలోలు, కాకుమానుకు 89కిలోల బ్రోమోడయోలిన్ మందు అందజేశామన్నారు. రెండు గ్రాముల మందులో 96గ్రాముల నూకలు, రెండు గ్రాముల వేరుశనగ నూనె కలిపి పొట్లాలు కట్టి ఎలుకల బొరియల వద్ద వేయనున్నట్టు తెలిపారు. రైతుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. మండలాలకు పర్యావేక్షణ అధికారులను ఏర్పాటు చేశామన్నారు. బుధవారం జరిగే ఈ కార్యక్రమం అధిక వర్షం వస్తే మరుసటి రోజుకు వాయిదా పడుతుందని తెలిపారు. అలాగే మండలాల వారీగా భూసార పరీక్ష ఫలితాల జాబితాను సిద్ధంగా ఉన్నాయన్నారు. భూసార పరీక్ష ఫలితాల ప్రకారం జింకు, జిప్సం, బోరాన్ లోపలం ఉంటే రైతులకు ఉచితంగా వాటిని అందజేస్తామన్నారు.

సినిమా గైడ్

అన్నపూర్ణ - ఫిదా
శ్రీనివాస - గౌతమ్‌నంద్
అలంకార్ - నక్షత్రం
తిరుమల పిక్చర్ ప్యాలెస్ (కర్లపాలెం) - నక్షత్రం
విజయలక్ష్మి(ఖాజీపాలెం) - గౌతమ్‌నంద్
వెంకటరమణ ఫిక్చర్ ప్యాలెస్ (పిట్టలవానిపాలెం) - ఫిదా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి : ఎస్ఎఫ్ఐ

బాపట్ల : విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 10వ తేదీన జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. బంద్‌కు సంబంధించిన పోస్టర్లను మంగళవారం పట్టణంలో కన్వీనర్ టి.నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యను కార్పోరేటీకరణ చేసే ప్రయత్నంలో సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ యాక్ట్ 2017ను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దీనిని రద్దు చేయాలని, మున్సిపల్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతోపాటు తెలుగుమీడియం కొనసాగించాలని, జీవో నెంబర్ 14ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.గోపిరెడ్డి, సిహెచ్.నిఖిల్, ఇ.చైతన్య, అన్వేష్‌లు, రాజ్‌గోపాల్, వెంకయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

'జీవో నెంబర్ 64ని రద్దుచేయాలి'

బాపట్ల టౌన్ : జీవో నెంబర్ 64ను తక్షణమే రద్దుచేసి, పాత జీవో 16ను పునరుద్ధరించాలని వ్యవసాయ కళాశాల విద్యార్థులు అన్నారు. మంగళవారం వారు తరగతులను బహిష్కరించి కళాశాల ప్రధాన గేటు ముందు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం 64జీవోను రద్దు చేసేంతవరకు తమ నిరసన కొనసాగిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ కళాశాలల విద్యార్థులు నిరసనను తెలియపరుస్తున్నారన్నారు. కళాశాల లోపలకు అధ్యాపకులు, సిబ్బందిని విధులకు వెళ్ళనీయకుండా వారు అడ్డుకున్నారు. పాత జీవో 16ను ప్రభుత్వం అమలుచేసేంతవరకు తరగతులు బహిష్కరించి, నిరసన తెలుపుతామని విద్యార్థులు తెలియజేశారు.



వ్యవసాయ కళాశాల ప్రధానగేటు ముందు నినాదాలు చేస్తున్నవిద్యార్థులు

ముగిసిన ఆర్పీల శిక్షణ

బాపట్ల : మెప్మా ఆధ్వర్యంలో ఆర్పీలకు రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణ మంగళవారంతో ముగిసింది. స్వయం సహాయక సంఘాల పరిధిలో పనిచేసే ఆర్పీల విధులు, బాధ్యతల గురించి డీఆర్పీ ఎ.నాగరాజు వివరించారు. సంఘాల సంస్థాగత నిర్మాణంపై పలు సూచనలు చేశారు. పంచసూత్రాలైన మంచి లక్షణం, సమావేశాలు, పొదుపు, అంతర్గత అప్పులు, పుస్తకాల నిర్వహణ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి టీఎంసీ ఎంఎం జోత్స్న, సీవోలు సుబ్రహ్మణ్యం, సీహెచ్ రావమ్మ, టీఎల్ఎఫ్ ఆర్పీ ఎ.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల కూరగాయల ధరలు (రూ.) 1 కిలో

వంకాయలు: 30, బీర: 17, బెండ: 25, టమోట: 40, దొండ: 17, దోస: 25, కాకర: 30, క్యారెట్: 55, క్యాబేజి: 20, పచ్చిమిర్చి: 35, బీట్‌రూట్: 35, చేమ: 30, బంగాళదుంప: 15, ములక్కాయ: 05, సొరకాయ: 15, కీరదోస: 35, గోరుచిక్కుడు: 30.

మహిళపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

● ప్రగతిశీల మహిళా అధ్యక్షురాలు కొండా అన్నమ్మ

బాపట్ల టౌన్ : మహిళపై దాడిచేసిన మద్యం వ్యాపారిని అరెస్టు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు కొండా అన్నమ్మ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నివాస గృహాల మధ్య ఉన్న వైన్‌షాపులను తొలిగించాలన్నారు. నివాస గృహాల మధ్య వైన్‌షాపు ఉండటం వలన ప్రజలు, విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్థానిక డ్రైవర్స్‌కాలనీలో మద్యం తాగి సుమారు 26 మంది మరణించారని తెలిపారు. మహిళల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం మద్యపాన నిషేధం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం కార్యదర్శి ఎం.పల్లవి, షేక్ మహరున్నీసా, జె.కల్పన, జి.రాఘవ, షేక్ అబీదా, ఎంపి రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

బాలల నాటికల పోటీలకు ఏవీవీ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక

బాపట్ల : ప్రఖ్య చిల్డ్రన్స్ ఆర్ట్స్ థియేటర్ నిర్వహణలో సూపర్‌స్టార్ కృష్ణ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమి తెనాలివారి 7వ రాష్ట్రస్థాయి బాలల నాటికల పోటీలకు స్థానిక ఏవీవీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు దర్శకుడు, ఉపాధ్యాయుడు జె.ఎస్. హెర్బర్ట్ తెలియజేశారు. ఈ నెల 10వ తేదీన తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్, తెనాలిలో ప్రదర్శన జరుగుతుందన్నారు. నాటికలో పాల్గొనే విద్యార్థులు ఎ.రాధాకృష్ణమూర్తి, ఎం.పోతురాజు, కోటేశ్వరరావు, శివమణి, వంశీ, రాజ్యలక్ష్మీ, శివపార్వతి తదితరులు ఉన్నారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తదితరులు అభినందించారు.

కోర్టుప్రాంగణంలో మొక్కల పెంపకానికి శ్రీకారం

బాపట్ల : స్థానిక కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. బీజేపీ స్వచ్ఛభారత్ కన్వీనర్ షేక్ సమీరా యాస్మిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జడ్జి శోభారాణి, న్యాయవాదులు ఉషారాణి, నరేష్, బాబు, బీజేపీ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్‌బిఎస్‌జి తిలక్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. కోర్టు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛభారత్‌లో అందరూ భాగస్వాములు కావాలని వారు పేర్కొన్నారు.



కోర్టుప్రాంగణంలో జడ్జిలతో కలిసి మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవికాదు) సమస్యలు ఉన్నాయా? ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కా రానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం : ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య
ఫోన్ నెంబర్ : 9985411240

మోడల్ స్కూల్స్‌కు పెరుగుతున్న ఆదరణ

• పట్టణంలో మూడు చోట్ల ఏర్పాటు • మున్సిపల్ అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ
• అన్ని వసతులతో విద్యాబోధన



రాజీవ్‌గాంధీకాలనీలోని మోడల్ స్కూల్

బాపట్ల : ప్రభుత్వ ఆదేశాలతో పట్టణాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్న మోడల్ స్కూల్స్‌కు ఆదరణ పెరుగుతున్నది. తొలి విడతగా బాపట్ల పట్టణంలో మూడు మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేశారు. రాజీవ్‌గాంధీకాలనీలో రెల్లికాలనీ, భావరాజుతోట డొంక, రాజీవ్‌గాంధీకాలనీ అంగన్‌వాడీ కేంద్రాలను కలిపి మోడల్ స్కూల్‌గా ఏర్పాటు చేశారు. అలాగే జమేదారుపేటలో ఉప్పరపాలెం, అంబేద్కర్‌కాలనీ, జమేదారుపేట కలిపి ఒక సెంటర్, రైలుపేటలో ఉప్పలవారివీధి, జమేదారుపేట, రైలుపేట కలిపి ఒక సెంటర్‌గా మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్కూల్‌కు వచ్చే విద్యార్థులకు నర్సరీ, ఎల్‌కేజి, యుకేజి బోధిస్తున్నారు. ఆటపాటలతో కూడిన విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. చిన్నారులతోపాటు బాలింతలు, గర్భిణులకు ఆహారం అందిస్తున్నారు. తల్లుల గమనిక ఉండడం వల్ల కార్యకర్తలు జవాబుదారీతనంతో పని చేస్తున్నారు. పైగా కేంద్రాలలో గోడలపై ఆకర్షించే విధంగా బొమ్మలు గీయించారు. పిల్లలకు కుర్చీలు, టేబుల్స్, పుస్తకాలు, ఆటవస్తువులు అందుబాటులో ఉంచారు. వీటితో పిల్లలు కేంద్రాలకు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకేచోట ముగ్గురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉండడం వలన ఎక్కువమంది పిల్లలకు విద్యానేర్పించడం ఒక కాన్వెంట్‌ను తలపిస్తున్నది. పైగా మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సైతం వీడియో ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను విజిట్ చేస్తున్నారు. దీంతో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగ్గా ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఇదేవిధంగా అన్ని కేంద్రాలు అభివృద్ధి చేస్తే పేదపిల్లలకు నర్సరీ నుంచే ఆంగ్ల విద్యతోపాటు సృజనాత్మకత పెంపొందుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

పెరిగిన విద్యార్థుల సంఖ్య..

మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటుతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. జమేదార్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో గడిచిన 15రోజుల్లో ఐదుగురు విద్యార్థులు, రెల్లికాలనీలో ఐదుగురు, రైలుపేటలో 8మంది విద్యార్థులు చొప్పున పెరిగారు. ఇంకా మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలలో చేరేందుకు అనేక మంది చిన్నారులు వస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలియజేస్తున్నారు.

తొలి విడతగా మూడు కేంద్రాలు



బాపట్ల పట్టణంలో తొలి విడతగా మూడు మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అన్ని రకాల వసతులు కల్పించాం. మరిన్ని కేంద్రాలు ఏర్పాటుకు ప్రయత్నిస్తాం. మోడల్ కేంద్రాలను పర్యవేక్షిస్తూ లక్ష్యం సాధించేలా చర్యలు చేపడుతున్నాం. **- కమిషనర్ ఎం.రమేష్‌బాబు**

తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు



మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో పిల్లలు వచ్చి వెళ్ళిపోయేవారు. ఇప్పుడు ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటున్నారు. మధ్యలో తల్లిదండ్రులు వచ్చి చూసి వెళుతున్నారు.

- సీడీపీవో డి.గీతాంజలి

'తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం'

బాపట్ల టౌన్, చందోలు(పిట్టలవానిపాలెం): తల్లిపాలు పిల్లలకు మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయని సీడీపీవో గీతాంజలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ అన్నారు. మంగళవారం తల్లిపాల వారోత్సవ చివరి రోజు బాలింతల సందర్శనం అనే కార్యక్రమం ద్వారా స్థానిక ఏరియా వైద్యశాలలో ప్రసూతి విభాగంలో ఉన్న బాలింతలకు తల్లిపాల విశిష్ఠతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బిడ్డ జన్మించిన వెంటనే గంటలోపు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలతో చిన్నారులకు తెలివితేటలు పెరుగుతాయని తెలిపారు. పిట్టలవానిపాలెం మండలంలోని చందోలులో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుల్తానా బేగం అఫ్జల్, అంగన్‌వాడీ కార్యకర్తలు సీతామహాలక్ష్మీ, పద్మ, కరీమున్నీసా, రాజ్యలక్ష్మీ, భాగ్యలక్ష్మీ, పద్మ, ప్రసన్నకుమారి, అంజలి, సమీన్, మేరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

బాలింతల ఇళ్లకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పిట్టలవానిపాలెం : స్థానిక ఎస్టీ కాలనీలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గూడపాటి అన్నపూర్ణ అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి మంగళవారం బాలింతల గృహాలకు వెళ్లారు. ఈ సందర్భంగా వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. బిడ్డకు తల్లిపాలు ఏలా పట్టించాలో సూచించారు. పిల్లలు పుట్టిన వెంటనే తల్లిపాలను తాగిస్తే వారు చాలా చురుగ్గా ఉంటారన్నారు. ముర్రిపాలు పిల్లల జీర్ణాశయాన్ని శుభ్రపరుస్తాయన్నారు. విటమన్ ఎ,కె ఎక్కువగా ఉంటాయన్నారు. పిల్లలకు పాలివ్వడం వలన తల్లి శరీరానికి సాధారణ ఆకృతి వస్తుందన్నారు. అనంతరం బాలింతల వివరాలను నమోదు చేసుకున్నారు.

పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న అకాడమి ఆఫ్ గాంధేయన్ స్టడీస్ ఫీల్డ్‌మేనేజర్ అశోక్‌కుమార్

బాపట్ల : మండలంలో ఎంపిక చేసిన 24 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో ఎస్.నిరంజన్ అధ్యక్షతన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి అకాడమి ఆఫ్ గాంధేయన్ స్టడీస్ ఫీల్డ్ మేనేజర్ డి.అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలలు పరిశుభ్రంగా ఉండే విధానం గురించి ఎక్సిడ్ సంస్థ, బటర్‌ఫ్లై సంస్థ ఉపకరణాలు ఉపయోగిస్తూ పలు విషయాలు తెలియజేశారు. ఆరోగ్య నియమాలు పాటించడంలో లాభాలు, ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్, ఎంపీడీవో శ్రీరామమూర్తి, ప్రాజెక్ట్ మేనేజర్ టి.బద్రినారాయణ, టి.రమేష్, పి.పుల్లయ్య, కె.దేవరాజు, కె.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలకు బటర్‌ఫ్లై సంస్థవారు ఉపకరణాలు అందజేశారు.

ఆంజనేయస్వామికి శ్రావణ మంగళవార పూజలు

కర్లపాలెం : మండలంలోని చింతాయపాలెంలో నూతనంగా ప్రతిష్ఠ చేసిన శ్రీప్రసన్నాంజనేయస్వామి విగ్రహం వద్ద మండలంలోని పలుగ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు శ్రావణ మంగళవార పూజలను ఘనంగా జరిపారు. ప్రసన్నాంజనేయస్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, తమలపాకుల పూజను పురోహితులు నిర్వహించారు. ఆలయం వద్దకు విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను గుడిరామకృష్ణ, అంకిరెడ్డిరవికుమార్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పేరలి పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ



ఆదర్శ ఎడ్యుకేషన్ సొసైటీ పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా మంగళవారం బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఆదర్శ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ బొమ్మనబోయిన సాంబయ్య, పేరలి అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరాజు, ప్రధానోపాధ్యాయుడు శేషవర్మరాజు, విద్యాకమిటీ చైర్మన్ విజయకుమారి, బుర్ల సురేష్, శ్యామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. **(కర్లపాలెం)**

పిల్లలు ఐకమత్యంగా ఉండాలి : ఎంఈవో

కర్లపాలెం : పిల్లల మధ్య ఐక్యమత్యం ఉండాలని ఎంఈవో మనోరంజని అన్నారు. కర్లపాలెంలోని మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం సహితా క్లబ్ రివ్యూ కార్యక్రమాన్ని ఎంఈవో ఆధ్వర్యంలో నిర్వహించారు. దివ్యాంగుల పిల్లలకు ఉపాధ్యాయరాలు ఎన్.లక్ష్మీప్రసన్న చేస్తున్న సేవలు భేష్‌గా ఉన్నాయని తల్లిదండ్రులు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పులిపాటి రాజు, ఐఈఆర్‌టీఎస్ ఉపాధ్యాయురాలు ఎన్.లక్ష్మీప్రసన్న, సిహెచ్ చందన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు సేవలు అభినందనీయం

బాపట్ల : మండలంలోని వెదుళ్ళపల్లి వృక్షనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న బడుగు శ్రీనివాసరావును సన్మానించారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఎస్టీయూ నాయకులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు పాల్గొని బడుగు శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎం.పాపారావు, సుబ్బరాయుడు, కొండారెడ్డి, తాతయ్య, అనీల్‌కుమార్, గవిని శ్రీనివాస్, గురజాల శ్రీనివాసరావు, జి.ఉదయశంకర్, ఎన్ఎవస్ ప్రసాదబాబు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు పివి.నాగరాజు, కె.మురళీకృష్ణ, జి.కిరణ్‌కుమార్, వై.నాగసుధలను కూడా సన్మానించారు. ఆదివాసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరువీధుల శంకరప్రసాద్ ఆధ్వర్యంలో కూడా బడుగు శ్రీనివాసరావుకు సన్మానం చేశారు.

విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్


వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్యసిబ్బంది, ఉపాధ్యాయులు

కర్లపాలెం : మండల కేంద్రంలోని ఏట్రవారిపాలెం పంచాయతీ కొత్తరాజులపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. సూపర్‌వైజర్ ఎం.నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ఏఎన్ఎం కె.జయ, ప్రధానోపాధ్యాయిని జె.శ్యామ్‌సుందరి, ఉపాధ్యాయిని జగన్మోహిని, ఎస్‌బి కిషోర్, పి.దివ్యవాణి, బి.నిర్మల, ఎ.యశోద, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

'గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి'

సంగుపాలెం కోడూరు (పిట్టలవానిపాలెం) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన మంత్రి అవాస్ యోజన, ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకాల ద్వారా లబ్ధిదారులు చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలని హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంగుపాలెం కోడూరు గ్రామాల్లో నిర్మిస్తున్న గృహాలను ఆయన స్వయంగా సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడుతూ త్వరగా నిర్మాణం పూర్తిచేస్తే బిల్లులు వస్తాయన్నారు.

నేడు ఎలుకల నిర్మూలన కార్యక్రమాలు

ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం) : మండంలోని 14 పంచాయతీ కార్యాలయాల వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో లోకేశ్వరి తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు పంచాయతీ కార్యాలయాల వద్ద ఎలుక మందు అందజేస్తామన్నారు.

కర్లపాలెం అధికారుల ఫోన్ నంబర్లు

తహసీల్దార్	9849904028
ఎంపీడీవో	7032983495
విద్యుత్ ఏఈ	9440812319
హౌసింగ్ ఏఈ	7093930808
పంచాయతీరాజ్ ఏఈ	9440368890
ఎంఈవో	9908130857
ఎస్ఐ	9440900870
ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ	9959579737

పిట్టలవానిపాలెం అధికారుల ..

ఏవో	888614162
తహసీల్దార్	9949096522
ఎంఈవో	9941245008
విద్యుత్ శాఖ ఏఈ	9440812316
హౌసింగ్ ఏఈ	7039930809
ఎస్.ఐ	9440900871
ఎంపీడీవో	7032983511
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	9177703898
ఈవోపీఆర్డీ	9701369044

ఎలుకల విధ్వంసం రూ.500 కోట్ల పైమాటే!

జిల్లాలో ప్రతియేటా సుమారు రూ.500 కోట్ల నుంచి రూ.700కోట్ల వరకు వివిధ రకాల వ్యవసాయ పంటలను ఎలుకలు ధ్వంసం చేస్తున్నాయి. రైతన్నలు ఆరుగాలం పండించిన పంటలు ఎలుకల పాలుకాకుండా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. వరి పంటలో దీని ప్రభావం ఎక్కువగా ఉంది. వరి, పసుపు, పత్తి, కూరగాయలు, అపరాలు, ఇతర పంటల్లో ఎలుకల బెడద వల్ల రైతులు నష్టపోతున్నారు.



ఎలుకల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు





- కృష్ణా పశ్చిమ డెల్టాలో బెడద
- నేడు పంచాయతీ కార్యాలయాల్లో ఎలుకల నివారణ మందు పంపిణీ

ఆంధ్రజ్యోతి, గుంటూరు

కృష్ణా పశ్చిమ డెల్టాలోని వరి మాగాణి భూముల్లో ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. వ్యవసాయశాఖ కృష్ణాపశ్చిమ డెల్టాలో ఎలుకల నివారణపై రైతులకు ఈనెల 9 బుధవారం ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. సామూహికంగా అన్ని ప్రాంతాల్లో ఒకే రోజు ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిపుణులు సూచించారు. తెనాలి, పొన్నూరు, బాపట్ల, రేపల్లె వ్యవసాయ సబ్ డివిజన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఎలుకల నివాణ మందును పంచాయతీ కార్యాలయాల్లో పంపిణీచేస్తున్నారు. ఎలుకలు ప్రధానంగా రాత్రి పూట వ్యవసాయ పంటలను ధ్వంసం చేస్తుంటాయి. సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు ఎలుకలు సంచరిస్తుంటాయి. వరి పైరు వేసిన నెలరోజుల తరువాత పిలకలను కొరికి ధ్వంసం చేస్తాయి. పంట చేలో రంధ్రాలు వేసి గూడు (బొరియ)ను ఏర్పాటు చేస్తుంది. వరి ఇతర పంటలను తిని ఆహారాన్ని దానిలో భద్రపరుస్తుంది. ఏటా జిల్లాలో వివిధరకాల పంటలను ఇవి దెబ్బతీస్తున్నాయి. మినుము, పెసర, కందిలో ఎక్కువగా ఉంది. కొబ్బరి చెట్లకు పైనే గూళ్ళు ఏర్పాటు చేసి అక్కడే నివాసం ఉంటాయి.

నివారణకు ఉచితంగా మందుల పంపిణీ

వ్యవసాయశాఖ ఎలుకల నివారణకు ఉచితంగా మందులను పంపిణీచేస్తోంది. ఈనెల 9న తెనాలి ప్రాంతంలోని 18 మండలాల్లో మందుల పంపిణీకి ఏర్పా ట్లు చేశారు. బ్రోమోడయోలిన్ అనే పొడరును నువ్వుల నూనె, వేరుశనగ నూనెలో కలిపి వరి నూకలను జతచేసి మిశ్రమరూపంలో తయారుచేయాలి. ఎనిమిది గ్రాముల బ్రోమోడయోలిన్, 8 గ్రాముల నూనె, 384 గ్రాముల వరినూకలను కలిపి, 400 గ్రాముల ఈ మిశ్రమాన్ని, పది గ్రాముల వంతున 40 ప్యాకెట్లను తయారుచేస్తారు. బ్రోమోడయోలిన్ విషపదార్థం.. దీనిలో వరినూకలు, నూనె కలపడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులకు బ్లొజులు ధరించి వీటిని కలపాలి. ఈనెల 9న తొలిదశలో వరి పండే ప్రాంతంలో సామూహికంగా ఎలుకల నివారణకు ప్రభుత్వం, వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. పంచాయతీ కార్యాలయాల వద్ద వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వంఉచితంగా 8 గ్రాముల బ్రోమోడయోలిన్ తెల్ల పొడరును ఉచితంగా ఇస్తారు. రైతులు 8 గ్రాముల నువ్వులు, వేరుశనగ నూనె, వరి నూకలను తీసుకెళ్ళాలి. ఒక ఎకరానికి 40 ప్యాకెట్లు, 400 గ్రాముల ఈ మిశ్రమం సరిపోతుంది. పంట పొలాల్లోని ఎలుకల బోదెల వద్ద ఈ ప్యాకెట్లను వేయాలి. ఈ మందు వేసిన 2-3 రోజులకు ఎలుకలు చనిపోతాయి.

గ్రామాల్లో కూడా నివారణ...

తెనాలి ప్రాంతంలోని 18 మండలాల్లో పంటపొలాలతో పాటు గ్రామాల్లో కూడా ఎలుకల నివారణకు అన్ని చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వరిలో నెలరోజుల తరువాత, పత్తిలో 45 -60 రోజుల్లో ఎలుకలు వచ్చే అవకాశం ఉంది. మినుము, పెసర, కంది పూతదశలో ఎలుకలు వస్తాయని అధికారులు చెప్పారు. ప్రతియేటా జిల్లాలో రూ.500 నుంచి రూ.700 కోట్ల వరకు వ్యవసాయ ఉత్పత్తులకు ఎలుకలు హానీ కలిగిస్తున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ కృపాదాస్ తెలిపారు. ఎలుకల నివారణపై రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే సెల్ నం: 88866 14109కు ఫోన్ చేసి తెలుసుకోవాలని ఆయన సూచించారు.

జీవో నెం.64 రద్దుచేయాలి

వ్యవసాయ కళాశాల విద్యార్థులు

బాపట్ల టౌన్: జీవోనెంబర్ 64ను తక్షణమే రద్దుచేసి పాతజీవో 16ను పునరుద్ధరించాలని వ్యవసాయ కళాశాల విద్యార్థులు అన్నారు. మంగళవారం విద్యార్థులు తరగతులను బహిష్కరించి కళాశాల ప్రధానగేటు ముందు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 64జీవోను రద్దు చేసేంతవరకు తమ నిరసన కొనసాగిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని వ్యవసాయకళాశాలల విద్యార్థులు నిరసనను తెలియపరుస్తున్నారన్నారు. కళాశాల లోపలకు అధ్యాపకులను, సిబ్బందిని విధులకు వెళ్ళనీయకుండా విద్యార్థులు అడ్డుకున్నారు. పాతజీవో 16ను ప్రభుత్వం అమలు చేసేంతవరకు తరగతులు బహిష్కరించి నిరసన తెలుపుతామని విద్యార్థులు తెలియజేశారు.



వ్యవసాయ కళాశాల ప్రధానగేటు ముందు నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ఎందుకో వివక్ష!

- నిడుబ్రోలులో శేషాద్రి, సింహపురి రైళ్ల హాల్టింగ్ ఇవ్వరు
- సీఆర్‌డీఏ పరిధిలోని రైల్వే స్టేషన్‌లో వసతులు కరువు
- పుష్కరకాలంగా ప్రయాణికుల విన్నపాలు బుట్టదాఖలు



నిడుబ్రోలు రైల్వే స్టేషన్

పొన్నూరు: రైతుజన బాంధవుడు, గిన్నిస్‌బుక్ అవార్డు గ్రహీత, సీనియర్ పార్లమెంటేరియన్ దివంగత ఎన్‌జీ రంగా స్వగ్రామమైన నిడుబ్రోలు రైల్వేస్టేషన్ వివక్షకు గురవుతోంది. సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న రైల్వే ప్రయాణికుల విన్నపాలు రైల్వేశాఖ ఉన్నతాధికారులు బుట్టదాఖలు చేస్తున్నారు. నిడుబ్రోలు రైల్వేస్టేషన్‌లో శేషాద్రి, సింహపురి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని పుష్కరకాలంగా కోరుతున్నా రైల్వేశాఖ స్పందన కరువైంది. నిడుబ్రోలు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిత్యం నిడుబ్రోలు, పొన్నూరు, రేపల్లె, నిజాంపట్నం, చేబ్రోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, చందోలు, గుంటూరు నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, చేనేత వ్యాపారులు, తాపీ వర్కర్లు, విద్యావేత్తలు, ఉద్యోగులు 17210/17209 శేషాద్రి, 12709/12710 సింహపురి సూపర్‌ఫాస్ట్ రైళ్లకు అనేక పనులపై వెళుతుంటారు. తెనాలి, బాపట్ల రైల్వేస్టేషన్లలో శేషాద్రి, సింహపురికి హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. ఈ రెండు స్టేషన్ల మధ్యలో ఉన్న నిడుబ్రోలులో హాల్టింగ్ సౌకర్యం లేకపోవడంతో ఈ స్టేషన్ పరిధిలోని ప్రయాణికులు తెనాలి, బాపట్ల స్టేషన్లకు వెళ్లాల్సివస్తోంది. సీఆర్‌డీఏ పరిధిలో ప్రాధాన్యం ఉన్న నిడుబ్రోలు రైల్వేస్టేషన్‌లో శేషాద్రి, సింహపురి రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించేందుకు ఇక్కడి ఆదాయ లెక్కలు తాజాగా తీసుకోకుండా పాతలెక్కలు చూపిస్తున్నారు. ఆదాయం లేదనిసాకుతో ప్రయాణికులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు అందజేసిన విజ్ఞాపన పత్రాలను సైతం కొట్టిపారేస్తున్నారు. దీనికితోడు పార్లమెంటు సభ్యులు నిడుబ్రోలు రైల్వేస్టేషన్ అభివృద్ధి రైళ్ల హాల్టింగ్ సౌకర్యంపై శ్రద్ధ చూపించడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. 2016-17 సంవత్సరానికి నిడుబ్రోలు రైల్వే స్టేషన్ ఆదాయం సుమారు రూ. 4కోట్లు ఉన్నా నిడుబ్రోలు రైల్వేస్టేషన్‌లో శేషాద్రి, సింహాద్రి రైళ్లకు హాల్టింగ్ కల్పించలేదని పట్టణ ప్రముఖులు వాపోతున్నారు. నిడుబ్రోలు రైల్వేస్టేషన్ కంటే ఆకివీడుకు రూ.2.50 కోట్లు, పాల్వంచకు జనరల్ టిక్కెట్ల ద్వారా రూ. 2 కోట్లు మాత్రమే ఆదాయం లభిస్తున్నా ఆ రెండు రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం ఉండడం గమనార్హం!

ఆచార్య ఎన్‌జి.రంగా, నిడుబ్రోలుతో సత్సంబంధాలు ఉన్న గుంటూరు ఎంపీ, ప్రముఖ పారిశ్రామికవేత్త గల్లా జయదేవ్‌పై రైళ్ల హాల్టింగ్ సౌకర్యం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని పొన్నూరు, నిడుబ్రోలు పరిసర ప్రాంతాల ప్రజలు, రైల్వే ప్రయాణికుల సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మారం వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ కోరుతున్నారు.

ప్రజలే జగన్‌కు తగిన బుద్ధి చెబుతారు

● ఎమ్మెల్సీ సతీష్ ప్రభాకర్



బాపట్ల: నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో మచ్చలేని చంద్రునిగా ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వైపు చూసే అర్హత కూడా ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌కు లేదని ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి గురించి అప్రజాస్వామిక పదజాలాన్ని ఉపయోగిస్తూ జగన్ మాట్లాడే తీరుతో నిజస్వరూపం బయట పడిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే జగన్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అంతులేని అవినీతికి పాల్పడిన జగన్‌లో మరో కోణం కూడా ఉందని తేటతెల్లమైందన్నారు. నేర ప్రవృత్తి, అధికార దాహం, మితిమీరిన ఆధిపత్య స్వభావాలతో జగన్ ఉన్మాదిగా మారిపోయాడని ఇలాంటి ఉన్మాదులు రాజకీయ రంగంలో కొనసాగటం రాష్ట్ర ప్రజల దురదృష్టకరమని ఎమ్మెల్సీ సతీష్ ప్రభాకర్ విమర్శించారు.

ఆదివాసీ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్‌గా కొండారెడ్డి

బాపట్ల: ఆదివాసీ సంఘాల జాయింట్ వర్కింగ్ కమిటీ (జేఏసీ) జిల్లాచైర్మన్‌గా కొండారెడ్డి సంజీవరావును నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడావతు విష్ణునాయక్ మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాగాల రాము, రాగాల శ్రీనివాసరావు, రాజేష్ తదితరులు పాల్గొని అభినందించారు. తన నియామకానికి సహకరించినవారికి కొండారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.



కొండారెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న విష్ణునాయక్

13న కోటప్పకొండలో రెడ్డి కులస్థుల వివాహ పరిచయ వేదిక

రొంపిచర్ల : ఈనెల 13వ తేదీన నరసరావుపేట మండలం కోటప్పకొండలోని రెడ్ల సత్రంలో ఆ కులస్తుల వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ మేరకు రొంపిచర్లలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆసక్తి కలిగిన వారు, వారి ఫొటోలను తల్లిదండ్రులు తీసుకొని రావచ్చని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతోందని పొలిమేర వెంకటరెడ్డి, భీమారెడ్డి తెలిపారు.



శిక్షణా శిబిరానికి హాజరైన అభ్యర్థులు

ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాల ఎంపికకు శిక్షణ

నరసరావుపేట : డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాల ఎంపికకు సన్నద్ధం చేసేందుకు అభ్యర్థులకు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వంద మంది హాజరు కాగా, 50 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. మంగళవారం నుంచి స్టేడియంలో ప్రారంభమైన ఈ శిక్షణా శిబిరం నెల రోజుల పాటు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో స్టెప్ అధికారులు కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, ఆర్మీ ప్రతినిధులు శివనాగరాజు, సత్యం, స్టేడియం కమిటీ కన్వీనర్ మందాడి రవి కుమార్, స్టేడియం ఇన్‌చార్జి ఆకుల సత్యనారాయణ, ఆలీ, ఎన్‌సీసీ అధికారి బీ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం కేసులో నిందితులకు జైలు, జరిమానా

నరసరావుపేట లీగల్ : 2006 నవంబరు 27న తాలూకా కేసులో నిధుల దుర్వినియోగం, మోసం తదితర ఆరోపణలు రుజువు కావటంతో నిందితులైన ఇద్దరికీ ఒక్కొక్కరికి ఏడాది జైలు శిక్ష, మొదటి నిందితుడికి రూ 4వేలు, రెండవ నిందితుడికి రూ 3వేలు జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు.. ఫిర్యాదుదారుడు కుప్పం వెంకట ప్రసాదు గుంటూరులో సారిక పారా బాయిల్డ్ రైస్ మిల్‌ను స్థాపించాడు. అప్పట్లో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌గా మొదటి నిందితుడైన రామ్మోహనరావు ఉన్నాడు. ఆ సమయంలో కంపెనీ పేరున కొంత స్థలాన్ని కొన్నారు. తదుపరి రామ్మోహనరావును మేనేజింగ్ డైరెక్టర్ పదవి నుంచి తొలగిస్తూ తీర్మానం చేశారు. ఆ సమయంలో రామ్మోహనరావు తనకు హక్కు లేక పోయినప్పటికీ కంపెనీ తరుపున కొనుగోలు చేసిన భూమిని రెండవ నిందితుడైన గుంటక కోటిరెడ్డికి విక్రయించాడు. ఈ మేరకు ఫిర్యాదుదారుడు కుప్పం వెంకట ప్రసాదు నరసరావుపేట రూరల్ పోలీసులకు కేసు ఫిర్యాదు చేశాడు. కోర్టు విచారణలో నిందితుల ఆరోపణలు రుజువవ్వటంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ షారుమతి నిర్వహించారు.

వరిలో కలుపు నివారణకు యాజమాన్య చర్యలు చేపట్టాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, రైతులు

నరసరావుపేట రూరల్ : మెట్ట వరిలో కలుపు నివారణకు, నీటి యాజమాన్య చర్యలకు చేపట్టాలని ఏవో బీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెదరెడ్డిపాలెం, ములకలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఏవో రెడ్డి మాట్లాడారు. కంది, పెసర పంటల్లో చిత్త పురుగుల ఉధృతి నివారణకు క్లోరి ఫైరిఫాస్ రెండు మిల్లీ లీటర్లు, డైక్లోరోఫాస్ ఒక మిల్లీ లీటరు, లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. పత్తిలో రెండోదఫా ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలన్నారు. మినుము పైరులో తెల్ల దోమ, పేను నివారణకు ఎస్ఫేట్ ఒక గ్రాములో లీటరు నీటిని లేదా పోస్టోథియాన్ రెండు మిల్లీ లీటర్లు, లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. ఒక వేళ ఆకు పచ్చ తెగుళ్ళు గమనిస్తే డైథేనియం రెండు గ్రాములలో లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలని చెప్పారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు రైతు పత్రాలు, సాగు ధ్రువీకరణ పత్రాలు ఎంపీవోల నుంచి పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో ఎం బోసు, కే శ్రీరాములు, మోహనరావు, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు పాసులు సద్వినియోగం చేసుకోవాలి

● మునిసిపల్ చైర్మన్ సుబ్బరాయ గుప్తా



బస్సు పాసులు పంపిణీ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా

నరసరావుపేట టౌన్ : ఆర్టీసీ బస్సు పాసులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా అన్నారు. మంగళవారం మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.16 వేలు విలువ చేసే 400 బస్సు పాసులను తన సొంత ఖర్చులతో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బస్సు పాసులు పిల్లందరికీ అందేలా హెచ్‌ఎం బాధ్యతను తీసుకోవాలన్నారు. విద్యార్థులు పాసులు వినియోగించు కోవాలని, అవసరం లేని వారు, తమ పాసులను ఆర్టీసీ అధికారుల సహకారంతో మరో విద్యార్థికి బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డివిజనల్ మార్కెటింగ్ అధికారులు జే చంద్రశేఖర్, కే చంద్రశేఖర్, పాఠశాల హెచ్‌ఎం ఎం సులేఖ, పీఈటీ భాగ్యలక్ష్మి, రిటైర్డు ఎంఈవో అద్దంకి నాగేశ్వరరావు, జే వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

రొంపిచర్ల : మండలంలోని స్థానిక పంచాయతీ కార్యాలయంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కాటూరి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యులు భవిత, అనీల్ ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. 96 మందికి పరీక్షలు నిర్వహించగా, 36 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ణయించారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నారు. కార్యక్రమంలో పీఆర్‌వో సలాం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రొంపిచర్ల : మండలంలోని కొత్తపల్లి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులైన రెడ్డియ్య, వెంకటబాబు, శ్రీలక్ష్మి బదిలీపై వెళుతున్న నేపథ్యంలో మంగళవారం సన్మానించారు. వారిని నరసరావుపేట సురక్ష సూపర్ స్పెషల్టీ హాస్పిటల్ డాక్టర్ ఖాశిం దంపతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోమటినేని నాసరయ్య, కొలికొండ వెంకట్రావు, యామర్తి వెంకట రామారావు, బిక్షమయ్య, హెచ్‌ఎం సెల్వరాజు, శ్రీనివాసరావు, హనుమంత రావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డాక్టర్ ఖాశిం దంపతులు

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎస్‌బీ పురం విద్యార్థులు

నరసరావుపేట రూరల్ : తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మండలంలోని శంకర్ భారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా ర్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం బీవీఏఎల్ వర ప్రసా ద్‌మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ - 14 విభాగంలో దుర్గా చంద్, ఆకాష్, ప్రశాంత్, అండర్ - 17 విభాగంలో నాగాంజలి, రమ్య ఎంపికయ్యారని పేర్కొన్నా రు. విజేత లుగా నిలిచిన విద్యార్థు లను పాఠశాల పీడీ ఝాన్సీ, వ్యాయామ ఉపాధ్యా యుడు పురుషోత్తం, ఉపాధ్యాయులు అభినందించారని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం బీవీఏఎల్ వర ప్రసాద్



ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ జేఆర్ పుష్పరాజ్‌కు శుభాకాంక్షలు తెలియ జేస్తున్న డీబీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్ కుమార్

రాష్ట్రంలో కల్తీ ఆహార పదార్థాలకు తావివ్వొద్దు

నరసరావుపేట టౌన్ : రాష్ట్రంలో కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసే వారి పై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని దళిత బహుజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్ కోరారు. మంగళవారం రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ జేఆర్ పుష్పరాజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చౌక ధరల దుకాణాల నుంచి ప్రభుత్వం అందించే సరుకులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని రమేష్‌కుమార్ కోరారు. కల్తీ కారం, కల్తీ పాలు, జంతువుల మాంసం నుంచి తయారు చేసిన నూనె తదితర అంశాల పై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట గోదా వెంకట రమణ, వెంకటేశ్వర్లు, రాజేష్, శ్రీను పాల్గొన్నారు.

ముఖ్యమైన ఫోన్ నెంబర్లు

శాసన సభ్యుడు	: 9440993399
మునిసిపల్ చైర్మన్	: 9848157403
ఆర్డీవో	: 9849150077
ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్	: 9885334747
బ్లడ్ బ్యాంక్	: 08647- 224455
మునిసిపల్ కమిషనర్	: 9849905831
డీఎస్పీ	: 9440796209
నరసరావుపేట తహసీల్దార్	: 9849904024
నరసరావుపేట ఎంపీడీవో	:9849903369
ఆర్టీసీ డీఎం	: 9959225428
వ్యవసాయ అధికారి	: 8886614117
నీటి పారుదల శాఖ ఎస్ఈ	: 9490757900
పబ్లిక్ హెల్త్ ఈఈ	: 9849906229
పౌర సరఫరాల అధికారి	: 9701027286

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవి కాదు) సమస్యలు ఉన్నాయా? అలా ఉన్న సమస్యల గురించి ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం: ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య **సెల్ నెంబర్**: 9985411239

సినిమా గైడ్

ఈశ్వరమహల్	దువ్వాడ జగన్నాథం
విజేత	దర్శకుడు
చిత్రాలయ	నక్షత్రం
శారదాంబ	నిన్నుకోరి
రవికళామందిర్	ఫిదా
లక్ష్మీనరసింహ	గౌతమ్‌నంద

నరసరావుపేట — కూరగాయల ధరలు 1 కిలో రూపాయల్లో

టమోటా:50, బెండ:25, గోరుచిక్కుళ్లు:30, వంకాయలు:40, బీర:30, పచ్చిమిర్చి:50, క్యారెట్:80, బంగాళదుంప:25, దోస:20, దొండ: 20, క్యాబేజి:30, కాకర:40, బీట్‌రూట్:50, పెద్ద చిక్కుళ్లు:60, క్యాలీఫ్లవర్:50, కీరదోస:50, సొరకాయ(1):15, ములక్కాయ(1):రూ.10


వర్షంతో రోడ్డుపైకి చేరిన నీరు

రోడ్డుపైకి వర్షపు నీరు



నకరికల్లు: వర్షం కురిస్తే నకరికల్లులో వర్షపు నీరు రోడ్డుపైకి చేరుతోంది. అద్ధంకి-నార్కెట్‌పల్లి ప్రధాన రహదారికిరువైపులా సైడ్ డ్రైన్స్ లేని కారణంగా రోడ్డుపైకి నీరు వస్తోంది. వాహనచోదకులకు, కాలినడక వారికి ఈ మార్గం ఇబ్బందిగా మారింది. అద్దంకి- నార్కెట్‌పల్లి ప్రధాన రహదారికిరువైపులా మురుగుకాలువల నిర్మాణం చేపట్టాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

వ్యవసాయ మార్కెట్ కూలీలకు సీఐటీయూ మద్దతు

నరసరావుపేట టౌన్ : తమకు కూలీ రేట్లు పెంచాలని కోరుతూ వివిధ రూపాలలో శాంతియుతంగా 14 రోజులుగా వ్యవసాయ మార్కెట్ కూలీలు నిరసన చేస్తుండగా మంగళవారం సీఐటీయూ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఒప్పందం ముగిసినప్పటికీ కార్మికులతో చర్చలు జరపగకుండా భయభ్రాంతులకు గురి చే స్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డీ.శివ కుమారి, మార్కెట్ యార్డు ముఠా జిల్లా కార్యదర్శి ఎస్కే నాగుర్ మీరా, కోటిరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు

నకరికల్లు: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా మిషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు అసిస్టెంట్ సేల్స్‌మెన్ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు నరసరావుపేట ఏరియా కోఆర్డినేటర్ కే లక్ష్మారెడ్డి తెలిపారు. విద్యార్హత 10 నుంచి డిగ్రీ వరకు పాస్/ఫెయిల్, 19 నుంచి 25 ఏళ్ల మధ్య గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 75 ఖాళీలున్నాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 10వ తేదీ విద్యార్హత, రేషన్, ఆధార్ జిరాక్స్ ప్రతులు, పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో జిల్లా సమాఖ్య కార్యాలయం, కలెక్టర్ బంగ్లారోడ్, గుంటూరులో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 0863-2210757/7286962778 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

చంద్రన్న బీమా చెక్కుల అందజేత

నరసరావుపేట టౌన్ : పురపాలక సంఘ పరిధిలోని చంద్రన్న బీమాలో చేరి మృతి చెందిన కుటుంబ సభ్యులకు మంగళవారం మునిసిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా చెక్కులు పంపిణీ చేశారు. ఐదుగురు లబ్ధి దారులకు ఒక్కొక్కరికీ రూ 25వేలు చొప్పున చెక్కులు అందించారు. ప్రమాదం మృతి చెందిన పోట్లూరి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు రూ 75వేలు విలువ చేసే చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, బీమా మిత్ర పాల్గొన్నారు.


లబ్ధి దారులకు చెక్కులు అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్ సుబ్బరాయ గుప్తా

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని తహసీల్దార్‌కు వినతి

రొంపిచర్ల : పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలంటూ తహసీల్దార్ కోమటినేని నాసరయ్యకు మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల నాయకులు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం వర్గీకరణ చేపట్టక పోతే ఉద్యమిస్తామని సంఘ నాయకులు బూదాల బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో బందెల డానియేలు, వర్ల చిరంజీవి, దావీదు, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

నరసరావుపేట టౌన్ : విద్యా సంస్థల బంద్‌ను ఈనెల 10న నిర్వహిస్తున్నామని ఏఐఎస్‌ఎఫ్ ఏరియా కార్యదర్శి వైదన వెంకట్ అన్నారు. సీపీఐ కార్యాలయంలో విద్యా సంస్థల బంద్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం సంపత్, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, కిషన్, ప్రతాప్, సతీష్ పాల్గొన్నారు.

స్ప్రింగ్ బోర్డు స్కూల్‌లో ఎంఆర్ వ్యాక్సినేషన్

స్థానిక ప్రకాష్ నగర్‌లోని స్ప్రింగ్ బోర్డు స్కూల్‌లో మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌లు వేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం సుజాత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

నకరికల్లు: రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) పిలుపు మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు ముట్టడించారు. తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గంటా అగస్టీన్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకొని మాదిగలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మురికిపూడి నాగేశ్వరరావు, కే శ్రీను, బొక్కా రవి, యేసుబాబు, పీ నాగయ్య, కే జయరాజు, కనుమూరి శాంశోను, బుజ్జి పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

10న విద్యా సంస్థల రాష్ట్ర బంద్

నరసరావుపేట టౌన్ : విద్యా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 10న విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నామని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పీ.పవన్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎన్జీవో హోంలో బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ఎం గోవింద్ నాయక్, ఆచారి, వాణి, లక్ష్మి, నవీన్, అఖిల్, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ సుకన్య

విద్యార్థులకు భావ వ్యక్తీకరణ నైపుణ్యం అవసరం

నరసరావుపేట రూరల్ : విద్యార్థులు భావ వ్యక్తీకరణ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎస్ఆర్‌డీ ఇన్ఫోటెక్ ఐఎన్‌సీ రిసోర్స్ పర్సన్ సుకన్య అన్నారు. మంగళవారం నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, సమాజ సేవ పై ఉల్లాస్ ట్రస్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సుకన్య మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్ల భాషా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, జ్ఞాపక శక్తిని పెంచుకునే మెలకువల గురించి తెలియజేశారు. సంస్థ డైరెక్టర్ ఎంజేఎం రామలింగారెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రామ్మోహనరావు, సీఏవో టీ త్యాగరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఐ శ్రీధర్, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎన్ వెంకటేశ్వర్లు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు కృష్ణవేణి విద్యార్థులు

నరసరావుపేట టౌన్ : కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎన్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ - 20 విభాగంలో టీ ఈశ్వరి, పీ రవి గుంటూరు జిల్లా తరుపున ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ కే నాసరయ్య, వ్యాయామ అధ్యాపకుడు వీ ఆదిబాబు, ఎం తిరుపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్ తదితరులు అభినందించారని పేర్కొన్నారు.

నేడు సామూహిక ఎలుకల నివారణ

కాకుమాను: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి ధనరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెక్టారుకు బ్రోమెడయోలిన్ రెండు గ్రాముల చొప్పున, వంద గ్రాముల నూకలు, రెండు గ్రాముల నూనె కలిపి బొరియకు పది గ్రాముల చొప్పున విషపు ఎరను పొట్లాలు కట్టి బొరియల్లో వేయాలని సూచించారు. పంటకు, ఇంటికి ఎలుకలు నష్టం కలిగిస్తాయని, కావున రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎలుకల నివారణ చేయాలని తెలిపారు.


విద్యార్థులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

టీకాల ద్వారా వ్యాధుల నుంచి రక్షణ

పొన్నూరు టౌన్: విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేయటం ద్వారా మీజిల్స్, రూబెల్లా వ్యాధుల నుంచి రక్షించవచ్చని నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో మంగళవారం 1200 మంది విద్యార్థులకు ఎంఆర్ టీకాలను ఆరోగ్య శాఖ సిబ్బంది వేశారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ ఎంఆర్ టీకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రామాభివృద్ధికి సహకరించండి'

కాకుమాను: గ్రామాభివృద్ధికి సహకరించాలని ఐటీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను గార్లపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు దొప్పలపూడి కోటేశ్వరరావు కోరారు. మంగళవారం మంత్రి లోకేష్ ఛాంబర్‌లో కలిసిన కోటేశ్వరరావు ఇప్పటికే గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందని, కొమ్మూరు-గార్లపాడు అప్రోచ్ రోడ్ వంటి అభివృద్ధి పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇంకా గ్రామంలో మౌలిక వసతుల కల్పన గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.


మంత్రి లోకేష్‌ను కలిసిన కోటేశ్వరరావు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పొన్నూరుటౌన్: ట్రాక్టర్ ఢీకొని రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలైన సంఘటనపై రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పోలీసుల కథనం ప్రకారం రేపల్లెకు చెందిన బి.నాగదేవి ద్విచక్ర వాహనంపై రేపల్లె నుంచి గుంటూరు వెళ్తుండగా మార్గమధ్యంలో మునిపల్లె గ్రామం వద్ద నాగదేవి ద్విచక్ర వాహనాన్ని సోమవారం రాత్రి ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో నాగదేవికి గాయాలు కాగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేశారు. నాగదేవి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

'రసం పీల్చే పురుగును నివారించాలి'

చేబ్రోలు: పత్తి పంటలో అధికంగా రసం పీల్చే పురుగులు ఉధృతమవుతాయని వీటిని వెంటనే నివారించాలని మండల ఏఈవో నాగశ్రీనివాస్ అన్నారు. మండలంలోని గొడవర్రు, గుండవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగశ్రీనివాస్ మాట్లాడుతూ రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడో క్లోఫిన్ అనే మందును వాడాలని రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సునీత, ఎంపీఈవోలు సాల్మన్, మాణిక్యాలరావు, అల్లాబక్షు, వెంకట్ రెడ్డి, రమణ, భావన, రైతులు ఆయా గ్రామ సర్పంచులు దానబోయిన వెంకటేశ్వర్లు, రామారావు, అంజిబాబు పాల్గొన్నారు.



రైతు క్షేత్ర ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు

అభివృద్ధిని చూడలేకే విమర్శలు

● మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ హేమలత

పొన్నూరు టౌన్: అందరికీ ఇళ్ళు పథకం ద్వారా వేలాది మంది నిరుపేదలకు పారదర్శకంగా ఇళ్ళు అందచేస్తున్నామని, పట్టణ అభివృద్ధిని చూడలేకే వైసీపీ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో చైర్‌పర్సన్ డాక్టర్ హేమలత మాట్లాడుతూ ఇళ్ళ లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించామన్నారు. పట్టణంలోని పేదలను ఎంపిక చేసి ఇళ్ళను మంజూరుచేసినట్లు తెలిపారు. అయితే వైసీపీ నాయకులు ఇళ్ళ ఎంపికపై అవాకులు చవాకులు మాట్లాడటం సరికాదన్నారు. జాబితాలో అనర్హులు ఉంటే ఆధార్ లింక్ ద్వారా బయటపడుతుందన్నారు.

వైస్ చైర్మన్ ఆకుల సాంబశివరావు మాట్లాడుతూ వైసీపీ నాయకులకు అభివృద్ధి నచ్చదన్నారు. స్థానికంగా ఉండని నాయకులు విజిటింగ్‌కు వచ్చినట్లు వచ్చి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. లక్ష లోపు జనాభాకు అందరికీ ఇళ్ళు పథకం లేకపోయినప్పటికీ ఎమ్మెల్యే నరేంద్రకుమార్ రూ.170 కోట్లతో నిర్మించే ఈ పథకాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ద్వారా సాధించారన్నారు. జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణచౌదరి మాట్లాడుతూ అందరికీ ఇళ్ళ పథకంలో పేదల నుంచి వస్తున్న స్పందన చూసి వైసీపీ నాయకులు అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. కౌన్సిలర్ దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరికీ ఇళ్ళు పథకంలో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోలేదని, అవకతవకలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. వైసీపీ నాయకులు ఆరోపణలు నిరూపించుకోకుంటే రాజకీయాలకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, కౌన్సిలర్లు షేక్ గౌస్, శిలార్‌బాషా, అనిశెట్టి వీరబాబు, టీడీపీ నాయకులు వేమూరి శ్రీను, తోట ప్రసాద్, షేక్ బాజీసాహెబ్, ఎద్దు సోంబాబు, తోటకూర నరేష్, షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత తదితరులు

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

కాకుమాను: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు పొందుతారని వార్డు మెంబర్ దేవరాజ్ అన్నారు. మండల పరిధిలోని అప్పాపురంలో స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న నాగరాజు బదిలీపై బాపట్ల మండలం మర్రిపోలువారిపాలెంకి వెళ్ళారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుడు నాగరాజుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్ భూషణం మాట్లాడుతూ విద్యా బోధనలో విద్యార్థులకు, మనసుతో గ్రామ ప్రజలతో మమేకమైన మాష్టారును ఎప్పటికీ మరువలేమన్నారు. బదిలీపై వెళ్తున్నారన్న విషయం తెలుసుకున్న విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని, భావిభారత పౌరులుగా మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయుడిని దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో దాత ఈదుల మూడి శ్యామ్‌బాబు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శాంతమ్మ, భాస్కర్‌రావు, మేరిమ్మ పాల్గొన్నారు.

కొత్తపాలెం ప్రాథమిక పాఠశాలలో...

పెదనందిపాడు: స్థానిక కొత్తపాలెం ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్ళిన సునీత, శ్రీలక్ష్మి ఉపాధ్యాయులకు మంగళవారం అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో డి.బాలసుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడుతూ ఎంతోమంది మేధావులను తీర్చిదిద్దగల ఘనత ఉపాధ్యాయ వృత్తికే ఉంటుందన్నారు.

విద్యార్థులను ఉపాధ్యాయులు భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జవహర్‌రాణి, ఉపాధ్యాయులు, సీఆర్‌పి సంగీత తదితరులు పాల్గొన్నారు.


బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు నాగరాజుకు సన్మానం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈవో డి.బాలసుబ్రహ్మణ్యం

ఉమ్మడి ఎస్సీలను ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలి

పెదనందిపాడు: ఉమ్మడి ఎస్సీలను ఏబీసీడీ వర్గీకరణగా చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కె.వీరయ్య కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఎమ్మార్పీఎస్ పిలుపు మేరకు మంగళవారం తహసీల్దార్ కె.మోహన్‌రావుకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టినా కాని ప్రభుత్వానికి ఎలాంటి చలనం లేదని, వెంటనే తమ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జాకబ్, పి.రమేష్, కె.జయచంద్రరావు, పి.పాపారావు, అబ్రహాం, అంకయ్య, బెనాద్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సినిమా గైడ్

శ్రీలక్ష్మి	గౌతమనంద
పీవీఎస్	శమంతకమణి
శ్రీనివాస	దువ్వాడ జగన్నాథం
సుబ్బరాయ	నక్షత్రం

ప్రత్తిపాడు వార్తలు

మహిళల ఆర్థిక స్వాలంభనకు కుట్టు శిక్షణ

వట్టిచెరుకూరు : మహిళల ఆర్థిక స్వాలంభన సాధించేందుకు కుట్టు శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ఐసీఐసీఐ బ్యాంక్ రీజనల్ హెడ్ పాల్ రత్నహంస అన్నారు. మండలంలోని లేమల్లెపాడు గ్రామంలోని ఐసీఐసీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో 40 మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా పాల్ రత్న హంస పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కాకుమాను మరియరాణి అధ్యక్షత వహించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆయా కుటుంబాలు పరిపుష్టిగా ఉంటాయనే ఉచితంగా కుట్టు శిక్షణా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిక్షణ ద్వారా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవచ్చని అన్నారు. బ్రాంచ్ మేనేజర్ సూర్య మాట్లాడుతూ 40 మంది మహిళలకు తమ బ్రాంచ్ సొంత ఖర్చులతో ఉచిత శిక్షణ ఇప్పించడం జరిగిందని బ్యాంక్ ద్వారా చేయూతనిచ్చేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. టైలరింగ్ పూర్తి చేసుకున్న 40 మందికి పాల్‌రత్న హంస, గ్రామ సర్పంచ్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఐసీఐసీఐ బ్యాంక్ ఏర్పాటు చేయడానికి పూర్తి సహకారం అందించిన నెలకుదిటి రవిబాబు కృషి ఎంతో ఉందని ఆయన అన్నారు.



కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న పాల్ రత్న హంస, సర్పంచ్ మరియరాణి

నాగులపాడులో వరుణుని కోసం పూజలు

నాగులపాడు(పెదనందిపాడు): మండల పరిధిలోని నాగులపాడులో వరుణుని కోసం మంగళవారం పూజలు చేశారు. భక్తులు బొడ్డురాయికి, అమ్మవారికి వారులు పోసి, పొంగళ్ళు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారికి పూజలు నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

మాదిగల రుణం తీర్చుకుంటానన్న సీఎం మాట మార్చారు

● ఎమ్మార్పీఎస్ నాయకుల ధ్వజం

ప్రత్తిపాడు: తెలుగుదేశం పార్టీకి అండగా ఉండే మాదిగల రుణం తీర్చుకుంటానని మాట ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు మాట తప్పారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దున్నా సాంబయ్య ధ్వజమెత్తారు. ప్రత్తిపాడులో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డప్పు కొడుతూ చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పద్మావతికి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతూ మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా దున్నా సాంబయ్య మాట్లాడుతూ ఆనాడు చంద్రబాబు మా కండువా వేసుకుని, మా డప్పుకొట్టి మీలో ఒకడిగా మీ రుణం తీర్చుకుంటానంటూ మాట ఇచ్చాడన్నారు. కాని ఈనాడు వర్గీకరణ విషయంలో నోరు మెదపటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీసీడీ వర్గీకరణ సాధించే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారసాల జాకోబ్, మందా రవి, కే.శ్రీను, కే.ప్రసాద్, వీ.విశ్వేశ్వరరావు, కే.అంకయ్య, కే.చిట్టిబాబు, కే.ప్రకాష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

జీఈసీలో రెండు రోజుల పాటు వర్క్‌షాపు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని గుంటూరు ఇంజనీరింగ్ కళాశాలలో అప్లికేషన్ ఆఫ్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ మీద 9, 10 తేదీలలో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ మిరియాల నరహరిరావు తెలిపారు. బీటెక్ నాలుగవ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం వైడల్ ఎకన్‌డీటీ టీమ్ విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నృత్య పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

తెనాలి కల్చరల్ : చెన్నైలో ఆగస్టు 5, 6 తేదీల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య 24వ వార్షికోత్సవంలో భాగంగా తెలుగు వైభవంలో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో పట్టణానికి చెం దిన విద్యార్థినులు బహుమతులు సాధించారు. స్వరలయ వేదిక లక్కరాజు సాయి ఆధ్వర్యంలో విద్యార్థులు నృత్య పోటీల్లో పాల్గొ న్నారు. నిర్మలా రమేష్ శిష్య బృందం కళ్యాణి, కుసుమ, భారతి, సింధూర, పూజా బృంద నృత్యాల్లో ద్వితీయ, సీనియర్‌లో కళ్యాణి తృతీయ, జూనియర్ సోలో హసినీరెడ్డి ద్వితీయ బహుమతి అందుకుంది. వీరిని సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరాదత్, హిందీ అకాడమీ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఐఏఎస్ అధికారి కాకర్త ఉష అభినందించారు.

ప్రత్తిపాడు మండలం నుంచి 33 మంది ఉపాధ్యాయుల రిలీవ్

ప్రత్తిపాడు: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రత్తిపాడు మండలం నుంచి 33 మంది ఉపాధ్యాయులు బదిలీ అయినట్లు ఎంఈవో రమాదేవి తెలిపారు. ఇందులో వివిధ మండలాలకు 25 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా, ప్రత్తిపాడు మండలంలోనే ఇతర పాఠశాలలకు 8 మంది ఉపాధ్యాయులు బదిలీ అయినట్లు ఎంఈవో తెలిపారు. వీరందరికీ మంగళవారం రిలీవ్ ఆర్డర్‌లను ఎంఈవో అందజేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరూ బుధవారం ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరవలసి ఉంటుందన్నారు. మండలంలో అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ప్రస్తుతం బదిలీ అయిన చోట్ల కూడా ఉపాధ్యాయులు బుధవారం విధులలో చేరతారన్నారు. ఉత్తమ విద్యను అందించే విధంగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తాయని ఎంఈవో రమాదేవి తెలిపారు. ఇక్కడ ఏ విధంగా విలువలతో కూడిన విద్యను అందించి మంచి పేరు తెచ్చుకున్నారో మీరు వెళ్లే పాఠశాలల్లో కూడా అదే విధంగా పేరు తెచ్చుకోవాలని ఆమె ఉపాధ్యాయులను కోరారు.



ఉపాధ్యాయులకు రిలీవ్ ఆర్డర్‌లను అందజేస్తున్న ఎంఈవో రమాదేవి

విద్య వ్యాపారం చేసేందుకు చట్టం

యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి

తెనాలి అర్బన్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టంతో విద్య వ్యాపారంగా మారిపోతుందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల నియంత్రణ చట్టం-2017 అనే అంశంపై మంగళవారం వైష్ణవి జూనియర్ కళాశాలలో సదస్సు నిర్వహిం చారు. చట్టంపై ముసాయిదా బిల్లును ప్రవేశపెట్టి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. ఈ బిల్లు చట్టమైతే సామాన్యులకు విద్య అందుబాటులో లేకుండా పోతుందని ఆం దోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కార్పొరేట్ శక్తులు కారణంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దిగజారిపోతుందని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలు ఫీజులు ఇష్టానుసారం పెంచుకునే హక్కులు కలుగుతాయన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ అంతా ఒకటి, రెండు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి పోవడంతో పాటు చిన్నాచితక ప్రైవేట్ పాఠశాలలు మూతబడతాయని తెలిపారు. ముసాయిదా బిల్లు చట్టంగా మారక ముందే అన్ని ప్రజా సం ఘాలు వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. రాష్ట్ర సహ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఉదయభాస్కర్, మల్లేశ్వరరావు, కుర్రా శ్రీనివాసరావు, దౌలా, డేవిడ్‌రాజు, నాంచారయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న బాబురెడ్డి

ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్‌లో వీఎస్ఆర్ విద్యార్థినులు

తెనాలి కల్చరల్ : వెలగపూడి సచివాలయంలో శాసన సభ స్పీకర్ కోడెల శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన అమ రావతి డిక్లరేషన్ ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ సదస్సులో స్థానిక వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. సోమవారం మహిళా సాధికారత అంశంపై విద్యార్థినులు జి.పూజిత, యామిని, సీహెచ్ హేమనాగ మణి, కళాశాల తెలుగు శాఖాధిపతి కేవీ పద్మావతిలు తమ అభిప్రాయం వివరించారు. స్పీకర్‌తో పాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత, ఐఏఎస్ అధికారులతో చర్చించారు. మంగళవారం నిర్వహించిన అభినందన సభలో కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో నేషనల్ ఉమెన్స్ పార్లమెంట్‌లో విద్యార్థులను ఎంపిక చేశారని అందులో తమ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించడం అభినందనీయమ న్నారు. విద్యార్థులను ఏవో సుగుణ, ప్రిన్సిపల్ డీవీ సోమయ్యశాస్త్రి, అధ్యాపకులు అభినందించారు.



స్పీకర్ కోడెల శివప్రసాద్‌తో చర్చిస్తున్న విద్యార్థినులు

ఆంధ్రజ్యోతి
17
రేపల్లె
గుంటూరు। బుధవారం 9 ఆగస్టు 2017
రేపల్లె । భట్టిప్రోలు । నగరం । చెరుకుపల్లి । నిజాంపట్నం

జడ్పీలో సుఖవాసిజగన్నాథం కాంస్య విగ్రహావిష్కరణ

రేపల్లె: మండలంలోని నల్లూరుపాలెం జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో సుఖవాసి జగన్నాథం కాంస్య విగ్రహాన్ని మంగళవారం ప్రగతి రిసార్ట్స్ అధినేత గద్దిపాటి బాలకోటేశ్వరరావు ఆవిష్కరించారు. తన తాత జగన్నాథం జ్ఞాపకార్థం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, గ్రామంలో సేవా కార్యక్రమాలు చేయాలనే ఆలోచనతో ముందడుగు వేసినట్లు బాలకోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాగితాల సుబ్బారావు, రాగిపాటి గోవిందమ్మ, సుఖవాసి సతీష్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు సంరక్షణ



బాలింతల వివరాలను సేకరిస్తున్న సీడీపీవో పరిశా రాధాకృష్ణ, అంగన్‌వాడీలు

రేపల్లె: తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బాలింతలు, గర్భిణులు పోషకాలున్న పదార్థాలను తీసుకోవాలని సీడీపీవో పరిశా రాధాకృష్ణ అన్నారు. మంగళ వారం ప్రభుత్వ వైద్యశాలలోని బాలింతల వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. అప్పుడే పుట్టిన శిశువులకు ముర్రుపాలు అందించటం ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యం పొందుతారన్నారు. బిడ్డలకు తల్లిపాలు తాగించటం వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని అన్నారు. బిడ్డకు ఆరు నెలల వచ్చే వరకు తల్లిపాలు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నిజాంపట్నంలోనూ

నిజాంపట్నంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు పట్టించడం వల్ల చిన్నారులు ఆరోగ్యవంతంగా ఎదుగుతారని సూపర్ వైజర్ రజని అన్నారు. కార్యక్రమంలో ఆశా, ఉషా, నాగదేవత పాల్గొన్నారు.

వరినాట్లు యంత్రం ప్రారంభం

పూడివాడ(నగరం): మండలంలోని పూడివాడ, శిరిపూడి గ్రామాల్లో యంత్రాలతో వరినాట్లు వేసే కార్యక్రమాన్ని మంగళవారం రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సాంప్రదాయ పద్ధతిలో కూలీలతో వేయించే వరినాట్లు ఎక్కువ ఖర్చుతో కూడిందని అన్నారు. తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో వరినాట్లు వేసేందుకు యంత్రాలు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో బుష్, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.



యంత్రం సహాయంతో వరినాటు వేయిస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్లు

అంకమ్మతల్లికి పూజలు

రేపల్లె : మండలంలోని నల్లూరుపాలెంలో అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా మంగళవారం దేవాలయ ప్రాంగణంలో వేద పండితులు హోమగుండ పూజలు నిర్వహించారు. బుధవారం అంకమ్మతల్లి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించి, అన్నసంతర్పణ నిర్వహించనున్నట్లు గ్రామకమిటీ సభ్యులు తెలిపారు.

దమ్ము ట్రాక్టర్లతో రోడ్లకు ఇబ్బంది !



నగరం: రోడ్లపైకి దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహ దారులు ధ్వంసమవు తున్నాయి. ఇప్పటికైనా ట్రాక్టర్ యజమానులు జాగ్రత్తలు పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు సంక్షేమానికే సహకార బ్యాంకులు

నిజాంపట్నం: రైతుల సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా సహకార బ్యాంక్‌లు కృషి చేస్తున్నాయని జీడీసీసీబీ చైర్మన్ ముమ్మనేని వెంకట సుబ్బయ్య అన్నారు. మంగళవారం నిజాంపట్నం సహకార బ్యాంక్‌లో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని కూచినపూడి, పెదపల్లి, నిజాంపట్నం సొసైటీల పరిధిలోని బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. జిల్లాలో 167 సొసైటీలకు 65 బ్యాంక్‌ల ద్వారా వెయ్యి కోట్లు రుణాలను అందించినట్లు తెలిపారు. తక్కువ వడ్డీపై విద్యకు, గృహ నిర్మాణాలకు ఈ బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీయం శేషబానురావు, ఓఎస్‌డి విజయలక్ష్మి, బ్రాంచి మేనేజర్ జానీ, శ్రీనివాసరెడ్డి, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీడీసీసీబీ చైర్మన్ ముమ్మనేని వెంకట సుబ్బయ్య

రైతులకు వెయ్యి కోట్లు వడ్డీలేని రుణాలు అందించాం

చెరుకుపల్లి: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా రైతులకు వెయ్యి కోట్లు వడ్డీ లేని రుణాలు అందించామని జీడీసీసీబీ చైర్మన్ ముమ్మనేని వెంకట సుబ్బయ్య అన్నారు. స్థానిక సహకార బ్యాంక్‌లో అధికారులతోనూ, సహకార సంఘాల అధ్యక్షులతోనూ మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంక్ అన్ని విభాగాలలో ముందంజలో ఉందన్నారు. ఎకరా మాగాణికి రూ. 50 వేలు వడ్డీలేని రుణం, 75 వేలు అదనంగా రూపాయి వడ్డీకి అందిస్తున్నామని తెలిపారు. తాను పదవి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వెయ్యి కోట్లు రుణాలు అందించి, ప్రతియేటా రెన్యువల్ చేయించామని తెలిపారు. బకాయిల వసూలుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శేష భానురావు, డాక్టర్ విజయలక్ష్మి సేల్స్ ఆఫీసర్ సుజాత, బీయం జీవి రమణమ్మ, సహకార సంఘాల అధ్యక్షులు ఆలపాటి వెంకట సుబ్బయ్య దివిరాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

చెరుకుపల్లి: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని దుర్గాబాయ్ మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ డి.సంధ్యారాణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్థిక సంస్థ ఆధ్వర్యాన కాపుల బజారు రామాలయం కల్యాణ మండపంలో మూడు మాసాలుగా నిరుద్యోగ కాపు మహిళలకు కుట్టు శిక్షణ మంగళవారం తో ముగిసింది. ఈ సందర్భంగా సంధ్యారాణి, ఎంపీపీ పార్వతి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను వంటింటికి పరిమితం కాకుండా అన్నిరంగాలలోనూ శిక్షణ ఇప్పించి, వారి కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. టైలరింగ్ నేర్చుకున్నట్లయితే కుటుంబ ఖర్చులను మహిళలే సంపాదించవచ్చని అన్నారు. తొలివిడతగా 81 మంది నిరుద్యోగ కాపు మహిళలకు మూడు నెలలు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విస్సా కోటేశ్వరమ్మ, విజయ్‌కుమారి, శ్రీలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ సంధ్యారాణి

దివ్యాంగులకు సహకారం అందించాలి

రేపల్లె: దివ్యాంగులైన చిన్నారులకు అందరూ సహకరించాలని రోటరీ క్లబ్ ఆఫ్ రేపల్లె రూరల్ అధ్యక్షుడు కోడె గౌరీశంకర్ అన్నారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో భవిత పాఠశాలకు రెండు ఫ్యాన్‌లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఎంఈవో నవీన్‌కుమార్, క్లబ్ కార్యదర్శి వై.బుచ్చిరావు, అసిస్టెంట్ గవర్నర్ ఎంఎం సక్సేనా, మల్లెల రామచంద్రరావు, రామకృష్ణబాబు, వి.సాగర్‌రావు, ఎం.అనూరాధ, పి.రమాదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నేత కార్మికులు నూతన పద్ధతులు అవలంబించాలి



రోడ్లను శుభ్రపరుస్తున్న చేనేత నాయకులు

చెరుకుపల్లి: చేనేత కార్మికులు నూతన పద్ధతులను అవలంబించి, వారి జీవన ప్రమాణాలను మెరుగు పర్చుకోవాలని జాతీయ చేనేత అభివృద్ధి కార్పొరేషన్ చీఫ్ మేనేజర్ గణేశన్ అన్నారు. ఎన్‌హెచ్‌డీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పురవీధులను శుభ్రపర్చారు. అనంతరం ఆరుంబాక చేనేత విక్రయసంఘం ఆవర ణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులు చేనేత అభివృద్ధి సంస్థ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత సొసైటీ అధ్యక్షుడు దివి రాంబాబు, దివి శ్రీనివాసరావు, ఎస్.సూర్యనారాయణ, బి.సుబ్బారావు, లక్ష్మీ నర్సు, చెన్నకేశవస్వామి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కందుల వెంకటేశ్వరరావు, కందుల చంద్రమౌళి పాల్గొన్నారు.

డీకే భూముల్లో ఆక్వాసాగుకు అనుమతి పొందాలి

రేపల్లె: నియోజకవర్గంలోని రేపల్లె, నిజాంపట్నం మండలాల్లో గల ఆక్వా రైతులు డీకేటీ, ఏడబ్ల్యూడీ భూముల్లో ఆక్వాసాగుకు ప్రభుత్వ అనుమతి పొందాలని మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసనాయక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఎటువంటి అనుమతులు లేకుండా భూములను తవ్వుకొని ఆక్వాసాగు చేస్తున్నారన్నారు. మత్స్యశాఖాధికారులకు రైతులు దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

శ్రీకృష్ణ	గౌతమ్‌నంద
బసవేశ్వర	ఫిదా

అన్న అమృతహస్తం పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి

సత్తెనపల్లి రూరల్: అన్న అమృతహస్తం పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని సివిల్ సప్లై డీటీ బాల కృష్ణ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, కంటెపూడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే మంచి ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అంగన్‌వాడీలదేనన్నారు. భోజనాన్ని పరిశీలించారు. లక్ష్మీపురం, కంటెపూడితో పాటు కట్టావారిపాలెంలోని రేషన్‌షాపులను కూడా ఆయన తనిఖీ చేశారు. కార్డుదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



రామకృష్ణాపురంలో పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేస్తున్న పోపూరి కృష్ణారావు

సంగం డెయిరీ డైరెక్టర్ పోపూరి కృష్ణారావు

సత్తెనపల్లి రూరల్: మండలంలోని కొమెరపూడి, రామకృష్ణాపురం, నందిగామ గ్రామాల్లోని సంగం డెయిరీ పాల ఉత్పత్తి దారుల బోనస్ పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న డెయిరీ డైరెక్టర్ పోపూరి కృష్ణారావు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే డెయిరీ ధ్యేయం అన్నారు. బోనస్‌ను అందుకున్న రైతులు ఆ నగదును సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు సంపదను పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

అనంతరం మూడు గ్రామాల్లోని పాల ఉత్పత్తిదారులకు ఆయన బోనస్‌ను పంపిణీ చేశారు. కొమెరపూడిలో 50 మంది రైతులకు రూ.93,650, రామకృష్ణాపురంలో 38 మంది రైతులకు రూ.72 వేలు, నందిగామలో 130 మంది రైతులకు రూ.6 లక్షల 5వేల బోనస్‌ను పంపిణీ చేసినట్లు డైరెక్టర్ కృష్ణారావు చెప్పారు.

కొమెరపూడిలో కొరబండి జోజప్ప రూ.8,716, రామకృష్ణాపురంలో బి.పూర్ణయ్య రూ.18,700, నందిగామలో ముండ్రు పిచ్చయ్య రూ.51 వేల అత్యధిక బోనస్‌ను అందుకున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో రెంటపాళ్ళ బీఎంసీ మేనేజర్ వీవీఆర్‌కే ప్రసాద్, పాల కేంద్రం అధ్యక్షుడు యర్రా వెంకటేశ్వరరావు, ఆళ్ళ అప్పయ్య, కార్యదర్శులు ధూళిపాళ్ళ భూపతి, శొంఠినేని సాంబశివరావు, సూపర్‌వైజర్ ఎన్‌వీ కిరణ్‌కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆళ్ళ సాంబయ్య, చెంబేటి బొల్లయ్య, యర్రా ఆదినారాయణ, ఆళ్ళ అనంతకోటేశ్వరరావు, యర్రా సాంబయ్య, గఫూర్, గాలిబ్‌సైదా పాల్గొన్నారు.

చాగంటివారిపాలెం, నార్నెపాడు గ్రామాల్లో...

ముప్పాళ్ళ : మండలంలోని చాగంటివారిపాలెం, నార్నెపాడు గ్రామాల్లో సంగం డెయిరీ ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారులకు బోనస్‌లు పంపిణీ చేసినట్లు సంగం డెయిరీ సూపర్‌వైజర్ బద్దుల హనుమంతరావు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగం డెయిరీ డైరెక్టర్ పోపూరి కృష్ణారావు ఉత్పత్తిదారులకు బోనస్‌లను పంపిణీ చేశారు.

చాగంటివారిపాలెంలో రూ.2 లక్షల 67 వేల 620లను 95 మంది పాల ఉత్పత్తిదారులకు 100కి 10 రూపాయల 13 పైసల చొప్పున, నార్నెపాడులో రూ.5 లక్షల 61 వేల 515ను 158 మంది రైతులకు 100కి 9 రూపాయల 16 పైసల చొప్పున పంపిణీ చేశారు. అత్యధికంగా ఆరుద్ర వీరకుమార్ రూ.20,204ను బోనస్‌గా పొందారు. కార్యక్రమంలో చాగంటివారిపాలెం సంగం పాల సేకరణ కేంద్రం అధ్యక్షుడు వేమవరపు శివారెడ్డి, మదిర రంగనాయకులు, నార్నెపాడు పాల సేకరణ కేంద్రం అధ్యక్షుడు మైనేని వెంకటేశ్వర్లు, రావిపాటి దేవేంద్రరావు, పాతూరి పెంచలయ్య పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

● తహసీల్దార్ శంకరబాబు

భృగుబండ(సత్తెనపల్లిరూరల్): చుక్కల భూముల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేసిందని తహసీల్దార్ శంకరబాబు అన్నారు. మండలంలోని భృగుబండలో మంగళవారం చుక్కలభూముల గ్రామసభ జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ చుక్కల భూములు సాగు చేసుకుంటున్న రైతులు సంబంధిత ఆధారాలతో గ్రామసభలో దరఖాస్తులు అందించాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. అనంతరం రైతుల వద్ద నుంచి దరఖాస్తులను తహసీల్దార్ స్వీకరించారు. 59 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి రైతుల వద్ద నుంచి 40 అర్జీలు వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వోలు చిమటా పేరయ్య, ఆర్డీ ప్రసాదరావు, సర్పంచ్ దుగ్గి మరియమ్మ, ఎంపీటీసీ దుగ్గి నాగరత్నం, మాజీ సర్పంచ్ అన్నదాసు వెంకటరామయ్య, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ అన్నదాసు శంకర్రావు, పాకాలపాడు సొసైటీ డైరెక్టర్ బొజ్జా నాగేశ్వరరావు, అన్నదాసు శివ రాఘవరావు, రైతులు పాల్గొన్నారు.



భృగుబండలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న తహసీల్దార్ శంకరబాబు

1345 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్

సత్తెనపల్లిరూరల్: మండలంలోని రెంటపాళ్ళ, పెదమక్కెన, అబ్బూరు గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు ఫణిదం పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. అబ్బూరులో జరిగిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్‌నాయక్ పరిశీలించి ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. 1507 మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేయటం లక్ష్యం కాగా 1345 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసినట్లు డాక్టర్ చెప్పారు.

ప్రగతి పాఠశాలలో...

ప్రగతి పాఠశాలలో మంగళవారం 980 మంది విద్యార్థులకు పీపీ యూనిట్ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మక్కెన పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో....

ముప్పాళ్ళ: మండలంలోని నాలుగు గ్రామాల్లో ఎంఆర్ వ్యాక్సిన్‌ను 15 సంవత్సరాల లోపు పిల్లలకు వేసినట్లు మంగళవారం డాక్టర్ శ్రీజ్యోతి తెలిపారు. నార్నెపాడు, పలుదేవర్లపాడు, బొల్లవరం, రుద్రవరం గ్రామాల్లో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశామన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ రమణారావు, హెల్త్ సూపర్‌వైజర్లు పీటర్ డానియేన్, సరోజిని దేవి, ఏఎన్ఎంలు, ఆషాలు పాల్గొన్నారు.



ప్రగతి పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న చిత్రం



గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఎంబీబీఎస్ విద్యార్థులు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

భృగుబండ, కందులవారిపాలెం(సత్తెనపల్లిరూరల్): గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని గుంటూరు మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ విద్యార్థులు అన్నారు. మండలంలోని భృగుబండ, కందులవారిపాలెం గ్రామాల్లో మంగళవారం స్వాస్థ్య విద్యావాహిని కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ విద్యార్థులు గర్భిణులు, బాలింతల గృహాలను సందర్శించారు. ఎటువంటి ఆహారం తీసుకోవాలి. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అన్న అమృతహస్తం పథకం ద్వారా వడ్డిస్తున్న ఆహారాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంబీబీఎస్ విద్యార్థులు వంశీరూపేష్, వెంకటసాయి, రాకేష్, తేజోరాం, ఆరోగ్య పర్యవేక్షకులు జి.రాణి, పెండెం మణిరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మెహెరున్నీసా, ఏఎన్ఎం విజయరాణి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుంది

సత్తెనపల్లి: దళితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఎల్.రవి, పట్టణ అధికార ప్రతినిధి జి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా దేవరపల్లి దళితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు.

నీట్‌లో 38వ ర్యాంకు సాధించిన నిఖిల్



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎం.జయమ్మ కుమారుడు నిఖిల్‌కు ఎంబీబీఎస్ సీటు వచ్చింది. నీట్‌లో ఎస్టీ కేటగిరిలో ఆంధ్రా, తెలంగాణలో ఆయనకు 38వ ర్యాంకు వచ్చింది. ఆయన తండ్రి డాక్టర్ వెంకటేశ్వరబాబు హైదరాబాద్‌లోని ఈసీఎల్‌లో సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నంపై కేసు నమోదు

ముప్పాళ్ళ: మండలంలోని రుద్రవరం ఎస్సీ కాలనీలో తల్లి మందలించిందనే నెపంతో గంటా చైతన్య అనే యువకుడు పురుగుమందు తాగాడని అతనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ భుజంగరావు మంగళవారం తెలిపారు. తల్లి మందలించిందనే చైతన్య సోమవారం సాయంత్రం గడ్డి మందు తాగాడని, కుటుంబ సభ్యులు గమనించి సత్తెనపల్లిలోని ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారని కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి : డీఎస్పీ

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలని డీఎస్పీ మధుసూధనరావు అన్నారు. డీఎస్పీ కార్యాలయ ఆవరణలో మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ద్విచక్రవాహనదారులు ప్రతిఒక్కరూ హెల్మెట్ వాడుకునేలా అవగాహన కల్పించాలని సత్తెనపల్లి సబ్-డివిజన్ పరిధిలోని ఎస్ఐలకు, సీఐలకు డీఎస్పీ సూచించారు. సబ్-డివిజన్ పరిధిలోని వివిధ అంశాలకు సంబంధించి ఎస్సైలు, సీఐలతో ఆయన సమీక్ష నిర్వహించారు. సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, అమరావతి సీఐలతో పాటు సబ్-డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

పెదమక్కెనలో పొలం పిలుస్తోంది

పెదమక్కెన(సత్తెనపల్లిరూరల్): మండలంలోని పెదమక్కెనలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. క్షేత్రస్థాయిలో పత్తి పంటను పరిశీలించిన ఏఈవో సుభాని మాట్లాడుతూ పంటను పేనుబంక, పచ్చదోమ ఆశించాయన్నారు. వీటి నివారణకు 1.5 ఎంఎల్ మోనోక్రోటోఫాస్, 0.04 గ్రాముల ఎసిటామిప్రిడ్‌లలో ఏదో ఒక దానిని లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. సమగ్ర సస్యరక్షణ చర్యలలో భాగంగా అక్కడక్కడ ఆముదపు మొక్కలను వేసుకోవాలన్నారు. దీనివల్ల పొగాకు లద్దెపురుగు ఆముదం ఆకులపై గ్రుడ్లుపెట్టి పొదుగుతుందన్నారు. ఆకులపై ఉన్న లార్వాలను వెంటనే గుర్తించి నాశనం చేస్తే పొగాకు లద్దె పురుగును నివారించవచ్చని రైతులకు సూచించారు.

పత్తి చేను చుట్టూ జొన్న పెట్టడం వల్ల రసం పీల్చు పురుగు ఉధృత్తిని తగ్గించవచ్చన్నారు. గులాబీరంగు కాయతొలుచు పురుగు ఉధృతిని అంచనా వేయటానికి లింగాకర్షక బుట్టలు అమర్చాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో పి.వెంకటేశ్వర్లు, ఎంపీఈవో గోపి, గ్రామ రైతులు పాల్గొన్నారు.



పత్తి పొలాన్ని పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

వాగు ప్రవాహానికి వేసిన అడ్డుకట్ట మరలా తొలగింపు

నందిగామ(సత్తెనపల్లిరూరల్): మండలంలోని నందిగామ ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రాంతం మీదుగా వెళ్ళే వాగు ప్రవాహానికి స్థల యజమాని వేసిన అడ్డుకట్టను మంగళవారం అధికారులు తొలగించారు. వాగు ప్రవాహానికి అడ్డుకట్ట వేయటం వల్ల నీరు గృహాల ముందే నిలిచిపోయి పారిశుధ్యం క్షీణిస్తుంది. వర్షాలు కురిసిన సమయంలో ఈ సమస్య అధికంగా ఉంటుంది. స్థల యజమాని వాగుకు అడ్డుకట్ట వేయటం, అధికారులు ప్రత్యామ్నాయంగా కాల్వ తీసినా వాగునీరు ప్రవహించకపోవటంతో ఇప్పటికే రెండుసార్లు అడ్డుగా వేసిన కట్టను జేసీబీ సహాయంతో తొలగించారు. మరలా కట్టవేయటంతో ఇప్పుడు తొలగింపజేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లు బీటలువారుతున్నా పట్టించుకోరా!

● బోరు బ్లాస్టింగ్‌లు ఆపకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం ● క్వారీలో స్థానికుల ఆందోళన

మేడికొండూరు: పేరేచర్ల సమీప క్వారీలో బోరు బ్లాస్టింగ్‌లు నిర్వహించడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోరు బ్లాస్టింగ్‌లు కారణంగా తమ ఇళ్లు గోడలు బీటలు వారుతున్నాయని మొత్తుకున్నా పట్టించుకోరా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం క్వారీ సమీప ప్రాంతాల గ్రామస్థులు బోరు బ్లాస్టింగ్‌లు చేస్తున్న క్వారీకి చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. ఆపకపోతే తమ ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పేరేచర్ల గ్రామానికి చేరువలో చినపలకలూరు పంచాయతీ పరిధిలోని ఒక క్వారీలో బోరు బ్లాస్టింగ్‌లు ని ర్వహిస్తున్నారు. అయితే మోతాదుకు మించకుండా సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో బోరు బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తున్నామని క్వారీ కాంట్రాక్టర్లు చెబుతున్నా దానిని స్థానికులు విశ్వసించడం లేదు. కొద్ది రోజుల క్రితం నిర్వహించిన పేలుళ్ల ధాటికి గోడలు బీటలు వారుతున్నాయని, గోడలపై పెట్టిన పూల కుండీలు సైతం కిందకు పడుతున్నాయని చెబుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, గత్యంతరం లేక తామే క్వారీ వద్ద ఆం దోళనకు దిగాల్సి వచ్చిందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. తక్కువ ప్రకంపనలు వచ్చే విధంగా బ్లాస్టింగ్‌లు చేసుకుంటే తమకేమి అభ్యంతరం లేదని, అందుకు భిన్నంగా ఎక్కువ లోతులో బోరు ఘాతాలు వేసి పేల్చడం వల్ల తీవ్ర ప్రకంపనలు కిలోమీటర్ల దూరం వ్యాపిస్తున్నాయని, కొత్తగా కట్టిన ఇళ్లకు కూడా నష్టం వాటిల్లుతుందని అంటున్నారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేసిన గ్రామస్థులు క్వారీ కాంట్రాక్టర్‌కు చెందిన కార్యాలయానికి వెళ్లి బోరు బ్లాస్టింగ్‌లు నిలిపివేయాలని చెప్పారు.



బోరు బ్లాస్టింగ్‌లు చేపట్టిన క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

అంగన్‌వాడీ కేంద్రానికి కొలతల సేకరణ

ముప్పాళ్ళ : మండలంలోని రుద్రవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి పంచాయతీరాజ్ ఏఈ అజయ్‌కుమార్ మంగళవారం మార్కింగ్ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి రూ.7 లక్షల 50 వేలు మంజూరయ్యాయని ఏఈ తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు నలబోతు పాపారావు, గోళ్ళ వెంకటప్పయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డుపై పందులు సంచరిస్తే చర్యలు

సత్తెనపల్లి: పట్టణంలో పందులు రోడ్లపై సంచరిస్తే వాటి యజమానులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. పందుల వల్ల మెదడువాపు వ్యాధి వస్తుందన్నారు. రోడ్లపైకానీ, ఇళ్ళ పక్కన పందులను సంచరించకుండా యజమానులు చూడాలన్నారు.

బేస్‌బాల్ టీంకు సుగాలీకాలనీ విద్యార్థుల ఎంపిక

సత్తెనపల్లి: పట్టణంలోని సుగాలీకాలనీ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి బేస్‌బాల్ టీంకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ ఎం.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఇటీవల అమరావతిలోని శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో టీం ఎంపిక జరిగిందని ఆయన చెప్పారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎం.అశోక్ శర్మ, 9వ తరగతి విద్యార్థి గోపి ఎంపికయ్యారని ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 18 నుంచి 20 వరకు కడప జిల్లా జమ్మలమడుగులో జరిగే పోటీల్లో జిల్లా జట్టు నుంచి వీరు పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రామకృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారన్నారు.



బేస్‌బాల్ టీంకు ఎంపికైన విద్యార్థులు

48 మంది ఉపాధ్యాయుల బదిలీ

ముప్పాళ్ళ: మండలంలో 48 మంది ఉపాధ్యాయులు బదిలీ అవుతున్నట్లు ఎంఈవో ఒంగోలు రాజు మంగళవారం తెలిపారు. బదిలీ అవుతున్న ఉపాధ్యాయులకు విద్యావనరుల కేంద్రంలో రిలీవింగ్ ఆర్డర్‌ను ఇచ్చారు. 44 మంది ఎస్జీటీ తెలుగు, నలుగురు ఎస్జీటీ ఉర్దూ ఉపాధ్యాయులు బదిలీ అవుతున్నారన్నారు. 10 మంది ఉపాధ్యాయులు ముప్పాళ్ళ మండలంలోనే కొత్త గ్రామాలకు వెళుతుండగా 38 మంది ఇతర ప్రాంతాలకు వెళుతున్నారని తెలిపారు.



ఉపాధ్యాయులకు రిలీవింగ్ ఆర్డర్‌ను ఇస్తున్న ఎంఈవో ఒంగోలు రాజు



దళిత బహుజన రీసోర్స్ కేంద్రం ద్వారా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పాస్టర్ శ్రీపతి సత్యానందం అన్నారు. పట్టణంలోని వడ్డవల్లి, శాస్త్రీనగర్‌లో మంగళవారం డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో డీబీఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, బక్కా సుబ్బారావు, మోహన్, రాంబాబు, దావల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. - **సత్తెనపల్లి.**

పట్టణంలో వర్షం

సత్తెనపల్లి: పట్టణంలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. పలు వీధుల్లో వర్షపునీరు ప్రవహించింది. వర్షం పొలాలకు ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. నాలుగు రోజులుగా ఎండలు ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఈ వర్షాలు పట్టణ ప్రజలకు కూడా ఊరటనిచ్చాయని చెప్పవచ్చు.

మండలంలో....

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది. సుమారు 2 గంటలపాటు ఆకాశం మేఘావృతమై పెద్ద వర్షం కురిసింది. వర్షాల వల్ల గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు చెప్పారని ఈవోపీఆర్డీ ఏవీవీ కుమారి తెలిపారు.





పట్టణంలో కురుస్తున్న వర్షం

సత్తెనపల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు (కిలో. రూ.)

టమాటా	- 40
వంకాయ	- 32
బెండకాయ	- 17
బీరకాయ	- 18
కాకర	- 35
మిర్చి	- 38
క్యాబేజి	- 18
దొండకాయ	- 22
దోసకాయ	- 15
గోరుచిక్కుడు	- 24
పొట్లకాయ	- 15
క్యారెట్	- 58
క్యాలిఫ్లవర్	- 30
బీట్‌రూట్	- 32
కీరదోస	- 27
క్యాప్సికం	- 52
బీన్స్	- 54
చిక్కుడుకాయలు	- 38
బంగాళదుంప	- 16
అరటికాయ	- 5, 6
మునగకాయ	- 6, 7
ఆకుకూరలు కట్ట	- 5

గిరిజనులకు సాగుభూమి పట్టాలు ఇవ్వాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మారుతివరప్రసాద్


గుంటూరులో గిరిజన జిల్లా అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు

వినుకొండ: గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎ.మారుతివరప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక ఆజాద్‌నగర్‌లో ఎస్సీ, ఎస్టీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని, బొల్లాపల్లి మండలంలోని ఎర్రవేణి చెంచుకాలనీ వాసులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ జిల్లా ట్రైబల్ అధికారికి గుంటూరులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనులు పదేళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వకపోతే గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో పోరాటాలకు పిలుపునిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, సాగర్‌బాబు, సుబ్బారావు, వెంకటేష్, బాలూనాయక్, వెంకటేశ్వర్లు, సాంబానాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆజాద్‌నగర్ కాలనీవాసుల సమస్యలను తెలుసుకుంటున్న సీపీఐ నేతలు



చినుకుపడితే చిత్తడే..

అధ్వానంగా అంతర్గత రహదారులు

వినుకొండ: మండల గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే చిత్తడి చిత్తడిగా తయారవుతున్నాయి. కొన్నిచోట్ల తటాకాలను తలపిస్తుండటంతో ఇళ్లలో నుంచి బయటకు రాలేక వృద్ధులు, గ్రామస్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షపునీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తిచెందుతున్నాయని వాపోతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా కనీసం రహదారులకు మరమ్మతులు కూడా చేయించడం లేదని అంటున్నారు. మండల పరిధిలోని ఏనుగుపాలెం, తిమ్మాయిపాలెం, భారతాపురం, వెంకుపాలెం గ్రామాల్లో వర్షం పడితే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. పిట్టంబండ పంచాయతీ పరిధిలో కొన్నిచోట్ల సీసీ రోడ్లు నిర్మించినా, సైడ్ డ్రైన్స్ లేకపోవడంతో వర్షపు నీరంతా ప్రధాన రహదారులపై నిలబడిపోతుంది. గ్రామీణ రహదారులపై ఏర్పడ్డ గుంతల్లో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి రాకపోకల సమయంలో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతలో నిలిచిన వర్షపునీరు

దళితులపై దాడులు అరికట్టకపోతే ఉద్యమిస్తాం : కేవీపీఎస్

వినుకొండ: దళితులపై దాడులు అరికట్టకపోతే ఉద్యమిస్తామని కేవీపీఎస్ డివిజన్ అధ్యక్షుడు గుంజరి ఏసు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణా జిల్లా గుడివాడ మండలం దొండపాడు గ్రామంలో దళితులపై జరిగిన దాడులను ఖండిస్తూ కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గుంజరి ఏసు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో అగ్రవర్ణాల దురహంకారంతో గరగపర్రు, తుందూరు, దొండపాడులో దళితులపై జరిగిన దాడులు బాధాకరమన్నారు. దళితుల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు వారి సంక్షేమాన్ని గాలికివదిలేసి అధికారంలోకి వచ్చిన తరువాత అగ్రవర్ణాలతో దాడులు చేయించడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు హనుమంతరెడ్డి, బి.కన్నా, జాన్‌బాబు, చిదంబరం, నాసర్‌బీ, చంటి, అంజమ్మ, అరుణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ డివిజన్ అధ్యక్షుడు గుంజరి ఏసు

ఉపాధ్యాయురాలికి వీడ్కోలు సభ

వెలమవారిపాలెం(శావల్యాపురం): మండలంలోని వెలమవారిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న జి.లక్ష్మి నరసరావుపేట మండలం గోనెపూడి గ్రామం ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయురాలు లక్ష్మికి మెమెంటోను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయురాలు లక్ష్మికి మెమెంటోను అందజేస్తున్న విద్యార్థులు

13న రెడ్డి వధూవరుల వివాహ పరిచయ వేదిక

వినుకొండ : యోగివేమారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 13న రెడ్డి వధూవరుల వివాహ పరిచయ వేదిక కోటప్పకొండలోని రెడ్ల సత్రంలో నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. స్థానిక కార్యాలయంలో వివాహ పరిచయ వేదిక బ్రోచర్‌ను మంగళశారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ వధూవరులు ఫొటో, బయోడేటాతో తల్లిదండ్రులతో కలిసి వేదికకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు తాడి బీమారెడ్డి 9959786677, పొలిమేర వెంకటరెడ్డి 9866608860 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మూలె వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారి ఈదర పెద్దిరెడ్డి, తుమ్మా వెంకటరెడ్డి (బొట్టు), యారం రామిరెడ్డి, నారపరెడ్డి రమణారెడ్డి, పునుగోటి సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, దశరథరామిరెడ్డి, బాలిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యోగివేమారెడ్డి సేవా సమితి సభ్యులు

పదిహేనేళ్లలోపు చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి

వైద్యాధికారి సునీల్‌నాయక్

వినుకొండరూరల్: 9 నెలలు నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని వైద్యాధికారి సునీల్‌నాయక్ అన్నారు. మండలంలోని కొప్పుకొండ, నడిగడ్డ గ్రామాల్లో 775మందికి గాను 712మంది విద్యార్థులకు మంగళవారం వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్ వ్యాక్సిన్‌ను సెప్టెంబరు 8 వరకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో వేయనున్నారని, ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పున్నయ్య, సీహెచ్‌వో బేబీప్రమీల, మేరీజోన, ఏఎన్ఎంలు వజ్రం, రమాదేవి, ఆరోగ్య, ఆశ సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

80శాతం పూర్తి..

శావల్యాపురం: మండలంలో మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ 80శాతం చిన్నారులకు అందజేసినట్లు వైద్యాధికారి జయప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పిచికపాలెం, చినకంచర్ల, ముండ్రువారిపాలెం, శానంపూడి గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ నూరుశాతం లక్ష్యాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వడ్లమూడి వెంకటకోటయ్య, తిరివీధి సూర్యనారాయణ, వంకాయలపాటి నారాయణ, మర్రి వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.


మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి సునీల్‌నాయక్

ప్రతి గ్రామంలో మొక్కలు నాటించాలి : ఎంపీడీవో రవికుమార్

నూజెండ్ల: ప్రతిగ్రామంలో మొక్కలు నాటించడానికి ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీవో టి.రవికుమార్ ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పోస్టాఫీసుల్లో నిలిచి ఉన్న వేతనాలను వెంటనే సంబంధిత కూలీలకు ఇప్పించాలన్నారు. పండ్ల మొక్కలను నాటుకునేందుకు ఆసక్తిగల 50 మంది కూలీలను గుర్తించి గుంతలు తీయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కె.రామారావు, టీఏలు బేబిరోజా, రమణారావు తదితరులున్నారు.

అందుగులకొత్తపాలెం, శివాపురం

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

వినుకొండ రూరల్: మండలంలోని అందుగులకొత్తపాలెం, శివాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ కౌలు రైతులందరూ వ్యవసాయ శాఖ జారీ చేసే పంట సాగు ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, దీనిద్వారా రాయితీ విత్తనాలు, పనిముట్లు, పంట నష్టపరిహారం, పంటల బీమా సదుపాయాలు వర్తిస్తాయన్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం రైతులు కౌలు చేసే పొలం సర్వే నంబరు, ఎన్ని ఎకరాల్లో ఏ పంట వేస్తున్నారో వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు. కందిలో ఎండుతెగులు రాకుండా ట్రైకోడెరమావిరిడి ఎకరానికి 2 కేజీలు 100 కేజీల పశువుల ఎరువుతో కలిపి పొలంలో కలియదున్నితే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో సుకన్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

మీ-సేవలో దరఖాస్తు చేసుకోవాలి

చుక్కల భూములపై గ్రామ సభలో తహసీల్దార్ శివనాగిరెడ్డి

వినుకొండరూరల్: చుక్కల భూములపై మీ-సేవలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శివనాగిరెడ్డి అన్నారు. మండలంలోని గోకనకొండ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం చుక్కల భూములపై గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివనాగిరెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఆర్‌లో చుక్కలు ఉన్న భూములకు 12 సంవత్సరాల పాటు సంబంధిత రైతు ఆధీనంలో ఉండి, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉండి, రికార్డు ఆఫ్ హోల్డింగ్, ఈసీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తీసుకొని ఫారం-3 నింపి దరఖాస్తు అందజేయాలని కోరారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు పంపడం జరుగుతుందని, ఆయన ఆదేశాల మేరకు ఆరు నెలలలోపు సమస్యను పరిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీహెచ్. మురళీధర్‌రావు, వీఆర్వో హనుమానాయక్, ఎంపీటీసీ గండికోట నాగేశ్వరరావు, రైతులు ఉన్నారు.

10లోపు అందజేయాలి: తహసీల్దార్

పిచికలపాలెం(శావల్యాపురం) : చుక్కల భూములు గల రైతులు ఈ నెల 10లోపు దరఖాస్తులను రెవెన్యూ అధికారులకు అందజేయాలని తహసీల్దార్ కోటేశ్వరరావు మండల రైతులకు తెలిపారు. మండలంలోని పిచికలపాలెం గ్రామంలో మంగళవారం చుక్కల భూములపై గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరివీధి సూర్యనారాయణ, శ్రీనివాసరావు, డీటీ పుల్లారావు, వీఆర్వో అరుణ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గ్రామసభ

ఈపూరు: మండలం కేంద్రమైన ఈపూరులోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం చుక్కల భూములపై రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. సభలో తహసీల్దార్ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుక్కల భూముల వివరాలను నోటీస్‌బోర్డులో ఉంచడం జరుగుతుందని, అందులోని సర్వే నంబర్లు సంబంధించిన రైతులు సంబంధిత పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. సభలో వీఆర్వో రామారావు, రైతులు పాల్గొన్నారు.



పిచికలపాలెంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు

వనం-మనం కార్యక్రమం



శానంపూడిలో మొక్కలు నాటడానికి గుంతలను పరిశీలిస్తున్న వెలుగు సిబ్బంది రమణారెడ్డి

శావల్యాపురం : వనం-మనం కార్యక్రమం పనులు మండలంలో కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శానంపూడి గ్రామం నుంచి పొలాలకు వెళ్లే దారికి ఇరువైపులా మొక్కలు నాటేందుకు గుంతల పనులను చేపట్టారు. కిలోమీటరుకు 400మొక్కల చొప్పున రోడ్డుకు ఇరువైపులా నాటడం జరుగుతుందని, మండలంలో 10 కిలోమీటర్ల పొడవున 15 గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటేపనులు జరుగుతున్నాయని సీసీ రమణారెడ్డి తెలిపారు.

రవ్వవరంలో చోరీ

నూజెండ్ల: మండలంలోని రవ్వవరంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పారెళ్ల దాసయ్య ఈ నెల 4న హైదరాబాద్ వెళ్లి తిరిగి వచ్చి చూడగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడేసి బీరువా తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించాడు. రూ.5వేలు, 18 సవర్ల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐనవోలు ఎస్ఐ కె.వెంకటప్రసాద్ సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

ఈపూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న దేవరశెట్టి అంజి(32) మృతిచెందినట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య మంగళవారం తెలిపారు. వినుకొండకు చెందిన మృతుడు కొచ్చర్లలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి వస్తూ కొండ్రముట్ల వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వినుకొండకు తరలించి అదే రోజు గుంటూరు తీసుకెళ్లారు. అక్కడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు.

రోడ్డు భద్రతపై సర్వే

ఈపూరు : రోడ్డు ప్రమాదాల నివారణకు సర్వే చేపట్టినట్లు నరసరావుపేట ఆర్డీవో ఎ. కిరణ్‌ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని ఈపూరు- అగ్నిగుండాల, గోపువారిపాలెం, చిట్టాపురం, పొనుగోటివారిపాలెం, కొండాయపాలెం, గుండేపల్లి, అంగలూరు, బోడిశంభునివారిపాలెం, యర్రగుంటతండా రోడ్లను పరిశీలించి ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించారు. ఈ మేరకు నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు ఎస్ఐ మేదరమెట్ల పట్టాభిరామయ్య, భాస్కర్, రసూల్, రాజు ఉన్నారు.



అగ్నిగుండాల సమీపంలో మేజర్‌కాలువపై చప్టాను పరిశీలిస్తున్న కిరణ్‌ప్రభాకర్, ఎస్ఐ పట్టాభిరామయ్య

సినిమా గైడ్

అరుణా	దండుపాళ్యం-2
వెంకటేశ్వర	ఫిదా
సురేష్	శమంతకమణి
కీర్తి	గౌతమ్‌నంద

ముఖ్యమైన ఫోన్ నెంబర్లు

శాసనసభ్యుడు	984950111
వ్యవసాయ శాఖాధికారి	8886614124
మున్సిపల్ కమీషనర్	9849905835
సర్కిల్ ఇన్‌స్పెక్టర్	9440796248
వినుకొండ తహసీల్దార్	9849904030
వినుకొండ ఎంపీడీవో	9849903368
వినుకొండ ఎంఈవో	9704440568
ఆర్టీసీ డీఎం	9959225431
మున్సిపల్ చైర్మన్	9440449361
పౌరసరఫరాల అధికారి	8897509585
ఆర్ అండ్‌బీ డీఈ	9440818328
ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ	9100121416

వినుకొండ కూరగాయల ధరలు (రూ.) 1 కిలో

టమోటా:రూ.40, వంకాయలు:రూ.30, బెండ: రూ.30, దొండ:రూ30, క్యారెట్ :రూ.60, క్యాబేజీ: రూ.30, దోస: రూ.20, పచ్చిమిర్చి:రూ.60,బంగాళదుంప: రూ.30, గోరు చిక్కుళ్లు:రూ.30, బీర :రూ.30, కాకర: రూ.30, బీట్‌రూట్: 60, పొట్లకాయ: రూ.30, పెద్ద చిక్కుళ్లు: రూ.60, మునక్కాయ (1): రూ.5, ఆకుకూర కట్ట: రూ.5

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవికాదు) సమస్యలు ఉన్నాయా? అలా ఉన్న సమస్యల గురించి ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కా రానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం : ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య
ఫోన్ నెంబర్ : 9985411238

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

బొల్లాపల్లి : మండలంలోని గంగులపాలెం, మూగచింతలపాలెం గ్రామాల్లోని సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారులకు మంగళవారం బోనస్ పంపిణీ చేశారు. గంగులపాలెంలో 56మంది పాల ఉత్పత్తిదారులకు రూ.1,38,902, మూగచింతలపాలెంలో 140మందికి రూ.4, 31,658 లక్షలు బోనస్‌ను వినుకొండ పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ యలవర్తి యోగేశ్వరరావు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డైరెక్టర్ గంగినేని హనుమంతరావు, పాల కేంద్రం ప్రెసిడెంట్‌లు రావూరి నారాయణ, చింతా నాగయ్య, సూపర్‌వైజర్ నాగరాజు, సెక్రటరీ వెంకటేశ్వర్లు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.



పాల ఉత్పత్తిదారులకు బోనస్‌ను అందజేస్తున్న పాల కేంద్రం ప్రెసిడెంట్ ఏడుకొండలు, మేనేజర్ సింగారావు

● **ఈపూరు:** మండలంలోని బొగ్గరం గ్రామంలో సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారులకు మంగళవారం బోనస్‌ను పంపిణీ చేశారు. 92మంది సభ్యులకు రూ.7లక్షల బోనస్‌ను అందజేశారు. అలాగే రూ.70 వేలు విలువగలిగిన వాటర్ క్యాన్‌లను అత్యధికంగా పాలు పోసిన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా నరసరావుపేట నరసరావుపేట పాలశీతలీకరణ మేనేజర్ సింగారావు మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే సంగం డెయిరీ లక్ష్యమని అన్నారు. త్పత్తిదారుల కుటుంబ సభ్యుల కోసం ఇన్సూరెన్స్‌లు, సాల్కు టర్‌షిప్‌లు, రాయితీపై గేదెలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల కేంద్రం ప్రెసిడెంట్ ఏడుకొండలు, సెక్రటరీ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్, పాల ఉత్పత్తిదారులున్నారు.

పంచాయతీ రోడ్లకు రూ.19 కోట్లు: రాయపాటి రంగబాబు

మాచర్ల: గ్రామ పంచాయతీ రహదారుల నిర్మాణానికి రూ. 19 కోట్లతో ప్రతిపాదనలను గ్రామీణాభ్రిద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌బాబు ఆమోదించారు. మాచర్ల నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న నరసరావుపేట ఎంపీ రాయపాటి సాంబశివరావు తనయుడు రంగబాబు ఈ ప్రతిపాదనలను మంగళవారం మంత్రి లోకేష్‌ను కలిసి అందించారు. గిరిజన గ్రామాలను, తండాలను అనుసంధానం చేసే రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఈ సందర్భంగా లోకేష్ స్పష్టం చేసినట్లు రంగబాబు తెలిపారు. మాచర్ల పరిధిలో ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద రక్షిత మంచినీటి పథకాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారని అన్నారు.

నిధులు త్వరితగతిన మంజూరు చేసేందుకు చొరవ తీసుకోవాలని లోకేష్‌ను కోరినట్లు రంగబాబు వెల్లడించారు.